
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 199
శుక్రవారం 10-10-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



ఆధునిక దేవాలయాలను అమ్మేస్తున్నారు

నర్సీపట్నం పర్యటనలో వైఎస్ జగన్ నిప్పులు -13లో


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 199

శుక్రవారం 10-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

యువర్స్

● సక్సెస్ స్టోరీ

ఏఐ... షా @ 19

అదృష్ట, దురదృష్టాల మాట ఎలా ఉన్నా... అదృష్టం అనేది సాహసికులు, సృజనాత్మకంగా ఆలోచించే వాళ్లు, కష్టపడేవారికి క్లోజ్‌ఫ్రెండ్ అనేది ఆధునిక సామెత! అమెరికాలోని ప్రతిష్ఠాత్మకమైన ఏఐ కంపెనీకి 19 సంవత్సరాల వయసులోనే సీయీవో అయ్యాడు ద్రవ్య షా. 'షా'లో సాహసం ఉంది. సృజనాత్మక ఆలోచనలూ ఉన్నాయి. కష్టపడే తత్వం ఉంది...



'నా లక్ష్యం ఏమిటి?' 'లక్ష్యాన్ని సాధించడానికి ఏంచేయాలి'... ఇలా ఎంతోమంది టీనేజర్‌లు తమ భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటారు. ఇలా ఆలోచించే వయసులోనే పెద్ద కంపెనీకి సీయీవోగా ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు షా. 19 ఏళ్ల వయసులోనే సిలికాన్ వ్యాలీలోని అగ్రగామి టెక్ దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు ద్రవ్య షా. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని ఒకప్పుడు లక్ష్యంగా పెట్టుకున్న షా, ఇప్పుడు ఎంతోమంది ఐఐటీ విజేతలకు స్ఫూర్తిని ఇస్తున్నాడు.

షా సీయీవోగా పనిచేస్తున్న 'సూపర్ మెమొరీ' విషయానికి వస్తే.. సీడ్ ఫండింగ్ విషయంలో వావ్ అనిపించింది. 'సూపర్ మెమొరీ'కి సంబంధించి అసలు విజయం ఇది కాదు. ఏఐ మోడల్స్ రోజురోజుకూ పురోగమిస్తున్నప్పటికీ ఒకానొక ఏరియాలో మాత్రం సమస్య ఎదుర్కొంటున్నాయి. ఎక్కువ కాలం పాటు సమాచారాన్ని గుర్తుంచుకోవడంలో విఫలం అవుతున్నాయి. అయితే షా స్టార్టప్ 'సూపర్‌మెమొరీ' ఏఐ అప్లికేషన్‌లు సమాచారాన్ని గుర్తుంచుకోవడంలో, సమాచారాన్ని తిరిగి పొందడంలో సహాయపడుతున్నాయి.

ముంబైలో పుట్టి పెరిగిన ద్రవ్య షాకు చిన్నప్పటి నుంచి సాంకేతిక విషయాలపై, ముఖ్యంగా రకరకాల యాప్స్‌పై ఆసక్తి ఎక్కువ. అత్యంత కఠినమైన పరీక్షగా భావించే ఐఐటీ ప్రవేశ పరీక్షకు తనతో చదువుకున్న వాళ్లు సిద్ధం అవుతున్న రోజుల్లోనే కోడింగ్‌లో బిజీబిజీగా ఉండేవాడు షా. ఆ సమయంలోనే ట్విట్టర్ ఆటోమేషన్ టూల్‌ను రూపొందించి ఒక పాపులర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు విక్రయించాడు. ఈ టూల్ ట్వీట్స్‌ను దృశ్యపరంగా ఆకర్షణీయమైన స్క్రీన్‌షాట్స్‌గా మారుస్తుంది. ట్విట్టర్ ఆటోమేషన్ టూల్ అమ్మకం షాను మరోదారిలోకి తీసుకువెళ్లింది. ఐఐటీ ప్రిపరేషన్ పక్కన పెట్టాడు. అమెరికాకు వెళ్లి అరిజోనా స్టేట్ యూనివర్శిటీలో చదువుకోడానికి ట్విట్టర్ ఆటోమేషన్ టూల్ ద్వారా వచ్చిన డబ్బులు ఉపయోగపడ్డాయి.


అమెరికాలో కూడా తన సత్తా చాటడానికి నడుం బిగించాడు షా. నలభై వారాల పాటు ప్రతి వారం ఒక కొత్త ప్రాజెక్ట్‌పై పనిచేయడానికి ప్రణాళిక తయారుచేసుకున్నాడు. అది తన కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడింది. సిలికాన్ వ్యాలీలోని టాప్ టెక్ కంపెనీలలో పనిచేశాడు. 'క్లౌడ్‌ఫ్లేర్' కంపెనీలో పనిచేస్తున్నప్పుడు ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డాటా సిస్టమ్స్‌ను లోతుగా అర్థం చేసుకునే అవకాశం దొరికింది. 'సూపర్‌మెమొరీ' టెక్నాలజీని పెద్ద కంపెనీలు వినియోగిస్తున్నాయి. విజువల్ మెమోరీస్‌కు సంబంధించి 'సూపర్‌మెమొరీ' రోబోటిక్ ఫర్మ్‌తో కూడా కలిసిపనిచేస్తోంది.

లాప్‌ట్యాప్ యూనివర్శిటీలో!

ద్రవ్య షా ముంబైలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. కోవిడ్ కల్లోల కాలంలో చాలా రోజులు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది షా. ఆ ఖాళీ సమయంలో తనకు ల్యాప్‌టాప్ కొనిపెట్టాల్సిందిగా తల్లిదండ్రులను అడిగితే వారు పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ అడిగితే ఇక తప్పదన్నట్లుగా కొనిచ్చారు. ఆ ల్యాప్‌టాపే తన విశ్వవిద్యాలయం అయింది. కోడింగ్‌లో ఓనమాలు మొదలుపెట్టాడు. అలా ఒక్కో విషయం తెలుసుకుంటూ సాంకేతిక అంశాలపై పట్టు సాధించాడు. ఇదంతా కేవలం తన సరదా కోసం చేసిందే. అప్పటికీ తనకు పెద్ద లక్ష్యాలు లేవు. అమెరికాకు వెళతానని కలలో కూడా అనుకోలేదు. సరదాగా, ఆసక్తిగా నేర్చుకున్న విషయాలే తన విజయానికి మెట్లు అయ్యాయి. 'ఒక విషయంపై ఆసక్తి మొదలైతే, అది పాషన్ అవుతుంది. అది రెండు అడుగులు ముందుకు వెళితే సృజనాత్మక ఆలోచన అవుతుంది. ఆ ఆలోచనలలో నుంచి ఆవిష్కరణ పుడుతుంది' అని చెప్పడానికి గట్టి ఉదాహరణ ద్రవ్య షా.

● మ్యూజిక్ వరల్డ్

అన్‌ఫిల్టర్డ్ టాలెంట్



ఎలాంటి మేకప్ లేదు. సహజ అందం. ఎలాంటి శిక్షణ లేదు. సహజ గాత్రం. అందుకే ఆమెను 'అన్‌ఫిల్టర్డ్ టాలెంట్' అని పిలుస్తున్నారు. 'దట్ గర్ల్'తో 19 సంవత్సరాల పంజాబీ అమ్మాయి సంగీత రంగంలో సరికొత్త సెన్సేషన్‌గా మారింది. పంజాబ్‌లోని మోగాకు చెంది పరమ్‌జీత్ కౌర్ 'పరమ్' పేరుతో పాపులర్ అయింది. ఆమె పాడిన 'దట్ గర్ల్' పాట పంజాబ్ మ్యూజిక్ ఇండస్ట్రీని షేక్ చేసింది. వారంలోపే ఈ పాటకు 35 లక్షల వ్యూస్ వచ్చాయి. ఈ పాట కోసమే మన్నీ సందు యూకే నుంచి ఇండియాకు వచ్చాడు. ఆయన 'దట్ గర్ల్' పాటకు ప్రొడ్యూసర్. పరమ్ తల్లి ఇండ్లలో పనులు చేస్తుంటుంది. తండ్రి దినసరి కూలీ. తన ఫ్రెండ్స్ రకరకాల వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని చూసి తాను అలాగే చేయాలనుకుంది పరమ్. తాను పాడిన వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది. వాటికి మంచి స్పందన వచ్చేది. 'దట్ గర్ల్' పాట మాత్రం పరమ్‌ను ఎక్కడికో తీసుకువెళ్లింది.

● యూత్ టాక్

ఆహా... జనరేషన్ జడ్!



తమ తల్లిదండ్రులతో పోల్చితే జనరేషన్ జెడ్ ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉంది. వ్యక్తిగత, వృత్తిపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో పరిణతి ప్రదర్శిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఇష్టపడతారు. మంచి బ్రాండ్‌లు అందుబాటులో లేనప్పటికీ గతంలో చాలామంది ఒక నిర్దిష్ట బ్రాండ్‌కే పరిమితమయ్యేవారు. కాని నేటి యువతరం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. సాంకేతిక విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉత్తమమైన ప్రాడక్ట్‌ను మాత్రమే కోరుకుంటున్నారు. కొత్త సాంకేతికతను స్వీకరించే విషయంలో భారతీయ యువతరం ముందంజలో ఉంది.

- క్లార్ పీ, నథింగ్ (కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ), సీయీవో

● టెక్... టాక్

యూట్యూబ్ హైడ్ ఫీచర్



రికమండేషన్ పాపప్స్‌ను హైడ్ చేసే సరికొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది యూట్యూబ్. యూజర్ నుంచి వచ్చే ఫిర్యాదులలో రికమండేషన్ పాపప్స్ ఒకటి. వీడియో ప్లేయర్ టాప్-రైట్ కార్నర్‌లో యూజర్‌లకు 'హైడ్' బటన్ కనిపిస్తుంది. ఈ బటన్‌ను నొక్కడం ద్వారా కరెంట్ వీడియో నుంచి పాపప్స్‌ను తొలగించవచ్చు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి సింపుల్‌గా 'షో' టాప్ చేస్తే సరిపోతుంది. ఈ 'హైడ్' ఆప్షన్ అనేది చూస్తున్న వీడియోకు మాత్రమే వర్తిస్తుందని, మొత్తం ప్లాట్‌ఫామ్‌కు కాదని యూట్యూబ్ ప్రకటించింది. ఇతర వీడియోల గురించి ప్రచారం కలిగించడానికి, సభ్యత్వాలను ప్రోత్సహించడానికి క్రియేటర్‌లు ఎండ్-స్క్రీన్ రెకమండేషన్‌లను ఉపయోగిస్తుంటారు. అయితే ఇవి ప్రేక్షకులకు అంతరాయం కలిగిస్తుంటాయి. అలా అంతరాయం కలిగించకుండా ఉండడానికి తీసుకువచ్చిందే...హైడ్ ఫీచర్.

రెడ్‌మీ పాడ్ 2 ప్రో



డిస్‌ప్లే: 12.10 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్స్
రిజల్యూషన్: 2560×1600 పిక్సెల్స్
ర్యామ్: 6జీబీ
వోఎస్: ఆండ్రాయిడ్
స్టోరేజ్: 128జీబీ
బ్యాటరీ: 12,000 ఎంఏహెచ్

గూగుల్ డిస్కవర్‌లో...



గూగుల్ వారి ఏఐ-పవర్డ్ ఫీడ్ 'డిస్కవర్' యూజర్‌ల ఆసక్తి మేరకు ఆర్టికల్స్, వీడియోలులాంటి పర్సనలైజ్డ్ కంటెంట్‌ను చూపిస్తుంది. కొత్త కంటెంట్‌ను ఎక్స్‌ప్లోర్ చేయడానికి 'డిస్కవర్'లో రెండు కొత్త ఫీచర్‌లను తీసుకురానున్నారు. త్వరలో కొత్త కంటెంట్, ఫార్మట్స్, ఫీచర్‌లను డిస్కవర్ చూపించనుందని గూగుల్ ప్రకటించింది. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లు, యూట్యూబ్ షార్ట్స్, ఎక్స్ పోస్ట్‌లు.. వంటి రకరకాల కంటెంట్‌ను గూగుల్ డిస్కవర్ చూపించనుంది. మరిన్ని ప్లాట్‌ఫామ్‌లకు సపోర్ట్ చేస్తుంది. 'డిస్కవర్‌లో మిక్స్ ఆఫ్ కంటెంట్‌ను ఎంజాయ్ చేస్తున్నామని ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసిన తరువాత కొత్త ఫీచర్‌లు తీసుకురావాలనుకున్నాం' అని ప్రకటించింది గూగుల్.

జీబోర్డ్‌కు కొత్త ఫీచర్‌లు



గూగుల్ జీబోర్డ్‌కు 'మోస్ట్ పాపులర్ కీబోర్డ్ యాప్'గా పేరుంది. జీబోర్డ్ కీబోర్డ్ కోసం కొత్త ఫీచర్‌లను పరీక్షిస్తోంది గూగుల్. టెక్స్ జనరేట్ చేయడంతో పాటు 'ప్రూఫ్‌రీడ్' 'ఎంటర్ ఏ ప్రాంప్ట్' 'స్మార్ట్ ఎడిట్ ఫర్ వాయిస్ టైపింగ్' లాంటి ఏఐ-ఆధారిత టూల్స్‌ను తీసుకురానుంది. కొత్త ఫీచర్‌లలో 'ఫ్లిక్ కీస్ టు ఎంటర్ సింబల్స్' ఒకటి. దీంతో యూజర్‌లు చాలా త్వరగా 'కీ'తో అనుసంధానమైన సింబల్‌ను ఎంటర్ చేయడానికి వీలవుతుంది. ఇది యాపిల్ కీబోర్డ్‌ను పోలి ఉంటుంది.

షావోమీ 15 టీ ప్రో



డిస్‌ప్లే: 6.83 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్/ 1 టీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
వోఎస్: ఆండ్రాయిడ్ 15
బ్యాటరీ: 5500 ఎంఏహెచ్
బరువు: 210 గ్రా.

సాక్షి సినిమా

నవంబరులో వృషభ



● మోహన్ లాల్

మోహన్ లాల్ లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియన్ మూవీ 'వృషభ' విడుదల తేదీ ఖరారైంది. నవంబరు 6న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. నందకిశోర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాగిణి ద్వివేది, సమర్జిత్ లంకేష్, నయన సారిక ముఖ్య పాత్రధారులు. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహీ పరేఖ్ మెహతా నిర్మించారు. మలయాళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ చిత్రాన్ని ఆయా భాషలతో పాటు హిందీ, కన్నడ భాషల్లోనూ నవంబరు 6న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, మోహన్ లాల్ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. ఈ సందర్భంగా ఏక్తా కపూర్ మాట్లాడుతూ– ''నా హృదయానికి ఎంతో దగ్గరైన కథ 'వృషభ'. బలమైన భావోద్వేగాలు, లార్జర్ దేన్ లైఫ్ డ్రామాతో ఈ సినిమాను గొప్పగా ఆవిష్కరిస్తున్నాం'' అన్నారు. నందకిశోర్ మాట్లాడుతూ– ''హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా అద్భుతమైన విజువల్స్‌తో ఈ సినిమాను రూపొందించాం. బంధాలు, త్యాగాల కలయికగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్పగా కనెక్ట్ అవుతుంది'' అని పేర్కొన్నారు.

కొత్త తరం సంగీతానికి సిద్ధం



● చార్మి, హర్షవర్ధన్ రామేశ్వర్, పూరి జగన్నాథ్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'పూరిసేతుపతి' (వర్కింగ్ టైటిల్) అనే పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో టబు, విజయ్ కుమార్, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డుగ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్ 'పూరిసేతుపతి'కి సంగీతం అందించనున్నారని మేకర్స్ ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ హర్షవర్ధన్‌తో పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ కలిసి ఉన్న ఫొటోని విడుదల చేశారు. ''పూరి జగన్నాథ్, వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి తొలిసారిగా కలిసి చేస్తున్న పాన్ ఇండియా మూవీ 'పూరిసేతుపతి'. యాక్షన్, ఎమోషన్, ఎలివేషన్ కలగలిసిన న్యూ జనరేషన్ మ్యూజిక్‌ని ఎక్స్‌పీరియన్స్ చేయడానికి సిద్ధంగా ఉండండి. ప్రధాన నటీనటులు పాల్గొనే ఈ చిత్రం కొత్త షెడ్యూల్ వచ్చే వారం ప్రారంభం అవుతుంది. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సీఈఓ: విష్ణు రెడ్డి.

అప్పట్నుంచే తెలుగు నేర్చుకుంటున్నా!

- శ్రీనిధి శెట్టి



''నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కొంతమంది తెలుగు ఫ్రెండ్స్ నాకు ఉన్నారు. వారిని అడిగి తెలుగు పదాలు, వాక్యాలు ఓ లిస్ట్‌గా రాసుకుని, నేర్చుకోవడం మొదలుపెట్టాను. అప్పట్నుంచే తెలుగు మాట్లాడటం అలవాటైంది. సినిమా సెట్స్‌లో తెలుగువాళ్లను తెలుగులోనే మాట్లాడమని చెప్పి, నేను కూడా వారితో తెలుగులోనే మాట్లాడతాను. అయితే తెలుగులో నేను ఇంకాస్త బెటర్ కావాలి. అందుకే 'తెలుసు కదా' చిత్రానికి డబ్బింగ్ చెప్పలేకపోయాను. ఇకపై నా ప్రతి సినిమాకు నేనే డబ్బింగ్ చెబుతాను'' అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనిధి శెట్టి చెప్పిన సంగతులు.

● 'తెలుసు కదా' మంచి ఫీల్ గుడ్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా. ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లు అనగానే అందరూ ఇది ట్రయాంగిల్ లవ్‌స్టోరీ మూవీ అనుకుంటారు. కానీ ఇందులో మేం ఓ కొత్త అంశాన్ని చూపించాం. ఆ అంశం ఏమిటి? అనేది థియేటర్స్‌లో చూసినప్పుడు ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. వరుణ్ (సిద్ధు పాత్ర పేరు), రాగ (శ్రీనిధి), అంజలి (రాశీ ఖన్నా) క్యారెక్టర్స్‌కు ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతారు. మా పాత్రల్లో కొంచెం గ్రే షేడ్స్ ఉన్నాయి. దర్శకురాలు నీరజ విజన్ ప్రేక్షకులకు నచ్చుతుంది. ● తెలుగులో నా తొలి సినిమాగా 'హిట్ 3' విడుదలైంది. కానీ తెలుగులో నేను సైన్ చేసిన తొలి సినిమా 'తెలుసు కదా'. 'కేజీఎఫ్, కోబ్రా, హిట్ 3' వంటి వరుస యాక్షన్ సినిమాలు చేసిన తర్వాత చేసిన రొమాంటిక్ మూవీ 'తెలుసు కదా' నాకు కొత్తగా అనిపించింది. ఇందులో నేను పోషించిన రాగ పాత్రకు, రియల్ లైఫ్‌లో నాకు పెద్దగా పోలికలు లేవు. ● ఓ నటిగా అన్ని రకాల జానర్ సినిమాలు చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులో ఓ సినిమా కమిట్ అయ్యాను.

సినిమా పరిశ్రమను కాపాడుకోవాలి

- మంత్రి జి. వివేక్



● సాయికుమార్, తిమ్మప్ప నాయుడు, వినోద్ వర్మ, జి. వివేక్, అనూప్

''సినిమా వ్యాపారం అంటేనే రిస్క్. 'అరి' చిత్రంతో అలాంటి రిస్క్ చేశారు నిర్మాతలు. వారికి ఈ సినిమా మంచి విజయం అందివ్వాలి. తగినన్ని ప్రోత్సాహకాలు ఇస్తూ, సినిమా పరిశ్రమను కాపాడుకోవడంతో పాటు అభివృద్ధి చెందేలా చూసుకోవాలి. అప్పుడే స్థానికంగా ఉన్న ప్రతిభావంతులకు అవకాశాలు వస్తాయి'' అని తెలంగాణ రాష్ట్ర మంత్రి జి. వివేక్ తెలిపారు. వినోద్ వర్మ, అనసూయ, సాయికుమార్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. జయశంకర్ దర్శకత్వం వహించారు. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నేడు రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ– ''అరి'లాంటి మంచి చిత్రాలను ప్రోత్సహిస్తే ఈ కోవలో మరిన్ని సినిమాలు వస్తాయి'' అని చెప్పారు. ''మంచి సందేశం ఇచ్చేలా రూపొందిన 'అరి' విజయం సాధించాలి'' అని ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి ఆకాంక్షించారు. ''మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు జయశంకర్'' అన్నారు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్. ''అరిషడ్వర్గాల నేపథ్యంలో తీసిన 'అరి'కి మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం'' అని తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శ్రీనివాస్ రామిరెడ్డి తెలిపారు. ''నా 50 ఏళ్ల నట జీవితంలో 'అరి' లాంటి చిత్రంలో నటించినందుకు గర్వపడుతున్నాను'' అని నటుడు సాయికుమార్ చెప్పారు. ఈ వేడుకలో దర్శకుడు జయశంకర్, త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి తదితరులు మాట్లాడారు.



● రవిశంకర్, ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, శశిధర్ రెడ్డి

డ్యూడ్ ఘనవిజయం సాధిస్తుంది

- రవిశంకర్

''డ్యూడ్' సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. మా చిత్రం ఘన విజయం సాధిస్తుంది. ఈ దీపావళికి వస్తున్న 'మిత్రమండలి, తెలుసు కదా, కె-ర్యాంప్' చిత్రాలు కూడా విజయం సాధించాలి'' అని నిర్మాత వై.రవిశంకర్ అన్నారు. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా శరత్ కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ– ''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో వినోదం, భావోద్వేగాలతో పాటు ఊహించని అంశాలుంటాయి. 'డ్యూడ్' కచ్చితంగా ప్రేక్షకులకి నచ్చుతుంది'' అని చెప్పారు. ''చాలా కొత్త కథ ఇది. కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అన్నారు శరత్ కుమార్. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

హారర్ పంజరం



● అనిల్, ముస్కాన్, సాయికృష్ణ, రూప, యువ తేజ

అనిల్, యువతేజ, ముస్కాన్, రూప ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'పంజరం'. సాయికృష్ణ దర్శకత్వంలో సే స్టోరీ ప్రొడక్షన్స్, ఆర్3 ప్రొడక్షన్స్‌పై ఆర్. రఘన్ రెడ్డి నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సాయికృష్ణ మాట్లాడుతూ– ''హారర్ నేపథ్యంలో రూపొందిన మా సినిమా ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నాను. మా చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని భావిస్తున్నాను'' అని చెప్పారు. ''పంజరం' అందర్నీ ఆకట్టుకుంటుంది'' అన్నారు యువతేజ, అనిల్, రూప, ముస్కాన్. ''ఈ సినిమాకి సంగీత దర్శకునిగా నాకు అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు. 'పంజరం' అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని సంగీత దర్శకుడు నాని మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నటీనటులు పద్మ, రమణ, ప్రదీప్ మాట్లాడారు.

ఆ హీరోకి పాలాభిషేకం చేశాను

- నిహారిక ఎన్ఎమ్



''సినిమా ఇండస్ట్రీ గురించి రకరకాలుగా మాట్లాడుకుంటుంటారు. కానీ మన హద్దుల్లో మనం ఉంటే ఏమీ కాదు. తెలుగు పరిశ్రమలో నాకు దొరికినంత ప్రేమ, కంఫర్ట్ ఇంకెక్కడా దొరక లేదు'' అని నిహారిక ఎన్ఎమ్ చెప్పారు. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జంటగా నటించిన చిత్రం 'మిత్ర మండలి'. బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నిహారిక ఎన్ఎమ్ మాట్లాడుతూ– ''నేను చెన్నైలో పుట్టాను. బెంగళూరులో పెరిగాను. మా అమ్మమ్మ వాళ్లు విజయవాడలో ఉండేవారు. నా చిన్నప్పుడు నేను మా అమ్మమ్మ ఇంటికి వచ్చేదాన్ని. అలా నాకు తెలుగు మాట్లాడటం వచ్చు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేశాను. ఎమ్‌బీఏ చేశాను. ఎమ్ఎఫ్ఏలో ఫిల్మ్‌మేకింగ్ చేశాను. నా పదహారేళ్ల వయసులోనే టైమ్‌పాస్‌గా యూట్యూబ్ వీడియోలు చేయడం స్టార్ట్ చేశాను. హాలీవుడ్ మూవీతో పాటు చాలా సినిమాలకు ఇన్‌ఫ్లూయన్సర్‌గా చేశాను. మహేశ్‌బాబుగారు నా ఫేవరెట్. 'సర్కారువారి పాట', 'మేజర్' (మహేశ్‌బాబు నిర్మాత) సినిమాలకు ఇన్‌ఫ్లూయన్సర్‌గా చేశాను. 'మేజర్' సినిమా కోసం నేను చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. నా చిన్నతనంలో రజనీకాంత్‌గారి సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం నన్ను మా నాన్నగారు చెన్నై తీసుకెళ్లేవారు. నేను పాలాభిషేకం కూడా చేశాను. ఇక 'మిత్ర మండలి'లో ఫన్నీ క్యారెక్టర్ చేశాను. హాయిగా నవ్వుకోవడం కోసం మా సినిమాకు రండి. ప్రస్తుతం కన్నడంలో రెండు, తమిళంలో ఒక సినిమా చేస్తున్నాను. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి'' అని అన్నారు.


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 | వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 199

శుక్రవారం | 10-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



హంగేరియన్ రచయితకు సాహిత్య నోబెల్

విధ్వంసానికి విచలితమైన సమాజంలో తన అక్షరాలలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని కలగలిపి చైతన్యం రగిలించిన హంగేరి రచయిత లాస్లో క్రాస్నహోర్కైకి నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది.

- వివరాలు 6లో



అయోధ్యలో పేలుడు.. ఐదుగురి మృతి

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు.

- వివరాలు 6లో



ఆ దగ్గు సిరప్‌లను ఉపసంహరించాం

దేశంలో తయారైన కోల్డ్రిఫ్, రెస్పిఫ్రెష్‌టీఆర్, రిలైఫ్ అనే దగ్గు సిరప్‌లను మార్కెట్ నుంచి ఉపసంహరించినట్లు సీడీఎస్‌సీవో తెలిపింది.

- వివరాలు 6లో



ముందే పాఠం నేర్పుకుందాం

డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడులపై అవగాహన కల్పించడం సాధ్యమే!

- వివరాలు 14లో



రూ.72 కోట్ల 'ఎఫెడ్రిన్' స్వాధీనం

జీడిమెట్లలో 'ఈగల్' బృందం నిర్వహించిన సోదాల్లో రూ.72 కోట్ల విలువైన 220 కిలోల ఎఫెడ్రిన్ బయటపడింది.

- వివరాలు 5లో

స్థానిక ఎన్నికలకు బ్రేక్

ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ హైకోర్టు ఆదేశాలు

నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి ఆదేశం

- ఆ తర్వాత 2 వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని పిటిషనర్లకు స్పష్టీకరణ
- అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత
- అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు
- సర్వే నుంచి బిల్లు వరకు ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయి
- ఎక్కడా.. ఏ రాజకీయ పార్టీ నుంచి వ్యతిరేకత రాలేదు
- ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశాం.. జోక్యం సరికాదు
- ఎలాంటి మధ్యంతర ఉత్తర్వుల జారీ వద్దని విజ్ఞప్తి



ఆదిలాబాద్‌లోని ఓ షాపులో కోర్టు తీర్పు వార్తలను వీక్షిస్తున్న స్థానికులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేకులు వేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన నోటిఫికేషన్‌ను గురువారం సాయంత్రం హైకోర్టు నిలిపివేసింది. నాలుగు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తర్వాత మరో రెండు వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండురోజులపాటు ఇరుపక్షాల నుంచి సుదీర్ఘ వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. నోటిఫికేషన్ నిలిపివేయటానికి గల కారణాలతో కాపీ వెలువరిస్తామని పేర్కొంది. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9ని సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను విచారణకు అనుమతిస్తున్నామని ధర్మాసనం చెప్పింది. జీవో 9ని కొట్టివేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు

మిగతా 12వ పేజీలో ▶

'నోటిఫికేషన్' సస్పెండ్

హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన

ఎన్నికల కోడ్ కూడా ఎత్తివేత

భగ్గుమన్న బీసీ సంఘాలు 12లో

బీఆర్‌ఎస్, బీజేపీలే అడ్డుకున్నాయి

ఆ రెండు పార్టీలు కలిసి బీసీలకు అన్యాయం చేశాయి: భట్టి విక్రమార్క

- వివరాలు 12లో

కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టండి

ఎర్రవల్లిలో పార్టీ నేతలతో కీలక భేటీలో కేసీఆర్ ఆదేశం

- వివరాలు 13లో

రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరు దురదృష్టకరం

రాష్ట్ర ప్రభుత్వ తీరుతోనే జీవో 9పై హైకోర్టు స్టే: కిషన్ రెడ్డి

- వివరాలు 12లో



సుంకాలు, నిబంధనలు ఆందోళనకరం

- అమెరికా నిర్ణయాలు, విధానాలు సానుకూల దృక్పథంతో ఉండాలి
- ఆర్థికాభివృద్ధి విధానాలే ప్రపంచానికి ఆదర్శనీయం
- అమెరికా ప్రతినిధుల బృందంతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వివరాలు 2లో

ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర

- చార్జీల పెంపుపై కేటీఆర్ ఆగ్రహం
- నిర్బంధాలు, ఆంక్షల నడుమ బీఆర్‌ఎస్ చలో బస్ భవన్
- ఉదయం నుంచే ముఖ్య నేతల ఇళ్ల వద్దకు పోలీసులు
- ఆర్టీసీ బస్సుల్లో బస్ భవన్‌కు వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు
- చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలంటూ ఎండీకి వినతి

13లో



యూకే ఒప్పందంతో ఎంఎస్‌ఎంఈలకు బూస్ట్

ఉద్యోగాల కల్పనకు దన్ను

2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు

సీఈవోల సదస్సులో ప్రధాని మోదీ వెల్లడి

15లో

ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్

- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకెళ్తోంది
- ఈ ప్రయాణంలో మేమూ భాగస్వాములం అవుతాం
- యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వెల్లడి
- మోదీతో సమావేశం
- ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చ
- యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదులకు అడ్డుకట్ట వేయాలని స్టార్మర్‌కు విజ్ఞప్తి

6లో

గాజాలో శాంతి పవనాలు!

ట్రంప్ ప్రణాళికలో మొదటి దశకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం

- ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయనున్న హమాస్.. పాలస్తీనా ఖైదీలకు విముక్తి కల్పించనున్న ఇజ్రాయెల్
- గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనక్కి
- రెండు కీలక అంశాలపై ఇంకా రాని స్పష్టత
- ఆయుధాల అప్పగింతపై నోరువిప్పని మిలిటెంట్లు.. గాజాలో పరిపాలనపై కొనసాగుతున్న సందిగ్ధత



6లో

క్లుప్తంగా...

పాలమూరులో భారీ వర్షం

పిడుగుపాటుతో మహిళ మృతి



నవాబుపేట మండలం రుద్రారంలో ఇళ్ల మధ్య పారుతున్న వరద నీరు

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహబూబ్‌నగర్, నవాబుపేట, దేవరకద్ర మండలాల్లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. నవాబుపేట మండలం రుద్రారంలో వాగు నిండి గ్రామంలోకి నీరు ప్రవహించడంతో ఇళ్లలోకి భారీగా వరద వచ్చి చేరింది. చెన్నారెడ్డిపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. వనపర్తి జిల్లాలో కాజ్‌వే ఉధృతంగా ప్రవహించడంతో మదనాపురం–ఆత్మకూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపేట జిల్లా పళ్ల ప్రాంతానికి చెందిన కందుకూరు పద్మ(35) పొలం పనులకు వెళ్లగా.. అక్కడ పిడుగు పడటంతో మృత్యువాతపడింది.

హామీ మేరకు ఒక డీఏను విడుదల చేయాలి

సీఎస్‌ను కోరిన టీజీఈజేఏసీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక డీఏను విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రచార కార్యదర్శి బి.శ్యామ్ తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందించాలని, ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మిగతా సమస్యలపై చర్చించాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతులపై సీఎస్ సానుకూలంగా స్పందించారని టీజీఈజేఏసీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు దామోదర్ రెడ్డి, వంగ రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సదానంద్ గౌడ్, కట్కం రమేశ్, ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, దాస్య నాయక్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌దే హవా

ఉపకరణాల్లో సింహభాగం వీటిదే

ఐదింట ఒక వంతు గృహోపకరణాలది

ఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ ఫోన్లదే అధిక భాగం

– సాక్షి, స్పెషల్ డెస్క్

మొబైల్ ఫోన్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, ఏసీ.. ఇలా ఏదో ఒకటి లేని ఇల్లు అంటూ ఉండదు. ఇవి మన జీవితంలో అంతలా భాగమయ్యాయి. దేశంలో ఉపకరణాలు, ఎలక్ట్రానిక్స్ రంగంలో బిజినెస్ టు కన్స్యూమర్ (బీ2సీ) విభాగం వాటా 90 శాతానికి పైగా ఉంది. విలువ రూ.5.9 లక్షల కోట్లు. 2029 నాటికి బీ2సీ విభాగం రూ.10 లక్షల కోట్లకు చేరుతుందని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా అంచనా వేస్తోంది. ఉపకరణాల రంగంలో గృహోపకరణాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌గా రెండు ప్రధాన విభాగాలున్నాయి. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మార్కెట్‌లో మొబైల్ ఫోన్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎయిర్ కండిషనర్స్ సెగ్మెంట్ రాబోయే నాలుగేళ్లలో రెండు రెట్లు అధికమై 17 శాతం వృద్ధి చెందుతుందని ఎల్‌జీ భావిస్తోంది. ఐపీఓ పత్రాల్లో కంపెనీ భారత మార్కెట్ గురించి ఆసక్తికర అంశాలు వెల్లడించింది.



విభాగాల వారీగా మార్కెట్ తీరుతెన్నులు (శాతాల్లో)

విభాగం	2024	2029	వార్షిక వృద్ధి రేటు
సర్వీసెస్	4	5	17
కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్	75	72	10
హోమ్ అప్లయెన్సెస్	21	23	13
విలువ (లక్షల కోట్లు)	5.9	10	11

(లాండ్రీ, అద్దెకు ఉపకరణాలు, నిర్వహణ ఒప్పందాలు సర్వీసెస్ కిందకు వస్తాయి)

2024లో గృహోపకరణాల మార్కెట్ ఇలా..

విభాగం	వాటా (శాతాల్లో)
రూమ్ ఏసీ	26
రిఫ్రిజిరేటర్స్	26
వాషింగ్ మెషీన్స్	20
కిచెన్ అప్లయెన్సెస్	7
ఇతర ఉత్పత్తులు	21

(వాటర్ హీటర్స్, వాక్యూమ్ క్లీనర్స్, ఐరన్ బాక్సెస్ వంటివి ఇతర ఉత్పత్తులు)

2024లో కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ ఇలా..

విభాగం	వాటా (శాతాల్లో)
మొబైల్ ఫోన్స్	71
టీవీలు, ఆడియో సిస్టమ్స్	20
కంప్యూటర్స్, విడిభాగాలు	4
ఇతర ఉత్పత్తులు	5

(ట్రిమ్మర్స్, వేరబుల్స్, ఈ-రీడర్స్, పోర్టబుల్ ప్లేయర్స్ వంటి ఇతర ఉత్పత్తులు)

2024-29 మధ్య విభాగాల వారీగా వార్షిక వృద్ధి రేటు

రూమ్ ఏసీ	రిఫ్రిజిరేటర్స్	టీవీలు, ఆడియో సిస్టమ్స్	మొబైల్ ఫోన్స్	వాషింగ్ మెషీన్స్
17	15	14	9	9

సుంకాలు, నిబంధనలు ఆందోళనకరం

అమెరికా నిర్ణయాలు, విధానాలు సానుకూల దృక్పథంతో ఉండాలి

- ఆర్థికాభివృద్ధి విధానాలే ప్రపంచానికి ఆదర్శనీయం
- అమెరికా ప్రతినిధుల బృందంతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



అమెరికా ప్రతినిధుల బృందంతో గురువారం సచివాలయంలో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అమెరికా ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచడం, హెచ్–1బీ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు అస్థిరతకు, అపార్థానికి దారితీస్తాయన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం తెలంగాణ పర్యటనలో భాగంగా గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులు ఈ బృందంలో ఉండగా వారిలో మేధావులు, బిజినెస్ లీడర్లు ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ బృందం పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార, వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై అభిప్రాయాలు స్వీకరిస్తోంది. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని.. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమ విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తోందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని.. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతూ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

న్యూయార్క్, టోక్యోకి పోటీగా హైదరాబాద్

ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ అందరినీ ఆకర్షిస్తోందని.. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీపడుతోందన్నారు. హైదరాబాద్‌లో గేమ్–ఛేంజర్ ప్రాజెక్టులుగా భారత్ ఫ్యూచర్ సిటీతోపాటు రీజనల్ రింగ్‌రోడ్, రీజనల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చరింగ్ జోన్లు, మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు కూడా ఉన్నాయన్నారు.

500 ఫార్చ్యూన్ కంపెనీలు రావాలి

30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని.. మొత్తం 500 కంపెనీలూ పెట్టుబడులకు ముందుకొచ్చి ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. 'చైనా+1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని.. అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి. సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 1.32 లక్షల ఎకరాలు

పండ్ల తోటల సాగు లక్ష్యమిదీ..

- 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం పెంపు కూడా..
- తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035 రూపకల్పన
- ప్రణాళికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రణాళికను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి తుమ్మల, వర్సిటీ వీసీ రాజిరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాబోయే ఐదేళ్లలో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు సాగులోకి వచ్చేలా చూడాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అలాగే 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం పెంచడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని నిర్ణయించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం రూపొందించిన 'తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక–2035'ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. వచ్చే పదేళ్లలో అనుసరించాల్సిన అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం పట్ల విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ డి. రాజి రెడ్డి, డాక్టర్ ఎ. భగవాన్, డాక్టర్ జి.పి. సునందిని సీఎం అభినందించారు.

రూపాయి పెట్టుబడికి రూ. 4 లాభంగా...

వచ్చే ఐదేళ్లలో రూ.921.40 కోట్లను సాగు పెట్టుబడిగా యూనివర్సిటీ ఈ ప్రణాళికలో పేర్కొంది. అలాగే రూ. 942.50 కోట్లను బిందుసేద్యం కోసం పెట్టుబడిగా కేటాయించాలని నిర్దేశించింది. తద్వారా రూపాయి పెట్టుబడికి 4 రూపాయల లాభం పొందే అవకాశం ఉందని ప్రణాళిక పేర్కొంది. తాము రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుత పంటల విస్తీర్ణంలో అమలు చేయడం వల్ల ఏటా రూ. 1,341 కోట్ల మేర ఉత్పత్తి విలువను సాధించవచ్చని అంచనా వేసింది. జామ, బొప్పాయి, అరటి, సపోటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, ఖర్జూరం అంజీర్, నేరేడు, ఉసిరి, సీతాఫలం మొదలైన పండ్ల పంటలను 1.32 లక్షల ఎకరాల్లో 2030 వరకు ఎంపిక చేసిన జిల్లాల్లో సాగు చేయవచ్చని పేర్కొంది. అలాగే 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయలను పండించేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఎంపిక చేసిన జిల్లాల్లో టమాటా, వంగ, క్యారెట్, క్యాబేజ్, దోస, కాలిఫ్లవర్, ముల్లంగి, ఉల్లి, ఆలుగడ్డ, ఆకుకూరలు, బీర, సొర, మిరప, బెండ, కాకర, చిక్కుడు పంటల విస్తీర్ణం పెంచడానికి కృషి చేయాలని పేర్కొంది. ఆఫ్ సీజన్ కూరగాయలు పెంపకంపై విశ్వవిద్యాలయం తయారు చేసిన ప్రణాళిక అమలు పరచాలని, సంవత్సరం పొడుగునా కూరగాయల లభ్యతకు, వివిధ వ్యవధుల్లో కూరగాయల సాగు, షేడ్ నెట్లో, రక్షిత వసతులలో కూరగాయలు పెంచడం వంటి పద్ధతులను అవలంబించాలని ఈ ప్రణాళిక స్పష్టం చేసింది.

మనిషిని చంపి, ముక్కలు చేయడమెలా?

- యూట్యూబ్‌లో చూసి నిందితుల స్కెచ్...
- ఖమ్మంలో డబ్బు కోసం కిరాతకం
- నిద్రిస్తున్న స్నేహితుడిని గొంతు కోసి హతమార్చి ఆపై ముక్కలుగా నరికిన వైనం
- శరీర భాగాలను బైక్‌పై దూరంగా తరలించి విసిరేసిన కేటుగాళ్లు
- మృతుడి ఫోన్ నుంచి డబ్బు బదిలీ కావడంతో కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ఖమ్మం రూరల్: ఇద్దరు పురుషుల మధ్య ఏర్పడిన పరిచయం స్నేహంగా మారి అసహజ శృంగార బంధానికి దారితీసింది. ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి.. రెండో వ్యక్తి అడిగినప్పుడల్లా డబ్బు అప్పుగా ఇచ్చేవాడు. అయితే అతన్ని చంపితే ఆ డబ్బంతా సొంతం చేసుకోవచ్చని రెండో వ్యక్తికి దుర్బుద్ధి పుట్టింది. అంతే.. వెంటనే తనకు పరిచయమైన మూడో వ్యక్తితోపాటు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ మహిళతో కలిసి ఆ వ్యక్తిని హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి పడేశాడు. మృతదేహాన్ని ఎలా ముక్కలు చేయాలో యూట్యూబ్ వీడియోలు చూసి అమలు చేశాడు. ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో బయటపడ్డ ఒళ్లు జలదరించే విషయాలివి. ఈ కేసును ఛేదించిన పోలీసులు.. ఆ వివరాలను గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

జీతం సరిపోక.. సాగు కలిసిరాక

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన పరిమి అశోక్ ఎం.ఫార్మసీ చదివాక తల్లిదండ్రులు చనిపోవడంతో అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. జీతం సరిపోక గ్రామంలో కూరగాయలు సాగు చేసినప్పటికీ నష్టాలు వచ్చి అప్పుల పాలయ్యాడు. ఆపై ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆయాగా పనిచేస్తున్న తిరుమలాయపాలెంకు చెందిన కొమ్ము నగ్మాతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. వారిద్దరూ ఖమ్మంలో ఉండేవారు. మరోవైపు అశోక్‌కు కామేపల్లి మండలం కెప్టెన్ బంజరకు చెందిన గట్ల వెంకటేశ్వర్లు (ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం)తో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. తరచూ అశోక్ గదికి వచ్చే వెంకటేశ్వర్లు అతని అవసరానికి డబ్బు అప్పు ఇచ్చేవాడు. ఈ క్రమంలో అశోక్, వెంకటేశ్వర్లు నడుమ అసహజ సంబంధం ఏర్పడింది. ఆపై అశోక్‌కు డ్రిప్ కంపెనీలో పనిచేసిన పెంటి కృష్ణయ్య పరిచయమయ్యాడు. వారిద్దరూ వెంకటేశ్వర్లు వద్ద డబ్బు బాగా ఉందని భావించి దోచుకోవాలని కుట్రపన్నారు.

యూట్యూబ్‌లో చూసి..

వెంకటేశ్వర్లు హత్యకు సిద్ధమైన నిందితులు ఇందుకోసం యూట్యూబ్ వీడియోలు చూశారు. నిద్రలో ఉన్నప్పుడు కత్తితో గొంతు కోస్తే శబ్దం రాకుండా చనిపోతాడని నిర్ణయానికి వచ్చారు. అలాగే మృతదేహాన్ని ముక్కలుగా ఎలా నరకాలో కూడా తెలుసుకున్నారు. ఇందుకోసం కత్తులు సిద్ధం చేసుకున్నారు. గత నెల 15న రాత్రి వెంకటేశ్వర్లు అశోక్ ఇంటికి వచ్చి పడుకోవడంతో 16న తెల్లవారుజామున నగ్మాను బయట కాపలా ఉంచిన అశోక్.. కృష్ణయ్యతో కలిసి వెంకటేశ్వర్లు గొంతు భాగంలో కత్తితో పలుమార్లు నరికాడు. దీంతో అతని తల, మొండెం వేరయ్యాయి. ఆపై మృతదేహాన్ని ముక్కలుగా కోసి కవర్లలో కుక్కి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి కరుణగిరి ప్రాంతంలో పడేశారు. అనంతరం గదిలో రక్తం మరకలను శుభ్రం చేశారు. అయితే వెంకటేశ్వర్లు తిరిగి హైదరాబాద్ చేరుకోకపోవడంతో ఆయన సోదరుడు యాదగిరి గత నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. వెంకటేశ్వర్లు ఫోన్ మాయం కావడం.. ఆయన ఫోన్‌పే యాప్ నుంచి నగదు బదిలీ అవుతుండటంతో అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత విచారణ చేపట్టగా కృష్ణయ్య, నగ్మాతో కలిసి అశోక్ హత్యకు పాల్పడ్డట్లు తేలింది. నిందితుల నుంచి 2.7 తులాల బంగారం గొలుసు, నాలుగు ఫోన్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు.

ఆర్‌టీఐ చట్టం ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో జస్టిస్ శామ్‌కోషి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారమని, ప్రజలకు పాలనలో భాగస్వామ్యం అయ్యే శక్తిని ఇస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం తీసుకువస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం కొద్దిమంది చేతుల్లో కాకుండా ప్రజల చేతుల్లోనే ఉండాలని పేర్కొన్నారు. సరైన సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శామ్‌కోషి మాట్లాడుతూ.. ఆర్‌టీఐ చట్టం పౌరులను శక్తివంతం చేస్తుందన్నారు. అయితే కొందరు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ, స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, ఈ పద్ధతి సరికాదని సూచించారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం ముఖ్య కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టీఐ పనితీరు పురస్కారాలను మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సీవీ ఆనంద్, సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి మహేశ్‌దత్తు, సమాచార హక్కుచట్టం కమిషనర్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సోలార్ విద్యుత్

ఈ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- జర్మనీ బృందంతో డిప్యూటీ సీఎం భేటీ



గురువారం జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో నవీన్ మిత్తల్, కృష్ణ భాస్కర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గృహజ్యోతి పథకంతోపాటు వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ సరఫరాకోసం సోలార్ విద్యుత్‌ను వాడాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గురువారం ఆయన జర్మనీ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసే దిశగా జర్మనీ ప్రతినిధులు కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచారు. వీటిని పరిశీలించిన భట్టి, సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతానికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగానికి ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని తెలిపారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లతో పాటు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని జర్మనీ ప్రతినిధులకు ఆయన వివరించారు. తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి జర్మనీ బృందం ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేసి ఓ నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, రెడ్కో సీఎండీ అనిలా, జర్మనీ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి సుప్రీం నో

- గ్రూప్–1 నియామకాలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- తెలంగాణ ప్రభుత్వానికి ఊరట



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్–1 పరీక్షల నియామకాలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. గ్రూప్–1 ర్యాంకర్ల నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వేముల అనుష్ అనే అభ్యర్థి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం గురువారం విచారించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇప్పటికే మధ్యంతర తీర్పు ఇచ్చినందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నియామక ప్రక్రియ సాగాలని చెప్పింది. హైకోర్టులో ఈ నెల 15న ఈ కేసు విచారణకు రానున్న నేపథ్యంలో, తాము జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. దీంతో గ్రూప్–1 పరీక్షల నియామకాలపై నెలకొన్న సందిగ్ధతకు తాత్కాలికంగా తెరపడినట్టైంది. సుప్రీం నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వానికి, ఇప్పటికే నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు భారీ ఉపశమనం లభించినట్లయింది. హైకోర్టులో రాబోయే విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఒకేసారి 2 వేల మంది వెయిటింగ్ లిస్ట్ క్లియర్

- రాష్ట్ర హజ్ కమిటీ చరిత్రలో తొలిసారి ఇలా ఎంపిక
- 2026 హజ్ యాత్రకు డ్రా పద్ధతిలో మరో 4,240 మంది ఎంపిక



సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్రకు 2వేల మంది యాత్రికులను ఎంపిక చేశారు. వీరంతా వెయిటింగ్ జాబితాలోని వారే కావడం విశేషం. ఈ తరహాలో ఒకేసారి వెయిటింగ్ లిస్ట్ మొత్తానికి ఆమోదం తెలపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరో పక్క డ్రా పద్ధతిలో ఇప్పటికే 2026 సంవత్సరం హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 4,240 మంది ఎంపియ్యారు. కాగా, గురువారం 2 వేల మంది వెయిటింగ్ లిస్టు కూడా ఓకే కావడంతో 6,240 మంది 2026 హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి సఫీవుల్లా తెలిపారు. 2026 హజ్ యాత్రకు తెలంగాణ నుంచి 11,757 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 4,240 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. వీరిలో 65 ఏళ్లు పైబడిన వారి కేటగిరీలో 839 మంది యాత్రకు నేరుగా ఎంపిక అయ్యారు. 2026 హజ్ యాత్ర మేనెల మూడో వారంలో జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 2026కు సంబంధించి ఉత్తరాదికి కేటాయించిన కోటా నుంచి ఎక్కువ శాతం యాత్రికులు హజ్ యాత్రకు వెళ్లడానికి మొగ్గు చూపకపోవడంతో వీరి స్థానంలో దక్షిణాది రాష్ట్రాలకు అదనపు అవకాశం కల్పించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. దీంతో తెలంగాణ నుంచి ఈ సారి దాదాపు 8 నుంచి 9 వేల మందికి యాత్రకు వెళ్లే అవకాశం దక్కనుందని అధికారులు చెపుతున్నారు.

గురుకులాల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

ఉత్తర్వులు జారీ చేసిన సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య

జిల్లా	ప్రత్యేకాధికారి
రంగారెడ్డి	బి.గీత
నల్లగొండ	బి.సక్రునాయక్
ఖమ్మం	కె.శారద
ఆదిలాబాద్	పీఎస్ఆర్ శర్మ
మహబూబ్‌నగర్	డి.శ్రీనివాస్
నిజామాబాద్	బి.ప్రమోద్‌కుమార్
హైదరాబాద్	జె.పద్మజ
కరీంనగర్	సీహెచ్.శైలజ
మెదక్	ఎస్.రజిని
వరంగల్	బి.రుక్మిణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని విద్యాసంస్థల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు మొదలయ్యాయి. విషాహార ఘటనలతోపాటు ఉపాధ్యాయుల సమస్యలు, అద్దె భవనాల పెండింగ్ బిల్లుల వంటి అంశాల పరిష్కారంలో వ్యూహాత్మక కార్యాచరణకు అధికార యంత్రాంగం ఉపక్రమించింది. సొసైటీ కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ఆదిత్య... క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సొసైటీ ప్రధాన కార్యాలయంలోని జాయింట్ సెక్రటరీలు, డిప్యూటీ సెక్రటరీలు, సీనియర్లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఉమ్మడి జిల్లాకు ఒక అధికారి చొప్పున 10 మంది అధికారులను నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన కార్యాలయంలో వారికి నిర్దేశించిన బాధ్యతలతోపాటు అదనపు బాధ్యతలను కూడా నిర్వహించాలని ఆదేశించారు.

సందర్శనలు... సమీక్షలు... : ప్రతి ప్రత్యేకాధికారి నిర్దేశించిన జిల్లా పరిధిలోని పాఠశాలల ను సందర్శించి ని ర్వహణను నిశితంగా పరిశీలించాలి. మెనూ ప్రకారం ఆహార పరిమాణం అందుతోందో లేదో, ఆహారం నాణ్యంగా ఉందోలేదో పర్య వేక్షించాలి. విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వసతులు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించాలి. ఒకవేళ పాఠశాల అద్దె భవనంలో ఉంటే అద్దె బకాయిలు, చెల్లింపులను పరిశీలించాలి. పాఠశాల పరిధిలోని తాత్కాలిక, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపులపై ఆరా తీయాలి. గుర్తించిన సమస్యలను నెలలోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి. విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి యూడైస్, అపార్ ఐడీలను ఈ నెల 20కల్లా పూర్తి చేయాలి. ప్రతి జిల్లాలో సోషల్ మీడియా సెల్ నిర్వహణకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి జోనల్ ఆఫీసర్, ప్రిన్సిపాళ్లతో సంప్రదింపులు జరపాలి. ఇన్‌స్పెక్షన్ చెక్‌లిస్ట్/ఫార్మాట్ ఆధారంగా పరిశీలన నివేదికను రాష్ట్ర కార్యాలయంలో సమర్పించాలి.



యువతకు ర్యాంకుల సాధనే కాదు... సామాజిక స్పృహ ఉండాలి

- ఆర్టీఐ అవగాహన సదస్సులో మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి


సదస్సును ప్రారంభిస్తున్న బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత అకడమిక్ ర్యాంకుల కోసమే కాకుండా, సామాజిక స్పృహకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. సమాజంలో జరిగే పరిణామాలపై స్పందించే తత్వం అలవర్చుకోవాలని, ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలకిష్టారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి కీలకోపన్యాసం చేశారు. యువత భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న భారత్‌లో వజ్రాయుధంలా ప్రజల ముందుకొచ్చిన సమాచార చట్టంపై విద్యార్థులు అవగాహన పొందాలని సూచించారు. ఎన్జీవోలు, పౌర సమాజం పోరాటాల ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఈ చట్టాన్ని యువత భాగస్వామ్యంతోనే మరింత ముందుకు తీసుకెళ్లొచ్చని తెలిపారు. కాలేజీ ఫౌండర్ చైర్మన్ అరమంద వరప్రసాద్‌రెడ్డి, కాలేజీ చైర్మన్ అరిమంద సిద్ధార్థరెడ్డి, సెక్రటరీ డాక్టర్ విజయశారద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో దశ ఎంఈడీ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ చేపడుతున్నట్టు సీపీగేట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, 15, 16 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, 21వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఈ నెల 24వ తేదీకల్లా సీట్లు వచ్చిన వారు రిపోర్టు చేయాలని సూచించారు.

30,371 ఎంసీఏ, ఎంబీఏ సీట్ల భర్తీ

టీజీఐసెట్ నిర్వహించిన ప్రత్యేక దశ కౌన్సెలింగ్ పూర్తయింది. ఇప్పటివరకూ 25,743 ఎంబీఏ సీట్లు, 4,628 ఎంసీఏ సీట్లు భర్తీ చేసినట్టు సాంకేతిక విద్య కమిషనరేట్ తెలిపింది. ఎంబీఏలో ఇంకా 4,844, ఎంసీఏలో 2,645 సీట్లు మిగిలిపోయినట్టు పేర్కొంది. 72 కాలేజీల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి.





సాక్షి
శుక్రవారం, 10 అక్టోబర్ 2025

గాజాలో శాంతివీచిక!

రెండేళ్ల నుంచి అవిచ్ఛిన్నంగా క్షిపణులు, బాంబుల వర్షంతో కంటిమీద కునుకు లేకుండా గడిపిన గాజా ఇకపై గుండెల నిండా ఊపిరి పీల్చుకోనుంది. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం ఆగిపోయిందనీ, ఇరు పక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయనీ, శాంతి ప్రణాళికలో ఇది తొలి దశ అనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గమనిస్తే పూర్తిస్థాయి శాంతి స్థాపనకు మరికొంత సమయం పట్టొచ్చని స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత హడావిడిగా సంధి కుదిరినట్టు ప్రకటించటం వెనక శుక్రవారం ప్రకటించబోయే నోబెల్ శాంతి బహుమతికి అర్హత సాధించటం కోసమేనని అందరికీ తెలుసు. ట్రంప్ అందుకు అర్హుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫార్సు చేస్తున్నారు. తమ భూభాగంలోకి చొరబడి 2023 అక్టోబర్ 7న 1,100 మంది పౌరులను హతమార్చి, 251 మందిని అపహరించుకుపోయిన హమాస్ దుండుడుకు చర్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ 24 నెలల పాటు గాజాపై నిప్పుల వాన కురిపించింది. ఏ క్షిపణి ఎక్కడ పడుతుందో, ఏ బాంబు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక గాజా వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జనావాస ప్రాంతాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా క్షిపణులు ప్రయోగించటం, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లు క్షణంలో కూలి శిథిలాల గుట్టగా మారటం ప్రపంచ ప్రజలంతా చూశారు. కనీసం ఇద్దరో ముగ్గురో మరణించని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు... ఇజ్రాయెల్ ఉల్లంఘనల వల్ల పెద్దగా ఉపశమనం ఇచ్చింది లేదు.

దీన్ని యుద్ధం అనడం ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని కప్పిపుచ్చే యత్నమే అవుతుంది. బలాబలాల్లో ఎంత వ్యత్యాసం ఉన్నా రెండు దేశాల మధ్య పరస్పరం కొన సాగే ఘర్షణల్ని యుద్ధం అంటారు. ఇక్కడ జరిగిందంతా వేరు. ఇజ్రాయెల్ లోపాయకారీ మద్దతుతో ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకుని గాజా ప్రజలపై పెత్తనం సాగిస్తూ, పాలస్తీనా అథారిటీని బేఖాతరు చేస్తూ వచ్చిన హమాస్ ఉన్నట్టుండి ఉగ్రవాద దాడికి పూనుకొంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారమే 67,183 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 1,69,841 మంది గాయాల పాలయ్యారు. వైద్య సిబ్బంది, పాత్రికేయులన్న విచక్షణ లేకపోగా, చాలా సందర్భాల్లో వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యాలు హతమార్చటం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనిది. దాడులు ఆగుతాయంటున్నారు గనుక శిథిలాల తొలగింపు మొదలవుతుంది. అప్పుడు గానీ మృతుల అసలు సంఖ్య ఎంతో తెలియకపోవచ్చు. ఇప్పటికీ ఆచూకీ తెలియనివారు వేలల్లో ఉన్నారు.

ఇజ్రాయెల్ ఘాతుకాల వెనక జాత్యహంకారం స్పష్టంగా కనబడుతుండగా, ఆ దుండగాన్ని ధర్మబద్ధంగా వ్యతిరేకించినవారిని యూదులపై వివక్ష ప్రదర్శిస్తున్నవారిగా జమకట్టి వేధించటం, విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు చొరబడి అరెస్టులు చేయటం ట్రంప్ నైజానికి అద్దం పడుతుంది. గాజాలో హమాస్ ఒక్కటే లేదు. పాలస్తీనా విమోచన కోసం పోరాడే సంస్థలు డజను వరకూ ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి పోలేదు. గాజాలోనే ఒక హద్దు నిర్ణయించుకుని ఆగింది. ఇప్పుడు కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఎంతవరకూ గౌరవిస్తుందో తెలియదనీ, ఒప్పందంలోని చాలా క్లాజులు అస్పష్టతతో ఉన్నా కేవలం ట్రంప్ హామీని నమ్మి సమ్మతించామనీ ఆ సంస్థల ప్రతినిధులు చెబుతున్న తీరు గమనార్హం.

ట్రంప్‌కు నోబెల్ వస్తే తప్ప ఈ ఒప్పందం సజావుగా ముందుకు పోదు. రెండో దశ చర్చల్లోనే అసలు అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు మరణమో, శరణమో పాలస్తీనా సంస్థలు తేల్చుకోక తప్పదు. ట్రంప్‌కు పురస్కారం లభిస్తే గాజా వాసులకు ఉన్నంతలో గౌరవప్రదమైన పరిష్కారం దొరకొచ్చు. రాకపోతే పరిణామాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. అయితే నరమేధాన్ని కొనసాగించటం ఇక సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే హమాస్ చెరలోని బందీలంతా విడుదలయ్యారు. అటు ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా పౌరులు దాదాపు 2,000 మంది విడుదలవుతున్నారు. గాజా విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా, ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయిన కొన్ని రోజులకే ఆ రెండు దేశాలూ తమకేం పట్టనట్టు ఈ శాంతి ఒప్పందం సాధించటం ఒక వైచిత్రి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.చవితి రా.12.27 వరకు, తదుపరి, పంచమి, నక్షత్రం: కృత్తిక రా.10.55 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ప.11.45 నుండి 1.14 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.10 నుండి 12.56 వరకు, అమృత ఘడియలు: రా.8.40 నుండి 10.11 వరకు, సంకటహర చతుర్థి.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.40
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

ద్వేషం వద్దు



ద్వేషం అనేది చాలా బరువైన భావోద్వేగం. నేనైతే ద్వేషాన్ని అస్సలు మోయలేను. ఎవరైనా మీకు తీవ్రమైన బాధను కలిగిస్తే, వారిని మీరు ద్వేషించడం సహజమే. కానీ మీ ద్వేషం కూడా మీకు వ్యతిరేకంగానే పనిచేస్తుంది. మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

– కరణ్ సింగ్ గ్రోవర్, మోడల్

పోటీ పడాలి



ప్రపంచంలోని అసమానమైన జట్లుతో పోటీ పడగలగటం అన్నది మనలోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తెస్తుంది. అయితే తేలికపాటి శిక్షణ మిమ్మల్ని పైకి తీసుకెళ్లలేదు. కఠోర సాధన వల్లే అసాధ్యం సాధ్యం అవుతుంది.

– నటాలీ స్కివర్–బ్రంట్, బ్రిటిష్ క్రికెటర్

సొంత కాళ్లు



సినిమాల్లో పనిచేయడం వల్ల గాయకులకు గుర్తింపు, డబ్బు వస్తాయి నిజమే, కానీ ఆ ట్రెండ్ నెమ్మదిగా మారుతోంది. ఇప్పుడు చాలామంది స్వతంత్ర సంగీత కళాకారులు సినిమాల్లో కంటే ఎక్కువగా తమ ప్రతిభకు తగిన పేరు, ప్రతిఫలం పొందుతున్నారు.

– నిత్యా మమ్మేన్, గాయని

వర్క్–లైఫ్



కెరీర్ గురించి ఆందోళన చెందుతూ జీవితం గురించి మర్చిపోకండి. ఉద్యోగాన్ని మాత్రమే కాదు, జీవితాన్ని కూడా ఏకకాలంలో ఉత్తమంగా మలుచుకునే ప్రయత్నం చెయ్యండి. ఒకదానికొకటి సహకరించేలా చేసుకోవటం మీ ఆలోచనల్లోనే ఉంది.

– రీస్ విథర్‌స్పూన్, నటి

దెబ్బలే నేర్పుతాయి!



నా ప్రత్యర్థుల ఆట ఆధారంగా నేను వివిధ రకాలుగా వారిని ఎదుర్కోవడం నేర్చుకున్నాను. అది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నా పంచ్‌లను 'కనెక్ట్' చేయడంలో మెరుగుపడ్డాను. బరిలోని ఎదురుదెబ్బలే నా పట్టుదలను పెంచాయి.

– జైస్మీన్ లంబోరియా, ఇండియన్ బాక్సర్

దేవుడి భయం



మానవులు తాము సృష్టించిన దేవుని పేరుతో వేల సంవత్సరాలుగా యుద్ధాలు చేస్తూ, ఒకరి నొకరు బాధించుకుంటూ, చంపుకుంటూనే ఉన్నారు. అలాగని దేవుడు లేడని, స్వర్గం – నరకం లేవని చెప్పటం కూడా కరెక్టు కాదు. అప్పుడు మరింతగా పీడన చెలరేగవచ్చు.

– రజత్ కపూర్, నటుడు

ముళ్లదారిలో ఒక ముందడుగు

విశ్లేషణ



టంకశాల అశోక్

గాజాలో 'శాంతి సాధన' కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రణాళికలో 'మొదటి దశ' అమలుకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించినట్లు 8వ తేదీ రాత్రి ప్రకటనలు వెలువడ్డాయి. ఈ ప్రకటనను హమాస్, ఇజ్రాయెల్ వెంటనే ధ్రువీకరించాయి. అది స్థూలమైన అంగీకారం. అమలు ఏ విధంగా అనే వివరాలు ఇంకా తెలియవలసి ఉంది. యథాతథంగా ఈ మొదటి దశ అనే దానిలో కాల్పుల విరమణతో పాటు రెండు అంశాలున్నాయి. ఒకటి – ఇజ్రాయెలీ బందీలను హమాస్, వారి ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయటం. రెండు – ఇజ్రాయెలీ సేనలు 'అంగీకృతమైన' (అగ్రీడ్ అపాన్) రేఖ వద్దకు ఉపసంహరించుకోవటం. ఈ రెండు అంశాల అమలు ఎంత సాఫీగా జరగవచ్చునన్నది వేచి చూడవలసిన విషయం. కాగా, రెండేళ్ళుగా సాగుతున్న గాజా మారణహోమంలో ఇపుడందరూ కొంత ఊపిరి తీసుకోగలరని మాత్రం చెప్పవచ్చు.

ఏది అంగీకృత రేఖ?

సరిగా రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌పై దాడి జరిపిన హమాస్, 250 మందిని బందీలుగా పట్టుకుంది. వారిలో ప్రస్తుతం సజీవులుగా 20 మంది, మృతదేహాల రూపంలో 28 మంది ఉన్నట్లు అంచనా. ఇజ్రాయెల్ వద్ద 250 మంది పాలస్తీనియన్లు జీవిత ఖైదీలుగా, సుమారు 1,300 మంది యుద్ధ ఖైదీలుగా ఉన్నట్లు చెప్తున్నారు. రెడ్ క్రాస్ ద్వారానో, మరొక విధంగానో వీరందరి విడుదలకు సమస్య ఉండక పోవచ్చు. కానీ, రెండవ అంశమైన ఇజ్రాయెలీ సేనల ఉపసంహరణ విషయం తేలటం తేలిక కాదు. 'అంగీకృత రేఖ' వద్దకు మాత్రమే పాక్షిక ఉపసంహరణ అన్నది ట్రంప్ ప్రణాళికలో గల అంశం కాగా, బందీలను తాము విడుదల చేయగానే పూర్తి ఉపసంహరణ జరగాలని హమాస్ షరతు పెడుతూ వచ్చింది. ఆ షరతును హమాస్ ఇప్పుడు సడలించిందా? ఏ విధంగా? 'అంగీకృత రేఖ' అర్థం పరస్పర అంగీకారమనా? లేక ట్రంప్, నెతన్యాహూల మధ్య అంగీకారమా?

ఇందులో 'అంగీకృత రేఖ' అనే మాట గురించిన సందేహాలు అనవసరమైనవిగా తోచవచ్చు. కానీ, ట్రంప్ 20 సూత్రాల ప్రణాళికను ఎవరితోనూ సంప్రతించకుండా ట్రంప్, నెతన్యాహూల మధ్య రూపొందిన విషయాన్ని గుర్తు చేసుకుంటే, ఈ సందేహాలు సహేతుకమైన వని అర్థమవుతుంది. పైగా, మొదట తాము ట్రంప్‌కు చేసిన సూచనలను ట్రంప్, నెతన్యాహూ సమావేశం దరిమిలా మార్చివేశారని అరబ్ నాయకులు బహిరంగంగా ఆరోపించటం కూడా గమనించదగ్గది. 'అంగీకృత రేఖ' అన్నది రాగల రోజులలో ఏ విధంగా 'పరస్పర అంగీకృతం' అయ్యే రీతిలో రూపొందగలదో చూడవలసి ఉంటుంది.



◆ ట్రంప్ 20 సూత్రాలలో అస్పష్టతలు, వంచనా కళలు తప్ప నిజాయతీ లేదు. 'అంగీకృత రేఖ' అన్నది ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య ఏ విధంగా 'పరస్పర అంగీకృతం' అయ్యే రీతిలో రూపొందగలదో చూడవలసి ఉంటుంది.

ఆయుధాలు వదిలేస్తారా?

కాల్పుల విరమణ జరిగిన అనేక సందర్భాలలో ఏవో కారణాలతో ఏదో ఒక పక్షమో, ఇరుపక్షాలో ఉల్లంఘనలకు పాల్పడటం సర్వసాధారణం. ఇజ్రాయెల్‌కు సంబంధించి వారు లెబనాన్, సిరియా, గోలన్ కనుమలు, జోర్డాన్ ప్రాంతాలలో చేస్తున్నది అదే. అందువల్ల, గాజాలో ఉపసంహరణను పర్యవేక్షించేది, 'అంగీకృత రేఖ' వద్దకు ఉపసంహరణ తర్వాత నియంత్రించేది ఎవరో ఇంకా సూచనలు లేవు.

గాజా సమస్య కేవలం గాజాకు పరిమితమైనది కాదు. వెస్ట్ బ్యాంక్‌తో కలిపి మొత్తం పాలస్తీనా దేశం ఏర్పాటుకు సంబంధించినది. ఇప్పటికే 150 దేశాలు గుర్తించినప్పటికీ కేవలం ఇజ్రాయెల్ కోసమని అమెరికన్లు భద్రతా సమితిలో పదే పదే వీటో చేస్తున్న తమ విధానాన్ని మార్చుకుని, రెండు స్వతంత్ర దేశ వ్యవస్థలు ఏర్పడే వరకు ఈ సమస్య పరిష్కారమయ్యేది కాదు. ఈ విషయమై ట్రంప్ 20 సూత్రాలలో అస్పష్టతలు, వంచనా కళలు తప్ప నిజాయతీ లేదు. గాజాకు సంబంధించి పాలస్తీనియన్లు, అరబ్బుల ఆలోచనలు ఒక విధంగా ఉండగా, అమెరికా, ఇజ్రాయెల్ ఆలోచనలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

అందుకు కొన్ని ఉదాహరణలను చెప్పుకొనేముందు... బందీలు, ఖైదీల విడుదల, అంగీకృత రేఖ వద్దకు సేనల ఉపసంహరణతో పాటుగా ఆ వెంటనే ముందుకు రాగల అంశాలేమిటో చూద్దాం. వాటిలో మొదటిది గాజా పౌరులకు సహాయం చేరటం. రెండవది హమాస్ నిరాయుధీకరణ. ఈ అంశాలు 20 అంశాలలో చేరి ఉన్నాయి గానీ, 8వ తేదీన ట్రంప్ చేసిన ప్రకటనలో లేవు. ఈజిప్టులో చర్చలు కొనసాగుతున్నందున సహజంగానే ముందుకు వస్తాయి. ఇందులో సహాయాల సరఫరాకు కూడా ఇంతకాలం ఆటంకాలు కల్పించిన ఇజ్రాయెల్, ఆ సహాయం హమాస్‌కు చేరుతున్నదనే వాదనలు చేసింది. సరఫరాలపై తమకు పూర్తి నియంత్రణ ఉండాలన్నది. ఇది పరిష్కారం కావలసి ఉన్న విషయం. హమాస్ నిరాయుధీకరణ జరిగి తీరాలన్నది అమెరికా, ఇజ్రాయెల్‌ల పట్టుదల కాగా, స్వతంత్ర పాలస్తీనాకు మార్గం సుగమం అయ్యే వరకు ఆ పని చేయబోమని హమాస్ ప్రకటిస్తున్నది. కాకపోతే, గాజాలో ఏర్పడే తాత్కాలిక ప్రభుత్వంలో భాగస్వాములం కాబోమని సూచించింది. అయితే, పాక్షిక నిరాయుధీకరణ కోసం ఒప్పించేందుకు మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారన్నవి 9వ తేదీ నాటి వార్తలు. పాక్షికమంటే ఏమిటో, హమాస్ నిర్ణయమేమిటో తెలియాలి.

ధూర్త ఆలోచన

ఇవి రెండవ దశగా భావిస్తే, ట్రంప్ ప్రణాళికలోని తక్కినవన్నీ మహా సమస్యాత్మకమైనవి. ఒక్క మాటలో చెప్పాలంటే, స్వతంత్ర పాలస్తీనా అన్నదే లేకుండా ఆ రెండు భూభాగాలు తమ అధీనంలోకి రావాలన్నది అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఈ రోజు వరకు కూడా ఉన్న పథకం కాగా, అందుకు ససేమిరా అన్నది పాలస్తీనియన్ల చరిత్రాత్మకమైన జాతిపరమైన ఆకాంక్ష. ట్రంప్ 20 సూత్రాలలో హమాస్ సంపూర్ణ నిరాయుధీకరణ, వారి రక్షణ వ్యవస్థలన్నింటి విధ్వంసం, ఆ సంస్థ కొత్త ప్రభుత్వంలో పాల్గొనకపోవటం, గాజాను డీ–ర్యాడికలైజ్ చేయటం, గాజా పరిపాలనకు బయటి వారితో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు, అమెరికా ఆధ్వర్యంలో రక్షణ బలాలు, గాజాను సెజ్‌గా మార్చి, బయటివారే అభివృద్ధి ప్రణాళికలు రచించి, బయటి నిధులతో అభివృద్ధి పరచటం వంటివి ఉన్నాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనా అథారిటీ తాము ఆశించిన విధంగా 'తనను తాను పూర్తిగా సంస్కరించుకున్న పక్షంలో' స్వీయ నిర్ణయాధికారం, పాలస్తీనా ఏర్పాటు విషయాలు అపుడు ఆలోచిస్తారు. ఇదెంత ముళ్లదారో, ధూర్తమైనదో స్పష్టంగా కనిపిస్తున్నదే!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

కారుమబ్బులు... కాంతి రేఖలు

సింపుల్‌గా....

మొదట సుంకాల మోత... ఆ తర్వాత కొత్త హెచ్1బి వీసాకు లక్ష డాలర్ల ఫీజు వ్యవహారం... ఆపైన బ్రాండెడ్ ఔషధాలపై 100 శాతం సుంకాలు... అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలితో భారత – అమెరికా సంబంధాలలో తెలియని గందరగోళం నెలకొంది. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు మొన్న అక్టోబర్ 1 నుంచి అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావమూ మన వీసాలపై పడనుంది.

ఇప్పుడేం జరిగింది?

హెచ్1బి వీసాల ఫీజును ఒకేసారి దాదాపు 60 రెట్లు పెంచుతూ, లక్ష డాలర్లు చేస్తున్నట్టు సెప్టెంబర్ 19న ట్రంప్ సంతకం చేశారు. గందరగోళం రేగడంతో, కొత్త దరఖాస్తులకే ఈ హెచ్చు ఫీజు వర్తిస్తుందనీ, ఇప్పటికే వీసా ఉన్నవారికీ, రెన్యువల్ కోరుతున్న వారికీ అది వర్తించదనీ వాషింగ్టన్ వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఇంతలో అక్టోబర్ 1 నాటి షట్‌డౌన్ నిర్ణయంతో మరో చిక్కు వచ్చి పడింది.

షట్‌డౌన్ కథేమిటి?

ఏటా అక్టోబర్ 1 నుంచి మరుసటి సెప్టెంబర్ 30 వరకు అమెరికా ప్రభుత్వపు ఆర్థిక సంవత్సరం. ఆ కాలవ్యవధికి అన్ని శాఖల వ్యయపరిమితిని నిర్ణయిస్తూ మన బడ్జెట్ తరహాలో నిధుల కేటాయింపు చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించగా, దేశాధ్యక్షుడు సంతకం చేయాలి. ఈ ఫండింగ్ బిల్ సమయానికి ఆమోదం పొందకపోతే, ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్ళిపోతుంది. అంటే, అత్యవసరం కాని సర్వీసులు స్తంభిస్తాయి. దీనితో కొత్త దరఖాస్తులు, బదలీలు, గ్రీన్‌కార్డ్ ప్రక్రియలు ఆగిపోయాయి.

ఎంత కష్టం? ఎవరికి నష్టం?

నిజానికి, అమెరికన్ పౌరులు కానివారు ఆ దేశంలో ప్రత్యేక ఉద్యోగాలు సంపాదించడానికి హెచ్1బి



వీసాలు ఒక మార్గం. ఏటా గరిష్ఠంగా 65 వేల వీసాలే ఇవ్వాలి. అమెరికాకు చెందిన ఉన్నత విద్యాసంస్థ నుంచి మాస్టర్స్ డిగ్రీ, లేదా డాక్టరేట్ చేసిన విదేశీ వృత్తినిపుణులకై అదనంగా మరో 20 వేల వీసాలు ఇవ్వవచ్చు. నిరుడు 80 వేల మందికి పైగా భారతీయులు హెచ్1బిలకు దరఖాస్తులు పెట్టారు. గత ఆర్థిక సంవత్సరం ఆమోదం పొందిన మొత్తం హెచ్1బిలలో 71 శాతం మన భారతీయులవే. పెంచిన తాజా వీసా ఫీజు ఆ దేశంలో భారీ టెక్ సంస్థలకే నష్టం. అవన్నీ విదేశీ ఉద్యోగులపై ఆధారపడి ఉన్నాయి.

తెరుచుకున్న కొత్త తలుపులు

ఇప్పుడు ట్రంప్ ఫీజు పెంపుతో భారతీయ వృత్తి నిపుణుల్లో లక్ష మందిపై ప్రభావం పడుతుందని అంచనా. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) రంగాల్లోని వారు ఎక్కువ నష్టపోతారు. ఈ పరిస్థితుల్లో చైనా, జర్మనీల నుంచి బ్రిటన్ దాకా వివిధ దేశాలు భారత్‌లోని ప్రతిభావంతుల్ని ఆహ్వానిస్తున్నాయి. ఉద్యోగ భర్తీకి ప్రత్యేక వీసా విధానాల్ని అందిస్తామంటున్నాయి. చైనా ఇప్పటికే అక్టోబర్ 1 నుంచి కొత్త 'కె' వీసాను అమలులోకి తెచ్చింది. స్పాన్సర్ అవసరం లేకపోవడం 'కె' వీసా ఆకర్షణ.

మరోపక్క విదేశీ ఉద్యోగులను తీసుకొనేందుకు త్వరలోనే కొన్ని ప్రతిపాదనల్ని చేయనున్నట్టు కెనడా ప్రధాని ఇటీవలే ప్రకటించారు. అమెరికాకు ప్రత్యామ్నాయం తమ ఆర్థిక వ్యవస్థే అంటూ, ఐటీ, సైన్స్, టెక్ రంగాలలో భారతీయులకు పుష్కలంగా అవకాశాలున్నాయని జర్మనీ చెబుతోంది. పైగా, జర్మనీలో పెరుగుతున్న వయోవృద్ధుల రీత్యా కనీసం 2040 వరకు ఏటా దాదాపు 2.88 లక్షల మంది ఇమ్మిగ్రెంట్స్ ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరం. ఇవన్నీ అమెరికన్ వీసాల సంక్షోభ వేళ భారతీయులకు అందివచ్చిన సరికొత్త అవకాశాలు.

రానున్న రోజుల్లో ఏం జరుగుతుంది?

వీసా ఫీజుపై ఇవే నిబంధనలు కొనసాగితే, అమెరికన్ ఐటీ సంస్థలు ఒక్కొక్కరికి లక్ష డాలర్లు పెట్టి కొత్త ఉద్యోగుల్ని తీసుకువెళ్ళడం కష్టమే. కాకపోతే, మరో మార్గం ఉంది. భారతీయుల ప్రతిభను ఉపయోగించుకోవడానికి అవి ఇక్కడే 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్' (జీసీసీలు) నెలకొల్పవచ్చు. ఇప్పటికే మన దేశంలో 1,600 జీసీసీలు పెట్టాయి. మరిన్ని జీసీసీలొస్తే, వీసా షరతుల ప్రభావం ఉండదు. ఈ 2025 నాటికి భారత్‌లోని జీసీసీలు 20 లక్షల మందికి పైగా నిపుణులకు ఉపాధినిస్తున్నాయి. ఏమైనా, సాక్షాత్తూ అమెరికాయే వలస జీవులతో నిర్మితమైన దేశం. ఆ సంగతి ట్రంప్ మర్చిపోతేనే కష్టం. ◆

మన మేధకు మరో తార్కాణం

ఇన్ బాక్స్

'హురున్ ఇండియా రిచ్ లిస్టు– 2025'లో 21 వేల కోట్ల రూపాయల సంపదతో 30 ఏళ్ల యువకుడు, 'పర్‌ప్లెక్సిటీ' ఏఐ సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ భారతీయ కుబేరుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రపంచం మొత్తాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధన, ఏకీకరణల్లో అనేక దిగ్గజ సంస్థలు, కంపెనీలు నిమగ్నమై ఉన్న కాలంలో పర్‌ప్లెక్సిటీ చాలా మంది దృష్టిని తన వైపునకు తిప్పుకోవటమే కాదు... ఏఐ శోధన రంగంలో ఒక బలీయమైన శక్తిగా అవతరించింది.

అరవింద్ శ్రీనివాస్ 1994 జూన్ 7న చెన్నైలో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా నుండి పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన తన పరిశోధనా కాలంలో అనేక ఏఐ అప్లికేషన్స్ పరిమితులను అర్థం చేసుకున్నారు. మార్కెట్‌లో ఉన్న సంప్రదాయ సెర్చ్ ఇంజిన్లు సంక్లిష్టమైన ప్రశ్నలకు సందర్భానికి అనుగుణంగా సమాధానాలు ఇవ్వలేకపోవటాన్ని గుర్తించారు. ఈ లోపాలను అధిగమించేందుకు 2022 ఆగస్టులో ఆండీ కొన్విన్‌స్కీ, డెనిస్ ఎరాట్స్, జానీ హోతో కలిసి శ్రీనివాస్ 'పర్‌ప్లెక్సిటీ'ని స్థాపించారు. టెక్ దిగ్గజాల (గూగుల్, ఛాట్‌జీపీటీ) ఆధిపత్యంలో ఉన్న సెర్చ్ ఇంజిన్ మార్కెట్ నుండి వారు విపరీతమైన సవాళ్లను మొదట్లో ఎదుర్కొన్నారు. కానీ పర్‌ప్లెక్సిటీ ద్వారా వారు తమ సాంకేతికత శక్తినీ, స్పష్టమైన ప్రత్యక్ష సమాచారాన్నీ యూజర్లకు అందించి అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ నుండి అభినందనలతో పాటు పెట్టుబడిని కూడా పొందారు. 2024 చివరి నాటికి పర్‌ప్లెక్సిటీ ఏఐ విలువ మూడింతలు పెరిగింది. ఏఐ ఆధారిత శోధన, సాంకేతికత వేగవంతం కావడం పర్‌ప్లెక్సిటీ వల్ల సాధ్యమైనవనటంలో అతిశయోక్తి లేదు. 2025 మే నుండి పర్‌ప్లెక్సిటీ ఆధునిక (ప్రో) వెర్షన్‌ను భారతీ ఎయిర్‌టెల్ యూజర్లకు ఉచితంగా ఇచ్చేందుకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. దీనివల్ల 36 కోట్ల భారతీయులను ఏఐ సేవలకు పర్‌ప్లెక్సిటీ దగ్గర చేసింది.




అరవింద్ శ్రీనివాస్

ఒక ఇంటర్వ్యూలో శ్రీనివాస్ మాట్లాడుతూ... 'ఏఐ అంటే శక్తిమంతమైన నమూనాలను సృష్టించటం మాత్రమే కాదు, ఆ నమూనాలను ప్రజలకు అర్థవంతమైన మార్గాలలో అందించటం' అన్నారు. పర్‌ప్లెక్సిటీకి ముందు ఉన్న ఏఐ నమూనాలు ప్రజలకు ఉపయోగంగా ఉన్నా... వాటి సేవలను అందరి వద్దకు చేర్చడంలో ఆ నమూనాలు వెనుకబడ్డాయి. పర్‌ప్లెక్సిటీని ప్రేరణగా తీసుకొని డీప్‌సీక్, క్వెన్ ఏఐ వంటి సంస్థలు ఓపెన్ సోర్స్ మార్గాన్ని ఎంచుకొని అతి తక్కువ ఖర్చుతో యూజర్లకు వారు అడిగిన సమాచారాన్ని అందిస్తున్నాయి. అరవింద్ శ్రీనివాస్ స్ఫూర్తితో భారతీయ యువత మరిన్ని ఆవిష్కరణలకు అంకురార్పణ చేసి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆశిద్దాం!

– తిరునహరి శ్రీరాం సుదర్శన్ । ఏఐ – పరిశోధక విద్యార్థి

డేటా పాయింట్



చూడగలిగే శక్తి

జ్యోతిర్మయం

సనాతన ధర్మంలో సూర్యోపాసన ప్రముఖంగా చెప్పబడింది. సూర్యుడు మనలోని ప్రతి ఇంద్రియానికీ ప్రాణశక్తిని అందించి నడిపిస్తాడు. 'సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ.' సూర్యుడు సకల చరాచర జగత్తుకూ చక్షువు రూపంగా చెప్పబడ్డాడు. ఆదిత్య హృదయం సూర్యుడిని 'నమస్సవిత్రే జగదేక చక్షుషే' అంటుంది. జగత్తుకంతటికీ చక్షువైన సవిత్రునికి నమస్సులు. చక్షువు అంటే కన్ను లేదా చూచేది. కన్నులు ఉంటేనే చూడగలం. చక్షువు వస్తు పరిజ్ఞానం యొక్క విశేషాన్ని తెలియ చేస్తుంది. దేనిని చూడాలన్నా కనులు ఉండాలి. వాటికి చూడగలిగే శక్తి ఉండాలి. సూర్యమండలంలో ఉన్న పరమాత్మ తేజస్సే మన కంటిలో నిలిచి వస్తువును చూడగలిగిన శక్తిని ప్రసాదిస్తున్నది. దీనినే 'నయనము' అని కూడా అంటారు. నయనమంటే తీసుకొని పోయేది అని అర్థం. ఎక్కడికి తీసుకు వెళుతుంది? త్రోవలో ఎదురయ్యే కంటకాల నుండి తప్పించి... మంచి మార్గం వైపు తీసుకొని పోతుంది. కంటి చూపునకు సంబంధించిన విద్య కాబట్టి దీనిని 'చక్షుష్మతీ విద్య' అన్నారు.

'చక్షుష్మతీ విద్యయా తమస్సుమతి': చక్షుష్మతీ విద్యను తెలుసుకుంటే... తమస్సును అధిగమించగలం. చక్షుష్మతీ దేవిని వర్ణిస్తూ – ఒక చేతిలో బంతిని, మరొక చేతిలో పూవును పట్టుకొని వెండి సింహాసనంపై కూర్చుంటుంది, అని చెపుతారు. వెండి సింహాసనం మన కంటి చుట్టూ ఉండే తెల్లని వలయం, నల్లగుడ్డు మధ్యలో ఉండే తెల్లని బిందుస్థానానికి ప్రతీక. అక్కడే సూక్ష్మరూపంలో చక్షుష్మతీ దేవి ఉంటుంది. పూవు వికసనకు ప్రతీక... ముడుచుకు పోతే దేనినీ చూడలేం. వికసన ఉంటేనే చూడగలుగుతాం. అలాగే బంతి అనేది భ్రమణానికి ప్రతీక. కనుగుడ్లు తిరిగితేనే దేనినైనా చూడగలం. ఆదిత్యునిలోని చక్షుష్మతి అనే శక్తి కనులలో ఉన్నప్పుడే మనమేదైనా చూడగలుగుతాం. చూడగలిగే శక్తి లేనప్పుడు ఆపదల వలయంలో చిక్కుకుంటాం. అందుకే చక్షుష్మతీ అనుగ్రహానికై ప్రార్థించాలి.

– పాలకుర్తి రామమూర్తి

ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తు



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



సామగ్రిని తరలిస్తున్న కోర్టు సిబ్బంది

జగిత్యాల టౌన్: రైల్వేలైన్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు సరిపడా పరిహారం చెల్లించకపోవడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ సామగ్రిని జప్తు చేయాలని కోర్టు తీర్పు వెలువరించింది. పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ కోసం జగిత్యాల ప్రాంత రైతుల నుంచి దాదాపు వంద ఎకరాల భూమిని సేకరించారు. 2006లో ఎకరాకు రూ.1.30 లక్షల పరిహారం అందజేశారు. అది చాలదంటూ రైతులు కోర్టును ఆశ్రయించడంతో అదనపు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆదేశాలను బేఖాతరు చేయడంతో కోర్టు తీర్పు మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయ సామగ్రిని జప్తు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, లింగంపేట రైతుల పరిహారానికి సంబంధించి గతంలోనూ ఆర్డీవో కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది.

రూ. 72 కోట్ల విలువైన ఎఫెడ్రిన్ డ్రగ్ స్వాధీనం

- హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఒక ఫ్లాట్‌పై ఈగల్ బృందం దాడి
- 220 కిలోల ఎఫెడ్రిన్ స్వాధీనం
- నలుగురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో మరోసారి భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయి. జీడిమెట్లలోని ఓ అపార్ట్‌మెంట్‌పై ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం నిర్వహించిన సోదాల్లో రూ.72 కోట్ల విలువైన 220 కేజీల ఎఫెడ్రిన్ బయటపడింది. ఈ డ్రగ్ తయారు చేస్తున్న ముఠాలోని నలుగురిని అరెస్టు చేసినట్టు 'ఈగల్' డైరెక్టర్ సందీప్‌శాండిల్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులను ఏపీలోని కాకినాడకు చెందిన సాయి దత్తా రెసిడెన్సీకి చెందిన వాస్తవాయి శివ రామకృష్ణ పరమ వర్మ, డి.అనిల్, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన మద్దు వెంకట కృష్ణారావు, జీడిమెట్లకు చెందిన ముసిని దొరబాబుగా గుర్తించినట్టు చెప్పారు. మరో నిందితుడు ఎం.ప్రసాద్ (సూళ్లూరుపేట)పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఎఫెడ్రిన్‌ను మెథాంఫెటమైన్‌గా తయారు చేయొచ్చని, అలా తయారు చేస్తే దాని ధర పది రెట్లు పెరుగుతుందన్న ఆసక్తికరమైన విషయం దర్యాప్తులో తేలిందన్నారు.



స్వాధీనం చేసుకున్న డ్రగ్

ఈజీ మనీ కోసం..

గతంలో పలు కెమికల్ కంపెనీల్లో క్వాలిటీ కెమిస్టుగా పనిచేసి మానేసి ప్రస్తుతం ఆక్వా కల్చర్ బిజినెస్ చేస్తున్న శివ రామకృష్ణను ఈ ముఠాలో కీలక వ్యక్తిగా ఈగల్ బృందం గుర్తించింది. గతంలోనూ డ్రగ్స్‌కేసులో రెండుసార్లు అరెస్టు అయినట్టు గుర్తించారు. డ్రగ్స్ తయారీలో తనకున్న అనుభవంతో మత్తుపదార్థాలు తయారు చేసి విక్రయిద్దామని ఐడీఏ బొల్లారంలోని పీఎస్ఎం లైఫ్ సైన్సెస్‌కు చెందిన అనిల్ అనే వ్యక్తికి ఆఫర్ చేశాడు. ఈ విషయాన్ని అనిల్ తన కంపెనీ భాగస్వాములైన వెంకట కృష్ణారావు, ప్రసాద్‌తో చర్చించి వారిని ఒప్పించాడు. ఏడో తరగతి వరకు చదివి వాల్ పెయింటర్‌గా పనిచేసి, ప్రస్తుతం జీడిమెట్లలోని విజ్ఞసాయి లేబొరేటరీలో హెల్పర్‌గా పనిచేస్తున్న దొరబాబు సైతం జతకూడాడు. 2024 డిసెంబర్ నుంచే ఎఫెడ్రిన్ తయారీ ప్రణాళిక ప్రారంభించారు. శివ రామకృష్ణ ఎఫెడ్రిన్ తయారీ ఫార్ములాను అనిల్‌కు ఇవ్వడంతోపాటు అవసరమైన మెటీరియల్ కోసం రూ.8 లక్షలు ఇచ్చాడు. దీంతో అనిల్ బృందం 220 కిలోల ఎఫెడ్రిన్ డ్రగ్‌ను తయారు చేసింది. ఈ డ్రగ్‌ను శివ రామకృష్ణకు చెందిన జీడిమెట్ల సుచిత్ర క్రాస్‌రోడ్స్ సమీపంలో స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో సాయి దత్తా రెసిడెన్సీలోని ఫ్లాట్ నంబర్ 101లో దాచి ఉంచారు.

పాత నేరస్తులపై నిఘాతో వెలుగులోకి...

తాము తయారు చేసిన ఎఫెడ్రిన్‌ను విక్రయించేందుకు సరైన విక్రయదారులను చూపించాలని శివ రామకృష్ణ, అనిల్, వెంకట కృష్ణారావు, ప్రసాద్‌లు అనిల్‌కు స్నేహితుడైన దొరబాబు సాయం కోరారు. ఇదే క్రమంలో డ్రగ్స్ తయారీలో పాత నేరస్తులపై నిఘా పెట్టిన ఈగల్ బృందానికి శివ రామకృష్ణ లింక్‌లు లభించాయి. దీనిపై ఈగల్ బృందం నిఘా పెట్టింది. గురువారం సాయి దత్తా రెసిడెన్సీలోని ఫ్లాట్‌లో నలుగురు కలుస్తున్నట్టుగా సమాచారం లభించడంతో ఈగల్ బృందం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి 220 కిలోల ఎఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకుంది. అలాగే, డ్రగ్స్ తయారీకి ఉపయోగించిన పీఎస్ఎం లైఫ్ సైన్సెస్ యూనిట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో జెర్రి



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనంలో జెర్రి రావడంతో విద్యార్థులు అవాక్కయ్యారు. పాఠశాలకు రోజులాగే అక్షయపాత్ర ద్వారా భోజనం అందింది. వచ్చిన భోజనాన్ని విద్యార్థులకు పెడుతుండగా.. ఒక విద్యార్థికి వడ్డించిన అన్నంలో తాడిజెర్రి కనిపించింది. దీంతో విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా.. దీన్ని గోప్యంగా ఉంచేందుకు యత్నించారు. ఘటనపై కొందరు విద్యార్థులు డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్‌కు సమాచారం అందించారు. ఆయన పాఠశాలను సందర్శించి అక్షయపాత్ర భోజనం తయారీ నిలిపివేసి.. పాఠశాలలోనే వండేలా చూడాలని డిమాండ్ చేశారు. దీనిపై హెచ్ఎం చంద్రకళను వివరణ కోరగా.. అన్నంలో తాడి జెర్రి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్షయపాత్ర నిర్వాహకులకు సైతం ఈ విషయాన్ని తెలియజేశామని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు.

ముగ్గురు హాస్టల్ విద్యార్థినుల అదృశ్యం

- పోలీసుల గాలింపు.. నిజామాబాద్ జిల్లాలో ఘటన

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో గల ప్రభుత్వ ఎస్సీ వసతి గృహం నుంచి ముగ్గురు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. వసతి గృహం అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మూడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. వసతి గృహం పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు చదువుతున్నారు. పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు, 9వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. ఓ విద్యార్థిని బంధువు జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్‌లో ఉంటారు. మొదట విద్యార్థినులు ఆ బంధువు ఇంటికి వెళ్లి అక్కడ కాసేపు ఉన్నారు. తిరిగి హాస్టల్‌కు వెళ్తున్నామని బంధువుకు చెప్పి వెళ్లిపోయారు. హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి తమ అనుమతి లేకుండా విద్యార్థినులను బయటకు ఎలా పంపించారంటూ నిలదీశారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి హాస్టల్లో విద్యార్థినులు కొన్ని చీటీలపై ఊర్లపేర్లు రాసి డ్రా తీశారని, డ్రాలో వచ్చిన ప్రాంతాలకు తాము వెళ్తున్నామని తోటి విద్యార్థినులకు చెప్పినట్లు హాస్టల్ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా, అదృశ్యమైన విద్యార్థునిల్లో ఒకరి ఆచూకీ తెలిసిందని, మరో ఇద్దరికోసం గాలిస్తున్నామని సీఐ శ్రీనివాసరాజు తెలిపారు.

వేప చెట్లకు మళ్లీ ఆపద



గుర్రంపోడు: వేప చెట్లకు మళ్లీ ఆపద ముంచుకొస్తోంది. వేప చెట్లకు నెల రోజు లుగా డైబ్యాక్ వ్యాధి వ్యాపిస్తోంది. కొమ్మ లు ఎండుతున్న వేప చెట్లు నల్లగొండ – దేవరకొండ ప్రధాన రహదారి వెంట కనిపిస్తున్నాయి. వేపకు మూడేళ్ల క్రితం డైబ్యాక్ ఒక్కసారిగా విజృంభించడంతో.. కొమ్మలు ఎండటంతోపాటు చెట్లు కూడా కొన్ని నిలువునా ఎండిపో యాయి. అప్పట్లో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి ఒక కీటకం కారణమని గుర్తించారు. టీ మస్కిట్ బగ్ శిలీంధ్రంతోపాటు , క్లాడోస్పోరియం అనే శిలీంధ్రాల ద్వితీయ సంక్రమణం ద్వారా వేపకు ఎండుతెగులు సోకుతున్నట్లు అప్ప ట్లో నిర్ధారించారు. సూర్యాస్తమయం తర్వాత టీ మస్కిట్ బగ్ పురుగులు.. వేప కణజాలంలోని రసాన్ని పీల్చడం ద్వారా ఆకులు, కొమ్మలు ఎండిపోతాయి. వ్యాధి తీవ్రత అధికమై చెట్లు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. డై బ్యాక్ నివారణకు శాస్త్రవేత్తలు మందులు సూచించినా.. ఎత్తయిన చెట్లకు మందుల పిచికారీ చేసే పరిస్థితి లేదు.

మద్యం సరఫరా బకాయిలు వెంటనే చెల్లించాలి

- ప్రభుత్వానికి మద్యం కంపెనీల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మద్యం సరఫరాదారులకు చెల్లించాల్సిన రూ.3,151 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైల్ లైసెన్స్‌ల వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బకాయిలు చెల్లించేందుకు వినియోగించాలని మద్యం కంపెనీల ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ఏడాది నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో అనేక కంపెనీలు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నాయన్నారు. ఈ ప్రభావం సరఫరా వ్యవస్థపై పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే మద్యం సరఫరా కొనసాగించడం కష్టమవుతుందన్నారు. పండుగల సీజన్ డిమాండ్ తీరాలంటే, సరఫరాదారుల వద్ద తగిన ఆర్థిక వనరులు ఉండాలని పేర్కొన్నారు.

గాజాలోని ఖాన్‌యూనిస్‌లో పాలస్తీనియన్ల సంబరాలు



గాజాలో శాంతి పవనాలు!

ట్రంప్ ప్రణాళికలో మొదటి దశకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం

- ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయనున్న హమాస్
- పాలస్తీనా ఖైదీలకు విముక్తి కల్పించనున్న ఇజ్రాయెల్



టెల్ అవీవ్‌లో ఇజ్రాయెల్ బందీల బంధువుల ఆనందోత్సాహాలు

జెరూసలేం/న్యూఢిల్లీ: వైమానిక దాడులు, బాంబు పేలుళ్లు, విధ్వంసాలు, ఆకలి చావులతో రెండేళ్లుగా అల్లాడిపోతున్న కల్లోలిత గాజా స్ట్రిప్‌లో శాంతి సాధనకు ఎట్టకేలకు అడుగులుపడ్డాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో మొదటి దశను వైరిపక్షాలైన ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఈ మేరకు ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేయబోతున్నాయి. రెండేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం పూర్తిగా ముగింపునకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి దశ ఒప్పందం ప్రకారం.. గాజాలో దాడులు వెంటనే ఆపేయాలి. తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను అతిత్వరలో హమాస్ మిలిటెంట్లు విడుదల చేయనున్నారు. అందుకు బదులుగా తమ నిర్బంధంలో ఉన్న పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం విముక్తి కల్పించనుంది. అలాగే గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లిపోనుంది. హమాస్ అధీనంలో 20 మంది బందీలు సజీవంగా ఉన్నట్లు అంచనా. భగవంతుడి దయతో వారందరినీ స్వదేశానికి తీసుకొస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హమాస్ సైతం స్పందించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లిపోవాలని, గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతించాలని పేర్కొంది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తామని వెల్లడించింది. అందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను తమకు అప్పగించాలని తేల్చిచెప్పింది. మరోవైపు రెండు కీలకమైన అంశాలపై స్పష్టత రాలేదు. ట్రంప్ ప్లాన్ ప్రకారం హమాస్ మిలిటెంట్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి. గాజా పరిపాలన బాధ్యతలను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా అథారిటీకి అప్పగించాలి. ఈ రెండింటిపై హమాస్ గానీ, ఇజ్రాయెల్ గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

గాజాలో ఆనందోత్సాహాలు

ట్రంప్ శాంతి ప్రణాళికలో మొదటి దశను ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించడంతో గాజాలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. యుద్ధం ఇక ఆగిపోతుందని, రక్తపాతానికి తెరపడుతుందని, తమకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ క్షణం కోసమే ఎదురు చూస్తున్నామని అన్నారు. జనం పరస్పరం అభినందనలు చెప్పుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. గాజాలో పనిచేస్తున్న జర్నలిస్టులు సైతం సంబరాల్లో మునిగిపోయారు. కొందరు పాలస్తీనా సంప్రదాయ నృత్యాలు చేశారు. మారణహోమం, అన్యాయం, అణచివేత కారణంగా మానసికంగా, శారీరకంగా అలసిపోయామని, ఇకనైనా ఊపిరి పీల్చుకుంటానని ఓ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు చెప్పారు. మరోవైపు శాంతి ప్రణాళిక అమల్లోకి వచ్చినట్లు భావించిన నిరాశ్రయులు తమ స్వస్థలాలకు చేరుకోవడానికి ప్రయత్నించగా ఇజ్రాయెల్ సైనికులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

జెరూసలేంలో సంబరాలు

ఇజ్రాయెల్‌లోని జెరూసలేం నగరంలోనూ జనం హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. బందీల రాకకోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా బందీల కుటుంబ సభ్యులు, బంధువులు సంబరాల్లో మునిగిపోయారు. పరస్పరం ఆలింగనాలు చేసుకున్నారు. తాము ఇన్నాళ్లూ చేసిన ప్రార్థనలు ఫలించాయని భావోద్వేగానికి గురయ్యారు. దేవుడు అద్భుతాలు సృష్టిస్తాడని విన్నామని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామని యూదు మత గురువు అవీ కోజ్‌మన్ వ్యాఖ్యానించారు.

అన్ని పక్షాలనూ గౌరవిస్తాం: ట్రంప్

''గాజాలో బలమైన, మన్నికైన, శాశ్వతమైన శాంతి సాధనలో భాగంగా బందీలందరినీ హమాస్ అతిత్వరలో విడుదల చేస్తుంది. ఇజ్రాయెల్ తమ సైనికులను ఉపసంహరించుకుంటుంది. ఈ విషయంలో అన్ని పక్షాలనూ సమానంగానే గౌరవిస్తాం'' అని డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



గురువారం అర్ధరాత్రి గానీ, శుక్రవారం ఉదయం నుంచి గానీ ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ ప్రారంభవుతుందని ఆశిస్తున్నట్లు హమాస్ సీనియర్ నేత ఒసామా హమ్‌దాన్ చెప్పారు. జనసాంద్రత అధికంగా ఉన్న గాజా సిటీ, ఖాన్ యూనిస్, రఫా, ఉత్తర గాజా నుంచి ఇజ్రాయెల్ సైనికులంతా వెళ్లిపోవాలని కోరారు. ఇజ్రాయెల్ జైళ్లలో 250 మంది పాలస్తీనా ఖైదీలు చాలాఏళ్లుగా మగ్గుతున్నారని, గాజాపై యుద్ధం మొదలైన తర్వాత ఈ రెండేళ్లలో మరో 1,700 మంది పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ సైన్యం నిర్బంధించిందని గుర్తుచేశారు. వీరందరినీ విడుదల చేయాల్సిందేనని తేల్చిచెప్పారు.

ట్రంప్‌కు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ: శాంతి ప్రణాళికకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం తెలియజేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. మోదీ గురువారం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గాజాలో శాంతి సాధనకు కృషి చేసినందుకు తన మిత్రుడిని అభినందించానంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ట్రంప్ ప్లాన్ చరిత్రాత్మకమని పేర్కొన్నారు. అలాగే భారత్–అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతిని తాము సమీక్షించామని తెలిపారు. రాబోయే రోజుల్లో పరస్పరం సంప్రదించుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు మోదీ స్పష్టంచేశారు.

నెతన్యాహుకు మోదీ ఫోన్

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కూడా మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ట్రంప్ శాంతి ప్రణాళికలో పురోగతి పట్ల నెతన్యాహుకు అభినందనలు తెలిపారు. గాజా నుంచి బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం పంపిణీ కోసం అడుగులు ముందుకు పడడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదం ఎక్కడ ఏ రూపంలో ఉన్నా సరే వ్యతిరేకించాల్సిందేనని మోదీ తేల్చిచెప్పారు.

ఇప్పుడేం జరగొచ్చు?

గాజాలో హమాస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయెల్ పట్టుదలతో ఉంది. వారంతా ఆయుధాలు అప్పగించి, లొంగిపోవాల్సిందేనని చెబుతోంది. ఇదే అంశాన్ని ట్రంప్ ప్లాన్‌లోనూ చేర్చారు. లొంగిపోతే క్షమాభిక్ష ప్రసాదిస్తామని సూచించారు. కానీ, ఆయుధాలు వదిలేయడానికి హమాస్ మిలిటెంట్లు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. గాజా తమ పట్టునుంచి జారిపోకుండా చూసుకోవాలన్నదే వారి ప్రయత్నంగా కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం గాజా నుంచి పూర్తిగా ఖాళీ చేయాలని, మరోసారి దాడులు చేయొద్దని వారు షరతు విధిస్తున్నారు. సైన్యమంతా వెనక్కి వెళ్లిపోయిన తర్వాతే చివరి బందీని విడుదల చేస్తామని తేల్చిచెబుతున్నారు. గాజాలోని బఫర్ జోన్లలో తమ సైన్యాన్ని కొనసాగించక తప్పదని ఇజ్రాయెల్ వాదిస్తుండడం గమనార్హం. మరోవైపు గాజాలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత కొరవడింది. వెస్ట్‌బ్యాంక్ మద్దతున్న పాలస్తీనా అథారిటీకి గాజా అధికార బాధ్యతలు అప్పగించడం గానీ, స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని గుర్తించడాన్ని గానీ తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఇజ్రాయెల్ చెబుతోంది. మిలిటెంట్లు లొంగిపోయి, స్వతంత్ర పాలస్తీనా అథారిటీ చేతిలోకి పాలనా పగ్గాలు వస్తే తప్ప గాజా పునర్నిర్మాణం సాధ్యం కాదు. 20 లక్షల మంది పాలస్తీనా ప్రజల భవిష్యత్తు ఇంకా తేలడం లేదు. గాజాలో శాశ్వతంగా శాంతి ఎప్పుడు నెలకొంటుందన్న సంగతి ఎవరూ చెప్పలేకపోతున్నారు.

అప్పుడేం జరిగింది...

2023 అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా దాడి చేశారు. ఈ దాడిలో దాదాపు 1,200 మంది మరణించారు. మిలిటెంట్లు 251 మందిని బందీలుగా మార్చేసి గాజాకు బలవంతంగా తరలించి, సొరంగాల్లో బంధించారు. వీరిలో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. హమాస్ దుశ్చర్యపై ఇజ్రాయెల్ సైన్యం వెంటనే ప్రతిస్పందించింది. మిలిటెంట్లను అంతం చేయడమే లక్ష్యంగా భీకర యుద్ధం ఆరంభించింది. గాజాలో రెండేళ్లపాటు సాగిన యుద్ధంలో 67,000 మందికిపైగా మృతిచెందారు. 1.70 లక్షల మంది క్షతగాత్రులుగా మారారు. గాజా చాలా వరకు ధ్వంసమైపోయింది. శిథిలాల దిబ్బగా మారింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గాజాలో మారణహోమం ఆపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవలే 20 సూత్రాల శాంతి ప్రణాళికను ప్రతిపాదించారు. ఇజ్రాయెల్‌ను, హమాస్‌ను నయానో భయానో ఒప్పించారు. తన మాట వినకుంటే నరకం చూపిస్తామని హమాస్‌ను హెచ్చరించారు. దాంతో ఉభయ పక్షాలు దారికొచ్చాయి. ట్రంప్ పీస్ ప్లాన్‌ను ఇజ్రాయెల్–హమాస్ మధ్య మూడో కాల్పుల విరమణ ఒప్పందంగా చెప్పుకోవచ్చు. 2023 నవంబర్‌లో ఇరుపక్షాల మధ్య తొలి ఒప్పందం కుదిరింది. అప్పట్లో 100 మందికిపైగా బందీలను హమాస్ విడుదల చేసింది. ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. అందుకు ప్రతిగా పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో రెండో ఒప్పందం కుదిరింది. హమాస్ మిలిటెంట్లు 25 మంది బందీలను వదిలేశారు. అంతేకాకుండా మరణించిన బందీల్లో 8 మంది మృతదేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించారు. అలాగే ఇజ్రాయెల్ ప్రభుత్వం 2,000 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది.

ఆ దగ్గు సిరప్‌లను ఉపసంహరించాం

- వాటి ఉత్పత్తిని ఆపివేయాలని ఆదేశించాం
- అవేవీ విదేశాలకు ఎగుమతి కాలేదు
- ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలిపిన సీడీఎస్‌సీవో

న్యూఢిల్లీ/చెన్నై/ఛింద్వారా: దేశంలో తయారైన కోల్డ్రిఫ్, రెస్పిఫ్రెష్‌టీఆర్, రిలైఫ్ అనే దగ్గు సిరప్‌లను మార్కెట్ నుంచి ఉపసంహరించినట్లు సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీవో) తెలిపింది. అదేవిధంగా, ఈ సిరప్‌ల ఉత్పత్తిని నిలిపివేయాలని కూడా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఉపసంహరించుకున్న దగ్గు సిరప్‌లలో ఏ ఒక్కటి కూడా విదేశాలకు ఎగుమతి కాలేదని కూడా స్పష్టం చేసింది. భారత్‌లో దగ్గు సిరప్ వాడకంతో కిడ్నీలు ఫెయిలై, చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదకరమైన ఈ ఔషధాలను ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయా తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సీడీఎస్‌సీవో స్పందించి డబ్ల్యూహెచ్‌వోకు ఇచ్చిన సమాధానంలో పై విషయాలున్నాయి. ఈ దగ్గు సిరప్‌లలో ఇథలీన్ గ్లైకాల్, లేదా డై ఇథలీన్ గ్లైకాల్ మరేదైనా కల్తీ జరిగినట్లు గుర్తించారా అనే విషయం తమకు తెలియజేయాలని కూడా డబ్ల్యూహెచ్‌వో కోరింది. ఇలాంటివి గుర్తిస్తే వాటి సరఫరా విక్రయాలను వెంటనే నిలిపివేయాలని కూడా కోరింది. మధ్యప్రదేశ్‌లో కల్తీ దగ్గు సిరప్ తాగి 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డ్రగ్ కంట్రోలర్లను అప్రమత్తం చేసింది. ఔషధ తయారీ యూనిట్లను తనిఖీ చేసి, సరైన ముడిపదార్థాలను వాడుతున్నారా లేదా గమనించాకే వాటిని మార్కెట్‌లోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ఫార్మా కంపెనీ యజమాని అరెస్ట్

మధ్యప్రదేశ్‌లో పలువురు చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌ను తయారు చేసే చెన్నైలోని శ్రేసన్ ఫార్మా కంపెనీ యజమాని రంగనాథన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తప్పించుకు తిరుగుతున్న అతడిని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సిట్ అధికారుల బృందం, తమిళనాడు పోలీసుల సాయంతో బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుంది.

22కు చేరిన చిన్నారుల మరణాలు

మధ్యప్రదేశ్‌లో కల్తీ దగ్గు మందు తాగి, కిడ్నీలు ఫెయిలై చనిపోయిన చిన్నారుల సంఖ్య గురువారానికి 22కు చేరుకుంది. ఛింద్వారాకు పొరుగునున్న మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదేళ్ల విశాల్, నాలుగేళ్ల మయాంక్ సూర్యవంశీ బుధవారం రాత్రి చనిపోయారని అధికారులు తెలిపారు.

ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్

- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకెళ్తోంది
- ఈ ప్రయాణంలో మేమూ భాగస్వాములం అవుతాం
- యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వెల్లడి
- భారత ప్రధాని మోదీతో సమావేశం
- ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చ
- యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదుల కార్యకలాపాలు అరికట్టాలని స్టార్మర్‌కు విజ్ఞప్తి



మోదీతో స్టార్మర్

ముంబై: భారత్ ఆర్థికంగా సూపర్ పవర్‌గా ఎదుగుతోందని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ప్రశంసల వర్షం కురిపించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలన్న లక్ష్యంతో వేగంగా దూసుకెళ్తోందని అన్నారు. ఈ ప్రయాణంలో తాము సైతం భాగస్వాములం అవుతామని చెప్పారు. అద్భుత నాయకత్వ ప్రతిభతో భారత్‌ను ముందుకు తీసుకెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలియజేస్తున్నానని వ్యాఖ్యానించారు. స్టార్మర్ గురువారం ముంబైలో మోదీతో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. వేర్వేరు రంగాల్లో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని, కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్–యూకే మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు సైతం జరిగాయి. మోదీతో భేటీ అనంతరం స్టార్మర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుపై మోదీతో చర్చించానని తెలిపారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం త్వరగా ముగిసిపోవాలని కోరుకుంటున్నామని, అందుకోసం తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తామని వెల్లడించారు. భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అద్భుతమైన ఫలితాలు రాబోతున్నాయని స్పష్టంచేశారు.

భాగస్వామ్యమే మూలస్తంభం: మోదీ

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక ప్రగతికి భారత్–యూకే భాగస్వామ్యం ఒక మూలస్తంభంగా నిలుస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్, యూకేలు సహజ మిత్రదేశాలు, భాగస్వామ్య పక్షాలని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, చట్టబద్ధపాలన అనే పునాదిపై రెండు దేశాల బంధం నిర్మితమైందని అన్నారు. నైపుణ్యం, సాంకేతికతలే చోదకశక్తిగా యూకేతో భాగస్వామ్యం నానాటికీ బలపడుతోందని హర్షం వ్యక్తంచేశారు. ఇరుదేశాల ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా ఉమ్మడిగా కృషి చేయడానికి కట్టుబడి ఉన్నామని తేల్చిచెప్పారు. కీర్ స్టార్మర్‌తో సమావేశమైన తర్వాత మోదీ మీడియాతో మాట్లాడారు. అరుదైన ఖనిజాల విషయంలో సహకరించుకోవడానికి ఇండస్ట్రీ గిల్డ్, సప్లై చైన్ అబ్జర్వేటరీని ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించినట్లు తెలిపారు. ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్‌లో శాటిలైట్ క్యాంపస్ నెలకొల్పనున్నట్లు వివరించారు. అంతేకాకుండా వాతావరణం, సాంకేతికత, కృత్రిమ మేధ(ఏఐ)లో పరిశోధనల కోసం క్లైమేట్ టెక్నాలజీ స్టార్టప్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్రవాదానికి తావులేదని మోదీ తేల్చిచెప్పారు. యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కీర్ స్టార్మర్‌కు విజ్ఞప్తి చేశారు.

'తుఝే దేఖా తో' పాట విన్న స్టార్మర్

సూపర్ హిట్ బాలీవుడ్ చిత్రం దిల్వాలే దుల్హానియా లే జాయెంగేలోని 'తుఝే దేఖా తో యే జానా సనమ్' పాటను బ్రిటిష్ ప్రధాని స్టార్మర్ ఎంతగానో ఆస్వాదించారు. ఆయన ఈ పాట వింటున్న వీడియోను యశ్‌రాజ్ ఫిలింస్ సంస్థ సోషల్ మీడియాలో పోస్టుచేసింది. ఈ చిత్రాన్ని యశ్‌రాజ్ సంస్థే నిర్మించిన సంగతి తెలిసిందే. భారత పర్యటనకు వచ్చిన స్టార్మర్ బుధవారం ముంబైలోని యశ్‌రాజ్ ఫిలింస్ స్టూడియోను సందర్శించారు.

రక్షణ ఒప్పందం

భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత విస్తరింపజేసుకోవాలని మోదీ, స్టార్మర్ నిర్ణయానికొచ్చారు. ఈ మేరకు రెండు దేశాల ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. భారత వైమానిక దళాన్ని బలోపేతం చేయడానికి లైట్‌వెయిట్ మల్టీరోల్ మిస్సైల్ సిస్టమ్స్‌ను అందజేయబోతున్నట్లు యూకే ప్రభుత్వం పేర్కొంది. అలాగే భారత నావికాదళంతో కలిసి మారిటైమ్ ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా భారత వైమానికదళం, బ్రిటన్ రాయల్ ఎయిర్‌ఫోర్స్ శిక్షకులు పరస్పరం సహకరించుకోబోతున్నారు.

ఇండియాలో యూకే వర్సిటీ క్యాంపస్‌లు

యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లాంకాస్టర్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే తమ క్యాంపస్‌లను భారత్‌లో ఏర్పాటు చేయబోతున్నాయి. ఈ విషయాన్ని యూకే ప్రధాని స్టార్మర్ స్వయంగా ప్రకటించారు. యూకేకు చెందిన పలు వర్సిటీలు ఇప్పటికే తమ క్యాంపస్‌లను భారత్‌లో ఏర్పాటు చేశాయి. వచ్చే ఏడాది మరికొన్ని వర్సిటీలు క్యాంపస్‌లను ఏర్పాటు చేయబోతున్నాయి.

అయోధ్యలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం ఐదుగురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. పూరాఖలందర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాగ్లాభరీ ప్రాంతంలో గురువారం శక్తివంతమైన పేలుడు సంభవించడంతో ఓ ఇల్లు కూలిపోయినట్లు అధికారులు చెప్పారు. అదే ఇంట్లో ఉన్నవారిలో ఐదుగురు మృతిచెందారని వెల్లడించారు. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పేలుడుకు కారణం ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు.

శబరిమలలో అవకతవకలపై సిట్

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం గర్భగుడి ద్వారపాలకుల విగ్రహాల వద్ద రాగి ప్లేట్ల బరువు తగ్గడం వివాదాస్పదంగా మారడం తెల్సిందే. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. సోమవారం కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సిట్‌ను నియమించామంది. క్రైం బ్రాంచి, శాంతిభద్రతల ఏడీజీపీ వెంకటేశ్ సిట్‌కు సారథ్యం వహిస్తారని రాష్ట్ర హోం శాఖ తెలిపింది. హైకోర్టు ఆదేశాలను అనుసరించి శుక్రవారం నుంచి ఈ బృందం దర్యాప్తు మొదలు పెట్టనుంది. రాగి ప్లేట్లకు చెన్నైలో బంగారు పూత వేయించిన తర్వాత బరువు తగ్గినట్లు అధికారులు గుర్తించడంతో అక్రమం వెలుగు చూసింది.


నితీశ్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఛార్జిషీట్

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ సీఎం నితీశ్ కుమార్ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ '20 ఏళ్ల వినాశ కాలం' పేరుతో 42 పేజీల ఛార్జిషీట్‌ను గురువారం విడుదల చేసింది. ఎన్డీయే 20 ఏళ్ల పాలన రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని ఆరోపించింది. పట్నాలోని బిహార్ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఛార్జిషీట్ విడుదల కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. బిహార్ పాలన ఢిల్లీ నుంచి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయమున్న నాగ్‌పూర్ నుంచి రిమోట్ కంట్రోల్‌తో నడుస్తోందని అనంతరం జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఇరవయ్యేళ్లలో రాష్ట్రం విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన వంటి తదితర అన్ని రంగాల్లోనూ పూర్తిగా వెనుకబడిపోయిందని విమర్శించారు.

ఆ న్యాయాధికారులు జిల్లా జడ్జీలుగా అర్హులే: సుప్రీం

న్యూఢిల్లీ: న్యాయవాదులుగా ఏడేళ్ల అనుభవమున్న న్యాయాధికారులు బార్ అసోసియేషన్ కోటాలో జిల్లా జడ్జీలుగా నియామకానికి అర్హులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాదులకు మాత్రమే అవకాశమున్న బార్ కోటాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రత్యక్ష ఎంపిక విధానం ద్వారా వీరిని నేరుగా ఈ పోస్టుల్లో నియమించవచ్చని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎస్‌సీ శర్మ, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది.

హంగేరియన్ రచయితకు సాహిత్య నోబెల్



రచనల్లో తనదైన ఊహా ప్రపంచాన్ని సృష్టించిన లాస్లో

స్టాక్‌హోం: కటిక చీకట్లోనూ ఆశలు వదులుకోకూడదని, విధ్వంసానికి విచలితమైన సమాజంలో తన అక్షరాలలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని కలగలిపి చైతన్యం రగిలించిన హంగెరీ రచయిత లాస్లో క్రస్నహోర్కాయ్‌కి ప్రతిష్టాత్మక నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో గురువారం నోబెల్ పురస్కార కమిటీలోని స్వీడిష్ అకాడెమీ అధికారి స్టీవ్ సెమ్ సాండ్‌బెర్గ్ 2025 ఏడాదికిగాను లాస్లోకు సాహిత్య నోబెల్ ఇవ్వాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. 'నాగరికత విధ్వంసం మధ్యలోనూ కళ శక్తిని పునరుద్ఘాటిస్తూ దూరదృష్టితో లాస్లో చేసిన రచనలకు నోబెల్ పురస్కారం అందజేస్తున్నాం'అని స్టీవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నోబెల్ పురస్కారం లభించటంపై లాస్లో సంతోషం వ్యక్తంచేశారు. డిసెంబర్‌లో స్టాక్‌హోంలో లాస్లోకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

ఇతిహాసాల్లాంటి రచనలు

లాస్లో రచనల్లో ప్రధానంగా అభౌతికమైన, అలౌకికమైన అంశాలే ఉంటాయి. వాటికి తనదైన హాస్య చతురతను జోడించి సమాజంలోని అణచివేతలు, విధ్వంసాలను ఆయన విమర్శించే తీరు అద్భుతంగా ఉంటుంది. అందుకే స్వీడిష్ అకాడెమీ లాస్లో రచనలను ఇతిహాసాలుగా అభివర్ణించింది. 'కోఫ్కా, థామస్ బెర్న్‌హార్డ్ వంటి గొప్ప రచయితలు అనుసరించిన మధ్య యూరప్ సంప్రదాయాన్ని కొనసాగించిన గొప్ప ఇతిహాస రచయిత క్రాస్నహోర్కై. అసంబద్ధత, వింతైన ఊహలతో ఆయన రచనలు మూర్తీభవించాయి'అని ప్రశంసించింది.



కమ్యూనిస్టు రష్యా ప్రభావం

లాస్లో 1954లో హంగెరీలోని గ్యులా ప్రాంతంలో జన్మించారు. హంగెరీలో విప్లవానికి రెండేళ్ల ముందు ఆయన పుట్టారు. ఆ విప్లవాన్ని సోవియట్ యూనియన్ హింసాత్మకంగా అణచివేసిన తర్వాత హింగెరీలో ఏర్పడిన నాగరికత విధ్వంస పరిస్థితులు లాస్లోపై తీవ్ర ప్రభావం చూపాయి. అందుకే ఆయన రచనల్లో నాగరికత అంతం, ఆ తర్వాత ఊహా ప్రపంచాల ఆవిర్భావం, అందులోని అసంబద్ధమైన వింతలు అధికంగా కనిపిస్తాయి. లాస్లో 1985లో తన తొలి రచన 'సటంటాంగో'ను ప్రచురించారు. మొదటి నవలతోనే ఆయనకు విపరీతమైన గుర్తింపు లభించింది. ఆ తర్వాత రాసిన మెలాంకోలీ ఆఫ్ రెసిస్టెన్స్ (1989) కూడా మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ రెండు నవలలను హంగెరీ సినీ దర్శకుడు వెలా తార్ ఆ తర్వాత సినిమాలుగా తీశారు. సెజెడ్, బుడాపెస్ట్‌లో ఉన్నతవిద్య అభ్యసించిన లాస్లో.. యూరప్ దేశాలన్నీ తిరిగి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి తన రచనల్లో వాటిని తనదైన ఊహాత్మక శైలితో పొందుపర్చారు. 'పిచ్చితనంలోనూ వాస్తవికతను పరీక్షించటమే నా రచనల లక్షణం'అని లాస్లో గతంలో పేర్కొన్నారు. వార్ అండ్ వార్, సీబో దేర్ బిలో (2008) రచనలు కూడా ఆయనకు మంచి గుర్తింపు తెచ్చాయి. లాస్లో ఇప్పటివరకు 5 నవలలు మాత్రమే రాసినా, అవన్నీ యూరోపియన్ సాహిత్యంలో ఆణిముత్యాల్లా ప్రశంసలు అందుకున్నాయి. 2021లో రాసిన 'హెర్ష్ట్ 07767'నవల గొప్ప సమకాలీన జర్మన్ నవలగా గుర్తింపు పొందింది. ప్రముఖ భారతీయ ఇంగ్లిష్ రచయిత ఆర్‌కే నారాయన్ రచనల్లో కనిపించే కల్పిత పట్టణం మాల్గుడి మాదిరిగా లాస్లో కూడా తన ప్రతి రచనలోనూ ఓ కల్పిత పట్టణాన్నో, గ్రామాన్నో కేంద్రంగా చేసుకొంటారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి
భారత దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు అసలైన దేశ చరిత్రను నేటితరం తెలుసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. -8లో



ఫుట్ వేర్‌కి బై.. ఫిట్ వాక్‌కి సై..
ప్రస్తుతం మెట్రో నగరాల్లో పాదరక్ష రహిత నడక ఆరోగ్య సాధనంగా మారింది. దీనివల్ల ఆరోగ్య పరమైన లాభాలున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/21.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

రౌండ్ ది క్లాక్ అప్రమత్తంగా ఉండాలి: ఆర్‌వీ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ముగిసేంత వరకూ రౌండ్ ది క్లాక్ అప్రమత్తంగా ఉండాలని కంట్రోల్ రూమ్ బాధ్యులు, సిబ్బందిని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ అదనపు ఎస్పీ, ఎంసీసీ నోడల్ అధికారి నరసింహారెడ్డి, మీడియా నోడల్ అధికారి దశరథం, సీఐ అమృత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు వద్దు

సాక్షి, సిటీబ్యూరో: ఉప ఎన్నిక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అయినప్పటికీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులతో పాటు ఉన్నతాధికారులు కూడా ఎలాంటి అధికారిక ప్రారంభోత్సవాలు, కొత్త పనుల శంకుస్థాపనలు వంటివి చేయరాదని జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ సూచించారు. అవి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కిందకు వస్తాయన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో లేకపోయినప్పటికీ, జూబ్లీహిల్స్‌కు దగ్గరగా ఉండే నియోజకవర్గాల్లో కూడా రాజకీయ పార్టీలు ఎన్నికలతో సంబంధం ఉండే రాజకీయ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు.

జూబ్లీహిల్స్‌లో రూ.9 లక్షల నగదు స్వాధీనం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నియమావళి అమలవుతున్న నేపథ్యంలో.. ఓ వ్యక్తి వద్ద రూ.9 లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు సీజ్ చేశారు. రోడ్ నెంబర్– 5లోని మెట్రో స్టేషన్ వద్ద జూబ్లీహిల్స్ ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ఎల్బీ నగర్‌లోని సరస్వతి నగర్ కాలనీలో నివసించే బిల్డింగ్ మెటీరియల్ సూపర్‌వైజర్ అయితగోని రవి చేతిలో ఓ బ్యాగ్‌తో మెట్రో స్టేషన్ మెట్లు ఎక్కుతూ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు తనిఖీ చేయగా భారీగా నగదు కనిపించింది. లెక్కించగా రూ.9 లక్షలు అని తేలింది. డబ్బుకు తగిన పత్రాలు చూపించకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులు నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించారు.

జలమండలి ఖాతాలో మరో పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ, ఉత్తమ యాజమాన్య అవార్డులు అందుకున్న జలమండలి.. మరో పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆర్టీఐ కేసుల్లో ఉత్తమ సేవలకు తెలంగాణ సమాచార కమిషన్ ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పురస్కారాన్ని ప్రకటించింది. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యాక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



చలో బస్‌భవన్.. ఉద్రిక్తత

పలువురు బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బీఆర్‌ఎస్ నాయకులను అదుపుకుంటున్న పోలీసులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్‌ఎస్ చేపట్టిన చలో బస్ భవన్ ఉద్రిక్తంగా మారింది. ఉదయం 8గంటల నుంచే పోలీసులు భారీ ఎత్తున మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. బస్‌భవన్ నలువైపులా బారికేడ్‌లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. అటు వీఎస్‌టీ నుంచి, ఇటు చిక్కడపల్లి, సికింద్రాబాద్, ఇందిరాపార్కు తదితర ప్రాంతాల నుంచి ఆందోళనకారులు బస్ భవన్ వైపు రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో సాధారణ ప్రజల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉదయం 10.30 గంటలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు చేరుకున్నారు. ఆర్టీసీ బస్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ మాట్లాడారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఒక్కసారిగా పోలీసులను, బారికేడ్‌లను దాటుకొని బస్‌భవన్ వైపు దూసుకెళ్లడంతో ఉద్రిక్తత ఏర్పడింది. నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని వివిధ ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. కేటీఆర్, హరీష్‌రావులతో చిక్కడపల్లి ఏసీపీ రమేష్, గాంధీనగర్ ఏసీపీ యాదగిరిలు మాట్లాడి బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం అందజేసేందుకు లోపలికి పంపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



బస్‌భవన్‌కు వస్తున్న కేటీఆర్, హరీష్‌రావు, పద్మారావు తదితరులు

అంతర్గత పోరు ఆగేనా!

జూబ్లీహిల్స్‌లో 'హస్త' కష్టాలు

- కాంగ్రెస్ కేడర్ మధ్య కొరవడిన సఖ్యత
- ఎవరికి వారే.. యమునా తీరే చందం
- అమాత్యుల ముందే అమీతుమీకి సిద్ధం
- ఖరారైన అభ్యర్థిత్వం.. ఏకతాటిపైకి వచ్చేనా?





సాక్షి, సిటీబ్యూరో

అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. యువ నేత నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. కానీ.. పార్టీ కొత్త, పాత శ్రేణుల్లో ఆధిపత్య పోరు, అంతర్గత కుమ్ములాటలు పార్టీకి పెను సవాల్‌గా మారాయి. ఈ పరిస్థితితో పార్టీ నేతలతో పాటు కేడర్ స్థాయిలోనూ గందరగోళం నెలకొంది. రెండు నెలలుగా మంత్రులు రంగంలోకి దిగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పేరిట సుడిగాలి పర్యటనలు చేసినప్పటికీ.. పాత, కొత్త కేడర్‌ను ఏకతాటిపై తేచ్చేందుకు ప్రయత్నించకపోవడంతో విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపే అంశంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో అభ్యర్థి నవీన్ యాదవ్ ఈ పరిస్థితి నుంచి ఎలా గట్టెక్కుతారోనని రాజకీయ పరిశీలకుల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ఎడమొహం.. పెడమొహమే..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు అనివార్యమై.. రాజకీయ వాతావరణం వేడెక్కి మూడు, నాలుగు మాసాలు కావస్తున్నప్పటికీ.. కాంగ్రెస్‌లోని కొత్త, పాత కేడర్‌లో సఖ్యత లేకుండా పోయింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో ఉప ఎన్నిక కావడంతో చాలెంజ్‌గా తీసుకొని ముందస్తుగానే గెలుపు మార్గాలను సుగమం చేసుకునేందుకు క్షేత్ర స్థాయిలో ముగ్గురు మంత్రులు, 18 మంది కార్పొరేషన్ల చైర్మన్లను రంగంలోకి దింపింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కొత్త, పాత క్యాడర్ మధ్య ఆధిపత్య పోరు కోసం అమాత్యుల ముందే అమీతుమీలకు దిగడం వంటి ఘటనలు కొనసాగాయి. ఎన్నికల బరిలో దిగేందుకు ఆసక్తి కనబర్చిన ఆశావహులు సైతం మంత్రుల పర్యటన కార్యక్రమాలకు పరిమితమై కనీసం పలకరింపు కూడా లేకుండా ఎవరికి వారే యమునా తీరే విధంగా వ్యవహరించడం విస్మయానికి గురిచేసింది. అభ్యర్థిత్వం ఖరారు అనంతరం కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది.

ఆశావహుల్లో అసంతృప్తి..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో దిగేందుకు ఆసక్తి కనబర్చిన ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. వీరిలో కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన నేతలతో పాటు దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తున్న నేతలు కూడా ఉన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి , విద్యావేత్త భవానీ శంకర్ తదితరుల టికెట్ ఆశించి విఫలమయ్యారు. వీరి అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా తయారైందన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మాల్స్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రాపర్టీట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ పన్నుల వసూలు కోసం



- తప్పుడు వివరాలు సరిదిద్దే చర్యలు
- ఆదాయం పెంచుకునే దిశగా జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: ఏటికేడు ఆస్తిపన్ను వసూళ్ల ఆదాయం పెరుగుతున్నప్పటికీ, జీహెచ్‌ఎంసీలోని అన్ని భవనాల నుంచి రావాల్సినంత ఆస్తిపన్ను మాత్రం రావడం లేదు. ప్రతియేటా నిరుటి కంటే ఈ యేడు ఎక్కువ ఆస్తిపన్ను వసూలు చేద్దామనే పాత ఆలోచనలకు స్వస్తి పలికి, వాస్తవంగా ఎంత ఆదాయం రావాలో అంత వసూలు చేసి ఖజానాను నింపుకోవాలనే ఆలోచనతో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. తొలుత, మాల్స్ నుంచి సరైన ఆస్తిపన్నును వసూలు చేయడంతోపాటు ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు కూడా వసూలు చేసే చర్యలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని మాల్స్‌ను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, భవనం విస్తీర్ణానికి అనుగుణంగా ఆస్తిపన్ను డిమాండ్ ఉందా, లేక రావాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువ డిమాండ్ ఉందా? అన్నది తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ రావాల్సినంత ఆస్తిపన్ను కంటే తక్కువ డిమాండ్ ఉన్నట్లయితే రివిజన్ చేసి సరైన ఆస్తిపన్ను విధించి వసూలు చేయనున్నారు.

ట్రేడ్ లైసెన్సులపైనా గురి

అలాగే.. మాల్స్‌లోని అన్ని వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులున్నాయా? ఉంటే నిబంధనలకు అనుగుణంగా లైసెన్సు ఫీజులు చెల్లిస్తున్నారా? అనే వివరాలపైనా సర్వే చేస్తున్నారు. వీటిల్లోనూ ఏవైనా వ్యత్యాసాలుంటే తగిన చర్యలు తీసుకోనున్నారు. ఈ తనిఖీలకు సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్వయంగా వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్వే దాదాపుగా పూర్తి కావచ్చిందని అధికారులు తెలిపారు. ఎంత మేర ఆదాయం పెరగనుందో ఒకటి రెండు రోజుల్లో తెలియనుంది. తనిఖీలతో పాటే పేరుకుపోయిన బకాయిలనూ వసూలు చేస్తున్నారు. తనిఖీల్లో భాగంగా మాల్స్‌లో ఉన్న వ్యాపార రకం, నిర్వహిస్తున్న సంస్థ పేరు, దాని పీటీఐఎన్, ఆస్తిపన్ను వార్షిక డిమాండ్, బకాయిలుంటే ఎంత మొత్తం, ఆస్తిపన్ను డిమాండ్ భవనం విస్తీర్ణానికి తగ్గట్లుగా ఉందా? లేక తక్కువ మొత్తం ఉందా? వంటి వివరాలతో పాటు అసలు ఆస్తిపన్ను జాబితాలో నమోదుకాని పీటీఐఎన్‌లు లేని వాటిని కూడా గుర్తించనున్నారు. రివిజన్ చేసి సరైన ఆస్తి పన్ను విధించే చర్యలు కూడా చేపట్టారు. బకాయిలున్నవారి నుంచి ఆస్తిపన్ను వసూళ్ల చర్యలు కూడా చేపట్టారు.

నివాసేతర భవనాలన్నింటిపై..

మాల్స్ స్పెషల్ డ్రైవ్ పూర్తయ్యాక, నివాసేతర భవనాలన్నింటి తనిఖీలకు ఆయా అంశాల వారీగా స్పెషల్‌డ్రైవ్స్ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. వివిధ రకాల దుకాణాలతో పాటు బ్యాంకులు, ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోడౌన్లు, సెల్ టవర్లు, ఆఫీసులు, ఏటీఎంలు బార్ అండ్ రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లు, ఫ్యాక్టరీలు, విద్యాసంస్థలు, జిమ్స్, పెట్రోలు బంకులు, సినిమా థియేటర్లు, మ్యారేజ్ హాళ్లు తదితరాలు వీటిలో ఉన్నాయి.

వైద్యం ముసుగులో గంజాయి దందా

నగరం కేంద్రంగా నైజీరియన్ వ్యవహారం
- డిపోర్టేషన్ చేసిన హెచ్–న్యూ అధికారులు



హెచ్-ఎన్ అధికారుల అదుపులో ఓనురా సోలమన్ చిబుజ్ (వృత్తంలో)

సాక్షి, సిటీబ్యూరో: వైద్యం కోసమంటూ మెడికల్ వీసాపై వచ్చిన ఓ నైజీరియన్ గంజాయి దందా ప్రారంభించాడు. వీసా గడువు ముగిసినా, పాస్‌పోర్టు ఎక్స్‌పైర్ అయినా ఇక్కడే తిష్ట వేశాడు. ఇతడి వ్యవహారాలపై సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఎలాంటి మాదకద్రవ్యం లభించకపోవడంతో డిపోర్టేషన్ విధానంలో బలవంతంగా తిప్పి పంపినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర గురువారం వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఓనురా సోలమన్ చిబుజ్ కొన్నాళ్లు తన స్వస్థలంలో చిరు వ్యాపారిగా బతికాడు. 2014 ఆగస్టు 14న మెడికల్ వీసాపై ఢిల్లీ వచ్చాడు. ఆ ఏడాది సెప్టెంబర్ 23 వరకే వీసా గడువు ఉంది. పాస్‌పోర్టు సైతం 2016 జనవరి 16న ఎక్స్‌పైర్ అయిపోయింది. అయినప్పటికీ ఢిల్లీలోని ఓ రెస్టారెంట్‌లో మూడేళ్ల పాటు పని చేశాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్ వచ్చి అత్తాపూర్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. పుణె, ముంబైల్లో ఉన్న డ్రగ్ పెడ్లర్స్ నుంచి తక్కువ ధరకు గంజాయి ఖరీదు చేసుకుని వచ్చేవాడు. ఆ సరుకును నగరంలో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలెట్టాడు.

ఇటీవల టోలిచౌకి ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సోలమన్‌ను హెచ్–న్యూ అదుపులోకి తీసుకుంది. ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్, ఎస్సై సి.వెంకట రాములు నేతృత్వంలోని బృందం విచారించింది. వీసా, పాస్‌పోర్టు లేవని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది. దీంతో ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సహకారంతో డిపోర్టేషన్ చేసింది.

డిస్కం ఎనర్జీ ఆడిట్ సీఈపై వేటు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఎనర్జీ ఆడిట్ విభాగం చీఫ్ ఇంజినీర్ రంగనాథ్‌రాయ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినట్లు పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విభాగంలో పని చేస్తున్న ఓ ఆర్టిజన్ కార్మికుడిని ప్రభుత్వ ఇంధన శాఖకు బదిలీ చేస్తూ ఈ ఏడాది మే 2న ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఆర్టిజన్‌ను తక్షణమే రిలీవ్ చేయాల్సిందిగా చీఫ్ ఇంజినీర్ ఎనర్జీ ఆడిట్‌ను ఆదేశించింది. ఐదు మాసాలుగా ఆయన్ను రిలీవ్ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో పాటు సదరు ఆర్టిజన్‌ను మానసిక వేధింపులకు గురి చేసినట్లు ఫిర్యాదులు అందడంతో ఈ మేరకు డిస్కం సీఎండీ సదరు సీఈపై ఈ చర్యలకు ఆదేశించారు.


బస్తీబాటతోనే అంతర్గత సామర్థ్యం పెంపు

బస్తీబాటతోనే సంస్థ అంతర్గత సామర్థ్యం మెరుగుపడినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. ఈ మేరకు గురువారం మెహిదీపట్నం డివిజన్‌లోని అయోధ్య నగర్, జనార్దన్ కాలనీ, సంతోష్‌నగర్, రేతిబౌలి ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్‌టీ ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో ఏబీ కేబుళ్లను ఏర్పాటు చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఆయన వెంట సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, మెట్రోజోన్ సీఈ ప్రభాకర్, సెంట్రల్ సర్కిల్ సీఈ వెంకన్న, డీఈ సుధీర్‌కుమార్‌లు ఉన్నారు.

ఆర్టీసీ సిబ్బంది మెడపై.. 'ఈవీ' కత్తి!

గ్రేటర్ పరిధిలో త్వరలో రోడ్డెక్కనున్న 275 అద్దె బస్సులు

- రెండేళ్లలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులకు ప్రణాళికలు
- ప్రశ్నార్థకంగా 15,000 మంది ఉద్యోగుల భవిష్యత్
- దశలవారీగా ఆర్టీసీ సొంత బస్సులకు ఉద్వాసన
- ఎలక్ట్రిక్ వాహనాల కోసమే ఏర్పడనున్న కొత్త డిపోలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్





సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో దశలవారీగా రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ సిబ్బంది మనుగడకు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. కాలుష్యరహిత, పర్యావరణహితమైన, ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాన్ని అందజేసే ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)లు వేలాదిమంది సిబ్బంది మెడపై కత్తిగా వేలాడనున్నాయి. ప్రస్తుతం 265 ఎలక్ట్రిక్ బస్సులు అద్దె ప్రాతిపదికన నడుస్తున్నాయి. త్వరలో మరో 275 వరకు రోడ్డెక్కనున్నాయి. వచ్చే రెండేళ్లలో 2,800 బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ బస్సుల కోసం కొత్తగా పది డిపోలను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉంది. మరోవైపు రెండేళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ బస్సుల చార్జింగ్ పేరిట ఆర్టీసీ ఇప్పటికే ప్రయాణికులపై చార్జీల భారాన్ని మోపింది. ఈ క్రమంలోనే దశలవారీగా సిబ్బందికి సైతం ఉద్వాసన పలికే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ– బస్సులతో గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 డిపోల్లో వివిధ స్థాయిల్లో పని చేసే సుమారు 15,000 మందికి పైగా ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కోనున్నారు. ఈ క్రమంలోనే ఎలక్ట్రిక్ బస్సుల పేరిట జరిగే ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకించేందుకు కార్మిక సంఘాలు ఆందోళనకు సన్నద్ధమవుతున్నాయి.

ఒక బస్సుతో ఐదుగురికి నష్టం..

ప్రధానమంత్రి ఎలక్ట్రిక్ డ్రైవ్ (పీఎం ఈ– డ్రైవ్) పథకంలో భాగంగా ఎలక్ట్రిక్ అద్దె బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ప్రైవేట్ సంస్థలకు చెందిన డ్రైవర్లే ఈ బస్సులను నడుపుతారు. దీంతో ఆర్టీసీకి ప్రత్యేకంగా డ్రైవర్ల అవసరం ఉండదు. మెకానిక్‌లు, టెక్నీషియన్‌లు తదితర సిబ్బంది అవసరం కూడా ఉండదు. కండక్టర్ల అవసరం మాత్రమే ఉంటుంది. ప్రస్తుతం ఒక బస్సుకు ఐదుగురు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ఒక డ్రైవర్, ఒక కండక్టర్‌తో పాటు మెకానిక్, టెక్నీషియన్, సూపర్‌వైజర్లు ఉన్నారు. ఈ లెక్కన నగరంలోని అన్ని డిపోల్లో 15,000 మంది పని చేస్తున్నారు. వీరిలో సుమారు 6,000 మంది డ్రైవర్లే. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పెద్ద సంఖ్యలో నష్టపోయేది కూడా డ్రైవర్లే కావడం గమనార్హం. ఆ తరువాత మెకానిక్‌లు, టెక్నీషియన్‌ల ఉద్యోగాలకు కూడా ప్రమాదం పొంచి ఉండనుంది.

- ఈ క్రమంలో హైదరాబాద్‌లో పని చేసే సిబ్బందిని జిల్లాల్లో సర్దుబాటు చేయడంతో పాటు, ఉద్యోగ విరమణకు దగ్గర్లో ఉన్న వారిని స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కోసం ఒత్తిడి చేసేలా ఆర్టీసీ ప్రణాళికలను సిద్ధం చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఆర్టీసీ డిపోలు కూడా ప్రైవేట్ బస్సుల నిర్వహణకు పరిమితం కానున్నాయి. ప్రస్తుతం హెచ్‌సీయూ డిపోను పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం వినియోగిస్తున్నారు. కంటోన్మెంట్, రాణిగంజ్, కూకట్‌పల్లి, హయత్‌నగర్ తదితర డిపోల్లో చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. త్వరలో అన్ని డిపోల్లోనూ హైటెన్షన్ విద్యుత్ సదుపాయం కలిగిన చార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఈ డిపోలన్నీ ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్, పార్కింగ్ అవసరాలకు వినియోగిస్తారు. అప్పుడు వీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బంది అవసరం ఉండదు.

ప్రభుత్వ కుట్రలను సహించబోం..

ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీని నమ్ముకొని బతుకుతున్న కార్మికులను బయటకు పంపించేందుకు ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోంది. ఈ పరిణామాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం. కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాన్ని ప్రజా క్షేత్రంలో దోషిగా నిలబెడతాం.
– ఈదరి వెంకన్న, ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

కేంద్రం సబ్సిడీ ప్రైవేటుకేనా?

- ప్రజారవాణా రంగంలో ఈవీలను ప్రోత్సహించేందుకు ఈవీ బస్సులపై కేంద్రం సబ్సిడీ ఇస్తోంది. పీఎం –ఈ డ్రైవ్‌లో భాగంగా ఒక్కో బస్సుపై సుమారు రూ.35 లక్షల వరకు రాయితీ లభిస్తుంది. రూ.కోటికిపైగా ఖరీదైన ఈ– బస్సులను కొనుగోలు చేసే ప్రైవేట్ సంస్థలకే రాయితీ లభిస్తుందని, దీనివల్ల ఆర్టీసీకి పెద్దగా ప్రయోజనం ఉండబోదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.
- ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్టీసీయే చార్జింగ్, పార్కింగ్ సదుపాయాన్ని అందజేస్తోంది. ప్రయాణికుల నుంచి చార్జీల రూపంలో వచ్చే ఆదాయంలో మాత్రం కిలోమీటర్‌కు సుమారు రూ.57 చొప్పున ప్రైవేట్ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఏ విధంగానూ ఆర్టీసీకి లాభదాయకం కాదని, అద్దె ప్రాతిపదికన నడపడం కంటే సొంతంగా ఈవీలను సమకూర్చుకోవడం వల్ల ఆదాయం పెరుగుతుందని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకన్న తెలిపారు. మరోవైపు ప్రస్తుతం నగరంలో సుమారు 22 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు.వీరిలో 16 లక్షల మంది వరకు మహిళలే ఉన్నారు. వారి ఉచిత ప్రయాణాలపై ప్రభుత్వం చెల్లించే రీయింబర్స్‌మెంటే ఆర్టీసీకి ప్రధాన ఆదాయం. నగదు రూపంలో లభించేది తక్కువే. ఉచిత ప్రయాణాలపై ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోయినా, ఆలస్యమైనా ఆర్టీసీ దారుణంగా నష్టపోతుంది.

నకిలీ ఐ ఫోన్ ఫ్రేమ్‌లు విక్రయిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు

పంజగుట్ట: నకిలీ ఐ ఫోన్ ఫ్రేమ్‌లను విక్రయిస్తున్న తొమ్మిది షాపులపై దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు షాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటలోని ఎలిఫెంట్ హౌస్ భవనంలో మొబైల్ ఫోన్ల పరికరాలు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ ఐ ఫోన్‌కు చెందిన నకిలీ ఫ్రేమ్‌లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో తొమ్మిది దుకాణాల్లో వీటిని విక్రయిస్తుండగా 1688 ఫోన్ పౌచ్‌లు, 289 బ్యాక్ కవర్లు, 15 కేబుల్స్, 6 చార్జింగ్ అడాప్టర్స్ స్వాధీనం చేసుకున్నారు. ఒరిజినల్ ఐ ఫోన్ సంస్థలో వీటి విలువ సుమారు రూ.97 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వీటిని విక్రయిస్తున్న షాపుల నిర్వాహకులు కె.నరేష్, విక్రమ్, పవన్ కుమార్, ఇర్ఫాన్, షేక్ మోహిన్, ఎం.డి.సర్వర్, ఎం.రఘునాథ్, సురేందర్, మహ్మద్ హసన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జడ్జి కారుపై దాడి

కేసు నమోదు

చంచల్‌గూడ: ర్యాష్ డ్రైవింగ్ చేయడమే కాకుండా జడ్జి కారు డ్రైవర్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి కోర్టు జడ్జి డ్రైవర్ జి.స్వామి గత సోమవారం విధుల్లో భాగంగా చంచల్‌గూడ మీదుగా నాంపల్లి కోర్టుకు వెళ్తున్నారు. జైలు దాటగానే పల్సర్ బైక్‌పై వచ్చిన యువకుడు కారును అడ్డగించి అసభ్య పదజాలంతో దూషిస్తూ కారుపై దాడి చేశారు. ఈ సంఘటనతో డ్రైవర్‌తో పాటు జడ్జి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇదేమని డ్రైవర్ ప్రశ్నించగా అతడిపై దాడికి యత్నించాడు. కారులో జడ్జి ఉన్నాడని చెప్పినా వినిపించుకోకుండా అయితే నాకేంటని బూతులతో రెచ్చిపోయాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బన్సీలాల్‌పేట్: భారత దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు అసలైన దేశ చరిత్రను నేటి తరం తెలుసుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ సుప్రసిద్ధమైన స్కందగిరి దేవాలయంలో జరుగుతున్న శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలకు గురువారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని అవి మన వేద విజ్ఞానంతో ముడిపడి ఉన్నాయన్నారు. సనాతన ధర్మం వేదంతో ముడిపడి ఉందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు దశాబ్దాలుగా ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని నిలబడిందని దానికి వేదమే ప్రమాణికమన్నారు. ఇతర దేశస్తులు మన సంపదను దోచుకొని పోయారు గాని మన జీవన ప్రమాణానికి ఆధారమైన వేదజ్ఞానాన్ని మన నుంచి విడదీయలేకపోయారన్నారు. వేద పాఠశాలతో పాటు ఆధునిక విజ్ఞానాన్ని అందిస్తున్న శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్‌ను అభినందిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేదాలు, శాస్త్రాలను గౌరవిస్తూ విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షతన వహించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ట్రస్ట్ రజతోత్సవాల సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మెన్ తూములూరి శాయినాథ్ శర్మ, ప్రధాన కార్యదర్శులు పసుమర్తి బ్రహ్మానంద శర్మ, చింతపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ..



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి

కంటోన్మెంట్: శుభకార్యానికి వెళ్లి వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి కంసాలి బజార్లో బి. ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి నివాసంఉంటున్నాడు. బంధువుల ఇంట్లో బర్త్‌డే వేడుకల్లో పాల్గొనేందుకు ఈ నెల 6న కుటుంబంతో కలిసి మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. బుధవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేలు విలువ చేసే పంచలోహ విగ్రహం, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఆత్మస్థైర్యంతో కేన్సర్‌ను జయించొచ్చు

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి
- ఢిల్లీ అపోలో ఆసుపత్రిలో 'ఐ యామ్ సర్వైవర్' పుస్తకావిష్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆత్మ స్థైర్యంతో కేన్సర్‌ను జయించొచ్చునని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అపోలో కేన్సర్ సెంటర్ ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్, మెడికల్ ఆంకాలజీ, డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి కేన్సర్‌పై రాసిన 'ఐ యామ్ సర్వైవర్'(నేను కేన్సర్‌ను జయించాను) అనే పేరుతో పుస్తకాన్ని రచించారు. హిందీ అనువాద 'మైనే కేన్సర్ కో జీతా హై' పుస్తకావిష్కరణ సభ బుధవారం ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో జరిగింది. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, అపోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్(ఢిల్లీ) శివకుమార్ పట్టాభిరామన్, విజయ్ ఆనంద్ రెడ్డిలతో కలసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో 30 ఏళ్ల అనుభవాన్ని ఈ పుస్తక రూపంలో ప్రజలకు తెలపడం అభినందనీయమన్నారు. కేన్సర్ పేరు చెబితే భయపడే పరిస్థితుల నుంచి, వ్యాధిని ఎలా జయించొచ్చు అనే విషయాలను పుస్తకంలో స్పష్టంగా వివరించడం మంచి పరిణామన్నారు. ఆత్మ స్థైర్యంతో కేన్సర్‌ను జయించొచ్చు అనే నిజాన్ని ఈ పుస్తకం ద్వారా ప్రజలకు తెలిపినందుకు అభినందనలు అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేన్సర్ మహమ్మారిపై దండయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కేన్సర్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఈ పుస్తకం ద్వారా ప్రతి రోగి ఆత్మవిశ్వాసంతో ముందుకెళతారని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి అన్నారు. ఈ పుస్తకంలో కేన్సర్‌ను జయించిన 108 మంది విజయగాథలను, వారి అనుభవాలను పొందుపరిచినట్లు పుస్తక రచయిత డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి తెలిపారు. రోగుల జీవితంపై ప్రేమను ప్రతిబింబించాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రాసినట్లు పేర్కొన్నారు.



డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్టు

మణికొండ: గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈగల్ టీంతో కలిసి నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ముంబైకి చెందిన కార్తికేయశేఖర్, అనంతకుమార్ కొన్నేళ్లుగా కొకైన్‌ను వినియోగించడమేగాక దానిని ముంబై నుంచి తెచ్చి సహచరుల ద్వారా హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. వారికి వీరబాబు అనే వ్యక్తి డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోకు చెందిన ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, గోపీ నేతృత్వంలో గురువారం నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి మంచిరేవుల వద్ద అనంతకుమార్, వీరబాబులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 7.50 లక్షల విలువ చేసే 107.4 గ్రాముల కొకైన్‌తో పాటు రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కార్తికేయ శేఖర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు నేరం అంగీకరించటంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి రిమాండ్

రాజేంద్రనగర్: తల్లితో సహజీవనం చేస్తున్న యువకుడిని హత్య చేసిన కేసులో నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూవ్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యాసిర్(28) అదే అదే ప్రాంతానికి చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తన ఫ్లాట్‌లోనే మహిళతో పాటు ఆమె నలుగురు కుమారులతో కలిసి ఉంటున్నాడు. కొన్నాళ్లుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ ఘర్షణ పడుతున్నారు. బుధవారం ఉదయం యాసిర్, సదరు మహిళకు మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న మహిళ పెద్ద కుమారుడు ఆయాన్(18) కత్తితో యాసిర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యాసిర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో కొండ చిలువ



నిజాంపేట్: బాచుపల్లిలోని రెడ్డీస్ ల్యాబ్ సమీపంలోని ఒక అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో భారీ కొండ చిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. ఈ నెల 8న రెండో అంతస్తులోని ఓ గదిలో కొండ చిలువను గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు స్నేక్ టీమ్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి కొండ చిలువను బంధించారు. అనంతరం దానిని సమీపంలోని అడవిలో వదిలేశారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడిపై కేసు నమోదు

సైదాబాద్: మద్యం మత్తులో ఓ యువకుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో ఓ బాలిక కుటుంబంతో సహా నివాసం ఉంటోంది. వారి ఇంటి సమీపంలో ఓ యువకుడు (24) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం బాలిక తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లగా బాలిక తన సోదరుడితో కలిసి ఇంట్లో ఉంది. అదే అదనుగా భావించిన సదరు యువకుడు ఆమెను తన గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడి వద్ద భారీగా బంగారం, వెండి గుర్తింపు

శంషాబాద్: పరిమితికి మించి బంగారం, వెండి ఆభరణాలతో పట్టుబడిన ఓ ప్రయాణికుడిని సీఐఎస్‌ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి హైదరాబాద్ వచ్చిన బిన్సన్ డేవిస్ అనే ప్రయాణికుడి కదలికలను గమనించిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు చేతి సంచి క్షుణ్ణంగా పరిశీలించడంతో అందులో 2.80 కేజీల బంగారు ఆభరణాలు, 3 కేజీల వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. ప్రయాణికుడు శంషాబాద్ విమానాశ్రయం నుంచి భువనేశ్వర్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అధికారులు గుర్తించారు. సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఐటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఐటీ అధికారులు ఎయిర్‌పోర్టుకు చేరుకుని వారిని విచారిస్తున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య..

కుత్బుల్లాపూర్: ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తూర్పు గోదావరి జిల్లా, చింతపల్లికి చెందిన వినయ్‌దుర్గ (19) మల్లారెడ్డి యూనివర్సిటీలో బీటెక్ చదువుతూ వర్సిటీ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం హాస్టల్ వార్డెన్ రాజేంద్ర గదులను తనిఖీ చేస్తుండగా 010 గది లోపల నుంచి గడియపెట్టినట్లు గుర్తించాడు. దీంతో గది తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో వెంటిలేటర్ నుంచి చూడగా వినయ్ దుర్గ టవల్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో తలుపులు బద్దల కొట్టి వినయ్‌దుర్గను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్థిరమైన, సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యం

రాయదుర్గం: రాష్ట్రంలో స్థిరమైన, సమగ్ర పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి క్రాంతి అన్నారు. 'టూరిస్ట్ పోలీస్ ఓరియంటేషన్ అండ్ సెన్సిటైజేషన్' అంశంపై వారం రోజుల పాటు గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో టూరిజమ్ పోలీసులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కీలక పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు పూర్తి స్థాయి భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అందులో భాగంగా టూరిజమ్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిథమ్ ప్రిన్సిపల్ ఎంకెగణేష్, నిథమ్ ఫ్యాకల్టీడాక్టర్ నీరజ్‌గోయల్, మిషెల్లీ జే ఫ్రాన్సిస్, యాదగిరి, ఇతర అధికారులు, టీఎస్‌టీడీసీ అధికారులు, శిక్షణ పొందిన టూరిజమ్ పోలీసులు పాల్గొన్నారు.



టూరిజం పోలీసులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఏటీసీని తనిఖీ చేసిన కలెక్టర్

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ పరిధిలోని పంజగూడ రెవెన్యూలో నిర్మించిన ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)ని గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవనంలోని గదులు, మిషనరీ ఏర్పాటును పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.లక్ష్మణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ భవన నిర్మాణం 95 శాతం పూర్తయిందని, ఇంకా మిషనరీ రావాల్సి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అవసరమైన పరికరాలతో పాటు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థిని ఆత్మహత్య

- యువకుడి వేధింపులే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- పరారీలో నిందితుడు



మౌలిక (ఫైల్)

అడ్డగుట్ట: ప్రేమ పేరుతో ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలాపేటలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసముంటున్న ప్రమోద్‌కుమార్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి పెద్ద కుమార్తె మౌలిక(19) అలియాస్ వెన్నెల తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలలో బి.ఏ సెకండ్ ఇయర్ చదువుతుంది. అదే కాలేజీలో మాణికేశ్వర్ నగర్‌కు చెందిన అంబాజీ అనే యువకుడు కొన్ని నెలల క్రితం వాలీబాల్ కోచ్‌గా జాయిన్ అయ్యాడు. కొద్ది రోజులుగా అతను మౌలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన మౌలిక బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అంబాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతురాలి సెల్‌ఫోన్‌లో డేటా పూర్తిగా డిలీట్ చేసి ఉందని, డేటాను రిట్రీవ్ చేస్తున్నట్లు చెప్పారు. అంబాజీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మధురం..56 ఏళ్ల జ్ఞాపకం

గురువును సత్కరించిన పూర్వ విద్యార్థులు

అంబర్‌పేట: విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఆత్మీయంగా సత్కరించారు. 56 ఏళ్లు గడిచినా విద్య నేర్పిన గురువును వారు విస్మరించలేదు. 1969లో కేశవ్ మెమోరియల్ స్కూల్‌లో పాఠాలు చెప్పిన మాస్టారు కె.యాదవరెడ్డి (ప్రముఖ కవి నిఖిలేశ్వర్)ని శిష్యులు సత్కరించి ఆత్మీయతను పంచారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇందుకు శివంరోడ్ లోని ఓ హోటల్ వేదికైంది. గురువారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో 1969 బ్యాచ్ విద్యార్థులు ప్రొఫెసర్ రుద్ర సాయిబాబా, డాక్టర్ భగవత్ రెడ్డి, సత్యనారాయణ, డి.ఎస్.ఎన్ మూర్తి, మల్లాది రాఘవ, జగన్‌రావుతో పాటు మరో 25 మంది పాల్గొన్నారు.

FORM NO.70 (Rule- 196 CRP)
Proclamation of sale of immovable property)
IN THE COURT OF THE HON'BLE II ADDL. CHIEF JUDGE, HYDERABAD
E.P.NO. 742 OF 2025
In
O.S. No. 138 OF 2014

Between:-
Mr. K.V.D. Kishore Kumar .... Decree-Holder
And
Mrs. Basavaraju Sailaja .... Judgement-Debtor

Whereas by a decree made in the above suit, and dated the 25th day of November 2014; the above named defendant were ordered to pay to the above named plaintiff the sum of Rs.20,63,200 and Rs.23,128 /- for costs of suit, making in all the sum of Rs.20,86,328/- together with interest thereon at rate of Rs.6% percent per annum from the said day until realization, and by an order for sale, dated the 11th day of September, 2025 immovable property described in the schedule hereto was ordered to be sold by me in satisfaction of the said decree. And whereas on the25thday of October 2025is fixed for sale there will be due thereunder the sum of Rs.Rs.20,63,200/- for principal and interest, Rs. 23,128 for costs and at rate of Rs.6% percent per annum from the said day until realization.

And whereas by an order made in the above suit, and dated the 25th day of October 2025 it was directed that the sale of the said property, independent house bearing H.No. 1-9-290/3, admeasuring 150 Sq. Yds, with a built up area of 500 Sq. Ft. situated at Vidyanagar, Hyderabad, by public auction at the City Civil Court, Hyderabad (or the several lots), subject to the conditions of sale hereunder, in the lots, and the times in the same schedule specified copies of this proclamation may be had gratis of (residence and description)

CONDITION OF SALE

1. The conditions prescribed by the Code of Civil Procedure shall apply to the sale.
2. The highest bidder of each (lot) shall be the purchaser, and if any dispute arises as to any bidding, the lots shall be put up again. The decree-holder shall (or shall not) be at liberty to bid. No person shall advance a less sum of each bidding than shall be named by auctioneer on putting-up the lot and no bidding shall be re-tracted, etc.
3. Each purchaser shall immediately after the sale to him pay to the auctioneer 52 percent of the purchase money and shall pay the residue of the purchase money to the auctioneer before5.00p.m., on or before the fifteenth day after sale to him.
4. The property is sold subject to the mortgagee dated the nil day of above referred to, and to all claims and rights of the said thereunder (not applicable).
5. The property is believed and shall be taken to be correctly described as to quantity and otherwise, and any omission or misstatement in this proclamation shall not annul the sale, or be a ground for any compensation on either side.
6. Such of the documents of title in the possession of the decree-holder (or now in Court) as relate exclusively to any lot will be delivered to the purchaser of such lot. All other documents which relate exclusively to the property sold will be delivered to the purchaser of lot No.or such other person as the Court may determine.
7. The Certificate of the Registrar of Assurances of the result of the above search, a copy of the decree under which the property is sold and copies of the leases and agreements referred to in column 7 of the schedule hereto, may be inspected at the said Court on any day before the sale during office hours or at the Office of the auctioneer at City Civil Court, Hyderabad on any day before the sale between the hours of 10 AM and 5 PM., and whether the purchaser shall have inspected the same or not, he shall be considered, by bidding at sale to have waived all objections appearing on the face thereof.
8. The further hearing of the above suit adjourned to the day of such day of 28th October 2025 when the sale will come before the court for confirmation. On such day any purchaser may make any objection to the sale of which he shall have given not less than five days previous notice in writing to the parties to the suit. Any objection not so made shall be considered, as waived, and if no objection be so made, the title shall be considered, as accepted, and the sale as valid in all respects, and in this respect, time shall be deemed to be the essence of the contract.

SCHEDULE

H.No. 1-9-290/3, admeasuring 150 Sq. Yds, with a built-up area of 500 Sq. Ft. situated at Vidyanagar, Hyderabad
North: Apartments (H.No. 1-9-290/2/2) South: Road East: Neighbours house (H.No. 1-9-290/3/A) West: Road

By Order of The Court
Sd/- RAGHU GURRAM Advocate
6-3-883/A/I, Flat No.302, 3rd Floor, Imperial Plaza, Situated at Panjagutta, Hyderabad-500 082, Mobile: 8096032018
raghug5451@gmail.com

ఏ ఓటరు.. ఎటువైపో?

● ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల ప్రణాళికలు ● ఏ ఓటర్లు ఎంతమంది ఉన్నారో లెక్కలు తీస్తున్న అభ్యర్థులు ● బీసీ, మైనార్టీ ఓటర్లే కీలకం



పోలింగ్ తేదీ :	నవంబర్ 11
మొత్తం ఓటర్లు :	3,98,982
పురుషులు :	2,07,367
మహిళలు :	1,91, 530

నియోజకవర్గ ముఖ చిత్రం:
పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి.
అల్పాదాయవర్గాలు ఉన్న ప్రాంతాలు:
బోరబండ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, షేక్‌పేట
వెనుకబడిన తరగతులు(బీసీ):
2 లక్షలు (50 శాతం)

ముస్లింలు	96,500 (24 శాతం)
వలస ఓటర్లు	35,000 (8.7 శాతం)
ఎస్సీలు	26,000 (6.5 శాతం)
మున్నూరు కాపులు	21,800 (5.5 శాతం)
కమ్మ	17,000 (4.3 శాతం)
యాదవులు	14,000 (3.5 శాతం)
మాలలు	12,000 (3 శాతం)
క్రిస్టియన్లు	10,000 (2.5 శాతం)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక వచ్చేనెల 11వ తేదీన జరగనుండగా, ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మూడు పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తుండగా, ఇప్పటికే బీఆర్‌ఎస్ కమ్మ కులానికి చెందిన అభ్యర్థి మహిళకు సీటు ఇచ్చింది. కాంగ్రెస్ బీసీ అభ్యర్థి యాదవ కులానికి చెందిన నవీన్‌యాదవ్‌ను ఎంపిక చేసింది. బీజేపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు పైఎత్తులతో ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నాయి. నియోజకవర్గంలో వివిధ కులాలు, మతాలను ఓటు బ్యాంక్‌గా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు తమ అభ్యర్థుల ప్రచారం కోసం ఆయా కులాలకు చెందిన అగ్ర నేతలను రంగంలోకి దింపుతున్నాయి. 2024లో జరిగిన తెలంగాణ కుల గణన సర్వేలో వెల్లడైన కులాలు, మతాలకు సంబంధించిన జాబితాతో ఆయా పార్టీలు తమ ప్రచారంలో సరికొత్త ఎత్తుగడలను ఎంచుకుంటున్నాయి. ఇంకా బీజేపీ అభ్యర్థి ఖరారు కాకపోవడంతో ఇప్పటికైతే కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని, బీఆర్‌ఎస్ ఓసీ అభ్యర్థిని రంగంలోకి దింపాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రచారంలో దూకుడుగా దూసుకెళ్తోంది. అభ్యర్థిని ముందే ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు ఇప్పటికే కొన్ని సమావేశాలు కూడా నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థిని బుధవారం రాత్రి ప్రకటించినా అంతకుముందు నుంచే ఓసీ, బీసీ, దళిత మంత్రులు నియోజకవర్గంలో ప్రచారాన్ని, అభివృద్ధి పనుల శంకుస్థాపనల విషయంలో ముందుకు తీసుకువెళ్లారు. ఒకవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ప్రజల్లోకి వెళ్లి తన భర్త చేసిన పనులను చూపిస్తుండగా, కాంగ్రెస్ తానేమీ తీసిపోనట్లు గల్లీగల్లీలో శంకుస్థాపనలు పూర్తి చేసింది. కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని నిలబెట్టడంతో నియోజకవర్గ బీసీ ఓటర్లు ఎంతవరకు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతారో చూడాల్సి ఉంది. ఓటర్లలో సగం మంది బీసీ ఓటర్లు ఉండటం ఈ ఎన్నికల్లో గెలుపోటములు అభ్యర్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. బీజేపీ ఎవరిని నిలబెడుతుందో మిగతా రెండు పార్టీలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఒకట్రెండు రోజుల్లో ఆ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టే అవకాశాలు ఉన్నాయి.

ఈ అవకాశం దేవుడిచ్చిన వరం

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ ప్రజలకు సేవ చేసేందుకు దేవుడే వరం ఇచ్చాడని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం ఎంతో మంది సీనియర్లు ఎదురు చూస్తున్నా తనకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం సాక్షితో మాట్లాడిన ఆయన పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. అధిష్టానం అన్ని సర్వేలు నిర్వహించిన తర్వాతే స్థానికత, బీసీ నేత అయిన తనకు అవకాశం కల్పించిందని అన్నారు. చాలా దఫాలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే గెలుస్తూ వచ్చారు. స్థానికుడికి అవకాశం ఇస్తే అభివృద్ధితో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటాడనే నమ్మకంతో టికెట్ వరించిందని పేర్కొన్నారు.

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

◆ కాంగ్రెస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి కేవలం రెండు నెలల్లో రూ.150 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఇప్పటికే అనేకచోట్ల సీసీ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. 11 ఏళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయింది. ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. సరైన రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ కూడా తట్ట మట్టి కూడా వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడంతో జూబ్లీహిల్స్ అభివృద్ధికి మంచిరోజులు వచ్చినట్లయ్యింది.

సానుభూతి పనిచేయదు

◆ నియోజకవర్గంలో సానుభూతి మీద ఎవరూ గెలవలేరు. మూడు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించిన దివంగత ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదు. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసు. బీఆర్‌ఎస్‌పై నమ్మకం పోయి.. కాంగ్రెస్‌పై పెరిగింది. ప్రజలు అభివృద్ధిని చూసే ఓట్లు వేస్తారు. ఇక్కడ కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడతారని నమ్ముతున్నాను. చిన్న వ్యాపారాలు, దినసరి కూలీ పనులు చేసుకుని బతికే ప్రజలే నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. గెలిచిన వెంటనే వారికి కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తాను. చివరి వరకు వారికి అండగా ఉంటాను.

ఉప ఎన్నిక నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు



రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పురస్కరించుకుని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘవేంద్రరావు గురువారం మోతీనగర్, స్వరాజ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్లను పరిశీలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్, డీఐ సైదులు, సెక్టార్ ఎస్సైలు ఆయన వెంట ఉన్నారు.

9 హెల్త్ కేర్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నంబర్-3లో అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన 9 హెల్త్ కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను సినీ దర్శకులు తేజ సినీనటి సంతోషిని, శ్రీకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ.. 'జై' సినిమా తర్వాత మళ్లీ చాలా ఏళ్ల తర్వాత సంతోషిని తన రిహాబిలిటేషన్ సెంటర్ వేదికగా కలవడం సంతోషంగా ఉందని అన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో మల్టీ మాడ్యులర్‌గా ఈ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



షేక్‌పేట నారాయణమ్మ కాలేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఫిలింనగర్ పోలీసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఫిలింనగర్ పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. షేక్‌పేట ప్రధాన రహదారిలోని నారాయణమ్మ కాలేజీ వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

చలో బస్‌భవన్‌కు భారీగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు



మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో బస్ భవన్ కార్యక్రమానికి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్ నుంచి కార్యకర్తలు ఊరేగింపుగా తరలివెళ్లారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హిమాయత్‌నగర్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో క్రిష్ణ చైతన్య, వెంకటస్వామినగర్ సెక్టార్ సూపర్‌వైజర్ సునీతరెడ్డి, బొగ్గులకుంట యూపీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మి ప్రసన్న అన్నారు. వెంకటస్వామినగర్ సెక్టార్, భగీఖాన బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, ఐలమ్మ, నీరజ, విజయలక్ష్మి, రేణుక, స్వరూపరాణి, మాధవి, అరుణజ్యోతి, శ్రీదేవి, పీహెచ్‌ఎన్ స్టాఫ్ నర్స్ ఏసులత, ప్రతినిధులు జోసఫ్, జాన్సన్, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార అనుమతులకు సువిధ యాప్

రిటర్నింగ్ అధికారి సాయిరాం



పొలిటికల్ పార్టీ ఏజెంట్ల మీటింగ్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం

◆ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి పార్టీ ఖచ్చితంగా పాటించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సికింద్రాబాద్ ఆర్డీఓ పి.సాయిరాం అన్నారు. షేక్‌పేట మండల కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 407 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ స్టేషన్లు, ఓటరు స్లిప్పుల పంపిణీ, హోం ఓటింగ్ తదితర అంశాలను ఆయన వివరించారు. ప్రచార అనుమతుల కోసం సువిధ యాప్‌ను, ఫిర్యాదుల కోసం సీ-విజిల్‌ను ఉపయోగించుకోవాలని వెల్లడించారు. ఈ ఎన్నికల కోసం ఐదుగురు నోడల్ అధికారులు, ఐదుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉంటారని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఫిర్యాదులు ఉంటే యాప్ ద్వారా చేయవచ్చన్నారు. ఈ మీటింగ్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, ఆప్ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్వత్‌నగర్‌లో పోషణ మాసోత్సవాలు



రహమత్‌నగర్: బోరబండ డివిజన్ పర్వత్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో గురువారం పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీఓ రేణుక మాట్లాడుతూ మాత, శిశు ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీవాత్సవ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిని తగ్గించుకోవడంపై అవగాహన



బంజారాహిల్స్: యాంత్రిక జీవనంలో విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఆ ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో తెలియజేసే అవగాహన కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ నిర్వహించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించి ఇక్కడి విద్యార్థులతో స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. మెంటల్ హెల్త్‌పై గళం విప్పాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకముందు తరగతి గదుల్లో వ్యక్తిత్వ వికాస నిపుణులచే మానసిక ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశంపై కౌన్సెలింగ్ కూడా నిర్వహించారు.

అభినందనల వెల్లువ



నవీన్‌యాదవ్‌కు అభినందనల వెల్లువ

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి.నవీన్‌యాదవ్‌ను అధిష్టానం ప్రకటించడంతో నియోజకవర్గానికి చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యూసుఫ్‌గూడలోని తన కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, యువతీ యువకులు, సినీ కార్మికులు తదితరులు భారీగా తరలివచ్చారు.

కృతజ్ఞతలు



మంత్రి పొన్నంతో..



మహేష్‌కుమార్‌గౌడ్‌తో..

కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి వి.నవీన్‌యాదవ్ గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు టికెట్ కేటాయించడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల్లో విజయానికి కూడా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

బంజారానగర్‌లో సోదాలు

మద్యం సీసాలు స్వాధీనం

రహమత్‌నగర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ మహిళను బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగుల్ మీరా తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ డివిజన్‌లోని బంజారానగర్‌లో పుష్ప అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో కలిసి బుధవారం ఆమె నివాసంలో సోదాలు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

ఎన్నికల బరిలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ



మాట్లాడుతున్న పాలూరు రామకృష్ణయ్య

పంజగుట్ట: బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు తమ అభ్యర్థులను పోటీలో ఉంచుతున్నట్లు ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య పేర్కొన్నారు. సోమాజిగూడలోని ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి మేకపోతుల నరేందర్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తమ పార్టీకి ఎన్నికల సంఘం కుర్చీ గుర్తును శాశ్వతంగా కేటాయించిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుంచి తమ అభ్యర్థులను బరిలోకి దింపుతామని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థి ఉంటారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు ఇచ్చే బీ ఫామ్‌లను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పాలూరు రామకృష్ణయ్య సంతకంతోనే ఇవ్వాలని కమిటీ నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి భిక్షపతి, సెక్రటరీ శ్రీహరి, కోశాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

దేశంలో దళితులపై దాడులు ఆందోళనకరం

విశ్రాంత ఐపీఎస్ అధికారి డా.కె.బాబురావు

హిమాయత్‌నగర్: దళితులు, మైనార్టీలు, క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోతున్నాయని విశ్రాంత ఐపీఎస్ అధికారి, సివిల్ రైట్స్ ఇంటియేటీవ్ ఇంటర్నేషనల్(సీఆర్‌ఐఐ) జాతీయ అధ్యక్షుడు డా.కె.బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి ప్రజాస్వామ్యానికి, న్యాయ వ్యవస్థకు, రాజ్యాంగానికి గొడ్డలిపెట్టని పేర్కొన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ వివిధ సంఘాలతో సీఆర్‌ఐఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుడు కాబట్టే గవాయ్‌పై దాడికి పాల్పడ్డాడని, అతడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజేఆర్ నారగోని, సామూహిక సెక్యూలర్ రైటర్స్ ఫోరం ప్రతినిధి మేర్సీ మార్గరేట్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దాంతో ఎస్‌ఐ సుష్మ బుధవారం రహమత్‌నగర్‌లో పెట్రోలింగ్‌ను పెంచారు. ఎస్పీఆర్ హిల్స్ సంతోష్‌గిరి ప్రాంతంలో ఇద్దరు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. కె.అశోక్ మద్యం బాటిల్స్ విక్రయిస్తుండగా అతడి కుమారుడు సుభాష్ పారిపోయాడు. అశోక్‌ను అదుపులోకి తీసుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

వెంగళరావునగర్: అనుమతి లేకుండా జాబ్‌మేళా నిర్వహించిన వారిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫెడరేషన్, డెక్కన్ ప్లాస్టర్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జాబ్‌మేళా నిర్వహించే ప్రతినిధులు అనుమతి తీసుకోలేదు. అంతేగాకుండా మధ్యాహ్నం భోజనం పంపిణీ చేసిన వ్యాన్‌పైన కూడా మాజీ మంత్రి కేటీఆర్ ఫొటో ముద్రించి ఉంది. మధురానగర్ పోలీసులు భోజనం తీసుకు వచ్చిన వాహనాన్ని సీజ్ చేసి, లక్షా 85 వేల రూపాయల ఖరీదైన భోజనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతి తీసుకోకుండా జాబ్‌మేళా నిర్వహించిన నిర్వాహకులు విద్యాసాగర్, మున్నన ఉల్లాఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డు భార్య, పిల్లలు అదృశ్యం

వెంగళరావునగర్: సెక్యూరిటీ గార్డు భార్య పిల్లలు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన కులదీప్ శర్మ శ్రీకృష్ణానగర్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 5న తన తల్లి ఫోన్ చేసి ఒక గుర్తు తెలియని మహిళతో కలిసి భార్య, పిల్లలు బిహార్ నుంచి హైదరాబాద్ వచ్చారని తెలిపింది. దాంతో అతడు ఎవరికీ చెప్పకుండా కాజీపేట వెళ్లి వారు ప్రయాణిస్తున్న రైలులో ఎక్కాడు. అందులో భార్య పిల్లలు, గుర్తు తెలియని మహిళ ఉంది. సికింద్రాబాద్‌లో ఆ మహిళను ప్రశ్నించగా నీ భార్యకు డబ్బులు ఇచ్చి ఇక్కడ పని చేసేందుకు తీసుకువచ్చానని చెప్పింది. బుధవారం కులదీప్ శర్మతో కలిసి కృష్ణానగర్‌లోని ఒక ఫ్లాట్‌లో ఉన్నారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి భార్య, పిల్లలు, గుర్తు తెలియని మహిళ కనిపించలేదు. దాంతో అతడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబీఆర్ ఫుట్‌పాత్‌లపై చెత్త కుప్పలు



కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్త కుప్పలు

బంజారాహిల్స్: సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించే బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు-జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు రోడ్డుతో పాటు సమీక్షలు నిర్వహించే బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12 కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్డులో చెత్తాచెదారం, వ్యర్థాల తొలగింపును జీహెచ్‌ఎంసీ మెక్లిన్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించింది. అయితే ఈ సంస్థకు చెందిన పారిశుధ్య కార్మికులు, ఎస్‌ఎఫ్‌ఏలు, సూపర్‌వైజర్లు ఈ రోడ్లతో పాటు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌లపై చెత్తా చెదారం తొలగించడంలోనూ, సేకరించిన వ్యర్థాల నల్ల బ్యాగ్‌లను నిత్యం తరలించడంలోనూ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ, కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్డులో ఎటు చూసినా చెత్త కుప్పలు, వ్యర్థాలతో నిండిన నల్ల బ్యాగ్‌లు, వీధి కుక్కలు చించేసిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు జీహెచ్‌ఎంసీ పనితీరుకు అద్దంపడుతున్నాయి. మెక్లిన్ సంస్థకు సంబంధించిన స్వీపర్లు, ఎస్‌ఎఫ్‌ఏలు, సూపర్‌వైజర్లపై జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీసీకి నియంత్రణ ఎంతవరకు ఉందన్నది ప్రశ్నార్థకంగా మారింది. జూబ్లీహిల్స్ సర్కిల్ ఏఎంఓహెచ్ నామమాత్రపు పనితీరుతో కేబీఆర్ పార్కు చుట్టూ అనారోగ్య వాతావరణం నెలకొంటోంది. ఇక్కడ పారిశుధ్యం పడకేయడంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు, బంధువులు, పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. మెక్లిన్ సంస్థ నిర్వాహకులపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

హక్కుల సాధనకు వడ్డెరలు ఏకం కావాలి



రహమత్‌నగర్: వడ్డెర కులస్తులు తమ హక్కుల కోసం ఏకం కావాలని సంఘం రాష్ట్ర నాయకుడు, కార్పొరేటర్ వెల్దండి వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం వడ్డెర ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా వడ్డెర కులస్తుల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. వడ్డెరుల్లో చైతన్యం కల్పించేందుకు డివిజన్ల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 12న ఎస్పీఆర్‌హిల్స్‌లోని వడ్డె ఓబన్న విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. సంఘం నాయకులు వేముల యాదయ్య, నరసింహ, శేఖర్, నాగేష్, శ్రీను, స్వామి, అనిల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వాట్సాప్ చాట్‌తో యువతికి బురిడీ

వెంగళరావునగర్: ఫేక్ మెసేజ్‌తో యువతి నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వి.మహేశ్వరి అనే మహిళ స్థానిక లక్ష్మీనరసింహానగర్‌లో నివాసం ఉంటుంది. జూన్ 16న ఆమె వదిన పద్మిని పేరుతో మహేశ్వరికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తనకు అత్యవసరంగా నగదు కావాలని, రూ.45 వేలు పంపాలని కోరింది. తన యూపీఐ పనిచేయడం లేదని, నీలు కుమారి పేరుతో ఉన్న మరో నంబర్ తెలియజేసింది. దాంతో మహేశ్వరి ఆమెకు రూ.45 వేలు పంపింది. వెంటనే రూ.25 వేలు పంపాలని మరో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. రూ.2 వేలు మాత్రమే ఉండటంతో వాటిని కూడా పంపింది. కొంత సమయం తర్వాత పద్మిని నుంచి ఫోన్ వచ్చింది. తన ఫోన్ హ్యాక్ అయ్యిందని, ఎవరైనా డబ్బులు అడిగితే పంపవద్దని ఆమెకు చెప్పింది. దాంతో తాను మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్ • శుక్రవారం, 10 • అక్టోబర్ • 2025


అప్పులేకుండా తన కాళ్ల మీద తాను నిలబడడం అంటే ఆర్థికంగా స్థిరపడినట్టే అనేవారు పెద్దలు. కానీ చెప్పుల్లేకుండా తన కాళ్లపై తాను నడవడం అంటే ఆరోగ్యం లభించినట్లే అంటున్నారు నేటి వైద్య నిపుణులు. ప్రస్తుతం గ్రౌండింగ్/ఎర్తింగ్ పేర్లతో మెట్రో నగరాల్లో పాదరక్ష రహిత నడక ఆరోగ్య సాధనంగా మారింది. దీనివల్ల ఆరోగ్యపరమైన లాభాలున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే జాగ్రత్తలు మాత్రం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఇప్పటికే వెల్‌నెస్ చికిత్సా కేంద్రాల్లో ఆదరణ పొందుతున్న ఈ బేర్‌ఫుట్ వాక్‌పై నగరవాసుల్లో క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. ఆరోగ్య రక్షణపై పెరుగుతున్న అవగాహనే దీనికి కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



ఫుట్ వేర్‌కి బై..
ఫిట్ వాక్‌కి సై..

బేర్ ఫుట్ వాక్‌పై నగరవాసుల్లో పెరిగిన ఆసక్తి

- ఆరోగ్యవరమైన లాభాలున్నాయంటున్న అధ్యయనాలు
- వెల్‌నెస్ చికిత్సా కేంద్రాల్లో ఆదరణ
- గ్రౌండింగ్/ఎర్తింగ్ వంటి పేర్లతో నడక
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్య నిపుణులు



కాలికి చెప్పుల్లేకుండా మైళ్ల దూరం నడిచేవాళ్లం అంటూ మొన్నటి తరం గొప్పగా చెప్పుకోవడం విన్నాం. అప్పట్లో చెప్పులూ లేవు.. ప్రయాణించడానికి సరైన రవాణ సౌకర్యాలూ లేవు.. కాబట్టి వారి ఆరోగ్యానికి అవన్నీ దోహదం చేశాయని చెప్పొచ్చు. ఎటువంటి పాదరక్షలూ లేకుండా నడిచినప్పుడు కాళ్లకి మరింతగా స్టిమ్యులేషన్ జరుగుతుందని వైద్యులు అంటున్నారు.

ప్రయోజనాలివే..



పాదాలకు చెప్పులు లేకుండా నడవడం వల్ల శరీరానికి, కాళ్లకూ మధ్య మెరుగైన సమన్వయం, రక్త ప్రసరణ వంటి ప్రయోజనాలు లభిస్తాయి. పాదరక్షలు లేకుండా నడవడం స్వేచ్ఛగా, కొంత సంతృప్తిగా కూడా అనిపిస్తుంది. ఇది బాల్యపు జ్ఞాపకాలను తిరిగి తీసుకువస్తుంది. ఈ నడక వల్ల నేలతో మరింత సమన్వయం ఏర్పడుతుంది. ఇది ప్రొప్రియోసెప్షన్ (శరీర కదలికల–అవగాహన)ను మెరుగుపరుస్తుంది. శరీరం కదలిక స్థానాన్ని గ్రహించే సామర్థ్యాన్ని పెంచి పాదాలపై పట్టు జారి పోకుండా ఉండటానికి సహాయపడుతుంది. మెరుగైన ప్రొప్రియోసెప్షన్‌తో మెరుగైన భంగిమ వస్తుంది. కొంతకాలం పాటు చెప్పులు లేకుండా నడవడం వల్ల వెన్నెముక, కీళ్లు బలోపేతమై మరింత స్థిరత్వంతో తక్కువ వంగి నడవడానికి కూడా సహాయపడుతుంది. పాదాలకు అసంఖ్యాక నరాలు, రక్త నాళాలు ఉంటాయి. చెప్పులు లేకుండా నడవడం వాటిని చురుకుగా మారుస్తుంది. రక్త ప్రసరణ పెంచుతుంది. ప్రసరణ సమస్యలు ఉన్నవారికి, చల్లని పాదాలకు లేదా రోజంతా కూర్చొని గడిపే వారికి ఇది చాలా మేలుచేస్తుంది. అంతేకాదు ఇది నాడీ వ్యవస్థను కూడా మేల్కొలుపుతుంది. భూ ఉపరితలంతో ప్రత్యక్ష సంబంధం ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడానికి, వాపును తగ్గించడానికి సహాయపడుతుంది. పాదాలు నేలను నేరుగా తాకినప్పుడు చర్మంలో సంభవించే మార్పుల కారణంగా మెదడు చురుకుగా మారుతుందని స్పర్శా జ్ఞానం అత్యుత్తమం అవుతుందని, సెన్సరీ స్టిమ్యులేషన్, మోటార్ స్కిల్స్.. బాడీ బ్యాలెన్సింగ్ నైపుణ్యం వంటివి పెరుగుతాయని చెబుతున్నారు. షూస్, సాక్స్‌లలో చేరుకునే బాక్టీరియా, ఫంగస్ నుంచి తప్పించుకోవచ్చు.



అందరికీ కాదు.. అన్నిచోట్లా కాదు..

చెప్పులు లేకుండా నడవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎక్కడ? దేనిపై అడుగు పెడుతున్నారు? పాదాలు ఏ స్థితిలో ఉన్నాయి అనే దానిపై ఆధారపడి ఉంటుంది. చదునైన పాదాలు, ప్లాంటార్ ఫాసిటిస్ లేదా పాదాల నొప్పి ఉన్నవారు దీన్ని ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఫ్లాట్ ఆర్చ్‌లు, ప్లాంటార్ ఫాసిటిస్, లేదా దీర్ఘకాలిక నొప్పి వంటి కొన్ని ప్రత్యేక తరహా పాదాలు ఉంటే చెప్పులు లేకుండా నడవడం మరింత దిగజార్చుతుంది.

- పాదరక్షలను వదిలే ముందు, పాడియాట్రిస్ట్ లేదా ఫిజియోథెరపిస్ట్‌ను ముందస్తుగా సంప్రదించడం అవసరం
- ఇది అందరికీ లేదా ప్రతి వాతావరణానికి తగినది కాదు. పట్టణ ప్రాంతాలు, విపరీతమైన ఉష్ణోగ్రతలు వంటి కొన్ని పరిస్థితులు ప్రమాదాన్ని కలిగిస్తాయి.
- గడ్డి, ఇసుక లేదా నేల వంటి సహజ ఉపరితలాలపై సహజమైన ప్రకృతిలో మాత్రమే పాదరక్ష రహితంగా నడవవచ్చు. పరిశుభ్రమైన పరిసరాలు కూడా తప్పనిసరి.
- వృద్ధులకు లేదా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఇది సరైన ఎంపిక కాదు. ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తెస్తుంది.
- పట్టణ ప్రాంతాల్లోని కఠిన ఉపరితలాలు, తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొన్ని ఆరోగ్య పరిస్థితులు చెప్పులు లేకుండా నడవడాన్ని ప్రమాదకరంగా మారుస్తాయి.
- బేర్ ఫుట్ వాక్ పూర్తయ్యాక వైద్యులు సూచించిన యాంటిబయాటిక్ సోప్స్ లేదా లోషన్స్ ఉపయోగించి పాదాలను శుభ్రపరుచుకోవడం మంచిది.
- పచ్చని గడ్డి మీద, పరిశుభ్రంగా ఉండే కార్పెట్స్ మీద నడవవచ్చు. సముద్రపు ఇసుక మీద నడక కూడా మంచిదే.





ఆరోగ్యకరం..

తగిన జాగ్రత్తలు తీసుకుని బేర్‌ఫుట్ వాక్ చేయడం ఆరోగ్యానికి మంచిదే. ముఖ్యంగా దీనివల్ల ఫుట్ పొజిషన్ (అడుగు పడే స్థితి) మీద నియంత్రణ వస్తుంది. నడకలో బ్యాలెన్స్ పెరగడానికి, నొప్పి నివారణ వేగంగా జరగడానికి ఉపయోగపడుతుంది. పిరుదులు, కీళ్లు, కోర్ మజిల్స్ మధ్య సమన్వయం మెరుగుపడుతుంది. సరిగా నప్పని పాదరక్షలు ధరించడం వల్ల వచ్చే ఇబ్బందులకు చెక్ పడుతుంది. లోయర్ బ్యాక్ ప్రాంతపు కండరాలను శక్తివంతం చేస్తుంది.

- డా.కల్పన, ఫ్యామిలీ ఫిజీషియన్



హైదరాబాద్ కేరాఫ్ వర్క్‌స్పేస్

- నగర వేదికగా ఏఎఫ్‌సీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- ఐఐఐడీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రారంభం
- దేశంలోని ఆఫీస్ మార్కెట్‌లో 12 శాతం వాటా



సాక్షి, సిటీబ్యూరో: వర్క్‌స్పేస్, ఆఫీస్ స్పేస్ రంగాల్లో హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రధాన వేదికగా మారిందని, ఈ నేపథ్యంలో వ్యాపారులు, డిజైనర్లు, ఆర్కిటెక్ట్‌లు మాడ్యులర్ – ఎర్గోనామిక్ ఆఫీస్ సొల్యూషన్స్‌కు ఆదరణ పెరిగిందని ఏఎఫ్‌సీ ఫర్నిచర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు మానోజ్ తోమర్ తెలిపారు. గ్లోబల్ వర్క్ స్పేస్ అవసరాలకు అనువైన ఆధునిక ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నగరంలోని బంజారాహిల్స్ వేదికగా ఐఐఐడీ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, 2025 మొదటి త్రైమాసికంలో లీజింగ్ కార్యకలాపాలు 111 శాతం పెరిగాయని మానోజ్ తోమర్ అన్నారు. ప్రస్తుతం నగరంలోని ఆఫీస్ స్టాక్ 123 మిలియన్ చదరపు అడుగులు దాటింది. ఇది భారతదేశం మొత్తం ఆఫీస్ మార్కెట్‌లో 12 శాతం వాటా కలిగి ఉందన్నారు. ఈ వృద్ధికి ఐటీ, బీఎఫ్ఎస్ఐ, ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ రంగాలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీ వేదికగా కార్పొరేట్ సంస్థలు, ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు పూర్తి శ్రేణి మాడ్యులర్ ఫర్నిచర్, ప్రయోగశాలల్లో పరీక్షించిన ఎర్గోనామిక్ కుర్చీలు, వినూత్న వర్క్‌స్పేస్ సొల్యూషన్‌లను రియల్ టైమ్ సెటప్‌లలో ప్రత్యక్షంగా అనుభవించేలా రూపొందించబడిందన్నారు.

నగరంలో లైవ్ కిచెన్..

- ఆకట్టుకుంటున్న హయత్, గచ్చిబౌలిలో లైవ్ 4–నోట్
- నార్త్ ఇండియన్, ఓరియంటల్, యూరోపియన్ తెలుగు రుచులు
- ప్రత్యేక అనుభవాన్ని అందించేలా ఏర్పాటు



రాయదుర్గం: నగర వాసులకు నాలుగు రకాల ప్రత్యేక వంటకాలను రుచి చూసే అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని '4–నోట్' రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఇది లైవ్ కిచెన్స్ థియేటర్‌గా రూపొందించిన సరికొత్త రెస్టారెంట్. అతిథులు రెస్టారెంట్ లోపల లేదా బయట కూర్చొని ప్రతి షో కిచెన్ నుంచి వంటకాలను ఆర్డర్ చేసుకొని, వైవిధ్య భరిత రుచుల అనుభవాన్ని పొందే సౌకర్యాన్ని ఈ రెస్టారెంట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ 4–నోట్‌లో ఒకే స్థలంలో నాలుగు ప్రత్యేక కిచెన్స్‌కు అతిథ్యమిచ్చేలా రూపొందించారు. ముఖ్యంగా నార్త్ ఇండియన్, ఓరియంటల్, తెలుగు రుచులు, యూరోపియన్ వంటకాలను, అతిథులు లైవ్ కిచెన్ ప్రదర్శనలను ఆస్వాదించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి వంటకం వారి ముందు తయారయ్యేలా ఏర్పాట్లు చేశారు. దీనివల్ల ఆహార ప్రియులు ఉత్సాహంగా, ఆనందంగా, ఓ అద్భుతమైన థియేటర్ అనుభవంగా మారనుంది. ఈ కార్యక్రమంలో హయత్ హైదరాబాద్ మేనేజర్ క్రిసెల్లె ఫెర్నాండేజ్, ఎగ్జిక్యూటివ్ చెఫ్ అలోక్, అసోసియేట్స్ డైరెక్టర్ మిచెల్ ఎవాన్స్, డైరెక్టర్ ఆఫ్ సేల్స్ శ్రావణ్‌బతినా పాల్గొన్నారు.

మరచిపోలేని అనుభవం కోసం..

4–నోట్ కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు. ఇది లైవ్ కిచెన్. క్యూరేటెడ్ ఫుడ్‌తో ఆత్మీయ అనుభూతి కలిగిస్తుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 4–నోట్ తన ప్రత్యేకతను చాటుకోనుంది. ప్రపంచ స్థాయి, హైదరాబాద్ అతిథులను అలరించేలా, మెప్పించేలా వైవిధ్యమైన రుచులను ఈ లైవ్ కిచెన్ థియేటర్ అందిస్తుంది.

- పియుష్‌శర్మ, హయత్ హైదరాబాద్ ఫుడ్ అండ్ బివరేజ్ డైరెక్టర్



బాలల సాంస్కృతికోత్సవం

కథలు, కవితలు ఆహ్వానిస్తున్న సారస్వత పరిషత్



సుల్తాన్‌బజార్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్ బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం తెలిపారు. నవంబర్ 23న హైదరాబాద్‌లో దీనిని నిర్వహిస్తున్నట్లు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుతాలు సృష్టించి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలు పంచుకొని, తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారన్నారు. ఈ ఉత్సవాల్లో వివిధ అంశాలపై పోటీలు జరుగుతాయని, రెండు రకాలుగా విద్యార్థులు తమ ప్రాంతాల నుంచే రాసి పోటీకి పంపవచ్చన్నారు. రెండు పేజీలకు మించకుండా కథ, 20 పంక్తులకు మించకుండా వచన కవిత, ఐదు పద్యాలకు మించకుండా పద్య కవిత పోటీకి రచనలు, చిత్రలేఖనం పోటీకి తమకు ఇష్టమైన చిత్రాలు గీసీ ఈ నెల 31లోగా సారస్వత్ పరిషత్ కార్యాలయానికి పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్.96037 27234 వాట్సాప్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


డెలివరీ వద్దు..

గర్భిణులను వేధిస్తున్న డిప్రెషన్ సమస్య

- 50 నుంచి 60 శాతం మందిలో విటమిన్–డి లోపం
- సామాజిక మాధ్యమాల వీడియోల ప్రభావం
- లైఫ్ స్టైయిల్, ఆహారపు అవాట్లు మార్చుకోవాలంటున్న నిపుణులు

మహానగరంలో సగటు గర్భిణి డిప్రెషన్‌కు గురవుతోంది. గర్భం దాల్చిన విషయం తెలిసిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకూ యాంగ్జైటీకి గురవుతున్నారని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ప్రసవ సమయంలో 15 నుంచి 20 శాతం మంది గర్భిణులు, ప్రసవానంతరం 25 శాతం మంది ఈ రకమైన డిప్రెషన్‌కు గురవుతున్నారని యూకే మెడికల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రసవానంతర మానసిక ఆరోగ్య సమస్యలపై చేపట్టిన సర్వే నివేదిక స్పష్టం చేస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో



ప్రసవానంతరం మూడు నెలల పాటు నెగిటివ్ థాట్స్ వేధిస్తున్నాయట. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ లింగ వివక్ష కనిపిస్తోందని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో మాతృ మరణాల సంఖ్య 50 శాతానికి పైగా తగ్గినప్పటికీ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ప్రధానంగా పేదరికం, ఆర్థిక అసమానతలు, గృహ హింస, సూటిపోటి మాటలు, కుటుంబ సభ్యుల మద్దతు లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.



సామాజిక మాధ్యమాలే కారణం..

నగర జీవితంలో ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, దంపతులిద్దరూ ఉద్యోగాలు చేయడం సర్వసాధారణం. గర్భిణిగా ఉన్నప్పుడు విధి నిర్వహణలో ఒత్తిడి, ఇంట్లో ఒంటరి తనం వేధిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో ఎక్కువ సలహాలు, సూచనలతోనూ గర్భిణులు ఇబ్బందిపడుతున్నారట. పట్టణ జీవితంలో సోషల్ మీడియాకు ఆకర్షితులవుతున్నారు. ప్రతి చిన్న విషయాన్నీ అంతర్జాలంలో చూసి ఆందోళనకు గురవుతున్నారు. కొంత మంది గర్భిణుల్లో నాకు అన్నీ తెలుసు అనే ధోరణి కనిపిస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు.

లైఫ్ స్టైల్ ప్రభావం..

సుమారు 60 శాతం మంది గర్భిణులు సూర్యుడిని చూడటంలేదట. ఫలితంగా విటమిన్–డి లోపం కనిపిస్తోంది. కుటుంబం, ఉద్యోగాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆహారపు అలవాట్లు, లైఫ్ స్టైయిల్‌లో మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

మెడిటేషన్ మస్ట్..



గర్భిణుల్లో వ్యాయామం, డెలివరీ కాన్సెప్ట్ తీసుకురావాలి. ఇంట్లో రోజువారీ పనులు చేసుకుంటూనే.. మెడిటేషన్‌కు సమయం కేటాయించాలి. రెండు నుంచి మూడు శాతం మందికి మాత్రమే బెడ్ రెస్ట్ అవసరం ఉంటుంది. మిగతావారు పనులు చేసుకోవచ్చు. ఈ మధ్య కాలంలో గర్భిణిగా గుర్తించిన తొలి రోజుల నుంచి యాంగ్జైటీ మొదలై చివరి వరకు కొనసాగుతోంది. సోషల్ మీడియాకు ప్రభావితం కావొద్దు. పోస్ట్ డెలివరీలో హార్మోన్ ఛేంజెస్ ఉంటాయి. తగినంత రెస్ట్ అవసరం. క్యాల్షియం డెఫిషియన్సీ, రోగ నిరోధక శక్తి సమస్యలు వేధిస్తున్నాయి. రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య కనీసం అర గంట ఎండలో ఉంటే డి–విటమిన్ లోపాన్ని అధిగమించొచ్చు.

- డాక్టర్ పి.శృతిరెడ్డి, గైనకాలజిస్టు, ల్యాప్రోస్కోపిక్ సర్జన్

క్లుప్తంగా...

'ఓరుగల్లు నుండి బస్తర్ వరకు'..

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్ సింగ్



'ఓరుగల్లు నుండి బస్తర్ వరకు'.. అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమణ్ సింగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని కాకతీయ రాజధాని ఓరుగల్లు (వరంగల్) మొదలు.. మధ్య భారతంలోని బస్తర్ వరకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను ఆధారాలతో సహా రచించిన 'ఓరుగల్లు నుండి బస్తర్ వరకు'.. అనే పుస్తకాన్ని ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ రమణ్ సింగ్ ఆవిష్కరించారు. తెలంగాణకు చెందిన చరిత్రకారులు అరవింద్ ఆర్య, కట్టా శ్రీనివాస్ రచించిన ఈ పుస్తకాన్ని గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్పూర్ రాజమహల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బస్తర్ రాజ కుటుంబానికి చెందిన కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయ, రాజమాత ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య ఉన్న ప్రాచీన సంబంధాలను నూతన దృక్కోణంలో ప్రతిపాదించిన విలువైన చారిత్రక గ్రంథమని స్పష్టం చేశారు.

రైల్వే కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ).. 2025–26 సంవత్సరానికి సబ్‌– కమిటీలను ఏర్పాటు చేసింది. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ రైల్వే సబ్‌-కమిటీ కన్వీనర్‌గా నియమితు లయ్యారు. ఈ మేరకు గురువారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ బులెటిన్ విడుదల చేశారు. రైల్వే సబ్‌-కమిటీ భార తీయ రైల్వేల్లో.. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ల (ఏటీవీఎం) పనితీరు, పెన్షన్ చెల్లింపుల విధానం, దీమాపూర్‌-కోహిమా కొత్త లైన్ ప్రాజెక్టు నిర్మాణం, సరుకు రవాణా చార్జీల ద్వారా వాటిల్లిన నష్టం వంటి అంశాలపై కాగ్ నివేదికలను పరిశీలిస్తుంది. డాక్టర్ లక్ష్మణ్ సివిల్‌- ఐఐ సబ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు.

ఉన్నత విద్యలోనూ ఏఐ

అనుమతిస్తున్న 60% విద్యాసంస్థలు

- బోధనాంశాల అభివృద్ధికి వినియోగం
- ఈవై-పార్థనాన్-ఫిక్కీ నివేదికలో వెల్లడి



సాక్షి, స్పెషల్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) తాజాగా విద్యార్థుల చదువుల్లోనూ భాగమైంది. దేశంలోని 60 శాతంపైగా ఉన్నత విద్యాసంస్థలు ఏఐ సాధనాలను ఉపయోగించడానికి విద్యార్థులకు అనుమతిస్తున్నట్లు ఈవై-పార్థనాన్-ఫిక్కీ తాజా నివేదిక వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం లెర్నింగ్ మెటీరియల్స్‌ను (బోధనాంశాలు) అభివృద్ధి చేయడానికి జనరేటివ్ ఏఐని ఇప్పటికే 53 శాతం విద్యాసంస్థలు ఉపయోగించడం ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా 30 ఉన్నత విద్యాసంస్థలపై చేపట్టిన సర్వే ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. ఇందులో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు బోధన, పరిపాలనలో ఏఐను ఎలా స్వీకరిస్తున్నాయో వివరించింది. 40 శాతం ఉన్నత విద్యాసంస్థలు ఏఐ-ఆధారిత ట్యూటరింగ్ సిస్టమ్స్, చాట్‌బాట్స్‌ను ఉపయోగిస్తుండగా 39 శాతం సంస్థలు అడాప్టివ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను వినియోగిస్తున్నాయి. అలాగే 38 శాతం కాలేజీలు ఆటోమేటెడ్ గ్రేడింగ్ కోసం ఏఐని ఉపయోగిస్తున్నాయని అధ్యయనం తెలిపింది. అయితే ప్రభుత్వాల విధివిధానాల మార్గనిర్దేశంలో ఏఐ వినియోగం జరగాలని నివేదిక సూచించింది.

అన్ని విభాగాలలో ఏఐ..

ఉన్నత విద్యారంగంలోని అన్ని రకాల కోర్సుల్లో ఏఐ అక్షరాస్యతను పెంపొందించాలని నివేదిక ప్రతిపాదించింది. విద్యార్థులంతా ఏఐ భావనలు, నీతి, అప్లికేషన్స్‌పై ప్రాథమిక అవగాహనను అలవర్చుకోవాలని సూచించింది. ఇందులో డిజిటల్ నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన, డేటా వినియోగం తదితర అంశాలపై నైతిక అవగాహన కల్పించాలని నివేదిక వివరించింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) ప్రోగ్రామ్స్‌లో మెషీన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, రోబోటిక్స్ వంటి అధునాతన కంటెంట్‌ను ప్రధాన పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టడం ముఖ్యమని నివేదిక అభిప్రాయపడింది. భారతీయ గ్రాడ్యుయేట్లను కేవలం ఏఐ వినియోగదారులుగానే కాకుండా ఏఐ సృష్టికర్తలు, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది.

శిక్షణ, మౌలిక వసతులకు..

విద్యార్థుల్లో ఏఐపట్ల ఉత్సాహం అధికంగా ఉన్నప్పటికీ ఏఐ బోధకులు ఆ స్థాయిలో లేకపోవడం సవాల్‌గా మారిందని నివేదిక పేర్కొంది. అధ్యాపకులను సన్నద్ధం చేయడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం తక్షణ అవసరాలని పేర్కొంది. ఏఐ స్వీకరణను సమర్థంగా తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి విద్యాసంస్థలు అధ్యాపకులకు శిక్షణ, మౌలికవసతుల మెరుగుదల కోసం పెట్టుబడి పెట్టాలని సిఫార్సు చేసింది. ఈ అంశాలు కార్యరూపం దాలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత విజ్ఞానం, ఆవిష్కరణల్లో భారత్ ముందంజలో ఉంటుందని నివేదిక వివరించింది. ఉన్నత విద్యాసంస్థలు ఏఐ-ఆధారిత కార్యకలాపాల వైపు ముందుకు సాగుతున్నప్పటికీ ఆవిష్కరణలు, సమగ్రత మధ్య సమతూకం పాటించడం సవాలేనని అధ్యయన నివేదిక అభిప్రాయపడింది.

దేశానికి రోల్‌మోడల్‌గా రాష్ట్ర రహదారులు

- హ్యామ్ విధానంలో తెలంగాణ రోడ్లకు మహర్దశ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి



సచివాలయంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రహదారులను దేశానికి రోల్‌మోడల్‌గా మారుస్తామని, అన్ని నియోజక వర్గాలకు రహదారుల అభివృద్ధిలో ప్రాతినిధ్యం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హ్యామ్ విధానంలో ఆర్‌అండ్‌బీ చేపట్టబోయే రహదారులపై గురువారం సచివా లయంలో భట్టి విక్రమార్క సమక్షంలో మంత్రి కోమటిరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. హ్యామ్ విధానంలో వచ్చే మూడేళ్లలో ఆర్‌అండ్‌బీ రోడ్లను అద్దంలా మారుస్తామన్నారు. ప్రధానంగా యాక్సిడెంట్స్ ఫ్రీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించామని చెప్పారు. దశల వారీగా హ్యామ్ రోడ్లు నిర్మిస్తామన్నారు. మొదటి దశలో 5,587 కిలో మీటర్లను రూ. 10,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసలు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి 4 వరుసల రోడ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తుందని చెప్పారు. మొదటి ఫేజ్‌కు ఒకటి, రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నట్లు మంత్రి వెల్లడించారు. వరద నష్టాలకు సంబంధించిన నివేదికను ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల రాజధానిగా హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి వల్లే పెట్టుబడులు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ నగరం రాజధానిగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు అన్నారు. జీసీసీలతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో త్వరలో బెంగళూరును అధిగమించి మొదటి స్థానంలోకి రావాలని అయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన రెండు రోజుల సదస్సును ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ రాజధానిగా మారడం వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. పదేళ్లలో అన్ని రంగాల్లో హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లనే ఇది సాధ్యమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తుల ఆధారంగా కాకుండా శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలను, చట్టాలను, సంస్కరణలను తీసుకురావడం వలన తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో ఉన్న అపార అవకాశాలను ఉపయోగించుకొని మరిన్ని పెట్టుబడులు వచ్చేలా చార్టెడ్ అకౌంటెంట్‌లు కృషి చేయాలి. దేశంలో డిజిటల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌కు సంబంధించిన రంగంలో చార్టెడ్ అకౌంటెంట్లు కీలకంగా మారారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలని కోరుకుంటాం'అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

సీఐడీ ఎస్పీలుగా సంగ్రామ్‌సింగ్, షేక్ సలీమా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అదనపు డీజీగా ఉన్న 2017 బ్యాచ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేశారు. అలాగే వరంగల్ కమిషనరేట్‌లో సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న షేక్ సలీమాను సీఐడీ ఎస్పీగా బదిలీ చేయడంతోపాటు మహిళా భద్రతా విభాగానికి అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బియ్యం నిల్వలకు చోటేదీ?

- రాష్ట్రంలోని గోదాముల్లో 66.65 ఎల్‌ఎంటీ నిల్వ సామర్థ్యం
- ప్రస్తుతం 6 ఎల్‌ఎంటీకి మాత్రమే ఖాళీ
- మిల్లుల నుంచి రావాల్సిన 20 ఎల్‌ఎంటీ సీఎంఆర్ నిల్వలకు కనిపించని చోటు
- ఎఫ్‌సీఐ గోదాముల్లోని 21 ఎల్‌ఎంటీ బియ్యాన్ని ఖాళీ చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గోదాముల కొరత తీవ్రమవుతోంది. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి ఏయేటికాయేడు పెరుగుతూ, దేశానికి అత్యధిక మొత్తంలో బియ్యం అందిస్తున్న తెలంగాణలో వాటిని నిల్వ చేసేందుకు సరిపడా గోదాములు లేకుండా పోయాయి. బియ్యంతోపాటు ఇతర ఆహార ధాన్యాలు, కేంద్రం నుంచి వచ్చే ఎరువుల నిల్వలకు కూడా గోదాములు లేని పరిస్థితి. కొత్తగా గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం కొన్నేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు నత్తనడకన సాగుతున్నాయి. వానాకాలం ధాన్యం, ఇతర పంటలు మార్కెట్‌లోకి వస్తే వాటి నిల్వ కోసం తిప్పలే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గోదాముల్లో ఉన్న నిల్వలను ఖాళీ చేయించేందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ఆహార శాఖకు లేఖ రాశారు. ప్రత్యేక రైల్వే ర్యాక్స్ ఏర్పాటు చేసి గోదాముల్లో నిల్వ ఉన్న ఎఫ్‌సీఐ బియ్యాన్ని అవసరమైన రాష్ట్రాలకు పంపించాలని కోరారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర చెప్పినప్పటికీ, కేంద్రం నుంచి ఇంకా రైల్వే ర్యాకులు రాలేదు.

ఎక్కడ నిల్వ చేయాలి?

రాష్ట్రంలోని అన్ని గోదాముల సామర్థ్యం కలిపి 66.65 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్‌ఎంటీ). వీటిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థవి, అద్దెకు తీసుకున్నవి కలిపి మొత్తం సామర్థ్యం 29.50 ఎల్‌ఎంటీలు. ఎఫ్‌సీఐ అధీనంలో 22.61 ఎల్‌ఎంటీల నిల్వ సామర్థ్యం గల గోదాములు ఉండగా, వాటిలో 21.72 ఎల్‌ఎంటీ మేర బియ్యం ఉన్నాయి. రాష్ట్ర గిడ్డంగుల్లో రేషన్ దుకాణాలకు సరఫరా చేసే సన్న బియ్యం ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ పర్యవేక్షణలో ఉన్న వాటిలో కూడా ఖాళీ లేదు. ప్రస్తుతం 6 ఎల్‌ఎంటీలు మాత్రమే ఖాళీగా ఉంది. ప్రైవేటు వ్యాపారులకు మరో 5 లక్షల టన్నుల ఎరువుల నిల్వకు గోదాములు కావాలి. ఈ నేపథ్యంలో కొత్తగా మార్కెట్లకు వచ్చే ధాన్యం, దాన్ని మరపట్టిస్తే వచ్చే బియ్యం, మొక్కజొన్నలు, శనగలు, వేరుశనగలు ఎక్కడ నిల్వ చేయాలనేది సమస్యగా మారింది.



80 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ లక్ష్యం

రాష్ట్రంలో వరికోతలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రారంభం కాగా, వచ్చే వారానికల్లా మరిన్ని జిల్లాల్లో మొదలుకానున్నాయి. ఈసారి రాష్ట్రంలో 68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 148.30 ఎల్‌ఎంటీల ధాన్యం దిగుబడి అవుతుందని, అందులో 80 ఎల్‌ఎంటీ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి నేరుగా రైస్‌మిల్లులకు పంపించి, మరాడించిన బియ్యం (సీఎంఆర్)ను ఎఫ్‌సీఐతోపాటు సీడబ్ల్యూసీ, ఇతర గోడౌన్‌లకు పంపిస్తారు. 80 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని సీఎంఆర్‌గా మిల్లింగ్ చేస్తే 54 ఎల్‌ఎంటీ బియ్యం వస్తుంది. ప్రస్తుతం రైస్ మిల్లుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసే ప్రక్రియ సాగుతోంది. తద్వారా 20 ఎల్‌ఎంటీల బియ్యం రానున్నాయి. వీటిని నిల్వ చేసేందుకు గోదాములు అవసరం. కాగా ప్రస్తుతం ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఉన్న 21 ఎల్‌ఎంటీల బియ్యం నిల్వలను ఖాళీ చేస్తే తప్ప మిల్లుల నుంచి వచ్చే బియ్యాన్ని నిల్వ చేసే అవకాశం ఉండదు.

నగర వార్తలు

ఓపెన్ వర్సిటీలో నేడు ప్లేస్‌మెంట్ డ్రైవ్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో స్టైపండ్ బేస్డ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రాంలో చేరిన విద్యార్థుల కోసం ఈ-ప్లేస్‌మెంట్ డ్రైవ్ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ– ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ డ్రైవ్‌లో 8 ప్రముఖ రిటైల్ సంస్థలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఉదయం 10 గంటలు నుంచి సీఎస్‌టీడీ భవనంలో ప్రారంభమవుతుందని తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి

నల్లకుంట: ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ వంతు చేయూతనందించేందుకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పి.రామకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ఉచిత వసతి కల్పిస్తునున్నట్టు చెప్పారు. గురువారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో ట్రస్టీ సభ్యులతోపాటు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఈ నెల 12వ తేదీన నల్లకుంట శంకరమఠం మార్కెట్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 95504 72190 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిమ్స్‌లో విజిలెన్స్ వీక్



లక్డీకాపుల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా నిమ్స్ ఆవరణలో వాక్‌థాన్, స్వచ్ఛ భారత్, మొక్కల నాటడం, మహిళా సాధికారత, రక్తదాన శిబిరం వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్(విజిలెన్స్) యు.వి.రజనీకాంత రావు, ఏజీఎం మనీష్ కుమార్, చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీదేవి డిప్యూటీ రీజినల్ హెడ్‌లు టి.వి.బాలకృష్ణ, ఐ.చంద్రశేఖర్, నిమ్స్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ టి.కె.కిరణ్ కుమార్, నిమ్స్ నెఫ్రాలజీ విభాగం డా.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

కంటోన్మెంట్ సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశాలు



కంటోన్మెంట్: కంటోన్మెంట్ అధికారులు, సిబ్బంది ప్రజలు, ప్రజాప్రతినిధులతో బాధ్యాతాయుతంగా, మర్యాదతో ప్రవర్తించాలని డిఫెన్స్ ఎస్టేట్స్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్(డీజీడీఈ) శోభాగుప్తా బుధవారం ప్రత్యేక లేఖ రాశారు. ఈ నెల ఒకటవ తేదీన డీజీడీఈగా బాధ్యతలు చేపట్టిన ఆమె వారం రోజుల్లోనే సిబ్బందికి ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం డిఫెన్స్ ఎస్టేట్స్ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. కంటోన్మెంట్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలిపై తమకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటీవల కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కంటోన్మెంట్ సిబ్బంది వ్యవహారశైలిని నిరసిస్తూ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా రక్షణ శాఖ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

ఇంతకీ ఆ లేఖలో ఏముందంటే..?

కంటోన్మెంట్‌ల అధికారుల ప్రవర్తనపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద సంఖ్యలో డీజీ కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్‌లు బాధ్యతాయుతంగా వ్యహరించాలంటూ సూచనలు రావడం గమనార్హం.

ఈ అవార్డు ఉద్యోగులకు అంకితం..

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ శాఖను సమాచార హక్కు చట్టం 2025 బెస్ట్ పర్ఫార్మెన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్ అవార్డు వరించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం రవీంద్రభారతిలో గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా కమిషనర్ హరికిరణ్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ శాఖ సమాచార హక్కులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించినందుకు ఈ అవార్డు వచ్చిందని ఆయన తెలిపారు.

ఆశా వర్కర్లపై వేధింపులు అరికట్టాలి

– కలెక్టరేట్ వద్ద ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్స్ ఆన్‌లైన్ పనిలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమపై కొనసాగుతున్న వేధింపులను అరికట్టాలని వారు కోరారు. ఆశా వర్కర్లు చేసిన సర్వే డబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి, యూనియన్ జిల్లా నాయకులు కోమలత, రాధా, జయ వసంత , యాదమ్మ, కవిత, అనిత, సబియా పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితోపాటు డీఎంహెచ్‌ఓ ఉమాగౌరీలకు ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు తదితరులు

గ్రూప్‌-1 నియామకాలు రద్దు చేయాలి : కవిత

పంజగుట్ట: గ్రూప్‌-1 ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ నుంచి నియామకాల వరకు ప్రభుత్వం అన్ని తప్పులే చేసిందని, తాము వాటిని ఎత్తి చూపినా సరిదిద్దుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రూప్ 1 నియామకాలను రద్దు చేసి, తిరిగి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిక్కడపల్లి పిల్లర్ నెంబర్ 121 వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రూప్ పరీక్షల్లో అక్రమాలు, నిరుద్యోగుల సమస్యలపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గ్రూప్ 1పై ఈ నెల 15వ తేదీన డివిజన్ బెంచ్ తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో అప్పటివరకు ప్రతీరోజు జాగృతి ఆధ్వర్యంలో ఒక నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అశోక్, మహేందర్, కూరపాటి శ్రీను, గంగాధర్, ఇస్మాయిల్, ప్రత్యూష, శివారెడ్డి, రవి రాథోడ్, గ్రూప్1 అభ్యర్థులు పాల్గొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో చేసిన తీర్మానాలను ముఖ్యమంత్రి, గవర్నర్‌లకు పంపిస్తామని కవిత పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ వీసీ ఆకస్మిక తనిఖీలు



బాలానగర్: జేఎన్‌టీయూ ఉప కులపతి కిషన్‌కుమార్ రెడ్డి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూడా ఈ తనిఖీలను స్వాగతిస్తున్నారు. బీబీఏ డేటా అనలిటిక్స్, బీబీఏ రెగ్యులర్, ఎంబీఏలో రెండు కోర్సులను మాత్రమే కొనసాగిస్తున్నప్పటికీ మేనేజ్‌మెంట్ కళాశాలలో కేవలం ఇద్దరే అధ్యాపకులు ఉండటం, ఉపాధి అవకాశాలు రాకపోవడం, వసతిగృహాలకు సైతం బాధ్యత తీసుకోవడానికి ఏ ఒక్క లెక్చరర్ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌ని ఇంజనీరింగ్ కళాశాలలో కలిపివేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, వసతిగృహాల కోసం ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఉండదని విద్యార్థులు భావిస్తున్న తరుణంలో వీసీ తనిఖీలు చేయడంతో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో వీసీ కిషన్ కుమార్ రెడ్డి బీబీఏ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు.

ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ కోర్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ-హైదరాబాద్, టాలెంట్ స్ప్రింట్‌ల సంయుక్త భాగస్వామ్యంతో కొత్త సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించినట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో ఈ సర్టిఫికెట్ కోర్సు ఉంటుందన్నారు. ఇది మూడు నెలల అభ్యాస కోర్సు అని పేర్కొన్నారు. జనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో సర్టిఫికెట్ కోర్సు బ్లెండెడ్ ఫార్మాట్‌లో అందించబడుతుందన్నారు.

సేవాభావాన్ని పెంచడానికే సేవా పక్వాడ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మల్లాపూర్: సేవా పక్వాడ కేవలం రాజకీయ వేడుక కాదని, ప్రజల్లో సేవాభావాన్ని పెంచ డమే దాని ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75 పుట్టిన రోజు సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఎమ్మెల్సీ కొమరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లా డుతూ పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యంపై దృష్టి సారించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

గోవధను నిషేధించాలి

వేదిక్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరేందర్ కుమార్ చతుర్వేది



మాట్లాడుతున్న నరేందర్ కుమార్ చతుర్వేది

హిమాయత్ నగర్: గోవధను పూర్తిగా నిషేధించి గోవులను పరిరక్షించాలని వేదిక్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరేందర్ కుమార్ చతుర్వేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గోవుల అక్రమ రవాణాను నిరోధించడంతోపాటు రహదారులపై చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, గోవులను వధించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రశాంత్ దాస్ స్వామీజీతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 'రామ గోశాల'ను స్థాపించాలని సూచించారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు అనుగుణంగా 17 గో పార్లమెంట్ సభ్యుల(గో ఎంపీలు)ను నియమించినట్లు తెలిపారు. మహంత్ శ్రీ యోగిదాస్ జీ హైదరాబాద్, చెంగల సూర్యప్రకాష్ రాజ్ (మల్కాజ్ గిరి), ఎ.లక్ష్మణ్ రెడ్డి (వరంగల్), జ్యోతి వైష్ణవిదేవి(సికింద్రాబాద్)లను గో ఎంపీలుగా నియమించినట్లు పేర్కొన్నారు.

ఆర్వో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల కంట్రోల్ రూమ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 13న విడుదల కానుండగా.. నామినేషన్ల దరఖాస్తులకు 21వ తేదీని గడువుగా నిర్ణయించారు. నామినేషన్ల స్క్రూట్నీ 22న, నామినేషన్ల ఉపసంహరణకు 24 వరకు గడువు విధించారు. నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి. దీనికి సంబంధించి బంజారాహిల్స్‌లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియతో పాటు ఇతరత్రా సందేహాల నివృత్తి కోసం గురువారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎవరైనా సరే కంట్రోల్ రూమ్‌లో సంబంధిత ఇన్‌చార్జి లక్ష్మణ్‌ను 70326 76233 నెంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పూర్తి సమాచారం కోసం ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని వెల్లడించారు.

స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్

హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన

- గత నెల 29 నుంచి ఉన్న ఎన్నికల కోడ్ కూడా ఎత్తివేత... కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటామన్న ఎస్ఈసీ కార్యదర్శి
- జీవో 9పై కాకుండా.. నోటిఫికేషన్‌పై స్టేతో సందిగ్ధంలో ప్రభుత్వం
- పాత రిజర్వేషన్ల ప్రకారంగానూ ఎన్నికలకు వెళ్లలేని పరిస్థితి
- హైకోర్టు తీర్పుపై సుప్రీంకు వెళ్లటంపై నేడు ప్రభుత్వం నిర్ణయం!


ఆదిలాబాద్ జిల్లా ముఖరా(కే) గ్రామంలో కోర్టు తీర్పు వివరాల కోసం వివిధ చానళ్లను ఫోన్లలో చూస్తున్న గ్రామస్తులు

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. గురువారం ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, సాయంత్రానికి హైకోర్టు దానిని నిలిపేయటంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో గత నెల 29 నుంచి అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) కూడా తొలగిపోయింది. హైకోర్టు ఆదేశాలకు లోబడి వ్యవహరిస్తామని ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల పూర్తిపాఠం అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ పేర్కొంది. గతంలో ఎస్ఈసీ జారీచేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా గురువారం మొదటి విడత మండల, జిల్లాపరిషత్ ఎన్నికలకు జిల్లాల్లో ఆయా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్లు జారీచేశారు. గురు, శుక్ర, శనివారాల్లో నామినేషన్లు స్వీకరించాల్సి ఉండగా.. కేసు విచారణ నేపథ్యంలో నామినేషన్ల దాఖలు మందకొడిగా సాగింది. తొలి రోజు మొత్తం 16 జెడ్పీటీసీ, 103 ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు మకరందు తెలియజేశారు. గత నెల 29న జారీచేసిన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్లను తదుపరి నోటిఫికేషన్ వచ్చేవరకు తక్షణం నిలుపుదల చేస్తున్నట్టు ఎస్ఈసీ ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్రంలోని మండల, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఓటర్లకు తెలియజేస్తున్నట్టు పేర్కొంది.

హైకోర్టు ఆదేశాల పూర్తి పాఠం అందాకే...

స్థానిక ఎన్నికల నోటిఫికేషన్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి సంబంధించి హైకోర్టు నుంచి పూర్తి ఆదేశాలతో కూడిన 'సైన్డ్ కాపీ'అందాకే తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించనున్నట్టు తెలుస్తోంది. తీర్పు కాపీలో ఎలాంటి కారణాలు పేర్కొన్నారో పరిశీలించిన తరువాత అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్ల పెంపు, పంచాయతీరాజ్ చట్ట సవరణకు సంబంధించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం విదితమే. సుప్రీంకోర్టుకు వెళ్లిన సమయంలో ఈ అంశాలన్ని వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటి దాకా ప్రభుత్వపరంగా బీసీ రిజర్వేషన్లు పెంచేందుకే అసెంబ్లీలో, బయటా, ఆర్డినెన్స్‌లు, బిల్లులు తేవడం ద్వారా పూర్తిస్థాయిలో ప్రయత్నాలు సాగించినందున వాటిని సాధించేవరకు ముందుకెళ్లాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ప్లాన్ 'బీ'లేనట్టే ?

కొన్నాళ్లుగా రాష్ట్రంలో స్థానిక ఎన్నికలపై ఇటు ప్రభుత్వంలో, అటు రాజకీయ పార్టీల్లో పెద్ద కోలాహలమే కొనసాగింది. నోటిఫికేషన్ కూడా రావటంతో ఇక ఎన్నికలు జరగటమే తరువాయి అనుకున్నారు. కానీ, చివరకు ఊరించి ఉసూరుమనిపించినట్లు హైకోర్టు తీర్పుతో అంతా చల్లబడ్డారు. నిజానికి బీసీ రిజర్వేషన్ల జీవోను హైకోర్టు కొట్టివేస్తే.. ప్లాన్ బీ కింద పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెంటనే వెళ్లాలని ప్రభుత్వం ప్రణాళిక కూడా సిద్ధం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ, హైకోర్టు గురువారం ఇచ్చిన ఆదేశాల్లో రిజర్వేషన్ల కోసం జారీచేసిన జీవో 9ను కాకుండా, ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొంది. అయితే, నోటిఫికేషన్‌పై స్టేకు గల అన్ని కారణాలను ఉత్తర్వుల్లో పొందుపరుస్తామని ప్రధాన న్యాయమూర్తి ఏకే సింగ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇచ్చింది మధ్యంతర ఉత్తర్వులే కావడంతో.. రిజర్వేషన్లను మార్చి పాత విధానంలో ఎన్నికలకు కూడా వెళ్లలేని స్థితిలో ప్రభుత్వం పడిపోయింది. హైకోర్టు స్టేను తొలగించాలంటూ సుప్రీంకోర్టుకు వెళ్లే అంశాన్ని తీర్పు కాపీ వచ్చిన తరువాతే పరిశీలించాలని భావిస్తోంది.

స్థానిక ఎన్నికలకు బ్రేక్

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైంది. ఈ పిటిషన్లలో తమ వాదనలూ వినాలని కోరుతూ కాంగ్రెస్ సహా కొందరు బీసీ నాయకులు దాదాపు 30 మంది ఇంప్లీడ య్యారు. ఈ పిటిషన్లపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం వాదనలు విన్నది. తిరిగి గురువారం విచారణ చేపట్టింది.

అన్ని పార్టీల ఏకగ్రీవ నిర్ణయం..

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం ఎందుకు పెంచాల్సి వచ్చిందో స్పష్టంగా వివరించారు. 'రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించింది. అందులో 98 శాతం మంది పాల్గొన్నారు. సర్వే తర్వాత 57.6 శాతం బీసీ జనాభా ఉన్నట్లు గణాంకాలు తేల్చాయి. దీనిపై నియామకమైన వన్‌మ్యాన్ కమిటీ పూర్తిగా పరిశీలించి ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఆ మేరకు రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసి, అసెంబ్లీలో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించింది. మార్చిలో ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు వీలుగా.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 265(ఏ) సవరణకు రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదాను జూలైలో గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ బిల్లును కూడా గవర్నర్‌కు పంపగా.. ఇవన్నీ అక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. గడువులోగా గవర్నర్ ఆమోదం తెలపకుంటే చట్టంగా భావించాలని సుప్రీంకోర్టు ఇటీవలే స్పష్టం చేసింది. సర్వే, రిజర్వేషన్ల పెంపు, బిల్లుపై ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకత వ్యక్తం చేయలేదు'అని వివరించారు. సర్వేలో బీసీల శాతమేనా.. ఎస్సీ, ఎస్టీల జనాభా శాతాన్ని కూడా తేల్చారా? అని ధర్మాసనం ప్రశ్నించగా, అన్ని వర్గాలకు సంబంధించి ప్రభుత్వం సర్వే చేసిందని తెలిపారు.

వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకే..

బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనాన్ని గుర్తించే ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకుందని ఏజీ తెలిపారు. 'అధిక జనాభా ఉన్న వర్గాలకు పల్లెల్లో అధికారమిస్తే వారు లబ్ధిపొంది రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇక్కడ వర్తించదు. విద్య, ఉద్యోగ రంగాలకు సంబంధించి మాత్రమే ఆ తీర్పు అమలవుతుంది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ఎలాంటి పరిమితి విధించలేదు. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఆర్డినెన్స్ జారీచేసిన తర్వాత మళ్లీ నోటిఫై చేయాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ప్రజామోదం మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకోవద్దు. ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత అడ్డుకోవడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం. ఈసీ అధికారాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం సరికాదు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దు'అని విజ్ఞప్తి చేశారు.

15% కులాలకు 33% ఓపెన్ కేటగిరీ ఉంటుంది...

ప్రభుత్వం తరఫున మరో న్యాయవాది రవివర్మ వాదనలు వినిపిస్తూ.. ఎంఆర్ బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసును ప్రస్తావించారు. 'పిటిషనర్లకు రిజర్వేషన్లను సవాల్ చేస్తే ప్రాథమిక హక్కు లేదు. ఓటు వేయడం, ఎన్నికల్లో పోటీ చేయడం ప్రాథమిక హక్కు కాదు. రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50 శాతం సీలింగ్ లేదు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారు. ఈ 85 శాతం జనాభాకు 67 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తున్నారు. 15 శాతం ఉన్న ఇతర కులాలకు 33 శాతం ఓపెన్ కేటగిరీ ఉంటుంది. ఈ రిజర్వేషన్లతో ఫార్వర్డ్ కులాలకు వచ్చే నష్టం లేదు. పిటిషనర్లకు పిటిషన్లు వేసే అర్హత లేదు. వాటిని కొట్టివేయాలి'అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈసీ జారీచేసిన నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కాగా, హైకోర్టు ధర్మాసనం ఇన్‌ఫ్యూజ్ నోటిఫికేషన్‌పై స్టే అని చెప్పడటంతో దేన్ని నిలిపివేశారనేదానిపై సందిగ్ధం నెలకొంది. అధికారిక ఉత్తర్వుల కాపీ వస్తేగానీ కోర్టు ఆదేశాలపై స్పష్టత రానుంది.

బీఆర్ఎస్, బీజేపీలే అడ్డుకున్నాయి..

- రిజర్వేషన్లు 50 శాతం మించకుండా 2018లో బీఆర్ఎస్ చట్టం చేసింది
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం కాకుండా నిలిపివేసింది: భట్టి విక్రమార్క
- 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం: మహేశ్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం, మహేశ్‌గౌడ్, వాకిటి శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే అడ్డుకున్నాయని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు కాకుండా ఆ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో గురువారం గాంధీభవన్‌లో ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 2018లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా చట్టం చేసిందని, అదే ఉరితాడుగా తయారైందని అన్నారు. 2019లో ఎన్నికలు జరిపిన వెంటనే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కులగణన చేసి జీవో ఇచ్చేదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే ఎంపిరికల్ డాటా అవసరమని హైకోర్టు చేసిన సూచనతోనే ప్రభుత్వం సైంటిఫిక్‌గా అధ్యయనం చేసి జీవో 9 తీసుకొచ్చిందన్నారు. బిల్లును అసెంబ్లీలో ఆమోదించి పంపితే బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రం దానిని చట్టం కాకుండా నిలిపివేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కూడబలుక్కొని బీసీల నోటి కాడి ముద్దను దూరం చేశాయన్నారు.

రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలనేది కాంగ్రెస్ ఆలోచన: మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీ కోర్టులను, చట్టాలను గౌరవిస్తుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో చట్టబద్ధంగా ఎన్నికలకు వెళ్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కోర్టు తీర్పు వచ్చిన తరువాత పరిశీలించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్ కుటిలయత్నాలు చేస్తున్నాయని, అడుగడుగునా బీసీలను అణగదొక్కిన పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు.

రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
పొన్నం, జూపల్లి, వాకిటి శ్రీహరి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీ అందిన తరువాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. చట్టపరంగా, న్యాయపరంగా బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి చెప్పారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి.. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి.. బీసీ బిల్లుకు అసెంబ్లీలో చట్టం చేసి గవర్నర్‌కు పంపించామని గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడం బాధాకరమని జూపల్లి అన్నారు. బీసీలకు నోటికాడికి వచ్చిన ముద్ద లాగేసినట్లు చేశారు. బీసీ రిజర్వేషన్లకు ఎవరు అడ్డుపడుతున్నారో తెలంగాణలోని బీసీలంతా ఆలోచించాలని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

భగ్గుమన్న బీసీ సంఘాలు

నోటికాడి కూడు లాగేశారంటూ ఆగ్రహం

- బంద్ నిర్వహించి రాష్ట్రాన్ని స్తంభింపచేస్తాం: ఆర్.కృష్ణయ్య
- రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయి: జాజుల


హైకోర్టు వద్ద మాట్లాడుతున్న జాజుల


మీడియాతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై గురువారం హైకోర్టు స్టే విధించడం పట్ల బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు నోటివరకు అందిన కూడును లాగేశారంటూ మండిపడ్డాయి. స్టే విధిస్తూ తీర్పు ఇచ్చిన వెంటనే హైకోర్టు ప్రాంగణంలో బీసీ సంఘాల నేతలు అన్యాయం జరిగిందంటూ నినాదాలు చేశారు. ప్రధాన పార్టీలపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర బంద్ నిర్వహిస్తాం: ఆర్.కృష్ణయ్య

ఈరోజు రాష్ట్రంలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. జీవో ఇచ్చిన వెంటనే కోర్టులో పిటిషన్ వేసినప్పుడు అదేరోజు స్టే ఇవ్వాల్సింది. కానీ అన్ని వర్గాల వాదనలు విన్న తర్వాత... చివరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు సమర్పించిన తర్వాత స్టే ఇవ్వడం దారుణం. ఈ అంశం పైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రభుత్వ వైఖరిని బట్టి భవిష్యత్ ప్రణాళిక చేపడతాం. రాష్ట్ర బంద్ నిర్వహించి జనజీవనాన్ని స్తంభింపజేస్తాం.

రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు: జాజుల

బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లు చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయి. శుక్రవారం హైదరాబాదులో బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం.

చీకటి రోజు: జూలూరి గౌరీశంకర్

రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకుండా జీవో 9ని ఇచ్చి అన్యాయం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని తెలిసినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ విడుదల చేసి బీసీలను కాంగ్రెస్ మరోసారి మోసగించింది.


మరో మండల్ ఉద్యమం

బీసీల రిజర్వేషన్ల కోసం మరో మండల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని, అందరం కలిసి నేటి బంద్‌ను విజయవంతం చేద్దామని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు వ్యాఖ్యానించారు. అగ్రకుల పాలకుల మీద ఆధారపడకుండా స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం గురువారం రాత్రిలోగా నిర్ణయం ప్రకటించకుంటే బంద్ నిర్వహిస్తామని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న తెలిపారు.

హైకోర్టు వద్ద ఉద్రిక్తత

చార్మినార్ (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడంతో బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. హైకోర్టు ప్రాంగణం నుంచి రోడ్డుపైకి వచ్చిన నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్పందించిన పోలీసులు వారిని రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక నినాదాలతో హైకోర్టు పరిసరాలు మారుమోగాయి. బీఆర్ఎస్–బీజేపీ కుమ్మక్కై తమ నోటికాడి ముద్దను లాక్కున్నాయంటూ కొందరు నేతలు నినాదాలు చేశారు. హైకోర్టులోనే ఉన్న మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావుతో పాటు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, వి.హనుమంతరావు తదితరులు తీర్పు అనంతరం హైకోర్టు ప్రాంగణం నుంచి బయటికి వచ్చి బీఆర్ఎస్–బీజేపీ కుట్ర పన్నాయంటూ ధ్వజమెత్తారు.

బీజేపీ బాధ్యత వహించాలి
ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ నెల్లికంటి




సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ విడుదలైన ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడం తీవ్ర నిరాశకు గురిచేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. బీసీలకు పెంచిన రిజర్వేషన్ జాప్యం జరగడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని వారు వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. శాసనసభలో బీజేపీసహా అన్ని పక్షాలు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించాయని, దాంతో పాటు రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందని అన్నారు. ఈ మూడింటిని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపిందని, గవర్నర్ కేంద్రానికి పంపగా, అక్కడే పెండింగ్‌లో పడిందని తెలిపారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లు కేంద్రం వద్ద నెలల తరబడి పెండింగ్ ఉన్నందునే , నేడు స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందని వారు ఆరోపించారు.

బీసీలు తిరగబడాల్సిన సమయం వచ్చింది
- గంగుల, దాసోజు, వద్దిరాజు



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లపై బీసీ బిడ్డలు అందరూ తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వ పెద్దలకు కర్రుకాల్చి వాత పెట్టాలని బీఆర్ఎస్ నేతలు అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు జీవో ద్వారా సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని చెప్పామన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాలని, బిహార్, మహారాష్ట్ర తప్పిదాలు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరామన్నా రు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్‌రెడ్డి జీవో ఎందుకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. 42% బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికలకు తొందర లేదని, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే నిర్వహించాలని సూచించారు. కేవలం జీవోతోనే రిజర్వేషన్లు సాధ్యమవుతాయని అనుకుంటే.. 22 నెలలు ఎందుకు ఆగారో చెప్పాలన్నారు. హైకోర్టులో కేసు వేసింది కాంగ్రెస్ పార్టీ నేతలు కాదా?, ఈ విషయాన్ని ఆత్మ సాక్షిగా చెప్పాలని డిమాండ్ చేశారు. 'మంత్రులు ఎవరిని బెదిరించడానికి కోర్టులకు వెళ్లారు? ఇదేమైనా బల ప్రదర్శనా'అని నిలదీశారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం
బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయనతో పాటు పల్లె రవికుమార్, ఉపేంద్ర చారి, కె.కిశోర్ గౌడ్, జక్కుల లక్ష్మణ్ మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్ బీసీ వాదాన్ని ఎత్తుకుని, రాహుల్ గాంధీ ఈ అంశాన్ని పట్టించుకోలేదని మధుసూదనాచారి విమర్శించారు. రేవంత్ రెడ్డి 60 సార్లు ఢిల్లీ వెళ్లినా బీసీ బిల్లు ఆమోదం కోసం ప్రయత్నించలేదని, కోర్టులో అడ్డుకున్నారన్నారు. జీవోల ద్వారా రిజర్వేషన్లు సాధ్యం కాదని, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చితేనే న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

కాంగ్రెస్ కపట రాజకీయాలు

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కపట రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్ గౌడ్ వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు.

రిజర్వేషన్లపై ప్రభుత్వ విధానం దురదృష్టకరం
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే రాజ్యాంగ పరమైన ప్రక్రియను అనుసరించకుండా, ముందుగానే ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని కోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగానే జీవో9పై హైకోర్టు స్టే విధించిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనమే ఈ తీర్పునకు కారణమని విమర్శలు సంధించారు. బీసీలను రాజకీయంగా వాడుకోవాలనే ఆలోచనలో కాంగ్రెస్ ఉందన్నారు. 'కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి నిర్దేశించింది. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించింది. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది'అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

ప్రజల విశ్వాసంతో ప్రయోగాలు చేసింది..
కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ పార్టీ తన మోసపూరిత ప్రయోగంగా మార్చుకుందని 'ఎక్స్' వేదికగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'గురువారం హైకోర్టులో ప్రభుత్వం తమ ఆదేశాన్ని రక్షించలేకపోయింది. డేటా లేదు, రక్షణ లేదు, మోసం మాత్రమే ఉంది' అని విమర్శించారు. '2009 డిసెంబర్ 9న తెలంగాణను ప్రకటించి –వెంటనే యూటర్న్ తీసుకోవడం వల్ల తొమ్మిదేళ్ల ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. 2023 డిసెంబర్ 9న సోనియా గాంధీ పుట్టినరోజున ప్రమాణం చేయాలన్న రేవంత్ రెడ్డి వాగ్దానం, కానీ మళ్లీ వెనక్కు తగ్గాడు. జీవోఎంఎస్ 9: 'బీసీ సాధికారత' చూపించాలన్న ఆవిష్కరణలో, బీసీల కోటాలో ముస్లింలను చేర్చి బీసీలను మోసం చేయాలని ప్రయత్నించింది. డిసెంబర్ 9 నుంచి అక్టోబర్ 9 వరకు, కాంగ్రెస్ తెలంగాణ భావాలను, వెనుకబడిన వర్గాల ఆశలను దశాబ్దాలుగా రాజకీయ లాభాల కోసం వంచించింది' అని ఆయన 'ఎక్స్'లో ధ్వజమెత్తారు

కాంగ్రెస్ మోసం తేటతెల్లం: కేటీఆర్
న్యాయస్థానంలో నిలబడని జీఓతో రేవంత్ మభ్యపెట్టారు...



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, హైకోర్టు స్టేతో కాంగ్రెస్ డ్రామా బట్టబయలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలు, చట్టం వల్లనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి సీఎం రేవంత్ రెడ్డి బీసీలను దారుణంగా మోసం చేశారన్నారు. మభ్యపెట్టేందుకు తెచ్చిన జీఓ న్యాయస్థానాల్లో నిలబడదని బీఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమని తేలిందన్నారు. కులగణన మొదలుకొని కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని, అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తెచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకవైపు రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చేశారని, చివరికి న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారని కేటీఆర్ విమర్శించారు. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి, పార్టీపరంగా ఇస్తామని ప్రతిపాదనలు తెరపైకి తెచ్చిన నాడే కాంగ్రెస్ మోసం బయటపడిపోయిందన్నారు. 22 నెలల చేతకాని పాలనపై ఇప్పటికే పెల్లుబుకుతున్న వ్యతిరేకతను చూసి ముఖ్యమంత్రి భయంతో వణికిపోతున్నారని కేటీఆర్ అన్నారు. అందుకే స్థానిక ఎన్నికలను వివాదంగా మార్చి, ఏదో రకంగా వాయిదా వేయించేందుకు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పావుగా వాడుకున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేసిన దగాకు తోడు, కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా బీసీ బిల్లులను పెండింగ్ లో పెట్టి వెనుకబడిన వర్గాలను దారుణంగా వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

6 గ్యారంటీల తరహాలోనే రిజర్వేషన్ల డ్రామా
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం..
- ఢిల్లీలో కొట్లాడితే కలిసి వచ్చేందుకు సిద్ధమని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరిట మోసగించిన తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామా ఆడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 55 ఏళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడిందా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వేదికగా జాతీయ స్థాయిలో ఉద్యమించాలని... ఈ విషయంలో కలసి వచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందన్నారు. జీవో–9పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో గురువారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'మాయమాటలతో గత ఎన్నికల్లో బీసీలను మోసగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందేందుకు చేసిన కుట్రలు పటాపంచలయ్యాయి. 22 నెలలుగా ఢిల్లీలో కొట్లాడాల్సిన రేవంత్ గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా చేయడం మినహా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనపట్ల ఎన్నడూ చిత్తశుద్ధి చూపించలేదు. బీసీలపట్ల ప్రేమ ఉన్నట్లు చాటుకోవడానికి తూతూమంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసారు. సీఎం ఇప్పటికైనా డ్రామాలు ఆపి పార్లమెంటులో చట్టం చేయించి రిజర్వేషన్ల పెంపును రాజ్యాంగంలోని షెడ్యూల్–9లో చేర్పించాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, జీవో–9 జారీలో ప్రభుత్వం శాస్త్రీయంగా వ్యవహరించనందునే హైకోర్టు స్టే ఇచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మరో ప్రకటనలో విమర్శించారు.

సర్కార్ నిర్లక్ష్యం వల్లే హైకోర్టులో స్టే
- వెంటనే 'సుప్రీం'ను ఆశ్రయించాలి: రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగానే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరే కారణం కాబట్టి వెంటనే బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని డిమాండ్ చేశారు. బిల్లులు, డిక్లరేషన్లు, ఆర్డినెన్స్ సవరణలు.. ఇలా న్యాయపరంగా చెల్లుబాటు కాని విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ తప్పుడు నిర్ణయాలతో బీసీల హక్కులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపించి మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. గవర్నర్‌కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్నా అది పూర్తికాకముందే ఎన్నికల షెడ్యూల్ జారీ చేయడం చట్టవిరుద్ధమని ధ్వజమెత్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అసలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు వేసిందే కాంగ్రెస్‌కు చెందినవారని ఆరోపించారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న సర్కారు
బీజేఎల్పీ నేత ఏలేటి



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు చెందినవారి ఆత్మ గౌరవం దెబ్బ తీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. స్థానిక ఎన్నికల అంశంపై కోర్టు స్టే విధించడం బాధాకరమన్నారు. ఆయన గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గవర్నర్ వద్ద సవరణ బిల్లు పెండింగ్‌లో ఉండగా.. ప్రత్యేక జీవో ఇవ్వాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పరిపాలన చేతగాక లోపాయికారి ఒప్పందం చేసుకుంటూ.. పాలన పూర్తిగా గాడి తప్పేలా చేసి బీజేపీపై నెపం మోపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడి స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు తెలిపినా.. వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి.. త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నర్సీపట్నం మెడికల్ కాలేజీ వద్దకు తరలివచ్చిన భారీ జనసందోహంలో ఓ భాగం.. (ఇన్‌సెట్) జోరువానలో తడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆధునిక దేవాలయాలను అమ్మేస్తున్నారు

నర్సీపట్నం పర్యటనలో వైఎస్ జగన్ నిప్పులు • వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

"ఇదిగోనయ్యా..! 2022 ఆగస్టు 8న జారీ చేసిన జీవో నం.204. మెడికల్ కాలేజీ నిర్మాణానికి జీవో ఇవ్వలేదంటూ స్పీకర్ పదవిలో ఉంటూ అబద్ధాలు చెప్పినందుకు ఆ పదవికి నువ్వు అర్హుడివేనా? ఆలోచించుకో...! తప్పుడు మాటలు చెబుతూ, ప్రజల్ని తప్పుదోవ పట్టించే కార్యక్రమంలో చంద్రబాబుతో చేతులు కలిపినందుకు తలదించుకోవాలి.."
- నర్సీపట్నం నియోజకవర్గం భీమబోయినపాలెం మెడికల్ కాలేజీ వద్ద మీడియాతో వైఎస్ జగన్

'రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన ఖర్చు రూ.8 వేల కోట్లు. ఇందులో రూ.3 వేల కోట్లను మా హయాంలోనే ఖర్చు చేసి ఈ స్థాయికి తీసుకొచ్చాం. ఏటా కేవలం రూ.1000 కోట్లు ఖర్చు చేస్తే.. కొన్ని కోట్ల మందికి ఆధునిక దేవాలయాల లాంటి వైద్య కాలేజీల ద్వారా పేదవాడికి ఉచితంగా వైద్యం అందుబాటులోకి వస్తుంది. మరి ఆ ప్రభుత్వ మెడికల్ కాలేజీల కోసం ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేరా? అని చంద్రబాబుని అడుగుతున్నా'

'రూ.2 లక్షల కోట్లు అమరావతిలో పెట్టడానికి సిద్ధపడుతూ.. రూ.70 వేల కోట్లకు టెండర్లు పిలిచామని చెబుతున్నారు. మరి కోట్ల మంది పేదలకు మేలు చేస్తూ.. ఉచితంగా వైద్యమందించే మెడికల్ కాలేజీలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేమంటూ ప్రైవేటువారికి అమ్మేసే కార్యక్రమం చంద్రబాబు హయాంలో జరుగుతోంది. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ ఆయనకు బుద్ధి రావాలని పోరాట కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం'

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: "పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఉద్దేశించిన వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను రచ్చబండ సాక్షిగా ప్రజలకు వివరిస్తాం. దీన్ని నిరసిస్తూ శుక్రవారం నుంచి రచ్చబండ కార్యక్రమాన్ని చేపడతాం. నవంబరు 24 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందచేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా మేం శ్రీకారం చుట్టిన 17 కొత్త మెడికల్ కాలేజీల్లో మా హయాంలోనే దాదాపుగా ఏడు కాలేజీలు పూర్తి కాగా ఐదు చోట్ల మా ప్రభుత్వంలోనే తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. పులివెందుల మెడికల్ కాలేజీకి ఎంబీబీఎస్ సీట్లను కేటాయిస్తే, మాకు వద్దంటూ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. పేదలకు చేరువలో ఉచితంగా మెరుగైన వైద్యం కోసం ఉద్దేశించిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి నాబార్డుతో పాటు కేంద్రం నుంచీ వడ్డీ లేని నిధులను మా ప్రభుత్వంలో టై–అప్ చేశాం. కేవలం ఏటా రూ.1,000 కోట్ల చొప్పున రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే ఆ కాలేజీలు పూర్తవుతాయి. అది కూడా చేయలేక పోతే చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క రంగం బాగుపడలేదు. విశాఖలో షాపులను తొలగించి 32 వేల మందిని రోడ్డున పడేశారు. గిరిజన విద్యార్థుల హాస్టళ్లలో మా ప్రభుత్వం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే.. ఈ సర్కారు కనీసం ఫిల్టర్లను కూడా మార్చడం లేదు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించడం లేదు. విశాఖ స్టీలు ప్లాంటులో 32 విభాగాలను ప్రైవేటు పరం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే స్టీలు ప్లాంట్ కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నారు..'అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఉత్తరాంధ్ర పర్యటన సందర్భంగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరంపాలెం మండలంలో నిర్మాణంలో ఉన్న భీమబోయినపాలెం మెడికల్ కాలేజీని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు గత ప్రభుత్వం అసలు జీవో ఇవ్వలేదని.. దమ్ము, ధైర్యం ఉంటే దాన్ని చూపించాలంటూ స్పీకర్ విసిరిన సవాల్‌పై ఘాటుగా ప్రతిస్పందించారు. స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉన్నత పదవిలో ఉంటూ చంద్రబాబు మాదిరిగా అబద్ధాలు చెబుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. ఆయనకు ఆ పదవిలో ఉండేందుకు అర్హత ఉందా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కోట్లాది మంది పేదలకు మేలు..

ఈ రోజు ఇక్కడ వెనుక కనిపిస్తున్నవి నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన మెడికల్ కాలేజీ నిర్మాణాలు. ఉత్తరాంధ్రకు మంచి చేస్తూ.. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఒక మెడికల్ కాలేజీ నిర్మాణం దాదాపు 52 ఎకరాల్లో కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇలా 17 కొత్త మెడికల్ కాలేజీలకు మా హయాంలో శ్రీకారం చుట్టాం. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా ఏడెనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు చేరువలో ఉచితంగా అందుతాయి. ఆ ఆధునిక దేవాలయాల వల్ల ఇది సాధ్యమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మందికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ వస్తే ఆ ఏడెనిమిది నియోజకవర్గాల్లో ప్రైవేట్ హాస్పిటల్స్ ఏవీ పేదవాడిని దగా చేయలేని పరిస్థితులు ఏర్పడతాయి. పక్కనే ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ సేవలు పేదవాడికి ఉచితంగా అందుబాటులో ఉన్నప్పుడు ఎక్కువ రేట్లు వసూలు చేసే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు రావడం వల్ల పేదలు దగాకు గురి కావటానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పడుతుంది. మొత్తంగా 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వం నిర్వహిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఉచితంగా వైద్యం పేదవాడికి చేరువలో అందుబాటులోకి వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రుల దగాకు తెర పడుతుంది. మరి ఇలాంటి ఆధునిక దేవాలయాల్ని ఎందుకు మూసేస్తున్నారని ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నా.

కోవిడ్ ఇబ్బందుల్లోనూ 500 కోట్లు ఖర్చు చేశాం..

గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేస్తే ఇక వారే నడుపుతారు. అంతా ప్రైవేట్ వాళ్లే ఉంటే.. మరి పేదవాడికి ఏ రకంగా భరోసా ఉంటుంది? ఉచిత వైద్యం అన్నది పేదవాడికి ఎలా అందుబాటులోకి వస్తుంది? ఏ పేదవాడు దగా పడకుండా.. ప్రైవేట్ దోపిడీకి ఫుల్‌స్టాప్ పెడుతూ రాష్ట్రవ్యాప్తంగా మంచి చేసే కార్యక్రమంలో భాగంగా మా హయాంలో 17 మెడికల్ కాలేజీలు కొత్తగా తీసుకొచ్చాం. ఈరోజు ఇక్కడ 52 ఎకరాల్లో కొత్త మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతోంది. 2022 డిసెంబర్ 30న కాలేజీకి శంకుస్థాపన చేశాం. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులున్నా, సంక్షోభంలో ఉన్నా రూ.500 కోట్లు ఖర్చు చేసి శంకుస్థాపన చేశాం. ఈ కాలేజీ పూర్తైతే 600 బెడ్స్‌తో పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తూ.. సంవత్సరానికి 150 మెడికల్ సీట్లు ఇక్కడ అందుబాటులోకి వచ్చేవి. ఈ ప్రాంతమంతటికీ ఇక్కడి మెడికల్ కాలేజీ దిక్సూచీగా ఉండేది. పాయకరావుపేట, తూర్పు గోదావరి పరిధిలోని తుని నియోజకవర్గం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇదే మెడికల్ హబ్ అవుతుంది. ఈ రోజు ఏ ఇబ్బంది వచ్చినా.. విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. కేజీహెచ్ ఒక్కటే ఈ ప్రాంతానికి దిక్కుగా ఉంది. రోజూ ఇక్కడి నుంచి వెళుతున్న వందల మంది రోగులకు సరిగా వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ రోజు చంద్రబాబు చేసే అన్యాయాలు ఎలా ఉన్నాయంటే.. పేదవాడికి భవిష్యత్తు లేకుండా చేసే కార్యక్రమాలు చేస్తున్నారు.



అనకాపల్లిలో..

మరిన్ని వివరాలు, వార్తలు, ఫొటోల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

స్పీకర్.. క్షమాపణ చెబుతావా?

నర్సీపట్నానికి సంబంధించిన సీనియర్ నాయకుడు, సీనియర్ ఎమ్మెల్యే, స్పీకర్ పదవిలో ఉంటూ... చంద్రబాబులా తప్పుడు మాటలు మాట్లాడుతూ అబద్ధాలు చెబుతున్నారు. తాను కూడా చంద్రబాబు కంటే నాలుగు ఆకులు తక్కువ కాదు అని నిరూపించుకుంటున్నారు. స్పీకర్‌కు చెబుతున్నా... అబద్ధాలతో ప్రజల్ని మోసం చేయడం ఎంత వరకూ ధర్మమని అడుగుతున్నా. క్షమాపణ చెబుతావా? ఈ మెడికల్ కాలేజీకి జీవో లేదని అంటారా.. ఇదిగోనయ్యా.. ఆగస్టు 8, 2022న జారీ చేసిన జీవో నం.204. చంద్రబాబు జూన్ 2024లో అధికారంలోకి రాగా సెప్టెంబర్ 3న ఒక మెమో జారీ చేశారు. మొత్తం 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ఆపాలంటూ మెమో జారీ చేశారు. అన్ని మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచి వదిలేసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేటి నుంచి రచ్చబండ...

చంద్రబాబూ.. మీరు చేస్తున్న పనులకు నిరసనగా రేపటి నుంచి (అక్టోబర్ 10) నవంబరు 22 వరకు గ్రామ, వార్డు స్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు వివరిస్తాం. చంద్రబాబు సూపర్‌సిక్స్, సెవెన్ పేరుతో చేసిన మోసాలను కూడా రచ్చబండలో తెలియచేస్తాం. ప్రతి గ్రామం నుంచి 500 సంతకాలు, ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేలకు తక్కువ కాకుండా సంతకాలు సేకరిస్తాం. రాష్ట్రం మొత్తం మీద కోటి సంతకాలు సేకరిస్తాం. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాలు, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తాం. ఆ తర్వాత నవంబరు 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, ఆ మర్నాడు నవంబరు 24న జిల్లా కేంద్రాల నుంచి విజయవాడకు ఆ సంతకాల పత్రాలు లారీల్లో వస్తాయి. ఆ తర్వాత గవర్నర్ అపాయింట్మెంట్ తీసుకుని వాటన్నింటినీ సమర్పిస్తాం. మాతో కలిసి వచ్చే వారందరినీ కూడగడతాం. చంద్రబాబు ఇప్పటికైనా తన నిర్ణయం మార్చుకోవాలి. బుద్ధి తెచ్చుకోవాలి.

65 కి.మీ.. 6 గంటలు..

గురువారం ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన వైఎస్ జగన్ సాయంత్రం 5.10 గంటలకు మాకవరంపాలెం మండలం భీమబోయినపాలెం మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా వైఎస్ జగన్‌ను పలకరిస్తూ.. జేజే లు పలుకుతూ... జనం పోటెత్తారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా లెక్క చేయకుండా... జోరు వానలోనూ లెక్క చేయకుండా అభిమాన నేతకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కేవలం 65 కి.మీ. దూరం ప్రయాణించేందుకు దాదాపు 6 గంటల సమయం పట్టింది.

ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర

ఆర్టీసీ చార్జీల పెంపుపై కేటీఆర్ ఆగ్రహం

- నిర్బంధాలు, ఆంక్షల నడుమ బీఆర్‌ఎస్ చలో బస్ భవన్
- ఉదయం నుంచే ముఖ్య నేతల ఇళ్ల వద్దకు పోలీసులు
- ఆర్టీసీ బస్సుల్లో బస్ భవన్‌కు వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు
- చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలంటూ ఎండీకి వినతి



ఆర్టీసీ బస్సులో బస్‌భవన్‌కు వచ్చిన కేటీఆర్



బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో పద్మారావు, సబిత, హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వాణీదేవి, తలసాని, ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడంపై బీఆర్‌ఎస్ పార్టీ పోలీసుల నిర్బంధం, ఆంక్షల నడుమ 'చలో బస్ భవన్'పేరిట ఆందోళన నిర్వహించింది. ఆందోళన నేపథ్యంలో పోలీసులు గురువారం ఉదయం నుంచే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీకి చెందిన కీలక నేతల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించి గృహ నిర్బంధం చేశారు. ప్రజల తరఫున ఆందోళన చేయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేసి అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా చార్జీలను తగ్గించేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. పోలీసుల అడ్డంకులను దాటుకుని ఆర్టీసీ బస్సుల్లో వివిధ మార్గాల్లో బస్ భవన్‌కు చేరుకున్న బీఆర్‌ఎస్ నేతలు సంస్థ ఎండీ నాగిరెడ్డితో భేటీ అయ్యారు. చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, సంస్థ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ మహాలక్ష్మి పథకానికి సంబంధించి రూ.1,353 కోట్లు బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఎండీ తమకు తెలిపారని బీఆర్‌ఎస్ నేతలు వెల్లడించారు.

22 నెలల్లో 5 సార్లు చార్జీలు పెంపు

'మహిళలకు ప్రయాణం ఉచితం అంటూ పురుషుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఓ వైపు ఉపాధి అవకాశాలు తగ్గి సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే టికెట్ల చార్జీలు పెంచడం దారుణం. ఆర్టీసీ లాభాల్లో ఉందని చెప్తున్న ప్రభుత్వం చార్జీలు ఎందుకు పెంచిందో చెప్పాలి. ఆర్టీసీ ఆస్తులను అమ్ముకోవడంతోపాటు అంతిమంగా సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. చార్జీల పెంపు ఉపసంహరణ కోసం, సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రజా ఉద్యమం చేస్తుంది. 22 నెలల కాంగ్రెస్ పాలనలో ఐదు సార్లు బస్సు చార్జీలు పెంచారు. మెట్రో రైలును ఆగం చేసిన రేవంత్‌రెడ్డి బస్సు చార్జీలు పెంచితే ప్రజలు మెట్రోవైపు చూస్తారని కుట్రలు చేస్తుండు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉప్పల్, మియాపూర్‌లోని ఆర్టీసీ వర్క్‌షాపులను కూడా అమ్మకానికి పెట్టింది. రేవంత్ సర్కారు జేబీఎస్ బస్టాండును కుదువపెట్టి రూ.1,500 కోట్లు అప్పు చేసింది. కార్గోను కూడా అమ్మకం ద్వారా ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది.

కేటీఆర్, హరీశ్ గృహ నిర్బంధం

చలో బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఉదయం నుంచే కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు వివేకానంద్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరుల నివాసాల వద్దకు పోలీసులు చేరుకున్నారు. నేతలు ఆందోళనలో పాల్గొనకుండా గృహ నిర్బంధం చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. కోకాపేటలోని తన నివాసం వద్ద పోలీసుల అడ్డంకులు దాటుకుని బయటకు వచ్చిన కేటీఆర్ సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాప్ నుంచి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్‌తో కలిసి ఆర్టీసీ బస్సులో బస్ భవన్‌కు చేరుకున్నారు. హరీశ్‌రావు మెహిదీపట్నం నుంచి ఆర్టీసీ బస్సులో బస్‌భవన్‌కు వచ్చారు. అంబర్‌పేట నుంచి బస్ భవన్‌కు వెళ్తున్న సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవిని అడ్డగించిన పోలీసులు వారిని లాలాగూడ వద్ద వదిలిపెట్టారు. దీంతో వారు అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో తిరిగి బస్ భవన్‌కు చేరుకున్నారు. బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులను అదుపులోకి తీసుకుని గోషామహల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బస్ భవన్‌కు వెళ్లే క్రమంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు కాసేపు అడ్డగించడంతో ఉద్రిక్తత నెలకొంది.

రాష్ట్రంలోని స్కూలు పిల్లల్లో మానసిక సమస్యలు

ఆస్ట్రేలియాకు చెందిన గివ్ మి ఫైవ్ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణతోపాటు కర్ణాటకలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మానసిక సమస్యలతో సతమతమవుతున్నట్లు ఆస్ట్రేలియాకు చెందిన సైకలాజికల్ వెల్‌నెస్ ప్లాట్‌ఫాం గివ్ మి ఫైవ్ (జీఎం5) చేపట్టిన సర్వేలో వెల్లడైంది. చదువుల ఒత్తిడి, ఫెయిలవుతామన్న భయం, తల్లిదండ్రులు, టీచర్లను నిరుత్సాహ పరుస్తామేమోననే ఆందోళన వారిలో నెలకొందని జీఎం5 పేర్కొంది. ఫలితంగా నిద్రలేమి, తరగతి గదిలో ఏకాగ్రత లోపం వంటి సమస్యలతో విద్యార్థులు బాధపడుతున్నారని గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఈ సర్వే ప్రకారం తెలంగాణలో 10 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసుగల విద్యార్థుల్లో 24 శాతం మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వారిలో 6 శాతం నుంచి 10 శాతం మంది అత్యంత ప్రమాదకర స్థాయిని ఎదుర్కొంటున్నారు. మొత్తం విద్యార్థుల్లో 60 శాతానికిపైగా విద్యార్థులు నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారు. 70 శాతానికిపైగా విద్యార్థులు తరగతి గదిలో ఏకాగ్రత కోల్పోతున్నారు. సుమారు 40% మంది విద్యార్థులు తాము తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను చదవులో నిరాశపరుస్తామేమోనని కలత చెందుతున్నారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టండి

ఎర్రవల్లిలో పార్టీ నేతలతో కీలక భేటీలో కేసీఆర్ ఆదేశం

'స్థానికం'వాయిదా నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చ
త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించే యోచన
జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ సన్నద్ధతపైనా సమీక్ష
పాల్గొన్న కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవో–9పై హైకోర్టు స్టే ఇవ్వడం, ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపేసిన నేపథ్యంలో గురువారం రాత్రి ఎర్రవల్లి నివాసంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు కీలక భేటీ నిర్వహించారు. తాజా పరిణామాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో చర్చించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని.. అసెంబ్లీ లోపలా, బయటా బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించినా జీవోకు చట్టబద్ధత సాధించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సన్నద్ధతపైనా ఈ భేటీలో కేసీఆర్ సమీక్షించారు. ఐదుగురు మాజీ మంత్రుల నేతృత్వంలో ఏర్పాటైన వార్ రూమ్ పనిచేయాల్సిన తీరుపై ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ఎంపికైన నేపథ్యంలో ఆ పార్టీ అనుసరించే వ్యూహం, అభ్యర్థి బలాబలాలను విశ్లేషించి పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడినందున గ్రామీణ ప్రాంత నేతలు, కేడర్‌ను కూడా జూబ్లీహిల్స్ ప్రచారంలో భాగస్వాములను చేయాలని కేసీఆర్ ఆదేశించారు. దీంతో ఉపఎన్నిక ప్రచార వ్యూహానికి తుదిరూపు ఇచ్చేందుకు కేటీఆర్, హరీశ్‌రావు ఒకట్రెండు రోజుల్లో పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో భేటీ కానున్నారని సమాచారం.

దాఖలైన నామినేషన్లు.. రద్దయిన నోటిఫికేషన్



నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీల నామినేషన్ కేంద్రం

- స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే నామినేషన్లు షురూ
- పలు జిల్లాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్/సాక్షి ప్రతినిధి, కరీంనగర్: స్థానిక ఎన్నికలపై గురువారం రోజంతా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 9ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరుగుతుండగానే, రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ వెంటనే కొన్ని జిల్లాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక జెడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల జెడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా చందూలాల్ నామినేషన్ వేశారు. జిల్లాలో మూడు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు (కాంగ్రెస్– 2, స్వతంత్ర–1) వచ్చాయి. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో రెండు, గోపాల్ పేట మండలంలో ఒక ఎంపీటీసీ స్థానానికి నామినేషన్లు దాఖలయ్యాయి. నారాయణపేట జిల్లాలో ఐదు ఎంపీటీసీ స్థానాలు, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలో ఎంపీటీసీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైంది. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ నుంచి ఒక నామినేషన్ వచ్చింది. కరీంనగర్ జిల్లాలో శంకరపట్నం మండలం కన్నాపూర్, మెట్పల్లి ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు వచ్చాయి. వి.సైదాపూర్ జెడ్పీటీసీ స్థానానికి ఒక నామినేషన్ వచ్చింది. జగిత్యాల జిల్లాలో రెండు ఎంపీటీసీ స్థానాలకు ఒకటిచొప్పున నామినేషన్లు వచ్చాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2 జెడ్పీటీసీ, ఒక ఎంపీటీసీ నామినేషన్లు దాఖలయ్యాయి. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం జల్లారం ఎంపీటీసీ స్థానానికి ఓదెలు అనే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. కాగా, ఎన్నికల నోటిఫికేషన్‌ను హైకోర్టు నిలిపేయటంతో గురువారం దానిని ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేసింది.

రూ. 500 కోట్ల భూమిపై ఎమ్మెల్యే కన్ను

రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలోని రూ. 500 కోట్ల విలువైన 11 ఎకరాల ప్రభుత్వ భూమిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబ సభ్యులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. నకిలీ సేల్ డీడ్‌లతో ఆ భూమి వివరాలను గతంలోనే రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించారని.. ప్రభుత్వ భూమిని కాపాడటంలో విఫలమైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూమిపై లావాదేవీలు, అభివృద్ధికి సంబంధించిన ఇతర అనుమతులు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, భూపరిపాలన కమిషనర్, మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు రాగిడి లక్ష్మారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే గాంధీ కుటుంబ సభ్యులు చేస్తున్న అక్రమాలపై సీబీసీఐడీ విచారణ జరిపించడంతో పాటు నాటి ధరణి (భూ భారతి) పోర్టల్‌లో నమోదు చేసిన అక్రమ ఎంట్రీలను తొలగించాలని కోరారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఫిర్యాదుతో పాటు జత చేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థిగా 'బొంతు'!

- ఎంపీ అర్వింద్ ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. పార్టీలో లేని ఒక నాయకుడి పేరును బీజేపీ అభ్యర్థిగా ప్రతిపాదించి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పార్టీ నాయకులను ఆశ్చర్యపరిచారు. గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై నిర్వహించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ మీటింగ్‌లో అనూహ్యంగా.. కాంగ్రెస్ నేత, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును ఎంపీ అరవింద్ తెరమీదకు తీసుకొచ్చారు. బొంతు రామ్మోహన్ అభ్యర్థిత్వం బలపరిస్తే బావుంటుందని, ఏబీవీపీ నేపథ్యం ఉన్న మంచి వ్యక్తి అంటూ.. పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు అర్వింద్ సూచించారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో.. జూబ్లీహిల్స్ నుంచి పోటీకి నిలపాలంటూ ప్రతిపాదించడం కొంత అసౌకర్యానికి గురి చేసినట్టు పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. మరో పార్టీలో ఉన్న వ్యక్తి పేరును ఉప ఎన్నిక అభ్యర్థిగా ఎలా సూచిస్తారని వారు ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు. కాగా, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీలను.. జూబ్లీహిల్స్ టికెట్‌ను ఆశిస్తున్న జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ కలిసి వెళ్లారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 10-10-2025


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్పుకుందాం

ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పద మూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లల్లో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా పాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.





ఫ్యాషన్

● ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు

రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్, ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.









సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ **అద్దుకున్న ఆధునికత**

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ **శక్తి సరాలు..**

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు–జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ **సెలబ్రిటీల స్టైల్ టచ్**

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వికపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.

కేర్‌గివర్

రాణి అనే నేను ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...



ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సైర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80–డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.

మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	బంగారం (24 క్యారెట్లు)	1,26,250	బంగారం (24 క్యారెట్లు)	1,24,150	బంగారం (24 క్యారెట్లు)	1,26,250.	బంగారం (24 క్యారెట్లు)	1,28,000	బంగారం (24 క్యారెట్లు)	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	బంగారం (22 క్యారెట్లు)	1,13,380	బంగారం (22 క్యారెట్లు)	1,13,800	బంగారం (22 క్యారెట్లు)	1,17,210	బంగారం (22 క్యారెట్లు)	1,17,700	బంగారం (22 క్యారెట్లు)	1,14,000
వెండి	1,70,000	వెండి	1,58,600	వెండి	1,67,000	వెండి	1,58,600	వెండి	1,60,000	వెండి	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
10-10-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
398	136
82,172	25,182

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,939	▽	104
డోజోన్స్	46,380	▽	221
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,515	▽	34
డాక్స్	24,655	▲	58
షాంఘై	3,934	▲	51
నికాయ్	48,580	▲	845

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.71	120.69
€	యూరో	ఎస్‌బీఐ	120.08	104.88
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.51	59.78
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.35	70.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

- నికర లాభం రూ. 12,075 కోట్లు
- ఆదాయం రూ. 65,799 కోట్లు
- షేరుకి రూ. 11 డివిడెండ్
- 6.5 బిలియన్ డాలర్లతో డేటా సెంటర్లు

టీసీఎస్ క్యూ2.. ఓకే

న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం వార్షికంగా నామమాత్ర (1.4 శాతం) వృద్ధితో రూ. 12,075 కోట్లను తాకింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 11,909 కోట్లు ఆర్జించింది. ప్రధానంగా బీఎఫ్ఎస్ఐతోపాటు వివిధ విభాగాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం సైతం స్వల్పంగా 2.4 శాతం పుంజుకుని రూ. 65,799 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 64,259 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే త్రైమాసికవారీగా (క్యూ2తో పోలిస్తే) నికర లాభం 5.3 శాతం క్షీణించగా, ఆదాయం 3.7 శాతం ఎగసింది. వాటాదారులకు ఒక్కో షేరుకీ రూ. 11 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 15 రికార్డ్ డేట్‌కాగా.. నవంబర్ 4కల్లా చెల్లించనుంది. క్యూ2లో అన్ని విభాగాలలోనూ వృద్ధి పథంలో సాగినట్లు కంపెనీ సీఎఫ్‌వో సమీర్ సేక్సరియా పేర్కొన్నారు. క్రమబద్ధ ఎగ్జిక్యూషన్, వ్యూహాత్మక పెట్టుబడులతో మార్జిన్లనకు బలాన్నిచ్చినట్లు తెలియజేశారు. వేతన పెంపు, భవిష్యత్ అవసరాలకు సంసిద్ధత, కొత్త భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. కాగా, టీసీఎస్ క్యూ2లో 10 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది.



పటిష్ట పనితీరు

"క్యూ2లో ప్రదర్శించిన పటిష్ట పనితీరు సంతోషాన్నిచ్చింది. అంకితభావం, సామర్థ్యాలు చూపిన మా ఉద్యోగులకు కృతజ్ఞతలు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ ఆధారిత టెక్నాలజీ సర్వీసుల కంపెనీగా అవతరించే ప్రయాణంలో ఉన్నాం. ఇందుకు అనుగుణంగా నైపుణ్యం, మౌలికసదుపాయాలు, వ్యవస్థాగత భాగస్వామ్యాలలో ట్రాన్స్‌ఫార్మేషన్‌కు ప్రాధాన్యతనిస్తున్నాం. తగిన పెట్టుబడులు వెచ్చిస్తున్నాం."
– కె. కృతివాసన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

లిస్ట్‌ఎంగేజ్ కొనుగోలు

మసాచుసెట్స్(యూఎస్) సంస్థ లిస్ట్‌ఎంగేజ్‌లో 100 శాతం వాటాను టీసీఎస్ కొనుగోలు చేసింది. ఇందుకు యాజమాన్య ప్రోత్సాహకాలు, వ్యయాలుకాకుండా 7.28 కోట్ల డాలర్లు (సుమారు రూ. 645 కోట్లు) వెచ్చించింది.

డేటా సెంటర్లకు సై.. 57,700 కోట్ల పెట్టుబడి

భారీ పెట్టుబడి ప్రణాళికలతో డేటా సెంటర్ల బిజినెస్‌లోకి ప్రవేశించనున్నట్లు టీసీఎస్ తాజాగా ప్రకటించింది. ఇందుకు రానున్న 5–7ఏళ్లలో 6.5 బిలియన్ డాలర్ల(రూ. 57,700 కోట్లు)పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కృతివాసన్ వెల్లడించారు. తద్వారా దశలవారీగా 1 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. వీటికి పెట్టుబడులను ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు టీసీఎస్ వివరించింది. 150 మెగావాట్లకు బిలియన్ డాలర్లు అవసరంకాగా.. గిగావాట్ సామర్థ్యానికి 6.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెచ్చించవలసి ఉంటుందని కంపెనీ మదింపు చేసింది.

టీసీఎస్ షేరు బీఎస్ఈలో 1.2% బలపడి రూ. 3,062 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు వచ్చాయి.

6,000 ఉద్యోగాల కోత

కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 6,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు టీసీఎస్ సీహెచ్ఆర్‌వో సుదీప్ కున్నుమల్ వెల్లడించారు. ఇది మొత్తం సిబ్బంది సంఖ్యలో 1 శాతమేనని తెలియజేశారు. అయితే మరింత భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తారన్న వదంతులను తోసిపుచ్చారు. కాగా.. ఐటీ నిపుణుల యూనియన్ నైట్స్ వివరాల ప్రకారం టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య క్యూ2లో 5,93,314కు చేరింది. ఈ ఏడాది క్యూ1లో నమోదైన 6,13,069 సంఖ్యతో పోలిస్తే 19,755 మంది ఉద్యోగులు తగ్గారు. అయితే ఈ క్యూ2లో 18,500 మందికి ఉపాధి కల్పించినట్లు కున్నుముల్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో డిమాండుకు అనుగుణంగా నియామకాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాది జూలైలో ప్రపంచవ్యాప్తంగా కంపెనీ సిబ్బందిలో 2%(12,261) మందిని తొలగిస్తున్నట్లు టీసీఎస్ ప్రకటించడం తెలిసిందే.

రేసు గుర్రం.. సిల్వర్

- ఢిల్లీలో 6,000 అప్; రూ.1,63,000తో కొత్త రికార్డు
- అంతర్జాతీయంగానూ కొత్త గరిష్టం

న్యూఢిల్లీ: వెండి ధరల పరుగు రేసుగుర్రాన్ని తలపిస్తోంది. గురువారం ఢిల్లీ మార్కెట్లో కిలోకి రూ.6,000 పెరిగింది. రూ.1,63,000 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఈ నెల 6న కూడా వెండి ధర కిలోకి రూ.7,400 పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లోనూ వెండి ధర మొదటిసారి ఔన్స్‌కు 50 డాలర్ల స్థాయికి (49.95) చేరి, 2012 నాటి గరిష్టాన్ని చెరిపేసింది. 2012లో ఔన్స్ వెండి ధర 49.50 డాలర్లకు చేరుకుని, తర్వాత గణనీయంగా దిద్దుబాటుకు గురైంది. ఇన్నాళ్ల తర్వాత తిరిగి వెండి లోహానికి బలమైన డిమాండ్ కనిపిస్తోంది. పరిశ్రమల నుంచి డిమాండ్‌కు తోడు, అమెరికా వడ్డీ రేట్ల కోతపై అంచనాలు వెండి ధరలను నడిపిస్తున్నట్టు అనలిస్టుల అభిప్రాయం. మరోవైపు పసిడి ధర (99.9 శాతం స్వచ్ఛత) ఢిల్లీ మార్కెట్లో క్రితం ముగింపు నాటితో పోల్చితే ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,600 వద్ద ఉంది.



ఐటీ, మెటల్ షేర్ల ర్యాలీ



ముంబై: ఒకరోజు విరామం తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం మళ్లీ లాభాల బాట పట్టింది. ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకుల షేర్ల ర్యాలీతో సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ 398 పాయింట్లు పెరిగి 82,172 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 136 పాయింట్లు బలపడి 25,182 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 474 పాయింట్లు బలపడి 82,248 వద్ద, నిఫ్టీ 153 పాయింట్లు ఎగసి 25,199 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. మెటల్ సూచీ 2.16%, కమోడిటీస్ 1.34%, ఐటీ 1.13% రాణించాయి. ఆసియాలో చైనా సూచీ 1.50%, జపాన్ ఇండెక్సు 2% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

ఎల్‌జీ సబ్‌స్క్రిప్షన్ విలువ రూ. 4 లక్షల కోట్లు

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓకు స్పందన అదిరింది. ఇష్యూ ముగిసేసరికి 54.02 రెట్ల స్పందన లభించింది. కంపెనీ రూ.11,607 కోట్ల సమీకరణ లక్ష్యంలో భాగంగా 7.13 కోట్ల ఈక్విటీలను జారీ చేసింది. మొత్తం 385 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. వీటి విలువ రూ.4.02 లక్షల కోట్లు. ఇది సరికొత్త రికార్డు. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 3.54 రెట్లు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కాగా, గతేడాది బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు రూ.3.24 లక్షల కోట్ల బిడ్లు వచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రూ. 6 లక్షల కోట్లతో 25 గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు | జీసీసీలకు కీలక హబ్‌గా తెలంగాణ

యూకే ఒప్పందంతో ఎంఎస్‌ఎంఈలకు బూస్ట్



- ఉద్యోగాల కల్పనకు దన్ను
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు
- సీఈవోల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంతో (సెటా) చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) ఊతం లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు ఇది దోహదపడుతుందని ఆయన చెప్పారు. సెటా దన్నుతో 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలన్న లక్ష్యాన్ని సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి సీఈవోల సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. రెండు పెద్ద దేశాల ఉమ్మడి పురోగతికి, ప్రజల శ్రేయస్సుకు సెటా తోడ్పడుతుందన్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను నెలకొల్పగలిగే రంగాలను గుర్తించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. పాలసీపరంగా స్థిరత్వం, అంచనాలకు అనుగుణమైన నియంత్రణ విధానాలు, భారీ స్థాయి డిమాండ్ లాంటివి భారత్‌కు సానుకూలాంశాలని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ఫార్మా, ఇన్‌ఫ్రా, ఎనర్జీ, ఫైనాన్స్ తదితర రంగాల్లో ఇన్వెస్ట్ చేయాలని బ్రిటన్ కంపెనీలను ఆహ్వానించారు.

ఇరు దేశాల బంధం బలోపేతం..

ప్రస్తుతం అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ సెటాతో భారత్–యూకే మధ్య బంధం మరింత పటిష్టమైందని ప్రధాని పేర్కొన్నారు. 'ప్రస్తుతం భారత్–యూకే ద్వైపాక్షిక వాణిజ్యం 56 బిలియన్ డాలర్లుగా ఉంది. నిర్దేశించుకున్న డెడ్‌లైన్ 2030 నాటికి దీన్ని రెట్టింపు చేసుకోగలమనే నమ్మకం ఉంది' అని చెప్పారు. 'టెలికం, ఏఐ, బయోటెక్, క్వాంటమ్, సెమీకండక్టర్, సైబర్, స్పేస్ తదితర రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. అలాగే కీలక లోహాలు, రేర్ ఎర్త్ మొదలైన విభాగాల్లోనూ నిర్మాణాత్మకంగా ముందుకెళ్లాలి. భారత్–యూకే ఉమ్మడిగా ప్రపంచంలో అగ్రగాములుగా నిల్చేందుకు అవకాశమున్న రంగాలను రెండు దేశాల వ్యాపార దిగ్గజాలు గుర్తించాలి. ఫిన్‌టెక్, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్ లేదా స్టార్టప్‌లు.. ఇలా ఏ రంగంలోనైనా సరే ఇరు దేశాలు కలిసి అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలి' అని మోదీ పేర్కొన్నారు. యూకేకి చెందిన తొమ్మిది యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ప్రారంభిస్తాయని ఆయన తెలిపారు.

పరిశ్రమకు పూర్తి సహకారం: స్టార్మర్

అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు ఇరు దేశాల ప్రభుత్వాలు తీసుకోతగిన చర్యలను సూచించాలని పరిశ్రమ దిగ్గజాలను స్టార్మర్ కోరారు. వాణిజ్య ఒప్పందం ప్రయోజనాలను పొందేందుకు పరిశ్రమకు కావాల్సిన పూర్తి సహకారాన్ని అందిస్తామని ఆయన చెప్పారు. జూలైలో సెటాపై సంతకాలు జరిగినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య 6 బిలియన్ పౌండ్ల మేర వాణిజ్యం, పెట్టుబడులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

భారత్‌లో ఇన్వెస్ట్ చేయండి..

ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో పాల్గొన్న సందర్భంగా అంతర్జాతీయ ఇన్వెస్టర్లను మోదీ ఆహ్వానించారు. తద్వారా భారత్ వృద్ధి గాథలో పాలుపంచుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థ గతంలో కొందరికే పరిమితమై ఉండేదని, దాన్ని అందరికీ సాధికారత కల్పించే సాధనంగా డిజిటల్ టెక్నాలజీ మార్చిందన్నారు. జేఏఎం (జన్‌ధన్, ఆధార్, మొబైల్) వ్యూహం ఇందుకు ఉపయోగపడిందని చెప్పారు. 'సాంకేతికత, ప్రజలు, భూమి.. ఇలా అన్నింటికీ ప్రయోజనం చేకూర్చగలిగే ఫిన్‌టెక్ ప్రపంచాన్ని సృష్టించాలి. ఇన్నోవేషన్ లక్ష్యమనేది వృద్ధి మాత్రమే కాకూడదు, మేలు చేసేదిగా ఉండాలి. ఫైనాన్స్ అంటే కేవలం అంకెలు కాదు.. మానవాళి పురోగతికి దోహదకారిగా ఉండాలి' అని ప్రధాని చెప్పారు. భారత్ విషయంలో ఏఐ అంటే సమ్మిళితత్వానికి సంక్షిప్త రూపమని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌తో పతకాన్ని ఖాయం చేసుకున్న భారత్

ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు పతకంతో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ ఈవెంట్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 44–45, 45–30, 45–33తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. సెమీస్ చేరడం ద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. బాలుర డబుల్స్‌లో భార్గవ్ రామ్–విశ్వతేజ్ జంట 5–9తో చొ హ్యోంగ్ వూ–లీ హ్యోంగ్ వూ జోడీ చేతిలో ఓడింది. బాలికల డబుల్స్‌లో వెన్నెల–రిషిక జోడీ 10–9తో చివోన్ హ్యా– మున్ ఇన్ సియో జంటపై గెలిచింది. తర్వాత బాలుర సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్ 11–9తో చొయ్ అహ్ సియంగ్‌ను ఓడించాడు. కానీ మిక్స్‌డ్ డబుల్స్‌లో లాల్‌రామ్‌సంగ–అన్య బిష్త్ జోడీ 4–9తో లీ–చివోన్ జంట చేతిలో ఓడింది. కీలకమైన మహిళల సింగిల్స్ రెండు మ్యాచ్‌ల్లోనూ ఉన్నతి హుడా గెలుపొందడంతో భారత్ విజయం సాధించింది.



క్లీన్‌స్వీప్ లక్ష్యంగా భారత్

- నేటినుంచి వెస్టిండీస్‌తో ఆఖరి టెస్టు
- ఉ.గం.9.30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్', 'జియో హాట్‌స్టార్'లలో ప్రసారం

న్యూఢిల్లీ: తొలిటెస్టును మూడే రోజుల్లో ముగించిన భారత జట్టు ఇప్పుడు రెండు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి వెస్టిండీస్‌తో జరిగే చివరి టెస్టులో ప్రత్యర్థిని వైట్‌వాష్ చేయడమే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో వరుసగా రెండుసార్లు ఫైనలిస్టుగా నిలిచిన భారత్... ప్రస్తుత ప్రత్యర్థి కరీబియన్ కంటే ఎన్నో రెట్లు మెరుగ్గావుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లతో పాటు సొంతగడ్డ అనుకూలతలు కూడా టీమిండియాను అజేయంగా నిలుపుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరిగిన మొదటి టెస్టులో ఏకంగా ముగ్గురు బ్యాటర్లు రాహుల్, ధ్రువ్ జురేల్, జడేజా శతకాల మోత మోగించారు. ఇక జట్టులో ఎవరైనా నిరూపించుకోవాలి అంటే అది సాయి సుదర్శన్ ఒక్కడే! గత మ్యాచ్‌లో అతను సింగిల్ (7) డిజిట్‌కే వికెట్ పారేసుకున్నాడు. ఈ నేపథ్యంలో బ్యాటర్లకు అచ్చొచ్చే ఇక్కడి అరుణ్ జైట్లీ స్టేడియంలో అతను ఫామ్‌లోకి రావాలని జట్టు మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. బౌలింగ్‌లో స్టార్ సీమర్లు బుమ్రా, సిరాజ్‌లతో పాటు స్పిన్నర్లు కుల్దీప్, జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు అందరూ ఫామ్‌లో ఉన్నారు. తొలిటెస్టులో భారత బౌలింగ్ దళం ప్రత్యర్థిని రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఒక రోజు ఓవర్ల కోటా (90 ఓవర్లు)నైనా పూర్తిగా ఆడనివ్వకుండా ఆలౌట్ చేసింది. ఇలాంటి పటిష్టమైన జట్టుపై కరీబియన్ గెలవడమైతే అసాధ్యం. అయితే ఎన్ని రోజుల్లో ముగుస్తుందనేది ఇక్కడ ఆసక్తికరం.

ఢిల్లీ గతమిది...

సంప్రదాయ టెస్టుల్లో భారత్‌కు బాగా కలిసొచ్చే వేదిక ఏదైన ఉందంటే అది ఢిల్లీనే. 38 ఏళ్లుగా ఇక్కడ టీమిండియాకు ఓటమంటేనే తెలీదు. చివరిగా 1987లో అదికూడా విండీస్ చేతిలోనే ఓడిన భారత్ తర్వాత 24 మ్యాచ్‌లాడినా... ఇందులో ఏ ఒక్క టెస్టులోనూ ఓడలేదు. 12 టెస్టుల్లో గెలిచిన భారత జట్టు, మరో 12 మ్యాచ్‌ల్ని డ్రాగా ముగించింది.

తుది జట్లు (అంచనా)

భారత్: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురేల్, జడేజా, నితీశ్ కుమార్‌రెడ్డి, సుందర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

వెస్టిండీస్: రోస్టన్ చేజ్ (కెప్టెన్), తేజ్ నారాయణ్, క్యాంప్‌బెల్, అతనేజ్, బ్రాండన్ కింగ్, షైహోప్, గ్రీవ్స్, వారికన్, పియర్, జాన్ లేన్‌/ట్వేడ్స్, సీలెస్.

పిచ్–వాతావరణం

ఢిల్లీ భిన్నమైన వికెట్. తొలి రెండు రోజుల బ్యాటింగ్‌కు స్వర్గధామం. మూడో రోజు గడిచే కొద్ది పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుంది. మ్యాచ్ రోజుల్లో తేలికపాటి వర్షాలున్నా... మ్యాచ్‌ను పూర్తిగా ప్రభావితం చేసే స్థాయిలో లేవు.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

విజయం చేజార్చుకున్నారు...

వైజాగ్‌లో భారత మహిళల అనూహ్య ఓటమి

- 3 వికెట్లతో నెగ్గిన దక్షిణాఫ్రికా
- సఫారీలను గెలిపించిన డి క్లెర్క్
- రిచా ఘోష్ ఇన్నింగ్స్ వృథా
- ఆదివారం ఆస్ట్రేలియాతో హర్మన్ బృందం ఢీ

వన్డే వరల్డ్ కప్ వేటలో విశాఖ తీరాన భారత మహిళల బృందానికి అనూహ్య ఓటమి ఎదురైంది. గెలుపు ఖాయమనుకున్న దశలో దక్షిణాఫ్రికా బ్యాటర్ డి క్లెర్క్ చెలరేగి భారత్‌నుంచి మ్యాచ్‌ను లాక్కుంది. చివరి 5 ఓవర్లలో 52 పరుగులు చేయాల్సి ఉండగా 4 ఫోర్లు, 5 సిక్సర్లు బాదిన డి క్లెర్క్ 7 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించింది. అంతకు ముందు భారత్ మళ్లీ బ్యాటింగ్‌లో తడబడింది. అయితే రిచా ఘోష్ అద్భుత ఇన్నింగ్స్‌తో మెరుగైన స్కోరును అందించింది. ఆదివారం ఇదే వైజాగ్ మైదానంలో ఆస్ట్రేలియాతో హర్మన్ సేన తలపడుతుంది.


హర్మన్



డి క్లెర్క్ సంబరం


రిచా

సాక్షి క్రీడా ప్రతినిధి, విశాఖపట్నం: మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 3 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (77 బంతుల్లో 94; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ అవకాశం చేజార్చుకుంది. ఒక దశలో భారత్ స్కోరు 153/7 కాగా...రిచా, స్నేహ్ రాణా (24 బంతుల్లో 33; 6 ఫోర్లు) ఎనిమిదో వికెట్‌కు 53 బంతుల్లో 88 పరుగులు జోడించి మెరుగైన స్థితికి చేర్చారు. అనంతరం దక్షిణాఫ్రికా 48.5 ఓవర్లలో 7 వికెట్లకు 252 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్‌వర్ట్ (111 బంతుల్లో 70; 8 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. అయితే చివర్లో నాడిన్ డి క్లెర్క్ (54 బంతుల్లో 84 నాటౌట్; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ దక్షిణాఫ్రికాను గెలిపించింది. వర్షం కారణంగా మ్యాచ్ గంట ఆలస్యంగా మొదలైంది.

హర్మన్ మళ్లీ విఫలం...

స్మృతి మంధాన (32 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) కాస్త జాగ్రత్తగా బ్యాటింగ్ చేసింది. 21వ బంతికి గానీ ఆమె తొలి బౌండరీ కొట్టలేకపోయింది. మరో ఓపెనర్ ప్రతీక రావల్ (56 బంతుల్లో 37; 5 ఫోర్లు) చక్కటి ఆఫ్‌సైడ్ షాట్లతో ఆకట్టుకుంది. అయితే ఆ తర్వాత దక్షిణాఫ్రికా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత్ 47 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు చేజార్చుకుంది. ఓపెనర్లతో పాటు హర్లీన్ డియోల్ (13) కూడా వెనుదిరగ్గా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (9) తన వైఫల్యాన్ని కొనసాగించింది. జెమీమా రోడ్రిగ్స్ (0) టోర్నీలో రెండో డకౌట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత దీప్తి (4) పెవిలియన్ చేరింది. ఈ దశలో అమన్‌జోత్ (13)తో రిచా జత కలిసింది. వీరిద్దరు కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు.

రిచా షో...

40వ ఓవర్ చివరి బంతికి అమన్ అవుటైంది. ఆ సమయంలో 153/7 వద్ద స్కోరు 200 దాటడం కూడా కష్టమే అనిపించింది. ఈ స్థితిలో రిచా చెలరేగిపోయింది. క్లెర్క్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన ఆమె 53 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. ఆ తర్వాత ఖాకా వేసిన 47వ ఓవర్లో వరుసగా 4, 4, 6తో పండగ చేసుకుంది. ఇన్నింగ్స్ చివరి ఓవర్ ఆరంభానికి ముందు 84 పరుగుల వద్ద ఉన్న రిచా...వరుసగా 2, 4, 4తో 94కు చేరుకుంది. అయితే తర్వాతి బంతికి అవుటై శతకం కోల్పోయింది. ఆఖరి 10 ఓవర్లలో భారత్ 98 పరుగులు చేయడం విశేషం.

టపటపా...

ఛేదనలో దక్షిణాఫ్రికా ఆరంభంలో తేలిపోయింది. తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ లారా మినహా ప్రధాన బ్యాటర్లంతా కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోవడంతో సఫారీలకు ఓటమి తప్పదనిపించింది. అయితే డి క్లెర్క్, క్లో ట్రయాన్ (66 బంతుల్లో 49; 5 ఫోర్లు) అసాధారణ పోరాటం ఆ జట్టును గెలిపించింది.

982 స్మృతి మంధాన 2025లో వన్డేల్లో చేసిన పరుగులు. ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా బెలిండా క్లార్క్ (970 - 1997) రికార్డును ఆమె అధిగమించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక (సి) బ్రిట్స్ (బి) సెఖుఖునే 37; స్మృతి (సి) లూస్ (బి) ఎంలాబా 23; హర్లీన్ (బి) ఎంలాబా 13; హర్మన్‌ప్రీత్ (సి) కాప్ (బి) ట్రయాన్ 9; జెమీమా (ఎల్బీ) (బి) ట్రయాన్ 0; దీప్తి (సి) జాఫ్తా (బి) కాప్ 4; అమన్‌జోత్ (సి) లూస్ (బి) ట్రయాన్ 13; రిచా (సి) ట్రయాన్ (బి) డి క్లెర్క్ 94; రాణా (సి) వోల్‌వార్ట్ (బి) కాప్ 33; క్రాంతి (నాటౌట్) 0; శ్రీచరణి (సి) వోల్‌వార్ట్ (బి) డి క్లెర్క్ 0; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 251. వికెట్ల పతనం:** 1–55, 2–83, 3–91, 4–92, 5–100, 6–102, 7–153, 8–241, 9–251, 10–251. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 9–0–45–2, ఖాకా 7–0–47–0, డి క్లెర్క్ 6.5–0–52–2, ఎంలాబా 10–0–46–2, సెఖుఖునే 7–0–29–1, ట్రయాన్ 10–0–32–3.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: వోల్‌వార్ట్ (బి) క్రాంతి 70; బ్రిట్స్ (సి) అండ్ (బి) క్రాంతి 0; లూస్ (సి) రిచా (బి) అమన్‌జోత్ 5; మరిజాన్ కాప్ (బి) స్నేహ్ 20; బాష్ (సి) అండ్ (బి) దీప్తి 1; జాఫ్తా (ఎల్బీ) (బి) శ్రీచరణి 14; ట్రయాన్ (ఎల్బీ) (బి) రాణా 49; డి క్లెర్క్ (నాటౌట్) 84; ఖాకా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (48.5 ఓవర్లలో 7 వికెట్లకు) 252. వికెట్ల పతనం** : 1–6, 2–18, 3–57, 4–58, 5–81, 6–142, 7–211. **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 9–0–59–2, అమన్‌జోత్ 5.5–0–40–1, స్నేహ్ రాణా 10–0–47–2, శ్రీచరణి 10–1–37–1, దీప్తి 10–0–54–1, హర్మన్‌ప్రీత్ 4–0–15–0.

ఫెయిర్.. ఫర్మ్.. ఫ్రెండ్లీ పోలీసింగ్

కొత్త డీజీపీ ఎఫ్-3 మంత్రం

- ఇదే తన విధానమన్న డీజీపీ శివధర్‌రెడ్డి
- అవినీతిని సహించేది లేదని స్పష్టం
- డీజీపీగా తొలిసారి పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ శివధర్‌రెడ్డి. చిత్రంలో స్వాతి లక్రా, మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: ఫెయిర్.. ఫర్మ్..ఫ్రెండ్లీ (ఎఫ్–3) అనేవి తెలంగాణ పోలీస్ మూల సూత్రాలని డీజీపీ బి.శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిష్పాక్షికమైన, దృఢమైన, స్నేహపూర్వక, ప్రొఫెషనల్ పోలీసింగ్ ప్రజలకు అందించేందుకు పోలీస్‌శాఖలోని ప్రతి అధికారి పనిచేయాలని సూచించారు. డీజీపీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత శివధర్‌రెడ్డి తొలిసారి రాష్ట్రంలోని పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. గురువారం డీజీపీ కార్యాలయంలో అదనపు డీజీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు, డీసీపీలతో జరిగిన సమావేశంలో డీజీపీ పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఫెయిర్ (న్యాయమైన) పోలీసింగ్ అంటే ప్రతి పౌరుడిని చట్టం ముందు సమానంగా చూస్తూ నిష్పక్షపాతంగా న్యాయం అందించడం. ఫర్మ్ (దృఢమైన) పోలీసింగ్.. అంటే భయం లేదా పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేస్తూ శాంతి భద్రతలను నెలకొల్పడం. ఫ్రెండ్లీ (స్నేహపూర్వక) పోలీసింగ్ అంటే పౌరులలో విశ్వాసం, సానుభూతి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడం. అలాగే ప్రొఫెషనల్ (వృత్తిపరమైన) పోలీసింగ్ అంటే.. సామర్థ్యం, నీతి, క్రమశిక్షణ, జవాబుదారీతనాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ నాలుగు సూత్రాలు ఆధునిక పోలీసింగ్ స్ఫూర్తిని నిర్వచిస్తాయి. మానవీయ కోణంలో పనిచేస్తూ.. నీతి, సామర్థ్యంలో రాజీపడకుండా పనిచేయాలి' అని దిశానిర్దేశం చేశారు.

బేసిక్ పోలీసింగ్ మరవొద్దు

బేసిక్ పోలీసింగ్ తెలంగాణ పోలీసుల ఆపరేషనల్ వెన్నెముకగా ఉండాలని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. బేసిక్ పోలీసింగ్‌లో కీలకమైన బీట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, ఇంటెలిజెన్స్ సేకరణ, అత్యవసర స్పందన, నేర నివారణ, గుర్తింపు, ప్రజా శాంతిభద్రతల నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్ తప్పక ఉండాలని చెప్పారు. కేవలం నేరగణాంకాల్లో తగ్గుదలే బేసిక్ పోలీసింగ్ విజయానికి కొలమానం కాదని, పోలీసులపై ప్రజల విశ్వాసం, నమ్మకం, సంతృప్తి ద్వారా కొలవాలని ఆయన నొక్కిచెప్పారు. బేసిక్ పోలీసింగ్‌ను ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేయడం ద్వారా పోలీసుల సామర్థ్యాన్ని పెంచవచ్చని అభిప్రాయపడ్డారు. కొత్తగా ఎంపికైన డీఎస్పీల శిక్షణ ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతుందని అదనపు డీజీ (ట్రైనింగ్) వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, చారు సిన్హా, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనార్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాకు చేరిన ప్యాడీ డ్రయర్లు

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఆరబెట్టే యంత్రాలు

రైతులకు తప్పనున్న ఇబ్బందులు

సాక్షి, సిద్దిపేట: పండించిన పంటలను విక్రయించే సమయంలో తేమ శాతం తగ్గించేందుకు రైతులు యుద్ధం చేయాల్సి వస్తోంది. దీంతో రైతుల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ప్రయోగాత్మకంగా ఆటోమేటిక్ డ్రయర్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. తొలి విడతలో ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ప్రతి జిల్లాకు 2 నుంచి 4 డ్రయర్లు పంపించారు. ఇవి ఇప్పటికే ఆయా జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్లకు చేరుకున్నాయి. ప్యాడీ డ్రయర్ మెషీన్ 40 క్వింటాళ్ల ధాన్యాన్ని గంటకు 6 శాతం చొప్పున తేమను తగ్గిస్తుంది. తేమ 30 శాతం ఉన్నా కూడా అందులో పోస్తే ఆరబెడుతుంది. దీంతో ధాన్యం నాణ్యత మెరుగుపడుతుంది. గంటకు 40 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టేందుకు దాదాపు రూ.500 వరకు ఖర్చవుతుంది. దీంతో రైతుల ఇబ్బందులు తప్పనున్నాయి.

> **జిల్లాకు రెండు వచ్చాయి..**
>
> కొనుగోలు కేంద్రాలకు తొలిసారిగా ప్యాడీ డ్రయర్లను అందుబాటులోకి తెచ్చాం. సిద్దిపేట జిల్లాకు రెండు కేటాయించారు. ఇది గంట సమయంలో దాదాపు 6% తేమను తగ్గిస్తుంది. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి.
>
> – ప్రవీణ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

65 రోజుల్లో రూ. 7.88 కోట్లు

ఇన్వెస్ట్‌మెంట్ మోసంలో వ్యాపారవేత్త నుంచి కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, హైదరాబాద్: కేవలం 65 రోజుల్లో రూ. 7.88 కోట్లు కొల్లగొట్టిన భారీ మోసం కేసు ఇది. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీకి చెందిన 55 ఏళ్ల వ్యాపారవేత్త ఒక నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెట్టి రూ. 7.88 కోట్లు కోల్పోయాడు. అతను కొంతమంది తెలియని వ్యక్తుల ద్వారా సులభమైన లాభాల కోసం ఒక వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెట్టారు. భారీ లాభాలు వచ్చినట్టు చూపినా.. నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కాకపోవడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాలు ఇలా.. జూలై 25న కేపీహెచ్‌బీకి చెందిన వ్యాపారి పి.నాగేశ్వరరావుకు సత్యనారాయణ, వైశాలి అనే పేర్లతో గుర్తు తెలియని వ్యక్తులు 'ఫినాల్టో ఇండస్' అనే ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన వాట్సాప్ లింక్ పంపి అతన్ని అందులో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. తాము యూకే స్టాక్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌లతో సంబంధం కలిగి ఉన్నట్లు నమ్మించారు. మొదట జూలై 25న, అతను యూపీఐ ద్వారా రూ. 45,000 పెట్టుబడి పెట్టాడు. దీంతో అతని ట్రేడింగ్ ఖాతా 15% లాభాన్ని చూపించింది. గణనీయమైన లాభాలను సంపాదించాలంటే, రొటీన్ ట్రేడింగ్, ఐపీఓ కోసం భారీ మూలధనాన్ని పెట్టుబడి పెట్టాలని వారు ఒత్తిడి చేశారు. మొదట్లో, అతను తన నమ్మకాన్ని బలపరచడానికి రూ. 8,600 విత్‌డ్రా చేశాడు. వారిని ఒప్పించడంతో, అతను 65 రోజుల వ్యవధిలో మొత్తం రూ. 7,88,18,233 పెట్టుబడి పెట్టాడు. ఈ కాలంలో, ఖాతా సుమారు రూ. 11 కోట్ల లాభాన్ని చూపించారు. సెప్టెంబర్ 30న, అతను తన నిధులను విత్‌డ్రా చేయడానికి యత్నించినప్పుడు, 30% క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ అయిన రూ. 3 కోట్లు చెల్లించాలని వారు తెలిపారు. దీంతో ట్యాక్స్, విత్‌డ్రాయల్ నిబంధనల చట్టబద్ధతపై అతనికి అనుమానాలు కలిగాయి. అప్పుడు, అతను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశాడు. అధికారులు కేసును నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

వ్యర్థాల రీసైక్లింగ్‌కు చర్యలు

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

సాక్షి, అమరావతి: పారిశ్రామిక వ్యర్థాల రీసైక్లింగ్ చర్యలు తీసుకుంటామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య చెప్పారు. విజయవాడలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాఖాధిపతులతో గురువారం నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న అనంతరం కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. దేశంలో సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ(4.0)ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించనుందన్నారు. ఈ పాలసీని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

పంచాయతీరాజ్ సంస్థలకు రూ.410 కోట్లు

సాక్షి, అమరావతి/సాక్షి న్యూఢిల్లీ: రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.410 కోట్లను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. దీంతో 13 జిల్లా పరిషత్‌లకు, 650 మండల పరిషత్‌లకు, 13,092 పంచాయతీలకు లబ్ధి చేకూరనుంది.

ఔషధ నియంత్రణ విభాగం జేడీకి డైరెక్టర్ బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ ఎం.పాండురంగ ప్రసాద్‌కు డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు వైద్య శాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రీ–అపాయింట్‌మెంట్‌పై డైరెక్టర్‌గా నియమితులైన ఎంబీఆర్ ప్రసాద్ పదవీకాలం ఈ నెల 2వ తేదీతో ముగిసింది.

మైనార్టీ యువతకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని మైనార్టీ నిరుద్యోగ యువతకు ఖతార్ దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ప్రకటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ద్వారా ఖతార్ దేశంలోని దోహా ప్రాంతంలో హోమ్ కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. మైనారిటీ వర్గాల యువతీ యువకులు http://naipunyam.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈనెల 12 వరకూ గడువు ఉందన్నారు.

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: ఏప్రిల్ 15న విడుదల చేసిన జీవో 13 ప్రకారం 2,260 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. విజయవాడలో గురువారం స్పెషల్ డీఎస్సీ అభ్యర్థులతో జరిగిన సమావేశంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. సుప్రీం ఆదేశాల మేరకు డిసెంబర్ 15లోపు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని కోరారు.

రూ.670 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు అప్‌లోడ్ చేశాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబుతో చర్చించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తామని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు ఆపొద్దని కోరారు. రూ.670 కోట్ల బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, మరో రూ.రెండు వేల కోట్ల బిల్లులు పరిశీలనలో ఉన్నాయన్నారు.

నవంబర్‌లో టెట్.. మార్చిలో డీఎస్సీ

విద్యాశాఖ మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: ఈ ఏడాది నవంబర్‌లో టెట్, వచ్చే మార్చిలో డీఎస్సీ, స్పెషల్ డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను భర్తీచేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం పాఠశాలవిద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలుచేయాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తిచేసి తర్వాత 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 11 జవహర్ నవోదయ విద్యాలయాల పనులను త్వరగా ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

బాల్య వివాహాలతో చిన్నారులు అనారోగ్యం బారిన పడతారు. పలు అనర్థాలకు దారి తీస్తాయి. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండితేనే వివాహం చేయాలనేది నిబంధన. ఆ వయసు నిండకుండా చేయడం నేరం. బాధ్యులపై గరిష్టంగా రెండేళ్లు జైలు, రూ. లక్ష వరకు జరిమానా లేదా రెండు అమలు చేసే వీలుంది. అయితే, ఇటీవల తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు చిన్న వయసులోనే వివాహం చేసి బరువు దించేసుకోవాలని చాలామంది భావిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు, ప్రేమ పెళ్లిళ్లనే భయంతో మరికొందరు ఈ రకంగా వ్యవహరిస్తున్నారు.



పసితనంలోనే పలుపుతాడు

- పల్నాడు జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- ఆర్థిక ఇబ్బందులతో పాటు ప్రేమ పెళ్లిళ్ల భయం
- చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్న తల్లిదండ్రులు
- జిల్లాలో 109 బాల్య వివాహాలు అడ్డుకున్న అధికారులు
- సత్తెనపల్లిలో 14 మందిపై కేసు నమోదు

జిల్లాలో బాల్య వివాహాల సమాచారం
(2024 జనవరి నుంచి 2025 ఆగస్ట్ వరకు)

109 వివాహాల యత్నం	109 అధికారులు అడ్డుకున్నవి
3 అడ్డుకున్నా జరిగినవి	3 పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు



నరసరావుపేటలో బాల్య వివాహం చేయబోమని లిఖిత పూర్వక హామీ తీసుకొని కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్నాయి. 2024 జనవరి నుంచి 2025 ఆగస్టు వరకు 109 బాల్య వివాహాలను స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వకంగా హామీ (బైండోవర్ లెటర్) తీసుకున్నారు. అయినా, తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రావడం లేదు. ఇలా అధికారుల ఆదేశాలు ధిక్కరించి మూడు బాల్య వివాహాలు జరగడంతో వారిపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. సత్తెనపల్లిలోని ధోబీఘాట్‌లో ఆగస్టు 3న బాల్య వివాహం జరిగింది. దీనిపై చైల్డ్ వెల్ఫేర్ కేర్‌కు ఫిర్యాదు కూడా వచ్చింది. విషయాన్ని గత నెల 23న చైల్డ్ వెల్ఫేర్ కేర్ ప్రతినిధి యర్రసాని ప్రశాంత్ కుమార్ సత్తెనపల్లి 4వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ గరికె కల్పన దృష్టికి తెచ్చారు. దీనిపై ఆమె విచారణ చేయడంతో వాస్తవమే అని తేలింది. వధూవరులతో పాటు ఇద్దరి తల్లిదండ్రులు, బంధువులు, వివాహం జరిపిన పూజారి, కల్యాణ మండపం నిర్వాహకుడు, ఫొటోగ్రాఫర్.. ఇలా మొత్తం 14 మందిపై బాల్య వివాహ చట్టం కింద పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేశారు.

బాల్య వివాహంతో దుష్ఫలితాలు...

- చిన్న వయసులోనే గర్భం దాల్చడం వల్ల ప్రసవ సమయంలో శిశువు మరణించడం లేదా తీవ్ర అనారోగ్య సమస్యలతో పుట్టే ప్రమాదం ఉంది.
- గర్భస్రావం అయ్యే అవకాశం ఎక్కువ
- రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది
- పోషకాహార లోపం, రక్తహీనత తదితర సమస్యలు ఎదురవుతాయి
- వివాహం తరువాత చదువుకునే అవకాశం లేకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి

బాల్య వివాహాలతో అనర్థం



బాల్య వివాహాలతో అనర్థాలే ఎక్కువ. గర్భం దాల్చిన బాలికలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. బిడ్డను మోసే సామర్థ్యం వారికి తక్కువగా ఉంటుంది. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లి ప్రాణానికీ ప్రమాదమే. ఒకవేళ బిడ్డ జన్మించినా బరువు తక్కువగా ఉండడం, అనేక అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

– డాక్టర్ బి.రవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పల్నాడు



సత్తెనపల్లి ధోబీ ఘాట్‌లో ఆగస్ట్ 3న జరిగిన బాల్య వివాహం

వీవోఏలపై గ్రామ సంఘాలదే నిర్ణయం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: స్వయం సహాయక సంఘాల్లో పుస్తక నిర్వహణ, శిక్షణ కోసం పని చేస్తున్న గ్రామ సంఘ సహాయకుల (వీవోఏ) తొలగింపు, ఎంపిక అనేది ఆయా గ్రామ సంఘాల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టంచేశారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం వీవోఏ సంఘ ప్రతినిధులతో మంత్రి శ్రీనివాస్, సెర్ప్ సీఈవో వాకాటి కరుణ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 27,000 మంది వీవోఏలు మూడేళ్లకు పైగా పని చేస్తున్నారని, వారి పనితీరు సంతృప్తిగా ఉంటే గ్రామ సంఘాల నిర్ణయం మేరకు కొనసాగవచ్చని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొందని చెప్పారు.

గురుకులాలు, వసతి గృహాలకు టాటా ట్రస్ట్ సహకారం

సాక్షి, అమరావతి: అంబేడ్కర్ గురుకులాలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో వాటర్ ఇన్‌లైన్ క్లోరినేషన్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ ఏర్పాటుకు టాటా ట్రస్ట్ ముందుకొచ్చింది. వెలగపూడి సచివాలయంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామితో టాటా ట్రస్ట్ ప్రతినిధులు గురువారం సమావేశమయ్యారు. వాటర్ ఇన్‌లైన్ క్లోరినేషన్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు, వంట మనుషులకు నాణ్యమైన ఆహారం తయారీపై శిక్షణ, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు టెక్నికల్ సపోర్ట్ అందించేందుకు టాటా ట్రస్ట్ ప్రతినిధులు సహకరిస్తామన్నారు. కుప్పం, కొండపి నియోజకవర్గాల్లోని గురుకుల పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు.

ముందస్తు పరీక్షలే బెస్ట్!

స్క్రీనింగ్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్

- రొమ్ము కాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం
- ప్రతి ఎనిమిది మంది మహిళల్లో ఒకరు రొమ్ము కాన్సర్ బాధితులే
- అక్టోబరు రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం

ఆధునిక జీవన శైలి వల్ల 50 ఏళ్లు దాటిన తరువాత వచ్చే రొమ్ము క్యాన్సర్లు నేడు 25 ఏళ్లకే కనిపించడం ఆందోళనకు దారి తీస్తోంది. విద్యావంతులు, చదువులేనివారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన లేకుండా నిర్లక్ష్యంగా ఉండటం వల్లే రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది అక్టోబరు నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.





జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్

గుంటూరు మెడికల్: పేదల పెద్దాసుపత్రిగా పేరుగడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే వైద్య పరికరం మెమోగ్రఫీ వైద్య పరికరం అందుబాటులో ఉంది. నాట్కో ట్రస్ట్ వారు రూ. కోటి విలువైన త్రీడీ డిజిటల్ మెమోగ్రఫీ వైద్య పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. మెమోగ్రామ్ పరీక్ష చేసినందుకు ప్రైవేటు ఆస్పత్రుల్లో సుమారు రూ. 2వేలు వరకు ఫీజు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణతోపాటు, రొమ్ము క్యాన్సర్ బాధితులకు అవసరమైన ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ఆపరేషన్‌ల అనంతరం అవసరమయ్యే రేడియేషన్ థెరఫీ, కిమోథెరఫీ వైద్య సేవలు సైతం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లో పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.

'మెమోగ్రామ్' పరీక్షలు చేయించుకున్నవారి వివరాలు..

జీజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష మెమోగ్రామ్ 2023లో 368 మంది, 2024లో 381మంది, 2025 సెప్టెంబరు వరకు 381 మంది పరీక్షలు చేయించుకున్నారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ 2022లో 34 మంది, 2023లో 73 మంది, 2024లో 69 మంది, 2025 సెప్టెంబరు వరకు 55 మంది రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్ చేయించుకున్నారు.



రొమ్ము క్యాన్సర్ పరీక్ష చేసే మెమోగ్రామ్ మెషీన్

తొలిదశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మెమోగ్రామ్ పరీక్ష చేస్తారు. మెమోగ్రామ్‌తో రెండు మి.మీ కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే వ్యాధి నుంచి త్వరితగతిన కోలుకోవటంతోపాటుగా మరణాన్ని తప్పించవచ్చు. మహిళలే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుని రొమ్ములో ఏమైనా గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్



మహిళలంతా మెమోగ్రామ్, బయాప్సీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రథమ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు. కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా ముందస్తుగా జనటిక్ పరీక్ష చేయించాలి. సంతానం లేనివారికి, ఆలస్యంగా పిల్లలు పుట్టిన వారికి సైతం రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

ఉచితంగా రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్లు...



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా రొమ్ము క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేలా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశాం . గత ఏడాది 69 మందికి, ఈఏడాది ఇప్పటివరకు 55 మందికి ఉచితంగా క్యాన్సర్ ఆపరేషన్లు చేశారు. నన్నపనేని లోకాధిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో సెంటర్‌లో 24 గంటలు కార్పోరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ఉచితంగా క్యాన్సర్ వైద్యసేవలను అందిస్తున్నారు.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

పెట్టుబడి పెట్టు.. గ్రీన్‌కార్డు పట్టు

- ఈబీ–5 వీసాతో అమెరికాలో స్థిరపడడం సులభం
- అవగాహన సదస్సులో నిపుణులు

సాక్షి, అమరావతి: అమెరికాలో స్థిరపడడానికి ఈబీ–5 ఇన్వెస్టర్ వీసా సులభ మార్గమని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్ అన్నారు. ఈబీ–5 ఇన్వెస్టర్ వీసా గురించిన అవగాహన సదస్సును న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ గురువారం విజయవాడలో నిర్వహించింది. ఈ సందర్భంగా ఇల్యా ఫిష్కిన్ మాట్లాడుతూ.. అమెరికాలో అనేక మంది భారతీయుల గ్రీన్‌కార్డ్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వారు సకాలంలో గ్రీన్ కార్డ్ పొందలేకపోతే అమెరికా వీడి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అలాంటి వారికి ఈబీ–5 ఇన్వెస్టర్ వీసా అద్భుత అవకాశమని తెలిపారు. ఈబీ–5 వీసా పొందాలంటే దాదాపు రూ.9.32 కోట్లు(1.05 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రాజెక్టు పెడితే మాత్రం రూ.7.11 కోట్లు సరిపోతుందన్నారు. ఈబీ–5 ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ పార్టనర్లు సుబ్బరాజు పేరిచర్ల, సంపన్న్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఈబీ–5 వీసా అమెరికాలో ఉన్న భారతీయులు శాశ్వత నివాస హక్కు పొందే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న సుబ్బరాజు పేరిచర్ల, ఇల్యా ఫిష్కిన్, సంపన్న్ మల్హోత్రా

ఎంబీబీఎస్ స్పోర్ట్స్ కోటా ప్రాధాన్యత జాబితాలు విడుదల


సాక్షి, అమరావతి : ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ సీట్లలో ప్రవేశాల కోసం స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తాత్కాలిక ప్రాధాన్యత జాబితాను గురువారం ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. అభ్యంతరాలను శనివారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు విద్యార్థులు తెలియజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. అదే విధంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను కూడా విడుదల చేశారు. విద్యార్థులు తమ అభ్యంతరాలను తెలియజేయడానికి ఆదివారం సా.5 గంటల వరకూ గడువు ఇచ్చారు.

ఒంగోలు ఆవులు, కోడెదూడల వేలం ఆపండి

గవర్నర్‌కు మన ఒంగోలు, పుంగనూరు గో జాతి అభివృద్ధి సేవా సంఘం ఫిర్యాదు

సాక్షి, అమరావతి: గుంటూరు లాం ఫామ్‌లో ఈ నెల 14వ తేదీన నిర్వహించతలపెట్టిన ఒంగోలు జాతికి చెందిన 99 ఆవులు, కోడెదూడల వేలం పాటను నిలిపివేయాలని మన ఒంగోలు, పుంగనూరు గో జాతి అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సంఘ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గుట్టుచప్పుడు కాకుండా తమకు అనుకూలమైన వారికి ఒంగోలుజాతి ఆవులు, కోడెదూడలను అప్పగించేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లుగా ఉందని తెలిపారు. వేలం వేస్తున్న ఆవులు, కోడెదూడలను పరిశీలించేందుకు కనీస సమయం కూడా ఇవ్వలేదన్నారు. కేవలం 13వ తేదీన పరిశీలించి, 14న వేలం పాటలో పాల్గొనాలని పేర్కొనడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణమే ఈ వేలం పాటను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు తక్కువ ధరకు ఆవులు, కోడెదూడలు అందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం : సీఎస్ కె. విజయానంద్



సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వివిధ అంశాలపై గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. విజయానంద్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతినెలా 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించి నమోదైన కేసులు, పరిహారం తదితర అంశాలను సమీక్షించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు 3,500 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయండి: ఎస్టీయూ

సాక్షి, అమరావతి: జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో స్థానచలనం పొందినప్పటికీ రిలీవర్ లేక వేలాది మంది ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారని, వెంటనే వారందరినీ రిలీవ్ చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ప్రభుత్వాన్ని కోరింది. డీఎస్సీ నియామకాల సమయంలో రిలీవర్ లేని పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని గతంలోనే చెప్పారని, ఆపై ఖాళీల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లతో ఖాళీలను భర్తీ చేసి బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసింది. ప్రభుత్వం వెంటనే బదిలీ అయిన వారిని రిలీవ్ చేసి మోడల్ ప్రైమరీకి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని విజ్ఞప్తి చేసింది.

ఎస్జీటీలకు పదోన్నతులివ్వాలి: ఎస్టీఏ

ప్రాథమిక, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్టీఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 18 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి డిగ్రీ, బీఈడీ అర్హత గల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ కేడర్ లేదా పీయస్ హెచ్ఎం పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

పీపీపీలో రహదారుల అభివృద్ధి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పీపీపీ విధానంలో రహదారులను అభివృద్ధి చేయాలని అధికారులను మంత్రి జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, భూసేకరణ అవసరం లేని రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధమైన నేపథ్యంలో వేగంగా ముందుకు అడుగులు వేయాలన్నారు. గురువారం విజయవాడలోని ఈఎన్సీ కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఆర్అండ్‌బీ శాఖకు చెందిన ఖాళీ స్థలాలను గుర్తించి,వాటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి అవకాశాలను పరిశీలించాలని చెప్పారు.

సాక్షి సినిమా



టైటిల్ ప్లీజ్ గురూ!

ఒక సినిమాకు అందులోని హీరో, దర్శకుడు, హీరోయిన్ సెంట్రాఫ్ ఎట్రాక్షన్‌గా ఉంటారు. అలాగే ఆ సినిమా ప్రేక్షకులకు చేరువ కావడానికి, మరింత ప్రమోషన్‌కు ఆ సినిమా టైటిల్ చాలా ముఖ్యం. అందుకే టైటిల్ విషయంలో చాలా కేర్ తీసుకుంటుంది యూనిట్. స్టార్ హీరో సినిమా అయితే ఏ టైటిల్ పెడతారా? అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తారు. ఆ కోవకు చెందిన తెలుగు చిత్రాలు పదికి పైనే ఉన్నాయి. ఈ చిత్రాలకు వర్కింగ్ టైటిల్స్ ఉన్నప్పటికీ, హీరో అభిమానులు ఒరిజినల్ 'టైటిల్ ప్లీజ్ గురూ..!' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇందుకు తగ్గట్లుగానే ఆయా చిత్రబృందాల మేకర్స్ కొన్ని టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారు. మరి... ఏ హీరో సినిమాకు, ఏ టైటిల్ పరిశీలిస్తున్నారనే విషయంపై మీరూ ఓ లుక్ వేయండి.

కింగ్ 100

నాగార్జున కెరీర్‌లోని వందో సినిమా షూటింగ్ పనులు ఊపందుకున్నాయని తెలిసింది. తమిళ దర్శకుడు ఆర్‌ఏ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైందని సమాచారం. నాగార్జున పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. ఈ సినిమా టైటిల్‌ను గురించి కూడా ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. నాగార్జున కెరీర్‌లోని ఈ వందో సినిమాకు 'కింగ్ 100', 'కింగ్ 100 నాటౌట్', 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ తెరపైకి వచ్చాయి. మరి... ఈ టైటిల్‌లో ఏ టైటిల్‌ని ఖరారు చేస్తారో మరికొన్ని రోజుల్లో తెలుస్తుంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది. ఇదిలా ఉంటే... నాగార్జున హీరోగా నటించిన 'మన్మథుడు 2' సినిమాలో కీర్తీ సురేష్ ఓ చిన్న గెస్ట్ రోల్ చేశారు. అలాగే కథ రీత్యా ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్‌కు చాన్స్ ఉందట. కీర్తీ సురేష్ ఓ లీడ్ హీరోయిన్‌గా చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఇంకా నాగార్జున, టబుల కాంబినేషన్‌లో 'నిన్నే పెళ్లాడతా' ఎంతటి బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిందో తెలిసిందే. నాగార్జున వందో సినిమాలోనూ టబు భాగమయ్యారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ విషయాలపై పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున నిర్మిస్తున్న ఈ మూవీ వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఆనంద నిలయం?

హీరో వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా రానుంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చిన బాబు) నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు చెందిన ఫొటోషూట్ కూడా జరిగింది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని తెలిసింది. వెంకటేశ్ కెరీర్‌లోని ఈ 77వ సినిమా ప్రధాన కథాంశం వైజాగ్ నేపథ్యంలో సాగుతుందని, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారని సమాచారం. కాగా, ఈ సినిమా టైటిల్ ఇదంటూ పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ చిత్రానికి 'ఆనంద నిలయం', 'వెంకటరమణ', 'వెంకటరమణ కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లుగా ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా, త్రివిక్రమ్ దర్శకత్వంలోని సినిమాల టైటిల్స్ ప్రధానంగా 'అ ఆ' అక్షరాలతోనే ప్రారంభం అవుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు 'ఆనంద నిలయం' అనే టైటిల్ తెరపైకి రావడం ఆసక్తికరమైన విషయం. మరోవైపు వెంకటేశ్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'మల్లీశ్వరి' 'నువ్వు నాకు నచ్చావ్' సినిమాలకు త్రివిక్రమ్ రైటర్‌గా పని చేశారు. ఇప్పుడు వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ సినిమా చేస్తున్న నేపథ్యంలో ఈ మూవీపై ఇటు ఇండస్ట్రీలో అటు ఆడియన్స్‌లో అంచనాలు ఉండటం సహజం. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలిసింది.


శ్రీలీల

భర్త మహాశయులకు విజ్ఞప్తి

'భర్త మహాశయులకు విజ్ఞప్తి, రోల్ మోడల్, అనార్కలి'... ఇప్పటివరకు రవితేజ 76వ సినిమాకు సంబంధించి వినిపిస్తున్న టైటిల్స్ ఇవి. ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాను కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లో జరుగుతోంది. కొంత టాకీ పార్టుతో పాటు పాటలను కూడా చిత్రీకరిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. పైగా, ఈ మూవీని వచ్చే సంక్రాంతికే విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్‌ను అతి త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తారని ఊహించవచ్చు. మరి... ప్రచారంలో ఉన్న టైటిల్స్‌లో ఏదో ఒకటి రవితేజ 76వ సినిమాకు ఫిక్స్ అవుతుందా? లేక మరో టైటిల్ ఏదైనా తెరపైకి వస్తుందా? అనేది చూడాలి.

'చుక్కలు తెమ్మన్నా తెంచుకురానా... చూస్తావా నా మైనా'... ఈ పాట వినగానే, 'ఏప్రిల్ 1 విడుదల' సినిమా గుర్తుకు వస్తుంది. కానీ 'చుక్కలు తెమ్మన్నా... తెంచుకురానా..' అనే టైటిల్‌తో ఓ ఉమెన్ సెంట్రిక్ సినిమా రానుందని, వైజయంతీ మూవీస్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అలాగే ఈ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌లోని ప్రధాన పాత్ర పోషించేందుకు భాగ్యశ్రీ భోర్సే, శ్రీలీల వంటి వార్ల పేర్లను పరిశీలిస్తున్నారట మేకర్స్. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


భాగ్యశ్రీ భోర్సే

వారణాసి

హీరో మహేశ్ బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' అనే వర్కింగ్ టైటిల్ ఉంది. అయితే 'రాజకుమారుడు', 'జెన్ 63' వంటి టైటిల్స్ తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాకు 'వారణాసి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ భారీ బడ్జెట్ సినిమా కోసం దాదాపు రూ. 50 కోట్లతో చిత్రయూనిట్ హైదరాబాద్ శివార్లలో 'వారణాసి' సినిమా సెట్స్ వేయడం, ఈ సినిమాకు కాశీ బ్యాక్‌డ్రాప్ ఉంటుందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు 'వారణాసి' అనే టైటిల్ తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. కాగా, నవంబరు నెలలో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' సినిమా అప్‌డేట్‌ను విడుదల చేస్తామని ఇటీవల రాజమౌళి అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నవంబరులో ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ టైటిల్ అనౌన్స్‌మెంట్‌నే అని, ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ కావొచ్చని, ఇందుకోసం నవంబరు రెండో వారంలో ఓ పెద్ద ఈవెంట్‌ను రాజమౌళి అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం 'బాహుబలి: ది ఎపిక్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. దీంతో నవంబరులో మళ్లీ 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' సినిమాపై ఫుల్ ఫోకస్ పెట్టనున్నారు రాజమౌళి. నవంబరులో మహేశ్‌బాబు, ప్రియాంకా చోప్రాలపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని, ఓ పాట చిత్రీకరణ కూడా ఉంటుందని, డిసెంబరులో చిత్ర యూనిట్ కెన్యాకు వెళ్లనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఫౌజి... బ్రహ్మరాక్షస

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్' సినిమా సెట్స్‌లో ఉన్నారు. ఈ సినిమా చిత్రీకరణ యూరప్‌లో జరుగుతోంది. సాంగ్స్ చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాతో పాటు దర్శకుడు హను రాఘవపూడితో ప్రభాస్ ఓ పీరియాడికల్ యాక్షన్ సినిమా చేస్తున్నారు. ఇందులో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ ఇతర ప్రధాన పాత్రలు చేస్తున్నారు. 'ప్రభాస్‌హను' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. కాగా, ఈ సినిమాకు మేకర్స్ 'ఫౌజి' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని, త్వరలోనే ఈ విషయంపై ఓ క్లారిటీ రానుందని, వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయిని తెలిసింది. వచ్చే ఏడాది సెకండాఫ్‌లో ఈ సినిమా థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. అలాగే దర్శకుడు ప్రశాంత్ వర్మతో హీరో ప్రభాస్ ఓ సినిమా చేస్తున్నారని, ఈ సినిమాకు 'బ్రహ్మరాక్షస' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

డ్రాగన్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలిసి ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా సినిమా చేస్తున్నారు. 'ఎన్టీఆర్‌నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడ దర్శక-నటుడు రిషబ్ శెట్టి, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణకు చిన్న బ్రేక్ పడింది. ఓ యాడ్ షూటింగ్‌లో ఎన్టీఆర్ గాయపడ్డారు. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకున్న తర్వాత ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం అవుతుంది. నెక్ట్స్ షూటింగ్ షెడ్యూల్ విదేశాల్లో జరుగుతుందని, ముందుగా యూకేలో ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా, ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తారట. కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.


విజయ్ సేతుపతి

– మునిమి శివాంజనేయులు

బ్లడీ రోమియో!

సిల్వర్ స్క్రీన్‌పై నాని ఓ రోమియోగా కనిపించనున్నారట. నాని హీరోగా సుజీత్ డైరెక్షన్‌లో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం రానుంది. ఇందులో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ దసరా సందర్భంగా ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని తెలిసింది. లవ్, యాక్షన్ ప్రధానాంశాలుగా ఈ చిత్రం కొనసాగుతుందట. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు ఈ టైటిల్ అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారని తెలిసింది. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై నాని, వెంకట్ బోయనపల్లి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. అలాగే సుజీత్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది.

కొరియన్ కనకరాజు?

సిల్వర్ స్క్రీన్‌పై వరుణ్ తేజ్ దెయ్యాలను ఎలా అదుపు చేస్తారనే విషయం వచ్చే ఏడాది వెండితెరపై చూడొచ్చు. వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ హారర్ కామెడీ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో హాస్యనటుడు సత్య ఓ కీ రోల్ చేస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. కాగా, ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని, త్వరలోనే ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే చాన్సెస్ ఉన్నాయని ఫిల్మ్‌నగర్ భోగట్టా.

స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'పూరీ సేతుపతి' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా టబు, దునియా విజయ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో బెగ్గర్‌గా విజయ్ సేతుపతి, విలన్‌గా టబు నటిస్తున్నారని తెలిసింది. వచ్చే వారం ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ సెప్టెంబరు 28న పూరి జగన్నాథ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అధికారంగా ప్రకటించాలనుకున్నారు మేకర్స్. కానీ తమిళనాడులో జరిగిన కరూర్ దుర్ఘటన కారణంగా టైటిల్ రిలీజ్ ఈవెంట్‌ను క్యాన్సిల్ చేశారు మేకర్స్. అయితే ఈ సినిమాకు 'స్లమ్ డాగ్, బెగ్గర్, భవతీ భిక్షాం దేహి' అనే టైటిల్స్‌ను పరిశీలించారట. త్వరలోనే ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా, చార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తారు.

ఇలా రెండు, మూడు టైటిల్స్‌ను పరిశీలిస్తూ, త్వరలోనే ఓ టైటిల్‌ను ప్రకటించనున్న మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

గొప్ప ప్రయాణం

బాలీవుడ్ హీరోలు అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్న చిత్రం 'హైవాన్'. ప్రియదర్శన్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్‌పై వెంకట్ కె. నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్‌లో అక్షయ్ కుమార్ పాల్గొంటున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''సరికొత్త థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'హైవాన్'. ఈ మూవీలో ఫస్ట్ టైమ్ నెగిటివ్ క్యారెక్టర్ చేస్తున్నారు అక్షయ్ కుమార్'' అన్నారు మేకర్స్. ఈ సందర్భంగా అక్షయ్ కుమార్ ఓ స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''హైవాన్' చిత్రంతో ఒక గొప్ప ప్రయాణం చేస్తున్నాను. ఈ సినిమాలో నేను చేస్తున్న పాత్ర పలు విధాలుగా నన్ను ఆశ్చర్య పరుస్తోంది. ఇలాంటి రోల్‌లో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ ప్రియదర్శన్‌కు థ్యాంక్స్. ఆయన చేస్తున్న మూవీ సెట్‌లో ఉంటే ఇంట్లో ఉన్న అనుభూతి కలుగుతుంది. సైఫ్‌తో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేస్తున్నాను'' అంటూ అక్షయ్ తెలిపారు.


అక్షయ్ కుమార్

తీరేనా మూగవేదన


ధ్రువ్, అనుపమా పరమేశ్వరన్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ హీరోగా నటించిన చిత్రం 'బైసన్'. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించారు. దర్శకుడు పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. అదే విధంగా జగదంబే ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత బాలాజీ ఈ నెల 24న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. నివాస్ కె. ప్రసన్న సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'తీరేనా గుండెల్లోన మండుతున్న మూగవేదన...' అంటూ సాగే మొదటి పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు మారి సెల్వరాజ్ తమిళంలో లిరిక్స్ రాయగా, ఎనమండ్ర రామకృష్ణ తెలుగు లిరిక్స్ అందించగా, మనువర్ధన్ పాడారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ–''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన ఈ సినిమాలో ధ్రువ్ తనదైన నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలకు ధన్యవాదాలు'' అన్నారు.

సాక్షి ప్లస్
శుక్రవారం। 10-10-2025

బిజినెస్ రీల్

జోయాలుక్కాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా నటి సమంత



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నటి సమంత రూత్ ప్రభును నియమించుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలో సంస్థ సతత హరిత డిజైన్లు, అద్భుతమైన నైపుణ్య వారసత్వాన్ని సమంత తనదైన శైలిలో పరిచయం చేస్తుందని కంపెనీ తెలిపింది. ''సమంతను జోయాలుక్కాస్ కుటుంబంలోకి తీసుకురావడం మాకెంతో సంతోషంగా ఉంది. ఆమె ప్రచారంతో కస్టమర్లకు మరింత చేరువవుతాము'' అని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ... అందానికి, ఆత్మవిశ్వాసానికి ప్రాధాన్యతనిచ్చే బ్రాండ్‌తో కలిసి పనిచేయడం తనకెంతో ఆనందాన్నిస్తుందన్నారు.

అమెజాన్ ఇండియాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆన్‌లైన్ ఉనికి విస్తరణలో భాగంగా అమెజాన్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు చెందిన క్లాసిక్ 350, బుల్లెట్ 350, హంటర్ 350, గోవాన్ క్లాసిక్ 350, కొత్త మెటియోర్ 350 బైక్‌లను అమెజాన్ ఇండియా ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేయొచ్చు. అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీ, పూణే నగరాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంది. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినప్పటికీ..., డెలివరీ, విక్రయానంతర సేవలను కస్టమర్ ఎంపిక చేసుకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ సర్వీసు సెంటర్ ద్వారా అందిస్తామని కంపెనీ తెలిపింది.

చిన్న సంస్థల కోసం డెల్ ప్రో ల్యాప్‌టాప్‌లు

ధర రూ. 31,999 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: డెల్ టెక్నాలజీస్ రెండు సరికొత్త డెల్ ప్రో ల్యాప్‌టాప్‌లను ప్రవేశ పెట్టింది. డెల్ ప్రో 14 ఎజెన్షియల్, డెల్ ప్రో 15 ఎజెన్షియల్ వీటిలో ఉన్నాయి. చిన్న, మధ్యతరహా సంస్థల అవసరాలకు ఉపయోగపడేలా వీటిని తీర్చిదిద్దినట్లు సంస్థ తెలిపింది. ఈ ల్యాప్‌టాప్‌ల రేటు రూ.31,999 నుంచి ప్రారంభమవుతుంది. హార్డ్‌వేర్ స్థాయిలో ఎన్‌క్రిప్షన్, ఫింగర్‌ప్రింట్ రీడర్, డెల్ మేనేజ్‌మెంట్ పోర్టల్, మైక్రోసాఫ్ట్ ఆటోపైలట్, లాక్ స్లాట్ మొదలైన ఫీచర్లతో ఇవి సురక్షితమైనవిగా ఉంటాయని డెల్ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-10-2025

విశాఖ	525-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,565.00	4.29
INFY	1,492.00	2.3
TCS	3,031.50	1.94
HCLTECH	1,452.50	1.33
TECHM	1,456.10	1.2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	680.3	-2.54
M&M	3,425.00	-1.94
JIOFIN	304.7	-1.68
ULTRACEMCO	11,980.00	-1.67
BEL	403.6	-1.63

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,248
ఎన్ఎస్ఈ	1,53,035
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,660
ఎఫ్ఐఐ	+ 1,308
డీఐఐ	+ 864

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.35	$ 65.24
బ్రెంట్	65.03	$ 66.69

25 గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు

- రూ.6లక్షల కోట్లతో నిర్మాణం
- 10 శాతానికి తగ్గిన లాజిస్టిక్స్ వ్యయాలు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రూ.6లక్షల కోట్లతో 10,000 కిలోమీటర్ల పొడవైన 25 గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మిస్తున్నట్టు కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రహదారులు, ఆర్థిక నడవాల నిర్మాణంతో దేశంలో లాజిస్టిక్స్ (రవాణా) వ్యయాలు గతంలో ఉన్న 16 శాతం నుంచి 10 శాతానికి తగ్గినట్టు చెప్పారు. డిసెంబర్ నాటికి ఇది 9 శాతానికి తగ్గుతుందని, అప్పుడు భారత్ పోటీతత్వం మరింత పెరుగుతుందన్నారు. పీహెచ్‌డీసీసీఐ వార్షిక సమావేశంలో భాగంగా మంత్రి ప్రసంగించారు. లాజిస్టిక్స్ వ్యయాలు యూఎస్, ఐరోపా దేశాల్లో 12 శాతం మేర ఉండగా, చైనాలో 8–10 శాతం మధ్య ఉండడం గమనార్హం. ఈ వ్యయం ఎంత కనిష్టానికి తగ్గితే, అంతర్జాతీయ వాణిజ్యంలో అంతగా పోటీపడొచ్చు. దీంతో దీన్ని సాధ్యమైనంత తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది.

నంబర్ 1 స్థానానికి ఆటోమొబైల్ రంగం

భారత ఆటోమొబైల్ రంగం వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోనే నంబర్ 1 స్థానానికి చేరుకుంటుందని మంత్రి గడ్కరీ మరోసారి పునరుద్ఘాటించారు. ''రవాణా మంత్రిగా బాధ్యతలు తీసుకునే నాటికి భారత ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ.14 లక్షల కోట్లుగా ఉంటే, ఇప్పుడు రూ.22 లక్షల కోట్లకు చేరుకుంది. 4 లక్షల మందికి పరిశ్రమ ఉపాధి కల్పించడమే కాకుండా, కేంద్ర, రాష్ట్రాలకు జీఎస్‌టీ రూపంలో పెద్ద ఎత్తున ఆదాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం యూఎస్ ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ.78 లక్షల కోట్లుగా, చైనా రూ.47 లక్షల కోట్లుగా ఉంది''అని మంత్రి వివరించారు. వ్యూహాత్మకమైన జోజిలా టన్నెల్ (సొరంగ మార్గం) నిర్మాణం పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెబుతూ.. ఇది అందుబాటులోకి వస్తే అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో లద్దాక్ ప్రాంతానికి అనుసంధానత ఏర్పడుతుందన్నారు.

దేశ ప్రగతికి గ్రీన్ ఇంధనాలు కీలకం

శిలాజ ఇంధనాల (పెట్రోలియం ఉత్పత్తులు) దిగుమతుల కోసం ఏటా రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తున్నట్టు మంత్రి గడ్కరీ తెలిపారు. పైగా వీటి వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందన్నారు. భారత ప్రగతికి శుద్ధ ఇంధనాల వినియోగం కీలకమని చెప్పారు. దేశ జీడీపీ వృద్ధికి వ్యవసాయ రంగంపైనా దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ తయారీతో రైతులకు రూ.45వేల కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరినట్టు చెప్పారు. ''మొక్కజొన్న నుంచి ఇథనాల్ తయారు చేయాలని నిర్ణయించినప్పుడు.. క్వింటా మొక్కజొన్న మార్కెట్ ధర రూ.1,200 ఉంటే, మద్దతు ధర రూ.1,800గా ఉంది. పెట్రోల్‌లో ఇథనాల్ కలపాలని నిర్ణయించిన తర్వాత మొక్కజొన్న ధర రూ.2,800కు పెరిగింది. దీనివల్ల రైతులకు రూ.45,000 కోట్లు అదనంగా సమకూరింది''అని మంత్రి వివరించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో 80 లక్షల టన్నుల వ్యర్థాలను వినియోగించినట్టు వెల్లడించారు. ఢిల్లీలో పర్యావరణ కాలుష్యం ఎంతో పెరిగిపోయిందని చెబుతూ, దీన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రాధాన్యంగా పేర్కొన్నారు.

ఆకాశ ఎయిర్‌కు రాజీనామా

వైదొలగిన సహవ్యవస్థాపకురాలు నీలూ ఖత్రి



న్యూఢిల్లీ: దేశీ విమానయాన కంపెనీ ఆకాశ ఎయిర్ అంతర్జాతీయ కార్యకలాపాల సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, సహవ్యవస్థాపకురాలు నీలూ ఖత్రి రాజీనామా చేశారు. తద్వారా మూడేళ్ల క్రితమే ఏర్పాటైన కంపెనీ నుంచి నిష్క్రమించారు. ప్రొఫెషనల్‌గా కొత్త దారిలో ప్రయాణించేందుకు వీలుగా నీలూ ఖత్రి పదవిని వొదులుకున్నట్లు ఆకాశ ఎయిర్ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. 2022 ఆగస్ట్ 7న కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన ఖత్రీ ఆకాశ ఎయిర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులలోనూ ఒకరిగా సేవలు అందిస్తున్నారు. కంపెనీ వ్యవస్థాపకుడు వినయ్ దూబే సీఈవోగా వ్యవహరిస్తున్నారు. కాగా.. కంపెనీ సహవ్యవస్థాపకుల జాబితాలో ఆదిత్య ఘోష్, ఆనంద్ శ్రీనివాసన్, బెల్సన్ కొటినో, భవిన్ జోషీ, ప్రవీణ్ అయ్యర్ సైతం ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో ఎగ్జిక్యూటివ్ స్థాయిలో కొంతమంది కంపెనీ నుంచి వైదొలగడం గమనార్హం! మరోపక్క ఆగస్టులో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, క్లేపాండ్ క్యాపిటల్ తదితర సంస్థల నుంచి నిధుల సమీకరణ పూర్తి చేసుకున్నట్లు ఎయిర్‌లైన్ ప్రకటించిన విషయం విదితమే.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ లాభం జూమ్

2024-25లో రూ. 2,203 కోట్లు



న్యూఢిల్లీ: హోమ్ అప్లయెన్సెస్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా గతేడాది (2024–25)కి ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నికర లాభం 46 శాతం జంప్‌చేసి రూ. 2,203 కోట్లను దాటింది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం నిర్వహణ ఆదాయం సైతం 14 శాతం ఎగసి రూ. 24,367 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2023–24)లో రూ. 1,511 కోట్లు నికర లాభం ఆర్జించింది. రూ. 21,352 కోట్ల టర్నోవర్ సాధించింది. గతేడాది ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ. 21,668 కోట్లకు చేరాయి. మొత్తం టర్నోవర్‌లో రిఫ్రిజిరేటర్ బిజినెస్ వాటా(రూ. 6,696 కోట్లు) 27.5 శాతం. ఈ బాటలో ఏసీలు(రూ. 5,271 కోట్లు) 22 శాతం, వాషింగ్ మెషీన్లు(రూ. 5,042 కోట్లు) 21 శాతం, లెడ్ టీవీలు(రూ. 4,925 కోట్లు) 20 శాతం వాటా చొప్పున ఆక్రమించాయి. ఎగుమతుల ద్వారా రూ. 1,451 కోట్ల ఆదాయం అందుకుంది. అయితే దిగుమతి వ్యయాలు రూ. 9,323 కోట్లుగా నమోదయ్యాయి.

టాటా ఎలెక్సీ లాభం క్షీణత

క్యూ2లో రూ. 155 కోట్లు

న్యూఢిల్లీ: డిజైన్, టెక్నాలజీ సర్వీసుల సంస్థ టాటా ఎలెక్సీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 33 శాతం క్షీణించి రూ. 155 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 299 కోట్లకుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం 4 శాతం నీరసించి రూ. 918 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 955 కోట్ల టర్నోవర్ అందుకుంది. 2025 సెప్టెంబర్‌కల్లా కంపెనీ ఉద్యోగుల సంఖ్య 11,951ను తాకింది. రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల లోనూ త్రైమాసికవారీగా పటిష్ట ఫలితాలు సాధించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ మనోజ్ రాఘవన్ పేర్కొన్నారు. యూఎస్ బిజినెస్ 8 శాతం వృద్ధి చూపినట్లు వెల్లడించారు. ఆదాయంలో 31 శాతంపైగా వాటా కలిగిన మీడియా, కమ్యూనికేషన్ బిజినెస్ త్రైమాసిక వారీగా 7 శాతం బలపడినట్లు తెలియజేశారు. ఫలితాల నేపథ్యంలో టాటా ఎలెక్సీ షేరు బీఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 5,573 వద్ద ముగిసింది.

స్పెక్ట్రం ధరల ఖరారు తర్వాత శాట్‌కామ్ సర్వీసులు షురూ

కేంద్ర టెలికం మంత్రి సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: స్పెక్ట్రం ధరలను టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫార్సు చేశాక, కంపెనీలు తమ విస్తరణ ప్రణాళికలను ఖరారు చేసుకున్న తర్వాత భారత్‌లో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులు ప్రారంభమవుతాయని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇప్పటికే రెండు శాట్‌కామ్ సంస్థలకు లైసెన్సులు ఇచ్చామని, మరో సంస్థకు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాన్ని (ఎల్‌వోఐ) జారీ చేశామని చెప్పారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. మరోవైపు, ఆర్థిక సంక్షోభంలో ఉన్న వొడాఫోన్ ఐడియాలో వాటాలను మరింతగా పెంచుకునే యోచనేదీ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేసారు. అమెరికన్ కుబేరుడు ఎలాన్ మస్క్‌కి చెందిన స్టార్‌లింక్, దేశీ దిగ్గజం భారతీ గ్రూప్‌నకు చెందిన యూటెల్‌శాట్ వన్‌వెబ్, రిలయన్స్ జియో–ఎస్ఈఎస్‌లాంటి సంస్థలు పోటాపోటీగా శాట్‌కామ్ సేవలను ప్రారంభించే సన్నాహాల్లో ఉన్నాయి.

శామ్‌సంగ్ దసరా సేల్స్ అదుర్స్

- 1.3 రెట్లు అధికంగా అమ్మకాలు
- ప్రీమియం టీవీల విక్రయాలు రెట్టింపు
- కలిసొచ్చిన పన్ను రేట్ల తగ్గింపు



న్యూఢిల్లీ: దసరా సందర్భంగా బ్రహ్మాండమైన అమ్మకాలు సాధించినట్టు ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల తయారీ సంస్థ శామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. ప్రీమియం టీవీల విక్రయాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు రెట్టింపు కాగా, గృహోపకరణాల అమ్మకాలు 1.3 రెట్లు పెరిగినట్టు తెలిపింది. ఇటీవలి జీఎస్‌టీ సవరణతో రేట్లు దిగిరావడానికి తోడు ప్రమోషనల్ ఆఫర్లు అమ్మకాలకు ఊతమిచ్చినట్టు పేర్కొంది. రూమ్ ఏసీల అమ్మకాలు సైతం పెరిగినట్టు తెలిపింది. 32 అంగుళాల తెరల పరిమాణానికి మించిన టీవీలపై 28 శాతంగా ఉన్న రేటు 18 శాతానికి దిగిరావడం తెలిసిందే. ఏసీలపైనా ఇదే మాదిరి రేటు దిగొచ్చింది. దసరా నవరాత్రి వేడుకల ప్రారంభం నుంచి (సెప్టెంబర్ 22) కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. దీంతో చాలా ఉత్పత్తుల ధరలు చెప్పుకోతగ్గ మేర తగ్గాయి.

ఆఫర్లు, క్యాష్‌బ్యాక్‌లు

''సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు అమ్మకాలు బలంగా పెరిగాయి. ఆకర్షించే డీల్స్, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, సులభ వాయిదాల్లో చెల్లింపులు, వారంటీ పొడిగింపు ఇందుకు అనుకూలించాయి. జీఎస్‌టీ రేటు తగ్గింపుతో ఏసీల విక్రయాలు సైతం పెరిగాయి''అని శామ్‌సంగ్ ఇండియా అధికార ప్రతినిధి ప్రకటించారు. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, ఏసీల అమ్మకాలు మొత్తం మీద గతేడాది దసరా సీజన్‌తో పోల్చి చూస్తే 1.3 రెట్లు పెరిగినట్టు చెప్పారు. శామ్‌సంగ్ విజన్ ఏఐ పవర్డ్ ప్రీమియం నియో క్యూఎల్ఈడీ, ఓఎల్ఈడీ టెలివిజన్లకు వినియోగదారుల నుంచి గణనీయమైన డిమాండ్ కనిపించినట్టు తెలిపారు. రేట్ల తగ్గింపు దిశగా జీఎస్‌టీ కౌన్సిల్ సెప్టెంబర్ 4న నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో వినియోగదారులు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం కనిపించింది. ఈ పెంటప్ డిమాండ్ (గతంలో నిలిచినది) కూడా తోడై పండుగ సమయంలో విక్రయాలు జోరుగా సాగినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. రేట్లు తగ్గడంతో కొందరు వినియోగదారులు ప్రీమియం ఉత్పత్తులకు అప్‌గ్రేడ్ అయినట్టు పేర్కొన్నాయి. అధిక స్క్రీన్ సైజు టీవీలు, మెరుగైన టెక్నాలజీతో ఉన్న వాటి కొనుగోలుకు ముందుకొచ్చినట్టు చెప్పాయి.

నెఫ్రోప్లస్ @ 500 క్లినిక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డయాలిసిస్ సేవల సంస్థ నెఫ్రోప్లస్ అంతర్జాతీయంగా 500 క్లినిక్‌ల మైలురాయిని అధిగమించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో కొత్త సెంటర్ ఏర్పాటుతో దీన్ని సాధించినట్లు సంస్థ తెలిపింది. 2010లో హైదరాబాద్‌లో ఒక్క క్లినిక్‌తో మొదలుపెట్టి నేడు దేశ, విదేశాల్లో గణనీయంగా కార్యకలాపాలను విస్తరించినట్లు నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ గ్రూప్ సీఈవో రోహిత్ సింగ్ తెలిపారు. నేపాల్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల్లో అంతర్జాతీయంగా 43 క్లినిక్‌లు ఉన్నట్లు వివరించారు. 2025 మార్చి ఆఖరు నాటికి దేశీయంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో 125, తృతీయ శ్రేణి పట్టణాల్లో 218 క్లినిక్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నథింగ్‌లో జిరోధా కామత్ పెట్టుబడులు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ నథింగ్‌లో వెల్త్‌టెక్ యూనికార్న్ సంస్థ జిరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 2.1 కోట్ల డాలర్లు(రూ. 186 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. కంపెనీ ఇటీవల చేపట్టిన 20 కోట్ల డాలర్ల(రూ. 1,775 కోట్లు) నిధుల సమీకరణలో భాగంగా పెట్టుబడులను సమకూర్చినట్లు కామత్ వెల్లడించారు. 1.3 బిలియన్ డాలర్ల(రూ. 11,530 కోట్లు) విలువలో నథింగ్ సిరీస్ సి రౌండ్‌కు పెట్టుబడులు అందించినట్లు పేర్కొన్నారు. తదుపరి దశ ఏఐ టెక్నాలజీ కంపెనీగా అభివృద్ధి చెందేందుకు ప్రధానంగా నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు సెప్టెంబర్‌లో నథింగ్ ప్రకటించింది. నథింగ్‌కు తెరతీయకముందు కార్ల్ పే.. స్మార్ట్‌ఫోన్ల దిగ్గజం వన్‌ప్లస్ సహవ్యవస్థాపకుడిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

జీసీసీలకు కీలక హబ్‌గా తెలంగాణ

- కొత్త సెంటర్ల ఏర్పాటుకు ఆకర్షణీయ గమ్యస్థానం
- ప్రస్తుతం 360 పైగా జీసీసీలు, వాటిలో 3.1 లక్షల మంది సిబ్బంది
- ఎక్స్‌ఫినో నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు తెలంగాణ కీలక గమ్యస్థానంగా మారినట్లు స్పెషలిస్ట్ స్టాఫింగ్ సంస్థ ఎక్స్‌ఫినో ఒక నివేదికలో తెలిపింది. గత మూడేళ్లుగా భారత్‌లో ఏర్పాటైన 40 శాతం సెంటర్లను హైదరాబాద్ ఆకర్షించినట్లు వివరించింది. ఇదే వ్యవధిలో బెంగళూరు వాటా 33 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. కేపబిలిటీ సెంటర్లకు సంబంధించి దేశ, విదేశాల్లో తెలంగాణకి పెరుగుతున్న ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తోందని రిపోర్ట్ తెలిపింది.టాలెంట్ లభ్యత, మౌలిక వసతులు, పాలసీలు మొదలైనవి రాష్ట్రానికి సానుకూలంగా ఉంటున్నాయని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణలో 360 జీసీలు ఉన్నట్లు వివరించింది. వీటిలో సుమారు 3.1 లక్షల మంది ప్రొఫెషనల్స్ ఉన్నారని, రాష్ట్ర వైట్–కాలర్ సిబ్బందిలో ఇది 14 శాతమని రిపోర్ట్ తెలిపింది. ''భారత్‌లో కొత్తతరం జీసీసీ పవర్‌హౌస్‌గా తెలంగాణ వేగంగా ఎదుగుతోంది. నిపుణులైన సిబ్బంది లభ్యత, మెరుగైన మౌలిక సదుపాయాలతో గ్లోబల్ దిగ్గజాలను ఆకర్షిస్తోంది'' అని ఎక్స్‌ఫినో సహ వ్యవస్థాపకుడు కమల్ కారంత్ తెలిపారు. వ్యయాల విషయంలో ఇతర నగరాలకు దీటుగా పోటీనిస్తూ, టెక్నాలజీ, టెక్‌యేతర కార్యకలాపాలకు కీలకమైన హబ్‌గా తెలంగాణ నిలుస్తోందని సంస్థ సీఈవోగా కొత్తగా ఎంపికైన పి. ఫ్రాన్సిస్ తెలిపారు. కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టి పెడుతున్న కొత్త తరం జీసీసీలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఉంటోందని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం..

- తెలంగాణలో 47.8 లక్షల మంది వైట్–కాలర్ ప్రొఫెషనల్స్ అందుబాటులో ఉన్నారు. వీరిలో 23.3 లక్షల మందికి ఏడాది పైగా అనుభవం ఉంది.
- జీసీసీ సిబ్బందిలో 33 శాతం మంది మహిళలు ఉన్నారు. నాయకత్వ స్థానాల్లో 19 శాతం మంది ఉన్నారు.
- రాష్ట్రంలోని మొత్తం జీసీసీ ఉద్యోగాల్లో ఇంజినీరింగ్, ఐటీ వాటా 57 శాతంగా ఉంది.



మెట్రోల్లో ఇళ్ల అమ్మకాలు అంతంతే

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 87,603 యూనిట్లు
- ఒక శాతం వృద్ధికి పరిమితం

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్–8 నగరాల్లో ఇళ్ల విక్రయాలు జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో 87,603 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఒక శాతం పెరిగినట్టు నైట్‌ఫ్రాంక్ తెలిపింది. ఎలాంటి మందగమనం ఛాయలు లేవంటూ, రానున్న కాలంలో అమ్మకాలు పుంజుకుంటాయన్న అంచనాను వ్యక్తం చేసింది. ప్రస్తుత పండుగల సీజన్ అమ్మకాలతో దీనిపై స్పష్టత ఏర్పడుతుందని పేర్కొంది. వడ్డీ రేట్లు తగ్గడం, జీడీపీ అధిక వృద్ధి, బడ్జెట్‌లో కల్పించిన పన్ను ప్రయోజనాలతో అమ్మకాలు బలంగా కొనసాగినట్టు తెలిపింది. రెపో రేటు 100 బేసిస్ పాయింట్ల మేర రేట్ల తగ్గింపు, ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్ను తగ్గింపు (జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ) నేపథ్యంలో పెరిగిన వినియోగ విశ్వాసం ఇళ్ల అమ్మకాలపై ఏ మేరకు ఉంటుందో చూడాల్సి ఉందని పేర్కొంది. ఇక ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో టాప్–8 నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 2,57,804 యూనిట్లుగా ఉన్నట్టు తెలిపింది. గతేడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఒక శాతం తగ్గినట్టు వెల్లడించింది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, పుణె, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), కోల్‌కతా, అహ్మదాబాద్, ఢిల్లీ ఎన్‌సీఆర్ గణాంకాలు ఇందులో కలిసి ఉన్నాయి.

సంస్థాగత పెట్టుబడులు 11 శాతం అప్

రియల్ ఎస్టేట్ మార్కెట్లో సంస్థాగత పెట్టుబడులు సెప్టెంబర్ త్రైమాసికంలో 11 శాతం పెరిగి 1.27 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తెలిపింది. ఆఫీస్ వసతుల్లోకి మెరుగైన పెట్టుబడుల రాక ఇందుకు దోహదం చేసింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో 1.15 బిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు పేర్కొంది. 780 మిలియన్ డాలర్లు ఆఫీస్ వసతుల్లోకి రాగా, 320 మిలియన్ డాలర్లు నివాస గృహ ప్రాజెక్టుల్లోకి వచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు, రియల్ ఎస్టేట్ రంగంలో అవకాశాలపై ఇన్వెస్టర్లలో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనమని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్‌యాజ్ఞిక్ తెలిపారు. 1.27 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 60 శాతం దేశీ ఇన్వెస్టర్ల రూపంలో రాగా, మిగిలిన మొత్తం విదేశీ ఇన్వెస్టర్లు సమకూర్చారు. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 51 శాతం పెరగ్గా, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 21 శాతం తగ్గాయి. విదేశీ ఇన్వెస్టర్లలో అప్రమత్త ధోరణి నెలకొన్నప్పటికీ, రానున్న రోజుల్లోనూ ఈ రంగంలోకి సంస్థాగత పెట్టుబడుల రాక బలంగా కొనసాగుతుందని యాజ్ఞిక్ అంచనా వేశారు.

3.6 శాతం పెరిగిన ఇళ్ల ధరలు

- జూన్ క్వార్టర్‌లో నమోదు
- ఆర్‌బీఐ డేటా విడుదల



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 18 ప్రముఖ నగరాలకు సంబంధించి ఇళ్ల ధరల సూచీ (హెచ్‌పీఐ) 3.6 శాతం పెరిగింది. 18 నగరాల్లో ఇళ్ల కొనుగోలు/విక్రయ లావాదేవీల వివరాలను రిజిస్ట్రేషన్ విభాగాల నుంచి సమీకరించి, ఆర్‌బీఐ ప్రతీ త్రైమాసికానికి సంబంధించి హెచ్‌పీఐని విడుదల చేస్తుంటుంది. 2022–23 మూల సంవత్సరం (బేస్ ఇయర్)గా ఆర్‌బీఐ 2025–26 క్యూ1 హెచ్‌పీఐని ప్రకటించింది. ఇంతకుముందు వరకు 2010–11 బేస్ సంవత్సరంగా ఉంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఇళ్ల ధరల పెరుగుదల 3.6 శాతంగా ఉన్నట్టు తెలుస్తోంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ పెరుగుదల 7.6 శాతంగా ఉంది. నాగ్‌పూర్, చండీగఢ్, చెన్నై, కోచిలో ధరల వృద్ధి ఎక్కువగా ఉంది. ఇక త్రైమాసికం వారీగా పోల్చి చూస్తే (మార్చి క్వార్టర్ నుంచి) సూచీ 2 శాతం పెరిగింది. హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పూర్‌ను ప్రస్తుత 10 నగరాలకు అదనంగా సూచీలో ఆర్‌బీఐ చేర్చింది. ఇవి కాకుండా ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, జైపూర్, కాన్పూర్, కోచి పట్టణాలు ఈ సూచీలో భాగంగా ఉన్నాయి. ఈ నగరాల్లో ధరల తీరు తెన్నులను సూచీ ప్రతిఫలిస్తుంటుంది.

దేశవాళీ క్రికెట్లో కోహ్లి, రోహిత్!

విజయ్ హజారే వన్డే టోర్నీలో బరిలోకి దిగే చాన్స్!



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ... దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలో భారత జట్టు సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడనుండగా... దానికి ముందు ఈ ఇద్దరు స్టార్‌లు విజయ్ హజారే ట్రోఫీలో కనీసం మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశాలున్నాయి. టెస్టు, టి20 ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ ఇద్దరు... కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. చాంపియన్స్ ట్రోఫీ విజయం అనంతరం భారత జట్టు వన్డేలు ఆడకపోగా... ఆస్ట్రేలియాతో పర్యటన కోసం రోహిత్ శర్మ నుంచి కెప్టెన్సీని యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్‌కు అప్పగించి... కోహ్లి, రోహిత్‌ను ప్లేయర్లుగా ఈ పర్యటనకు ఎంపిక చేశారు. ఈ ఇద్దరు 2027 వన్డే ప్రపంచకప్ వరకు జట్టులో కొనసాగాలని భావిస్తుండగా... ఆలోపు టీమిండియా ఎక్కువ వన్డే మ్యాచ్‌లు ఆడేది లేకపోవడంతో... ఫామ్, ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు దేశవాళీల్లో ఆడాలని భావిస్తున్నట్లు సమాచారం. 'జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం **వహించాలనుకుంటున్న ప్రతీ ఆటగాడు అందుబాటులో ఉన్న** సమయంలో దేశవాళీల్లో ఆడా**ల్సిందే'అని ఇప్పటికే** చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ **వెల్లడించిన నేపథ్యం**లో ఈ ఇద్దరు బరిలోకి దిగడ**ంపై ఆసక్తి నెలకొంది.** 'డిసెంబర్ 6న విశాఖపట్నం **వేదికగా దక్షిణాఫ్రికా**తో టీమిండియా చివరి వన్డే **మ్యాచ్ ఆడనుంది. ఆ** తర్వాత జనవరి 11 నుంచి **న్యూజిలాండ్‌తో వన్డే** సిరీస్ ప్రారంభం కానుంది. **ఈ మధ్య దాదాపు** ఐదు వారాల సమయం ఉ**ంది. విజయ్ హజారే** ట్రోఫీ డిసెంబర్ 24 నుంచి **ప్రారంభమవుతుంది.** కివీస్‌తో సిరీస్‌కు ముందు **ముంబై, ఢిల్లీ జట్లు** విజయ్ హజారేలో ఆరేసి **మ్యాచ్‌లు ఆడనున్నాయి.** వాటిలో కనీసం మూడిట్లో రో**హిత్, కోహ్లి ఆడొచ్చు'** అని బోర్డు అధికారి వెల్లడించాడు. మరోవైపు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తపరిచాడు. ఆ ఇద్దరు ఆటగాళ్లు భారత్ 'ఎ' మ్యాచ్‌లు, విజయ్ హజారే వంటి టోర్నీల్లో ఆడుతూ ఫామ్ కొనసాగించుకోవచ్చని పేర్కొన్నాడు.



రక్షించిన రహీమ్ అలీ

చివరి నిమిషంలో గోల్ చేసిన స్ట్రయికర్ • భారత్, సింగపూర్ మ్యాచ్ 1-1తో 'డ్రా' • ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్

సింగపూర్: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు ఆశలు సజీవంగా ఉంచుకుంది. మూడో రౌండ్‌లో భాగంగా గ్రూప్ 'సి'లో పటిష్ట సింగపూర్‌తో మ్యాచ్‌ను భారత్ 'డ్రా' చేసుకుంది. గురువారం సింగపూర్‌తో జరిగిన పోరును భారత్ 1-1 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున రహీమ్ అలీ (90వ నిమిషంలో) అద్భుత గోల్ సాధించగా... సింగపూర్ తరఫున ఇఖ్‌సాన్ ఫండీ (45+1వ నిమిషంలో) ఓ గోల్ చేశాడు. కేవలం పది మంది ఆటగాళ్లతోనే ద్వితీయార్ధం మొత్తం పోరాడిన భారత్... ప్రత్యర్థిని నిలువరించడం విశేషం. ఖాలిద్ జమీల్ శిక్షణలోని భారత జట్టు... గొప్ప పోరాట పటిమ కనబర్చింది. మ్యాచ్ ఆరంభం నుంచి సింగపూర్ జట్టు ఆధిపత్యం సాగింది. 60 శాతానికి పైగా బంతిని నియంత్రణలో పెట్టుకున్న ఆ జట్టు... పకడ్బందీ పాసింగ్‌తో భారత డిఫెన్స్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. సొంతగడ్డపై పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడిన సింగపూర్... చిన్నచిన్న పాస్‌లతో బంతిని ఏమారుస్తు మన డిఫెండర్లను బోల్తా కొట్టించింది. తొలి అర్ధభాగం ముగియడానికి క్షణాల ముందు ఇఖ్‌సాన్ ఫండీ భారత డిఫెన్స్ లోపాలను వాడుకుంటూ చక్కటి గోల్ చేయడంతో ఆతిథ్య జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అప్పటికే భారత డిఫెండర్ సందేశ్ జింఘాన్‌కు రెఫరీ రెండుసార్లు యెల్లో కార్డు చూపడంతో... 47వ నిమిషంలో అతడు మైదానం వీడాల్సి వచ్చింది. అప్పటికే ప్రత్యర్థికి ఆధిక్యం అప్పగించుకున్న టీమిండియా... ఇక ఆ తర్వాత చివరి వరకు 10 మంది ప్లేయర్లతోనే ఆడింది.

మ్యాచ్ మొత్తం 90 నిమిషాల్లో భారత జట్టుకు ఒక్కటంటే ఒక్క అవకాశం కూడా రాలేదు. ఇక సింగపూర్ విజయం ఖాయమైపోయిన దశలో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన రహీమ్ అలీ అద్భుతం చేశాడు. అఖర్లో అవకాశం దక్కించుకున్న రహీమ్ చక్కటి గోల్‌తో భారత జట్టును పోటీలోకి తెచ్చాడు. దీంతో స్కోరు 1-1తో సమం కాగా... ఆ తర్వాత మిగిలిన సమయంలో ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ సాధించలేకపోవడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. గ్రూప్ 'సి'లో ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లాడిన భారత్... హాంకాంగ్ చేతిలో ఓడి... బంగ్లాదేశ్, సింగపూర్‌లతో మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొంది. 2 పాయింట్లతో పట్టిక మూడో స్థానంలో ఉంది. సింగపూర్ 5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఒక్కో గ్రూప్‌లో టాప్‌లో నిలిచిన జట్టు మాత్రమే 2027 ఆసియాకప్‌నకు అర్హత సాధించనుంది. గ్రూప్ దశలో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఇంటా బయట మ్యాచ్‌లు ఆడనుంది. ఇరు జట్ల మధ్య 14న గోవా వేదికగా రెండో మ్యాచ్ జరగనుంది.



ఆనంద్ వెనుకంజ

- తొలిరోజు కాస్పరోవ్‌దే పైచేయి
- క్లచ్ చెస్ లెజెండ్స్

సెయింట్ లూయిస్ (అమెరికా): జగద్విఖ్యాత చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్‌ల మధ్య జరుగుతున్న క్లచ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్‌కు తొలిరోజు కలిసిరాలేదు. దీంతో రష్యన్ గ్రాండ్‌మాస్టర్ కాస్పరోవ్ పైచేయి సాధించాడు. గురువారం జరిగిన నాలుగు గేమ్‌ల ఫలితాల అనంతరం కాస్పరోవ్ 2.5-1.5తో ఆనంద్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. తద్వారా రిటైర్ అయిన 21 ఏళ్ల తర్వాత బరిలోకి దిగిన 62 ఏళ్ల రష్యన్ దిగ్గజం తనలో గెలిచేసత్తా ఏమాత్రం తగ్గలేదని తన 'ఎత్తులు-పైఎత్తుల'తో చాటాడు. ముందుగా జరిగిన రెండు గేమ్‌లు కూడా డ్రాగానే ముగిశాయి. దీంతో ఇద్దరు 1-1తో సమవుజ్జీలుగా నిలిచారు. మూడో గేమ్‌లో కాస్పరోవ్ విజయం సాధించడంతో 2-1తో పైచేయి సాధించాడు. తర్వాత జరిగిన నాలుగో రౌండ్ గేమ్ డ్రాగా ముగియడంతో ఇద్దరికి చెరో అర పాయింట్ లభించింది. ఈ టోర్నీలో రెండో రోజు కూడా నాలుగు గేమ్‌లు జరుగుతాయి. రెండు ర్యాపిడ్, రెండు బ్లిట్జ్ గేమ్‌లు కాగా... రెండో రోజు విజయం సాధిస్తే 2 పాయింట్లు, మూడో రోజు విజయానికి 3 పాయింట్లు లభిస్తాయి. ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో జరిగే పోటీలు మరింత ఆసక్తికరంగా జరగనున్నాయి.

దబంగ్ ఢిల్లీ జోరుకు బెంగాల్ బ్రేక్

- వారియర్స్ చేతిలో ఓటమి
- యూపీ యోధాస్‌పై గుజరాత్ జెయింట్స్ గెలుపు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీకి రెండో పరాజయం ఎదురైంది. లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 36-37 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడింది. దబంగ్ ఢిల్లీ తరఫున నీరజ్ నర్వాల్ 6, అజింక్యా పవార్ 5 పాయింట్లు సాధించారు. బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవాంక్ దలాల్ 12 పాయింట్లతో విజృంభించాడు. ప్రత్యర్థితో సంబంధం లేకుండా దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీ జోరుకు బెంగాల్ వారియర్స్ బ్రేక్ వేసింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 23 రెయిడ్ పాయింట్లు సాధించగా... బెంగాల్ వారియర్స్ 20 రెయిడ్ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ట్యాక్లింగ్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన వారియర్స్ 13 పాయింట్లు సాధిస్తే... ఢిల్లీ 9 పాయింట్లకే పరిమితమైంది. తాజా సీజన్‌లో 13 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 11 విజయాలు, 2 పరాజయాలతో 22 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్'లో కొనసాగుతోంది. బెంగాల్ వారియర్స్ 11 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 7 పరాజయాలతో 8 పాయింట్లు సాధించి పదో స్థానంలో కొనసాగుతోంది. ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 41-39 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌పై నెగ్గింది.

15న ఆసీస్‌కు భారత జట్టు

న్యూఢిల్లీ: ఈ నెల 19 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు... 15న ఆస్ట్రేలియాకు బయలుదేరనుంది. న్యూఢిల్లీ నుంచి రెండు విడతలుగా మన ప్లేయర్లు పెర్త్‌కు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా టీమిండియా... ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం ఇప్పటికే జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత జట్టు సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడుతోంది. ఇది ముగిసిన వెంటనే టెస్టు జట్టులోని ఆటగాళ్లతో పాటు... రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ కలిసి ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు. దేశవాళీల్లో ఆడుతున్న ప్లేయర్లు కూడా చిన్న విరామం అనంతరం ఢిల్లీలో ఏకమై ఆసీస్ విమానం ఎక్కనున్నారు. ఇరు జట్ల మధ్య పెర్త్ వేదికగా తొలి వన్డే జరగనుంది. ఈ సిరీస్ నుంచి భారత వన్డే జట్టుకు కూడా శుబ్‌మన్ గిల్ సారథిగా వ్యవహరించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో టెస్టుల్లో మెరుగైన ప్రదర్శన చేసిన గిల్‌ను... తొలిసారి వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. టెస్టు, టి20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లి చాన్నాళ్ల తర్వాత తిరిగి మైదానంలో దర్శనమివ్వనున్నారు.

చెన్నై చెంతకు రిత్విక్

రూ. 12 లక్షలతో స్మాషర్స్ కొనుగోలు • బోపన్న జట్టులో శ్రీవల్లి • టీపీఎల్ వేలం

ముంబై: తెలంగాణ ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లి చెన్నై స్మాషర్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. వేలంలో చెన్నై ఫ్రాంచైజీ అతని కోసం పోటీపడిమరీ దక్కించుకుంది. టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) ఏడో సీజన్ కోసం గురువారం ఆటగాళ్ల వేలాన్ని నిర్వహించారు. భారత టెన్నిస్ దిగ్గజాలు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జాలు వేలంలో సందడి చేశారు. గురువారం అత్యధిక మొత్తం లభించిన ఇద్దరు ఆటగాళ్లలో తెలంగాణ టెన్నిస్ ప్లేయర్ రిత్విక్, శ్రీరామ్ బాలాజీ ఉన్నారు. రూ. 12 లక్షలతో రిత్విక్‌ను స్మాషర్స్ కొనుగోలు చేయగా, అంతే మొత్తంతో శ్రీరామ్ బాలాజీని గుర్‌గావ్ గ్రాండ్‌స్లామర్స్ చేజిక్కించుకుంది. తెలంగాణ మహిళా ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లిని రోహన్ బోపన్న నేతృత్వంలోని ఎస్‌జీ పైపర్స్ బెంగళూరు దక్కించుకుంది. ఇటీవల జరిగిన బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 పోరులో శ్రీవల్లి ఆకట్టుకోవడంతో బెంగళూరు ఆమె కోసం రూ.8.60 లక్షలు వెచ్చించింది. రామ్‌కుమార్ రామనాథన్ కంటే కూడా శ్రీవల్లికే ఎక్కువ మొత్తం లభించింది. బెంగళూరు రామ్‌కుమార్‌ను రూ. 7.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఎస్‌జీ పైపర్స్ జట్టు సీఈఓ అయిన మహేశ్ భూపతి మాట్లాడుతూ తమ బెంగళూరు జట్టు అనుభవజ్ఞులు యువ ఆటగాళ్ల మేలవింపుతో పటిష్టంగా ఉందని అన్నాడు. 'ఈ సీజన్‌లో జట్టు కూర్పు పట్ల సంతోషంగా ఉన్నాం. రోహన్ బోపన్న, శ్రీవల్లి, రామ్‌కుమార్ లాంటి మేటి ఆటగాళ్లు మా జట్టులో ఉన్నారు. ఈ సీజన్‌లో వీరంతా తప్పకుండా రాణిస్తారు' అని భూపతి ఆశాభావం వ్యక్తం చేశాడు. డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ స్ట్రయికర్స్ తెలుగు ఆటగాడు విష్ణువర్ధన్‌ను తిరిగి జట్టులోకి తీసుకుంది. అతన్ని రూ. 6 లక్షలకు దక్కించుకోగా... ఫ్రాన్స్ స్టార్ కారోల్ మోనెట్‌ను రూ. 10.60 లక్షలకు కొనుగోలు చేసింది. జీఎస్ ఢిల్లీ ఏసెస్ ఫ్రాంచైజీ బెల్జియంకు చెందిన సోఫియా కొస్టౌలస్‌ను రూ. 11 లక్షలకు, డబుల్స్ స్పెషలిస్టు జీవన్ నెదున్‌జెళియాన్‌ను రూ. 6 లక్షలకు కొనుక్కుంది. యశ్ ముంబై ఈగల్స్ జట్టు మరియం బొల్కవద్జె (జార్జియా), నిక్కీ పూనచలను చెరో రూ. 6 లక్షలతో దక్కించుకుంది. టీపీఎల్ ఏడో సీజన్ పోరు డిసెంబర్ 9న మొదలై 14న జరిగే ఫైనల్‌తో ముగియనుంది.



టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వేలం సందర్భంగా పేస్, భూపతితో సానియా మీర్జా

అజ్మతుల్లా ఆల్‌రౌండ్ షో

తొలి వన్డేలో బంగ్లాదేశ్‌పై అఫ్గానిస్తాన్ విజయం



అబుదాబి: బంగ్లాదేశ్ చేతిలో టి20 సిరీస్ కోల్పోయిన అఫ్గానిస్తాన్ జట్టు... వన్డేల్లో శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం అర్ధరాత్రి ముగిసిన తొలి పోరులో అఫ్గానిస్తాన్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (87 బంతుల్లో 60; 1 ఫోర్, 1 సిక్స్), తౌహిద్ హృదయ్ (85 బంతుల్లో 56; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. నజ్ముల్ హసన్ షంటో (2), తన్జిద్ హసన్ (10), జాకీర్ అలీ (10), నూరుల్ హసన్ (7) విఫలమయ్యారు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్, రషీద్ ఖాన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... గజన్‌ఫార్ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గానిస్తాన్ 47.1 ఓవర్లలో 5 వికెట్లకు 226 పరుగులు చేసి గెలిచింది. టి20 సిరీస్‌లో 0-3తో 'వైట్ వాష్'కు గురైన అఫ్గాన్... వన్డేల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేసిన అఫ్గానిస్తాన్... ఆ తర్వాత సాధికారిక ఆటతో లక్ష్యాన్ని ఛేదించింది. వికెట్ కీపర్ రహ్మనుల్లా గుర్బాజ్ (76 బంతుల్లో 50; 1 ఫోర్, 1 సిక్స్), రహమత్ షా (70 బంతుల్లో 50; 2 ఫోర్లు) అర్ధశతకాలతో సత్తాచాటగా... అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (44 బంతుల్లో 40; 6 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ హష్మతుల్లా షాహిది (46 బంతుల్లో 33 నాటౌట్; 2 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. బంగ్లా బౌలర్లలో తన్జిద్ హసన్ షకీబ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అఫ్గాన్ విజయంలో కీలక పాత్ర పోషించిన అజ్మతుల్లాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం ఇక్కడే రెండో వన్డే జరగనుంది.



చెన్నైకి రెండో విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో చెన్నై బ్లిట్జ్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా సాగిన పోరులో చెన్నై 3-2 (12-15, 15-11, 11-15, 18-16, 15-13) తేడాతో గోవా గార్డియన్స్‌పై గెలుపొందింది. చెన్నై విజయంలో కీలక పాత్ర పోషించిన జెరోమ్ వినీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ మ్యాచ్‌లో గోవా జట్టు తమ సర్వీస్‌లో 26 పాయింట్లు సాధించగా... చెన్నై 25 పాయింట్లు స్కోరు చేసింది. ఇక చెన్నై స్పైకింగ్ ద్వారా 31 పాయింట్లు ఖాతాలో వేసుకుంటే... గోవా జట్టు 26 పాయింట్లే సాధించింది.

అధికారమిస్తే ఇంటికో ఉద్యోగం

20 నెలల్లో పథకం పూర్తి స్థాయి వర్తింపు

- బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ హామీ
- యువత చూపు ఎన్డీయే వైపేనన్న సర్వేలతో అప్రమత్తం
- నితీశ్ ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలకు విరుగుడు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలకమైన ప్రకటన చేశారు. అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కోటికి పైగా ఉన్న యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 20 రోజుల్లోగా ఇందుకోసం ప్రత్యేకంగా చట్టం తెస్తామని, 20 నెలల్లోనే ఈ పథకాన్ని పూర్తిగా అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

యువతను ఆకట్టుకునేందుకు పోటాపోటీ..

బిహార్‌లోని మొత్తం 7.42 కోట్ల ఓటర్లలో 18–35 ఏళ్ల వారి సంఖ్య 1.60 కోట్ల వరకు ఉంది. ఇటీవల యువ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని నిర్వహించిన సర్వేలో 18–29 ఏళ్ల వారిలో దాదాపు 44.6 శాతం మంది ఎన్డీయేకు ఓటు వేయడానికి ఇష్టపడుతున్నారని, 39.5 శాతం మంది మహాఘట్‌బంధన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది. సుమారు 42 శాతం మంది బిహార్ తదుపరి ముఖ్యమంత్రిగా తేజస్వీ యాదవ్‌ను ఇష్టపడుతున్నట్లు తేల్చారు. కేవలం 27.7 శాతం మంది మాత్రమే ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు అనుకూలంగా ఓటు వేశారు. ఈ సర్వే ఫలితాలను దృష్టిలో పెట్టుకొనే ముఖ్యమంత్రి నితీష్ ముందుగానే యువతకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. 'ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ యోజన'పథకం కింద, 12వ తరగతి అర్హత సాధించిన విద్యార్థులకు రూ. 4,000, ఐటీఐ లేక డిప్లొమా ఉన్నవారికి రూ. 5,000, ఇంటర్న్‌షిప్‌లు తీసుకుంటున్న గ్రాడ్యుయేట్లు లేక పోస్ట్ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.6,000 అందిస్తామని ప్రకటించారు. దీంతో పాటే 2025-26 నుంచి 2030-31 వరకు రాష్ట్రం నుంచి లక్ష మంది యువతకు వివిధ సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తామని ప్రకటించారు. దీనిని ఎదుర్కొని యువతను తనవైపు తిప్పికునే లక్ష్యంతో ఆర్జేడీ నేత తేజస్వీ 'ఛాత్ర యువ సంసద్'కార్యక్రమాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. యువజన కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, విద్యాపరంగా వెనుకబడ్డ విద్యార్థులకు ఇంటి నుంచి ట్యూటర్లను అందిస్తామని, పరీక్షా కేంద్రాలకు ఉచిత రవాణాను కల్పిస్తామని ప్రకటించారు.సైన్స్, గణితం, ఇంగ్లిష్‌లలో వెనుకబడ్డ ఉన్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి వారికి అదనపు సమయం కేటాయిస్తామన్నారు. బిహార్ విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు మరోసారి ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఇన్ని హామీలు గుప్పించినా ప్రధాని నరేంద్ర మోదీ, నితీశ్‌కుమార్ నిర్వహిస్తున్న బహిరంగ సభలకు యువత పెద్ద సంఖ్యలో హాజరవుతుండటంతో ఎన్నికల షెడ్యూల్ అనంతరం గురువారం తొలి ఎన్నికల వాగ్దానం ప్రకటించారు. 'మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఉండేలా చూస్తాం. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు దీని కోసం చట్టం తెస్తాం. 20 నెలల్లో ఒక్క ఇల్లు కూడా ప్రభుత్వ ఉద్యోగం లేకుండా ఉండదు'అని ప్రకటించారు. ప్రస్తుత నితీశ్ ప్రభుత్వం 20ఏళ్లుగా ఎన్నడూ నిరుద్యోగం అతిపెద్ద సమస్య అని ఎన్నడూ గుర్తించలేదని, తానుగత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగాలను హామీ ఇచ్చి, అధికారంలో ఉన్న కొద్ది కాలంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించానని గుర్తు చేశారు. ఐదేళ్లపాటు పదవిలో కొనసాగితే ఏమి సాధ్యమవుతుందో మీరు ఊహించవచ్చని తేజస్వీ పేర్కొన్నారు.



ముంబైలోని రాజ్ భవన్ గార్డెన్స్‌లో గురువారం యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ప్రధాని మోదీల చర్చలు

'బాలాకోట్' బిర్యానీ.. 'షెహబాజ్' షర్బత్!



వైరల్ అయిన 'ఫేక్ మెనూ'

అవాక్కయ్యారా!.. ఈ పేర్లన్నీ మన బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్ (2019), ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్‌లో భారత్ దెబ్బ తగిలిన పాకిస్థాన్ ప్రాంతాల పేర్లే కదూ అనిపించిందా! మన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 93వ వార్షికోత్సవం సందర్భంగా, ఒక ఫేక్ మెనూ సోషల్ మీడియాలో వైరలైంది.. దేశం మొత్తం గట్టిగా నవ్వుకునేలా చేసింది! ఈ మెనూని తయారుచేసింది ఎవరో కాదు, మన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). ఈ ఏఐకి, ఆ మెనూ పేర్లు పెట్టిన మన సైనికులకు పద్మశ్రీ ఇవ్వొచ్చు!. మెనూ చూడగానే, 'అమ్మో! ఎంత ఘాటుగా ఉందో!' అనిపించేలా ఉంది. ఆ మెనూలో ఉన్న పేర్లు చదివితే, మనోళ్లు మామూలోళ్లు కాదు సుమీ.. అనిపించక మానదు. ఆ మెనూలో పాకిస్థాన్‌ను ఓ రేంజ్‌లో ఆడేసుకున్నారంతే..! ఇవి చదివాక.. 'ఆహా! వంటకాల పేర్లలో కూడా మన సైన్యం సత్తా చాటిందే!' అనుకున్నారంతా.

బహావల్పూర్ నాన్.. రావల్పిండి చికెన్ టిక్కా మసాలా

మెయిన్ కోర్సుగా బహావల్పూర్ నాన్, రావల్పిండి చికెన్ టిక్కా మసాలా పెట్టారు.. వారి ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసినట్టు.. మురిద్కే, ముజఫరాబాద్ పేర్లతో చేసిన డెసర్ట్‌లు వడ్డించారు. 'మా విందులో మీకు ఘాటుగా టిక్కా మసాలా ఉంది, తీయగా తిరామిసు ఉంది. కానీ మాకు మాత్రం ... మీ టెర్రర్ క్యాంపులు నాశనం చేసిన కిక్ ఉంది!' అన్నట్టుగా ఉంది ఈ ఫేక్ మెనూ వెనుక ఉన్న 'పకడ్బందీ ప్లాన్'! ఈ మెనూ చూసి సైనికులు, ఆర్మీ వెటరన్స్ కూడా పగలబడి నవ్వారంటే, దీని పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చు!

విమానాలకు కూడా 'పేరు'!

ఇక, విందు మెనూతో పాటు, అంతకంటే ఫన్నీగా జరిగిన ఇంకో విషయం ఉంది. ఐఏఎఫ్ డేకి ముందు.. ఆకాశంలో కనిపించిన రెండు విమానాలకు పెట్టిన సంకేత నామాలు చూస్తే, ఇక నవ్వు ఆపుకోవడం ఎవరి వల్లా కాదు.

C-130J విమానం సంకేత నామం: 'రఫీకీ'

An-32 విమానం సంకేత నామం: 'షెహబాజ్'

మన సైనికుల సెటైర్ సూపరెహే..

'షెహబాజ్' అంటే.. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌ను ఆడుకోవడం. ఇక, 'రఫీకీ' అనేది పాకిస్థాన్‌లోని ఓ ముఖ్యమైన ఎయిర్ బేస్ పేరు. ఆపరేషన్ సింధూర్‌లో మన సైన్యం ఆ ఎయిర్ బేస్‌ను కూడా దెబ్బ కొట్టింది. అంటే, 'షెహబాజ్ గారూ.. మీ రఫీకీ బేస్‌ను కొట్టేశాం'.. అని గాలిలోనే సరదాగా వార్నింగ్ ఇచ్చినట్టు ఉందీ వ్యవహారం. ఏఐ పుణ్యమా అని వైరలైన ఈ ఫేక్ మెనూ, సరదాగా చేసిన ఈ విమానాల నామకరణం చూస్తే.. మన సైనికుల ఫైటింగ్ స్పిరిట్ ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. వాళ్ళు యుద్ధంలోనే కాదు, సెటైర్ వేయడంలోనూ దిట్ట!. మరి ఈ ఫన్నీ మెనూ చూశాక మీకేం అనిపించింది?.. మీరూ.. కొత్త 'శత్రువుల కడుపు మంట' వంటకాలు కనిపెట్టారా?

\- న్యూఢిల్లీ

40 రోజులు.. 1,338 కిలోమీటర్లు.. అయోధ్యకు నడిచొచ్చిన వృద్ధుడు

అయోధ్య: శ్రీరాముడిపై అచంచల భక్తి విశ్వాసాలు కలిగిన ఓ 73 ఏళ్ల వృద్ధుడు గుజరాత్‌లోని మెహసనా నుంచి కాలినడకన బయలుదేరి 1,338 కిలోమీటర్ల దూరంలోని యూపీలోని అయోధ్య క్షేత్రానికి 40 రోజుల్లో గురువారం చేరుకున్నారు. అయోధ్యకు నడిచి వెళ్లాలనే మూడు దశాబ్దాలనాటి సంకల్పాన్ని సాకారం చేసుకున్నారు. మెహసనా జిల్లా మోదీపూర్ గ్రామానికి చెందిన జయంతీలాల్ హర్‌జీవన్‌దాస్ పటేల్ 1990లో బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ చేపట్టిన సోమ్‌నాథ్–అయోధ్య రథయాత్రను స్ఫూర్తిగా తీసుకున్నారు. అప్పట్లో గుజరాత్‌లోని జరిగిన ఆ యాత్రలో జయంతీలాల్ పటేల్ పాల్గొన్నారు కూడా. అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కూడా జరగడంతో తన కల నెరవేర్చుకునే సమయం వచ్చిందని భావించారాయన. ఆ మేరకు తన యాత్రను ఆగస్టు 30వ తేదీన స్వగ్రామం నుంచి ప్రారంభించారు. రోజుకు 33–35 మేర నడుస్తూ, రాత్రి వేళల్లో విశ్రాంతి తీసుకున్నారు. మార్గమధ్యంలోని ఆలయాలు, పబ్లిక్ పార్కులు, అతిథి గృహాల్లో విరామమిచ్చేవారు. కుటుంబసభ్యులు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు ఆయన క్షేమ సమాచారం తెలుసుకోవడంతోపాటు, ఆ మార్గంలో తర్వాతి స్టాప్ ఏమిటో తెలియజేస్తుండే వారు. అయోధ్యకు చేరుకున్న జయంతీలాల్ కరసేవక్‌పురంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్‌ను కలుసుకున్నారని ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

అయోధ్యలో కేంద్ర మంత్రి నిర్మల పూజలు

అయోధ్య: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం అయోధ్యలోని రామాలయంలో పూజలు చేశారు. బుధవారం కుటుంబంతో కలిసి వచ్చిన ఆమె రామ్ లల్లాకు ఆర్తి ఇచ్చారు. రాందర్బార్‌ను, దుర్గామాత ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు. కుబేర్ తలిలో మంత్రి నిర్మల శివుడికి అభిషేకం చేశారని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. ట్రస్ట్ సెక్రటరీ జనరల్ చంపత్ రాయ్ ఆలయ సముదాయం విశేషాలను దగ్గరుండి ఆమెకు వివరించారని పేర్కొంది.

రామాలయంపై 21 అడుగుల జెండా

నవంబర్ 25న ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ

అయోధ్య: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే నెల 25వ తేదీన అయోధ్యలోని రామాలయంపై 21 అడుగుల ధర్మ జెండాను ఆవిష్కరించనున్నారు. రామాలయ నిర్మాణ పనులన్నీ పూర్తయిన సందర్భంగా ప్రధాని జెండా ఆవిష్కరించనున్నారని రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. రామ పంచమి రోజున జరిగే ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోనుందన్నారు. అంతకుముందు 5 రోజులపాటు వేదపండితులతో పూజలను ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన ఆలయం దాదాపు పూర్తి కావొచ్చిందని, వెలుపల గోడ నిర్మాణం తుది దశలో ఉందని చెప్పారు. చెప్పుల ర్యాక్‌ల నిర్మాణం సైతం నవంబర్‌కల్లా పూర్తవుతుందన్నారు.

మా అధికారుల్ని బెదిరిస్తే ఊరుకోం

ఈసీకి బెంగాల్ సీఎం మమత హెచ్చరిక

కోల్‌కతా: ఎన్నికల కమిషన్ లక్ష్యంగా పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ప్రభావానికి గురైన ఈసీ అధికారులు తమ ప్రభుత్వంలోని అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల తేదీలు ప్రకటించడానికి ముందు నుంచే ఇలా జరుగుతోందన్నారు. ఇలాంటి బెదిరింపులను తాము ఏమాత్రం సహించబోమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల తేదీలను ప్రకటించకుండానే వారు తరచుగా రాష్ట్రానికి వచ్చి తమ ప్రభుత్వ అధికారులను పిలిపించుకుని మాట్లాడటాన్ని ఆమె తప్పుబట్టారు. పలు ఆరోపణలను ఎదుర్కొంటున్న రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి మనోజ్ అగర్వాల్.. ఎస్ఐఆర్ కోసం అవినీతిపరులైన అధికారులను నియమిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరుతో ఓటరు జాబితాలను తారుమారు చేసేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే, వారు నిప్పుతో చెలగాటమాడుతున్న విషయం వారు గుర్తుంచుకోవాలని మమత పేర్కొన్నారు. ఆ నిప్పు వారినే చుట్టుముట్టి రాజకీయంగా నాశనం చేస్తుందన్నారు.

దివ్యాంగులపై కేరళ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీలో గురువారం సీపీఎంకు చెందిన శాసనసభ్యుడు చిత్తరంజన్ దివాంగులనుద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు అలజడికి కారణమయ్యాయి. శబరిమలకు సంబంధించిన అంశంపై ప్రతిపక్షాల సభ్యులు నిరసన తెలుపుతుండగా వారిని హేళన చేశారు. రెండు చేతులూ లేని వ్యక్తికి తన ఒంటిపైకి చీమ ఎక్కినప్పుడు ఎలా ఉంటుందో ప్రతిపక్షాలసభ్యుల పరిస్థితీ అంతే ఉందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలోని ఎత్తు తక్కువున్న ఓ ఎమ్మెల్యేపై సీఎం విజయన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మరునాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అధికార పక్ష సభ్యులు తమనుద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేసినా స్పీకర్ పట్టించుకోవడం లేదని, మౌనంగా ఉంటూ వారిని కాపాడుతున్నారని ప్రతిపక్ష నేత సతీశన్ ఆరోపించారు.

చిన్నతనం నుంచే లైంగిక విద్య: సుప్రీం

న్యూఢిల్లీ: విద్యార్థులకు లైంగిక విద్యాబోధనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 9వ తరగతి తర్వాత కాకుండా, అంతకుముందు నుంచే పిల్లలకు లైంగిక విద్యను బోధించాలని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం గురువారం పేర్కొంది. సెకండరీ స్కూళ్లలో సెక్స్ ఎడ్యుకేషన్‌ను పాఠ్యాంశంగా చేర్చాలని, అప్పుడే కౌమార దశలో యుక్తవయస్సులో కలిగే హార్మోన్ల మార్పుల గురించి వారు తెలుసుకుంటారని తెలిపింది. పిల్లలకు యవ్వన దశలో సంభవించే మార్పులు, వాటికి సంబంధించి పాటించవలసిన జాగ్రత్తలు, అప్రమత్తత గురించి పూర్తి సమాచారం అందించేందుకు, అధికారులు తగిన విధంగా చర్యలు చేపట్టాలని ధర్మాసనం తెలిపింది. లైంగిక దాడికి పాల్పడిన 15 ఏళ్ల బాలుడిపై అధికారులు పోక్సో చట్టం తదితర ఆరోపణలను మోపారు. ఇందుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవిధంగా పేర్కొంది. నిందితుడైన బాలుడిని షరతులతో బెయిల్‌పై విడుదల చేయాలని జువెనైల్ జస్టిస్ బోర్డును ఆదేశించింది.

'డీప్ ఫేక్'పై ఈసీ నజర్

ఏఐ వాడకంపై పార్టీలకు కీలక ఆదేశాలు

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) దృష్టి సారించింది. డీప్‌ఫేక్ వీడియోల ద్వారా ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులను లక్ష్యంగా చేసుకునే ధోరణిపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ఈ మేరకు రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని తుచ తప్పక పాటించాలని హెచ్చరించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికల ప్రకటన 6న వెలువడిన విషయం తెల్సిందే.

విమర్శలకు హద్దుండాలి

విమర్శలు విధానాలు, కార్యక్రమాలు, పనితీరుకు మాత్రమే పరిమితం కావాలని ఈసీ పునరుద్ఘాటించింది. ఇతర పార్టీల నేతలు, కార్యకర్తల ప్రజా జీవితంతో సంబంధం లేని వ్యక్తిగత జీవితాలపై విమర్శలు చేయరాదని స్పష్టం చేసింది. ధ్రువీకరించుకోని ఆరోపణలు, వాస్తవాలను వక్రీకరించే విమర్శలకు దూరంగా ఉండాలని సూచించింది. ఈ నిబంధనలు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో పోస్ట్ చేసే కంటెంట్‌కు కూడా వర్తిస్తాయని తెలిపింది.

ఏఐ కంటెంట్‌కు లేబుల్ తప్పనిసరి

ఏఐ ఆధారిత టూల్స్‌ను దుర్వినియోగం చేసి సమాచారాన్ని వక్రీకరించే, తప్పుడు ప్రచారాలు చేసే డీప్‌ఫేక్‌ల జోలికిపోవద్దని పార్టీలకు ఈసీ సూచించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఒకవేళ ప్రచారం కోసం ఏఐ ద్వారా రూపొందించిన కంటెంట్‌ను సోషల్ మీడియా లేదా ప్రకటనల రూపంలో పంచుకుంటే, దానిపై 'ఏఐ–జెనరేటెడ్', 'డిజిటల్లీ ఎన్‌హాన్స్‌డ్'లేదా 'సింథటిక్ కంటెంట్'వంటి స్పష్టమైన లేబుల్స్‌ను తప్పనిసరిగా ఉంచాలని ఆదేశించింది. ఎన్నికల వాతావరణం కలుషితం కాకుండా ఉండేందుకు సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచినట్లు కమిషన్ తెలిపింది. ఎంసీసీ మార్గదర్శకాల సమర్థవంతమైన అమలు కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

రన్‌వే పైనుంచి జారి పొదల్లోకి...



ఫరూఖాబాద్: ప్రైవేట్ జెట్ విమానమొకటి రన్ వే పైనుంచి జారి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన గురువారం ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లా మహ్మదాబాద్‌లో చోటుచేసుకుంది. ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడగా, ఇద్దరు పైలట్లు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. జెట్ సర్వీస్ ఏవియేషన్‌కు చెందిన విమానం ఉదయం 10.30 గంటల సమయంలో రన్ వేపై ల్యాండయిన అనంతరం అదుపు తప్పి పక్కకు దూసుకెళ్లిందని అధికారులు తెలిపారు. విమాన ప్రయాణికుల్లో జిల్లాలో నిర్మాణం జరుగుతున్న ఓ బీర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ తదితరులున్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

సరోగసీ చట్టంలోని ఆ నిబంధన వారికి వర్తించదు: సుప్రీం

న్యూఢిల్లీ: సరోగసీ చట్టం–2021పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2022 జనవరి 25వ తేదీన అమల్లోకి వచ్చిన ఈ చట్టంలోని వయో పరిమితి నిబంధన అంతకుముందే అండాలను భద్రపర్చుకుని ఆ ప్రక్రియను ప్రారంభించిన జంటలకు వర్తించదని స్పష్టం చేసింది. 2021లో చేసిన చట్టంలో సరోగసీ ద్వారా సంతానం కావాలనుకునే దంపతులు అర్హత సర్టిఫికెట్‌ను కలిగి ఉండాలనే నిబంధన ఉంది. మహిళలయితే వివాహితులమని, వయస్సు 23–50 మధ్య ఉందని, పురుషులయితే తమ వయస్సు 26–55 ఏళ్ల మధ్య ఉన్నట్లు సర్టిఫికెట్ కలిగి ఉండాలి. గురువారం దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం..2022 జనవరి 25న అమల్లోకి వచ్చిన చట్టంలో అంతకుముందు సరోగసీ కోరుకున్న దంపతులకు వయో పరిమితి అంటూ ఏదీ లేదని తెలిపింది. సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటున్న తాము ఈ ప్రక్రియను మొదలుపెట్టాక అమల్లోకి వచ్చిన చట్టం వర్తించదంటూ ముగ్గురు పిటిషనర్లు చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.

తొలగించిన ఓటర్ల జాబితా బాధ్యత బిహార్ లీగల్ సర్వీస్ అథారిటీకి

సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: బిహార్ ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)అనంతరం ఎన్నికల కమిషన్(ఈసీ)తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను పరిశీలించేందుకు సహకరించాలని బిహార్ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ(బీఎస్ఎల్ఎస్ఏ)ని సుప్రీంకోర్టు కోరింది. ఈ జాబితాను పరిశీలించే బాధ్యతలను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలకు అప్పగించాలని ఆదేశించింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే తమ దృష్టికి తేవాలని రాజకీయ పార్టీలను కోరింది. ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 16వ తేదీన తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. అప్పటిలోగా సహేతుక కారణాలతో అభ్యంతరాలను తెలపాలని తుది జాబితాలో చోటుదక్కని ఓటర్లకు సూచించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం గురువారం ఈ మేరకు స్పష్టం చేసింది. 'ఓటరు జాబితాను జిల్లా న్యాయ సేవల అథారిటీ తన పరిధిలోని పారా–లీగల్ వలంటీర్లకు అందజేస్తుంది. వలంటీర్లు బూత్ లెవెల్ అధికారుల సాయంతో తొలగింపునకు గురైన ఓటర్లు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు సాయం చేస్తారు. వారి పేరు ఎందుకు తిరస్కరణకు గురైందో తెలుపుతూ పూర్తి వివరాలను అందజేస్తారు.

జైషే మహ్మద్ 'మహిళా గ్రూప్'

జమాత్ ఉల్ మొమినాత్ పేరుతో ఏర్పాటుచేసినట్టు ప్రకటన

- మసూద్ అజహర్ సోదరి సాదియా నేతృత్వం వహిస్తున్నట్లు సమాచారం
- సోషల్‌మీడియాలో జైషే కోసం ప్రచారం, చేరికలే ప్రధాన లక్ష్యం
- ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్న తర్వాత ఉగ్ర సంస్థ కొత్త ఎత్తులు

ఇస్లామాబాద్: భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కకావికలమైన పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్.. తిరిగి పుంజుకునేందుకు కొత్త వ్యూహాలు అమలుచేస్తోంది. అందులో భాగంగా తొలిసారి ఆ సంస్థ మహిళా విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు ప్రకటించింది. సంస్థ అధిపతి మౌలానా మసూద్ అజహర్ పేరుతో విడుదల చేసిన లేఖలో.. జమాత్ ఉల్ మోమినాత్ పేరుతో మహిళా విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించింది. ఈ విభాగంలోకి ఈ నెల 8వ తేదీ నుంచి చేరికలు కూడా ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ విభాగానికి మసూద్ అజహర్ సోదరి సాదియా అజహర్ నాయకత్వం వహిస్తున్నట్లు సమాచారం. గత మే నెల 7న ఆపరేషన సిందూర్‌లో భాగంగా పాక్‌లోని బహావల్‌పూర్‌లో ఉన్న జైషే ప్రధాన కార్యాలయంపై భారత్ వైమానికదళం క్షిపణుల వర్షం కురిపించటంతో సాదియా భర్త యూసుఫ్ అజహర్‌తోపాటు మసూద్ కుటుంబ సభ్యులు పలువురు మరణించారు.

ఉగ్రవాదుల భార్యలు, పేద యువతులే సభ్యులు

జైషే మహ్మద్ ఉగ్ర సంస్థలో పనిచేస్తున్న పురుష ఉగ్రవాదుల భార్యలను ఈ మహిళా విభాగంలోకి చేర్చుకుంటున్నట్లు తెలిసింది. బహావల్‌పూర్, కరాచి, ముజఫరాబాద్, కోట్లి, హరిపూర్, మాన్‌సేహ్రాలోని ఉగ్ర సంస్థ కేంద్రాల్లో చదువుకుంటున్న పేద యువతులను కూడా ఈ గ్రూపులో చేర్చుకుంటున్నట్లు సమాచారం. భారత్‌కు వ్యతిరేకంగా జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ సిద్ధాంతాన్ని ప్రచారం చేయటమే జమాత్ ఉల్ మోమినాత్ ప్రధాన లక్ష్యమని తెలిసింది. సోషల్‌మీడియా ద్వారా పాకిస్తాన్‌తోపాటు భారత్‌లోని జమ్మకశ్మీర్, ఉత్తరప్రదేశ్, మరి కొన్ని ప్రాంతాల్లో యువతను ఈ గ్రూప్ ఉగ్రవాదంవైపు మళ్లించే ప్రయత్నాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాద సంస్థలోకి భారీగా చేరికలను ప్రోత్సహించేందుకు ఈ మహిళా గ్రూప్ సభ్యులు ప్రయత్నిస్తున్నట్లు భావిస్తున్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు ఇప్పటివరకు మహిళలకు తమ సంస్థల్లో స్థానం కల్పించలేదు. జిహాద్ పేరుతో చేసే సాయుధ పోరాటాల్లో మహిళలకు స్థానం లేదని చెబుతూ వచ్చారు. కానీ, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ చావుదెబ్బ కొట్టడంతో జైషే మహ్మద్ తన విధానాన్ని మార్చుకుంది. ఈ సంస్థకు నాయకత్వం వహిస్తున్న మసూద్ అజహర్, అతడి సోదరుడు తల్హా అల్ సైఫ్ ఇద్దరూ ఈ మహిళా విభాగం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. బహావల్‌పూర్‌లో భారత్ ధ్వంసం చేసిన జైషే ప్రధాన కార్యాలయాన్ని పునర్నిర్మించేందుకు ఆర్థికసాయం చేయనున్నట్లు ఇటీవలే పాక్ ప్రభుత్వం తెలిపింది. కాగా, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలుగా పేరుపడ్డ ఐఎస్ఐఎస్, బోకోహరాం, హమాస్‌ల్లో మహిళా విభాగాలు ఉన్నాయి. ఈ మహిళలతో ఆయా సంస్థలు ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డ చరిత్ర ఉంది.

భారత్–ఆస్ట్రేలియా మధ్య మూడు రక్షణ ఒప్పందాలు

న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియాలు సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం సహా మూడు కీలక రక్షణ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఆస్ట్రేలియాలో రెండు రోజుల పర్యటనలో ఉన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఆ దేశ రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్‌తో కాన్‌బెర్రాలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక రక్షణ, సైనిక సంబంధాలను మరింత విస్తృతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. స్వేచ్ఛాయుత, శాంతియుత, సంపన్నవంతమైన ఇండో–పసిఫిక్ ప్రాంతం కోసం ప్రాంతీయ భాగస్వాములతో సహకారాన్ని పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ ప్రాంతంలో స్వేచ్ఛా నౌకాయానం, విమానయానాలతోపాటు అడ్డంకులు లేని వాణిజ్యానికి తమ మద్దతును పునరుద్ఘాటించారు. ఈ మేరకు రెండు దేశాల ప్రతినిధులు మూడు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్, విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తోనూ రాజ్‌నాథ్ భేటీ అయ్యారు. వ్యూహాత్మక జలాల్లో పెరుగుతున్న చైనా సైనిక ఆధిపత్యం నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

సంస్కరణలతోనే పటిష్ట ప్రజాస్వామ్యం

భారతదేశం - ఎన్నికల సంస్కరణలు

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు మౌలిక అంశం. నేటి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల చెంత ఉండే ప్రభుత్వం ఏర్పడాలంటే ఎన్నికలే ఏకైక మార్గం. నిష్పాక్షికంగా, స్వేచ్ఛాయుతంగా జరిగే ఎన్నికలపైనే ప్రజాస్వామ్య విజయం ఆధారపడి ఉంటుంది. న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలను నిర్వహించడానికి మన రాజ్యాంగ నిర్మాతలు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పని విధానానికి సంబంధించినంతవరకూ ఎవరికీ ఎలాంటి నివేదిక సమర్పించని రాజ్యాంగబద్ధ సంస్థ కేంద్ర ఎన్నికల కమిషన్. ఇది 1950 జనవరి 25న తన పనిని ప్రారంభించింది. ప్రారంభంలో ఇది ఏకసభ్య కమిషన్‌గా ఉన్నప్పటికీ, 1993 నుంచి త్రిసభ్య కమిషన్‌గా పనిచేస్తోంది. 1995లో సుప్రీంకోర్టు త్రిసభ్య కమిషన్ ఏర్పాటును సమర్థించింది. రాజ్యాంగబద్ధ సంస్థల ఎన్నికలన్నింటినీ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుండగా; 73, 74 రాజ్యాంగ సవరణల ఆధారంగా ఏర్పడిన రాష్ట్రాల ఎన్నికల కమిషన్‌లు స్థానిక స్వపరిపాలనా సంస్థల ఎన్నికలను నిర్వహిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు బహుళ సభ్య కమిషన్‌గా రాజ్యాంగబద్ధత కల్పించాలని పి.వి. నర్సింహారావు ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ తగిన మెజార్టీ లేని కారణంగా కేవలం చట్టబద్ధతను మాత్రమే కల్పించి త్రిసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 324 అధికరణం ప్రకారం భారత రాష్ట్రపతి ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను నియమిస్తారు. ప్రధాన కమిషనర్‌ను తొలగించే సందర్భంలో మాత్రమే పార్లమెంట్ 2/3వ వంతు మెజార్టీతో తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇతర కమిషనర్లను తొలగించడానికి ప్రధాన కమిషనర్‌ను కొలీజియంగా సంప్రదించి కేంద్రకేబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి తొలగిస్తారు. ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడమే కాకుండా ప్రజా ప్రతినిధులను అనర్హులుగా ప్రకటించే సందర్భంలో 103వ అధికరణ ప్రకారం రాష్ట్రపతికి సలహాలు ఇస్తుంది. అదే విధంగా 192వ అధికరణను అనుసరించి శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించే సందర్భంలో గవర్నర్ కూడా ఎన్నికల కమిషన్‌ను సంప్రదించాలి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఎన్నికల కమిషన్‌కు సెమి జ్యుడీషియల్ అధికారాలు సంక్రమిస్తాయి. 1957లో రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా డాక్టర్ ఎన్.బి. ఖరే వేసిన పిటిషన్‌ను విచారించే సందర్భంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

ప్రజాప్రాతినిధ్య చట్టాలను రూపొందించడం,



సవరణలు చేయడం లాంటి అంశాలను పార్లమెంట్ చేసినప్పటికీ అమలు పర్చాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని అమలుపరిచే క్రమంలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను రూపొందిస్తుంది. కార్యనిర్వహణపరమైన అంశాలను రూపొందించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం గమనార్హం. భారతదేశంలో ఎన్నికలు నిర్వహించే సందర్భంలో పార్లమెంట్ చేసిన చట్టాల్లో తగిన నిబంధనలు లేనట్లయితే రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల కమిషన్ అనుబంధ చట్టాలు చేయవచ్చని చీఫ్ ఎలక్షన్ కమిషన్ Vs మహేందర్ పాల్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు 1978లో తీర్పునిచ్చింది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికలు మొదలుకొని 2014లో జరిగిన 16వ సాధారణ ఎన్నికల వరకు అనేక ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టారు. 'ఒక వ్యవస్థ తనను తాను సంరక్షించుకొని, తనను తాను సమర్థంగా తీర్చిదిద్దుకునే క్రమంలో తనను తాను సంస్కరించుకోవాల్సిన అవసరం ఉంటుంది' అని ఎడ్మాండ్ బర్క్‌లాంటి ప్రముఖులు పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యం గడిచిన 6 దశాబ్దాల కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలదొక్కుకున్నదనేది విమర్శకులు సైతం అంగీకరించే వాస్తవం. రెండో ప్రపంచయుద్ధానంతరం స్వాతంత్ర్యాన్ని పొందిన అనేక దేశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేస్తూ సైనిక తిరుగుబాటు జరిగి, నియంతృత్వ పాలనలోకి వెళ్లిన ఉదంతాలను గమనించవచ్చు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల్లో ఈ విధమైన తిరుగుబాట్లను మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. కానీ భారత్‌లో ఇలాంటి ఉదంతా లు కనిపించవు. అదే మన ప్రజాస్వామ్య గొప్పదనం.

మన ప్రజాస్వామ్య గొప్పదనం

రాజ్యాంగం అమల్లోకి వచ్చే కాలంనాటికి నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం, వెనుకబాటుతనం లాంటి అనేక సమస్యలున్నప్పటికీ మన రాజ్యాంగ నిర్మాతలు సార్వత్రిక వయోజన ఓటుహక్కును ప్రసాదించారు. ఒకరకంగా ఇది వ్యక్తులను చైతన్యవంతం చేయడమే. 1971 లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఇందిరాగాంధీకి పట్టం కట్టిన ప్రజలు 1975లో జాతీయ అత్యవసర పరిస్థితి తదనంతరం 1977లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే కాకుండా ఇందిరాగాంధీని సైతం ఎంపీగా ఓడించారు. జనతాపార్టీ సుస్థిర ప్రభుత్వాన్ని అందించడంలో విఫలమైతే 1980లో తిరిగి ఇందిరాగాంధీకి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ అంశాలు భారత ప్రజల విజ్ఞత, చైతన్య స్ఫూర్తి ని తెలియజేస్తాయి. 1988లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటింగ్ వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వకాలంలోనే 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టారు. అంటే ఒక రాజకీయ పార్టీ గుర్తుపై గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల్లోకి వెళ్లినప్పుడు సహజసిద్ధంగానే తమ పదవిని కోల్పోతారు. రాజకీయాల్లో నైతిక విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తెచ్చారు. వాస్తవానికి భారతదేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధ పార్టీలు కావు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు గుర్తింపునిస్తుంది. రాజ్యాంగంలో రాజకీయ పార్టీల గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోయినా, పార్టీల మార్పిడిని నిషేధిస్తూ రాజ్యాంగంలో చట్టం చేర్చడం ఒక ప్రత్యేక

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

అంశం. 1962 తర్వాత ద్విసభా నియోజకవర్గాల స్థానంలో ఏకసభ్య నియోజక వర్గాలను ప్రవేశపెట్టారు. గతంలో ఒక అభ్యర్థి ఎన్ని నియోజక వర్గాల్లోనైనా పోటీ చేయడానికి అవకాశం ఉండేది. కానీ 1996లో ప్రజాప్రాతినిధ్య చట్టం ద్వారా తీసుకువచ్చిన సంస్కరణల ప్రకారం ఒక అభ్యర్థి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అవకాశం లేదు. అదేవిధంగా నేరమయ రాజకీయాలను అరికట్టడం కోసం 2 ఏళ్ల అంతకంటే ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేదు. ఎన్నికల ప్రచార కాలాన్ని కూడా 21 రోజుల నుంచి 14 రోజులకు తగ్గించారు. ఆషామాషీ అభ్యర్థుల సంఖ్యను తగ్గించడం కోసం ఎన్నికల డిపాజిట్లను పెంచారు. పార్లమెంట్‌కు పోటీ చేయడానికి సాధారణ అభ్యర్థులు రూ.25,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి. శాసనసభకు పోటీ చేయడానికి సాధారణ అభ్యర్థులైతే రూ.10,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5000 డిపాజిట్‌గా చెల్లించాలి. ప్రారంభంలో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయకూడదనే ఉద్దేశంతో పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే వారి ఎన్నికల ఖర్చుపై పరిమితులు విధించారు. పార్లమెంట్‌కు పోటీచేసే సభ్యులకు వ్యయపరిమితి రూ.70 లక్షలుగా, శాసనసభకు పోటీచేసే అభ్యర్థులకు వ్యయ పరిమితి రూ.28 లక్షలుగా నిర్ణయించారు.

అక్రమాలను అడ్డుకోవడానికి చర్యలు

రాజ్యసభ సభ్యుల ఎన్నికల సందర్భంగా ప్రతి వ్యక్తి నివాస స్థల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చిన నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించిం ది. 1996 నుంచి మనదేశంలో ఎన్నికల పరిశీలకులను నియమిస్తున్నారు. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా ముఖ్యంగా రిగ్గింగ్‌ను అరికట్టాలంటే అక్రమాలను నిరోధించాలనే ఉద్దేశంతో ఈవీఎం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజకీయ పార్టీలకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తీసుకురావడంతో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా నిరోధించగలుగుతున్నాం. 2010లో ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేసిన మార్పులను అనుసరించి ప్రపంచంలో ఎన్ఆర్ఐలు ఎవరైనా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది.

2003లో పీయూసీఎల్ Vs యూవోఐ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తన వ్యక్తిగత వివరాలతో కూడిన అఫిడవిడ్‌ను తప్పనిసరిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముందు ప్రమాణపూర్తిగా సమర్పించాలనే అంశాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చారు. పౌరహక్కుల యూనియన్ ప్రతిపాదనను ఎన్నికల కమిషన్ సమర్థించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరూ ఎవరూ నచ్చని సందర్భంలో 'పైవారెవరూ నచ్చలేదు' అని పేర్కొనే 16వ బటన్‌ను ఈవీఎంలో ఏర్పాటు చేశారు. ఈ అంశమే నోటా (None of the above – Nota)గా ప్రసిద్ధి చెందింది. గతంలో ఎన్నికల్లో పోటీ చేసిన వారు ఎవరైనా రెండేళ్లు అంతకంటే ఎక్కువ కాలం శిక్ష విధించినట్టు న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వగానే వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించేవారు. కానీ సిట్టింగ్ అభ్యర్థులకు అంటే గతంలో ఎంపీలేదా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా ఎన్నికైన వారెవరికి ఈ అనర్హత వర్తించదని పేర్కొనే నిబంధనను చేర్చగా.. ఇటీవల సుప్రీంకోర్టు ఈ నిబంధన చెల్లదని తీర్పునిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో రాజ్యసభ సభ్యత్వాన్ని కోల్పోయిన మొదటి వ్యక్తి రషీద్‌మసూద్.

మాదిరి ప్రశ్నలు

1. **భారత రాష్ట్రపతి ఎన్నిక వివాదాలను పరిష్క రించేది ఎవరు? (సివిల్స్ - 1997)**
   1) ప్రధాన ఎన్నికల కమిషనర్
   2) భారత పార్లమెంట్
   3) 39వ రాజ్యాంగ సవరణ ప్రకారం పార్లమెంటరీ కమిటీ
   4) సుప్రీంకోర్టు
2. **పార్లమెంట్ సభ్యుల అనర్హతను నిర్ణయించేది? సివిల్స్ - 1979)**
   1) ఎన్నికల కమిషనర్
   2) లోక్‌సభ స్పీకర్ 3) రాష్ట్రపతి
   4) పార్లమెంట్ నియమించే కమిటీ
3. **కిందివాటిలో ఎన్నికల సంఘం విధులను తెలపండి. (సివిల్స్ - 1994)**
   ఎ. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షుని ఎన్నిక నిర్వ హించడం
   బి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
   సి. ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు వివాదాలపై నిర్ణయం
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, సి మాత్రమే
   3) బి, సి మాత్రమే 4) ఏదీకాదు
4. **రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒక వ్యక్తి డిపాజి ట్ కోల్పోవడం అంటే?(సివిల్స్-1995)**
   1) ఎన్నికల్లో అభ్యర్థికి అతితక్కువ ఓట్లు రావడం
   2) నియోజకవర్గంలో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేయడం
   3) ఓడిపోయిన అభ్యర్థికి గెలుపొందిన అభ్యర్థికి మధ్య ఓట్ల తేడా చాలా ఎక్కువగా ఉండటం
   4) గెలిచిన అభ్యర్థికి ఓడిపోయిన అభ్యర్థికి మధ్య ఓట్ల తేడా తక్కువగా ఉండటం
5. **భారతదేశంలో రాజకీయ పార్టీలకు సంబంధించి కింది అంశాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి. (సివిల్స్ - 2001)**
   ఎ. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి రాజకీయ పార్టీలను రిజిస్ట్రేషన్ చేయించాలి
   బి. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది
   సి. జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే 4 రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందాలి
   డి. 1999 సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంతో రిజిస్ట్రేషన్ చేసిన ప్రాంతీయ పార్టీలు 48, జాతీయ పార్టీలు 6.
   1) ఎ, బి, డి వాస్తవం
   2) ఎ, సి మాత్రమే వాస్తవం
   3) బి, డి మాత్రమే వాస్తవం
   4) ఎ, బి, సి, డి వాస్తవం

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 1; 5) 4.

How many steps will be...

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ENGLISH

INPUT-OUTPUT

In Input-Output problems an aspirant is asked to imagine a kind of computer or a word processing machine which performs some operations repeatedly on a given input as per a pre-fixed manner and subsequently different output are given in different steps.

Arrangement: The words or the numbers are arranged as per a fixed order.

Generally the order can be alphabetical order incase of words, incre- asing or decreasing incase of numbers. Arrangement ends as soon as the desired order is achieved.

In case of arrangement a word that comes alphabetically first (or last) in a dictionary will go to first (or last) place, in the first step. Similarly a word which comes second (or second last) in alphabetical order which go to second (or second last) place and so on.

If the input consists of numbers, the smallest (or largest) number going to the first (or last) place in first step. Similarly the second smallest (or second largest) will go to second (or second last) place in the second step.

Directions (Q.No: 1-5): *Study the following information carefully and answer the questions given below:*

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and various steps of rearrangement. (All the numbers are two digit numbers).

Input: plan more vacation 35 56 92 nice holiday tours 84 61 12

Step I: 92 plan more vacation 35 56 nice tours 84 61 12 holiday

Step II: 92 84 plan vacation 35 56 nice tours 61 12 more holiday

Step III: 92 84 61 plan vacation 35 56 tours 12 nice more holiday

Step IV: 92 84 61 56 vacation 35 tours 12 plan nice more holiday

Step V: 92 84 61 56 35 vacation 12 tours plan nice more holiday

Step VI: 92 84 61 56 35 12 vacation tours plan nice more holiday

And Step VI is the last step of the rearrangement as the desired arrangement is obtained.

As per the rules followed in the above steps, find out in each of the questions the appropriate step for the given input.

Analysis: On observing the last step it can be concluded that numbers are arranged in the descending order from left end and the words are arranged in the alphabetical order from the right end. The first five steps reveal that one number and one word are arranged in the respective order in each step. Each time the remaining numbers are pushed to the right.

Questions:

Input: hard work pays 96 42 in 79 long run 18 25 57

1. **Which step number is the following output?**
   96 79 57 42 work run 18 25 pays long in hard
   1) Step II 2) Step III
   3) Step IV 4) Step V
   5) There is no such step

A: 3

As four numbers 96, 79, 57 and 42 are arranged in descending order from left and four words viz. hard, in, long and pays are arranged in alphabetical order from right end, it can be established that the given step is the fourth step of the arrangement.

2. **How many elements (words/ numbers) are there between "work" and "in" as they appear in Step III?**
   1) Six 2) Five
   3) Seven 4) Four
   5) Three

A: 1

In the III step the elements 96, 79 and 57 will take the first three positions and the word 'work' will take the fourth position from the left end. Similarly the word 'in' will occupy the second position from right end (i.e. eleventh position from the left end). Therefore there are 11- 4- 1 = 6 elements (words/numbers) between 'work' and 'in'.

3. **Which of the following represents the positions of "pays" in the Step II?**
   1) Seventh from right
   2) Sixth from left
   3) Eighth from right
   4) Fourth from left
   5) Fifth from left

A: 4

In II step 96 and 79 will occupy the first and second positions respectively followed by the words 'work' and 'pays' in the next two positions. Therefore the word 'pays' represents the fourth position from the left end in step II.

4. **Which word/ number would be at the seventh position from the right in the Step IV?**
   1) work 2) run
   3) long 4) 18
   5) 25

A: 2

In Q. No. 1, the IV step is given. It can be seen that the word 'run' takes seventh position from the right end.

5. **Which word/number would be third to the left of the fourth element from the right in the Step III?**
   1) pays 2) 42
   3) run 4) 18
   5) work

A: 2;

The element third to the left of fourth element from the right will be 4+3=7[th] element from the right.Therefore the same element will occupy13–7=6[th] position from the left end. In step III 96, 79 and 57 will occupy the first three positions followed by 'work', 'pays' and 42 in the subsequent three positions. Therefore the number 42 will take the sixth position from the left end in step III.

Directions (Q.No: 6-10): *Study the given information and answer the following questions:*

When a word and number arrangement machine is given an input line of words and numbers, it arranges them following a particular rule. The following is an illustration of input and rearrangement. (All the numbers are two digit numbers).

Input: 40 made butter 23 37 cookies salt extra 52 86 92 fell now 19

Step I: butter 19 40 made 23 37 cookies salt extra 52 86 92 fell now

Step II: cookies 23 butter 19 40 made 37 salt extra 52 86 92 fell now

Step III: extra 37 cookies 23 butter 19 40 made salt 52 86 92 fell now

Step IV: fell 40 extra 37 cookies 23 butter 19 made salt 52 86 92 now

Step V: made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 86 92 now

Step VI: now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 92

Step VII: salt 92 now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19

Step VII is the last step of the above arrangement as the intended arrangement is obtained. As per the rules followed in the given steps, find out the appropriate steps for the given input.

Analysis: It is observed from the last step, numbers and words are arranged alternately, words in the reverse dictionary order and numbers in the descending order from the left end or the words in the dictionary order and the numbers in the ascending order from the right end. From the first six steps it can be concluded that every time a word and a number are arranged in dictionary order and ascending order respectively from the left end but they are pushed to right in the subsequent steps.

Questions:

Input: 32 proud girl beautiful 48 55 97 rich family 61 72 17 nice life

6. **How many steps will be required to complete the given input?**
   1) Five 2) Six
   3) Seven 4) Eight
   5) Nine

A: 3

There are fourteen elements in the given input. In each step a word and a number (two elements) are arranged in the respective order, it will take 14 by 2 i.e. 7 steps to complete the arrangement.

7. **Which of the following is the third element from the left end of Step VI?**
   1) beautiful 2) life 3) 61
   4) nice 5) 17

A: 4

In V step, the word 'nice' will take the first position and the number 61 will take the second position. In the subsequent VI step they are pushed towards right taking third and fourth positions respectively. Therefore the word 'nice' will take the third position from the left end in the VI step.

8. **Which of the following is Step III of the given input?**
   1) proud 72 girl 48 family 32 beautiful 17 55 97 rich 61 nice life
   2) life 55 girl 48 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
   3) girl 48 family 32 beautiful 17 proud 55 97 rich 61 72 nice life
   4) family 32 beautiful 17 proud girl 48 55 97 rich 61 72 nice life
   5) girl 48 life 55 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice

A: 3

In III step, the word 'girl' will take the first position and the number 48 will take the second position. Since the word 'family' and the number 32 take the first and second positions in the previous step, will occupy the third and fourth positions respectively in Step III. Only option 3 will satisfy the above two conditions.

9. **What is the position of nice from the left end in the final step?**
   1) Fifth 2) Sixth
   3) Seventh 4) Eighth
   5) Ninth

A: 1

The word 'nice' takes the first position in Step V and in each of subsequent VI and VII steps two elements precede this word. Therefore a total of four elements precede the word 'nice' that means the word 'nice' will take the fifth position from the left end in the final step.

10. **Which element is third to the right of 'family' in Step V?**
    1) beautiful 2) 17
    3) proud 4) 97
    5) 32

A: 2

In step II the word 'family' takes the first position, the number 32 the second position, the word 'beautiful' the third position and the number 17 the fourth position from the left end. In every subsequent steps the elements 'family 32 beautiful 17' will be pushed to the right with no element coming in between them. Therefore the element third to the right of 'family' will be 17 in each of the steps from II to VII.

రక్తపోటును నియంత్రించే హార్మోన్ ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. చెమటలో ఉండే పదార్థాలు?
   1) నీరు, ఉప్పు, వ్యర్థ పదార్థాలు
   2) నీరు మాత్రమే 3) నీరు+లవణాలు
   4) పాస్ఫరికామ్లం
2. కిందివాటిలో తక్కువ విషతుల్యమైన నైట్రోజన్ సంబంధ వ్యర్థ పదార్థం?
   1) యూరియా 2) యూరికామ్లం
   3) అమ్మోనియా 4) క్రియాటిన్
3. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత జరుగుతుంది?
   1) వృక్కం (నెఫ్రాన్) 2) మూత్రకోశం
   3) వృక్క ధమని 4) ప్రసేకం
4. కింది వాటిలో యూరియా తయారయ్యే భాగం?
   1) మూత్రపిండం 2) పెద్ద పేగు
   3) మూత్రాశయం 4) కాలేయం
5. మానవ శరీరంలో మొదటిసారిగా ఏ అవయవాన్ని మార్పిడి చేశారు?
   1) గుండె 2) కాలేయం
   3) కిడ్నీ 4) క్లోమం
6. ఏ వ్యాధితో బాధపడే వారికి డయాలసిస్ చేస్తారు?
   1) కాలేయ సమస్య
   2) మూత్ర కోశాల సమస్య
   3) గుండె 4) ఊపిరితిత్తులు
7. కింది వాటిలో ఏ హార్మోన్ లోపంతో డయాబెటీస్ మెల్లిటస్ వస్తుంది?
   1) థైరాక్సిన్ 2) గ్లూకగాన్
   3) పిట్యూటరీ గ్రంథి 4) ఇన్సులిన్
8. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని ఏ గ్రంథిని పిలుస్తారు?
   1) అడ్రినల్ గ్రంథి 2) థైరాయిడ్
   3) లివర్ / కాలేయం 4) థైమస్ / బాలగ్రంథి
9. చిరు కప్ప రూపాంతరం చెంది ప్రౌఢ కప్పగా మారడానికి కావాల్సిన హార్మోన్?
   1) ఎఫ్ఎస్‌హెచ్ 2) ఎల్‌హెచ్
   3) థైరాక్సిన్ 4) అడ్రినల్ గ్రంథి
10. క్లోమం ఒక?
    1) బహిస్స్రావ గ్రంథి
    2) అంతస్స్రావ గ్రంథి
    3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
    4) ఏదీకాదు
11. పీయూష గ్రంథి ఎక్కడ ఉంటుంది?
    1) కంఠం 2) కాలేయం
    3) మూత్ర పిండం పైన
    4) కపాలం మధ్యన
12. పాల పొదుగు నుంచి చూషణ ద్వారా పాలను స్రవించడానికి తోడ్పడే హార్మోన్?
    1) ప్రొలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
    3) అడ్రినలిన్ 4) థైమోసిన్
13. కింది వాటిలో వేటి నుంచి అయోడిన్ అధికంగా లభిస్తుంది?
    1) సముద్ర చేపలు 2) సముద్ర ఉప్పు
    3) సీ వీడ్స్ 4) కూరగాయలు
14. అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధి?
    1) మహాకాయం 2) జడవామనుడు
    3) విస్తరించిన అవటు గ్రంథి
    4) చిన్న అవటు గ్రంథి
15. ఎండోక్రైన్ గ్రంథులపై ప్రభావం చూపే గ్రంథి?
    1) ఎడ్రినల్ గ్రంథి
    2) పారాథైరాయిడ్ గ్రంథి
    3) పీయూష గ్రంథి
    4) థైరాయిడ్ గ్రంథి
16. ఇన్సులిన్ ఒక?
    1) కొవ్వు పదార్థం 2) హార్మోన్
    3) రంగు పదార్థం 4) ఎక్సో ఎంజైమ్
17. పీయూష గ్రంథి అధీనంలో లేని గ్రంథి?
    1) పారాథైరాయిడ్ గ్రంథి
    2) థైరాయిడ్ 3) క్లోమం
    4) అడ్రినల్ గ్రంథి
18. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
    1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
    3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
19. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
    1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
    3) క్రిములు 4) హార్మోన్లు
20. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
    1) పిట్యూటరీ గ్రంథి 2) ఎడ్రినల్ గ్రంథి
    3) థైరాయిడ్ గ్రంథి 4) సెలైవరీ గ్రంథి
21. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
    1) చిన్న పేగు 2) గుండె
    3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
22. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) సబ్‌హార్మోన్లు 2) న్యూరోహార్మోన్లు
    3) పిరమోన్లు 4) న్యూరోట్రాన్స్ మీటర్
23. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
    1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
    3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
24. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
    1) థైరాయిడ్ గ్రంథి
    2) థైమస్ గ్రంథి 3) పీనియల్ గ్రంథి
    4) పీయూష గ్రంథి
25. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
    1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
    3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
26. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్య రసాన్ని స్రవింపజేసే హార్మోన్?
    1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
    3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
27. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
    1) విరిలిజం 2) హిర్సుటిజం
    3) గైనకోమాస్టియా 4) పైవన్నీ
28. కొమ్ములు, గోళ్లలో ఉండే ప్రోటీన్?
    1) బొటాక్స్ 2) కెరాటిన్
    3) రాటెక్స్4) బీటా కెరోటిన్
29. కండరాలకు వచ్చే కేన్సర్ వ్యాధిని ఏమంటారు?
    1) అంపోమా 2) ల్యూకేమియా
    3) సార్కోమా 4)మస్కులార్ డిస్ట్రోఫీ
30. రక్తం అనేది ఒక..?
    1) ద్రావణం 2) కొల్లాయిడ్
    3) సరళ పదార్థం 4) జెల్
31. డెక్ట్రోకార్డియా అంటే ఏమిటి?
    1) చిన్న గుండె 2) పెద్ద గుండె
    3) కుడివైపు ఉన్న గుండె 4) ఏదీకాదు
32. అందరికీ ఉపయోగపడే బ్లడ్ గ్రూప్?
    1) ఎ 2) బి 3) ఎబి 4) ఓ
33. చెట్ల కింద రాత్రి వేళ ఎందుకు నిద్రించొద్దు?
    1) తక్కువ ఆక్సిజన్ విడుదల
    2) ఎక్కువ ఆక్సిజన్ విడుదల
    3) కార్బన్ డై ఆక్సైడ్ విడుదల
    4) ఏదీ కాదు
34. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి? 1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
    3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
    4) ఊపిరితిత్తుల ద్వారా
35. రక్తపోటుకు కారణమైన హార్మోన్ ?
    1) కాలేయం 2) టెస్టిస్
    3) పాంక్రియాస్ 4) అడ్రినలిన్
36. బారియాట్రిక్ శస్త్రచికిత్స అంటే ఏమిటి?
    1) గుండె బైపాస్ సర్జరీ 2) ఉదరం సర్జరీ
    3) మెదడు సర్జరీ 4) ఏదీకాదు
37. రూట్ కెనాల్ థెరపీ అనేది దేనికి సంబంధించినది?
    1) దెబ్బతిన్న పళ్ల 2) దెబ్బతిన్న మూత్రనాళం
    3) గోళ్ల చికిత్స 4) రక్తనాళ చికిత్స
38. తుమ్ములు, మింగడం, వాంతి, దగ్గు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి?
    1) మస్తిష్కం
    2) మజ్జాముఖం(మెదుల్లా అబ్లాంగేట)
    3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
39. ఆల్కహాల్, అనస్తీషియా(మత్తుమందు) మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
    1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
    3) మెదుల్లా అబ్లాంగేట
    4) వెన్నుపాము
40. శిశువు లింగ నిర్ధారణకు ఉపయోగించే పరీక్ష?
    1) ఆమ్నియో సింటాసిస్
    2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
41. పాలలోని బ్యాక్టీరియాలను నశింపజేసే శాస్త్రీయ పద్ధతి?
    1) సూక్ష్మ జీవరహితం 2) శుద్ధిచేయడం
    3) కిణ్వనం 4) పాశ్చరైజేషన్
42. పాలు అనేవి?
    1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
    2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
    3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
    4) నీరు విస్తరించి ఉన్న చమురు
43. గాయాలు మానడానికి ఉపయోగపడే విటమిన్?
    1) ఎ 2) కె 3) సి 4) డి
44. సూర్యకాంతి నుంచి లభించే విటమిన్?
    1) బి 2) సి 3) కె 4) డి
45. నేలలో నత్రజని పెరుగుదల కోసం సాగు చేసే పంట?
    1) వరి 2) గోధుమ 3) చిక్కుడు 4) పత్తి
46. కాఫీలో కలిపే చికోరి పొడర్‌ను దేని నుంచి గ్రహిస్తారు?
    1) కాండం 2) ఆకులు
    3) విత్తనాలు 4) వేర్లు
47. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్‌పిరేషన్‌ను ఏమంటారు?
    1) స్టొమాటల్ 2) క్యుటిక్యులార్
    3) లెంటిక్యులార్ 4) గుట్టేషన్
48. జీవుల్లో అనువంశిక లక్షణాలకు కారణం?
    1) హెచ్‌బీ 2) ఆర్ఎన్ఏ
    3) డీఎన్ఏ 4) ఏటీపీ
49. జన్యువు అనగా?
    1) డీఎన్ఏ ముక్క
    2) ప్రోటీన్‌లోని అమైనోఆమ్లం
    3) సహలగ్న సముదాయం
    4) ఆర్ఎన్ఏలోని కొంత భాగం
50. యాంటిబయోటిక్ పెన్సిలిన్‌ను ఉత్పత్తి చేసేవి?
    1) ఆల్గే 2) బ్యాక్టీరియాలు
    3) సింథటిక్ రకాలు 4) ఫంగస్
51. సిట్రస్ కాంకర్ వ్యాధి వేటి ద్వారా వస్తుంది?
    1) ఫంగీ 2) వైరస్
    3) బ్యాక్టీరియా 4) మైకోప్లాస్మా
52. భారత తొలి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ఏది?
    1) అగ్ని–4 2) అగ్ని–5
    3) బ్రహ్మోస్ 4) పృథ్వీ–3
53. సూర్యుడి శక్తికి కారణం?
    1) కృత్రిమ రేడియోధార్మిక శక్తి
    2) కేంద్రక విచ్ఛిత్తి 3) కేంద్రక సంలీనం
    4) సహజ రేడియోధార్మిక శక్తి
54. చమురు దీపాల్లోని నూనె.. వత్తుల ద్వారా పైకి రావడానికి కారణం?
    1) స్నిగ్ధతా ధర్మం
    2) ఉష్ణోగ్రత వ్యత్యాసం
    3) పీడన వ్యత్యాసం
    4) కెపిలారిటీ ధర్మం
55. ఆకాశంలోని నీలి రంగుకు కారణం?
    1) కాంతి పరావర్తనం
    2) కాంతి వక్రీభవనం
    3) కాంతి వివర్తనం 4) కాంతి పరిక్షేపనం
56. దేని ఉత్పత్తిని వివరించడానికి బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని వినియోగిస్తారు?
    1) భూమి మీది జీవజాలం
    2) జీవ పరిణామం
    3) అణు విస్ఫోటం 4) విశ్వం
57. ఎల్‌పీజీలో ఏ రసాయనాన్ని కలపడం వల్ల గ్యాస్ లీకేజీలో వాసనను గుర్తించగలుగుతాం?
    1) ఇథైల్ ఆల్కహాల్
    2) ఫినోల్ 3) బెంజీన్
    4) ఇథైల్ మెర్క్ పటన్
58. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
    1) తిరుపతి 2) తిరువనంతపురం
    3) డెహ్రాడూన్ 4) భోపాల్
59. క్రయోజెనిక్ ఇంజన్‌లో వాడే ఇంధనం?
    1) ద్రవ హైడ్రోజన్
    2) ద్రవ ఆక్సిజన్
    3) ద్రవ హీలియం
    4) ద్రవ నైట్రోజన్
60. శాస్త్రీయంగా పులియబెట్టడమంటే?
    1) ఆక్సిజన్‌లో చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    2) ఆక్సిజన్ లేకుండా చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    3) ఆక్సిజన్ లేకుండా చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    4) ఆక్సిజన్‌లో చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం

సమాధానాలు

1) 1	2) 2	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 2	13) 3	14) 3	15) 3
16) 2	17) 1	18) 3	19) 4	20) 2
21) 4	22) 3	23) 1	24) 2	25) 2
26) 3	27) 4	28) 2	29) 3	30) 2
31) 3	32) 4	33) 3	34) 3	35) 4
36) 2	37) 1	38) 2	39) 2	40) 1
41) 4	42) 2	43) 3	44) 4	45) 3
46) 4	47) 1	48) 3	49) 1	50) 4
51) 3	52) 2	53) 3	54) 4	55) 4
56) 4	57) 4	58) 3	59) 1	60) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఒత్తిడి, కోపం, ఎక్కువ బీపీకి ఏ హార్మోన్ బాధ్యత వహిస్తుంది?
   1) ఆక్సిటోసిన్ 2) థైరాక్సిన్
   3) ఎడ్రినాలిన్ 4) గలనిన్
2. కింది వాటిలో దేనిని జంతు స్టార్చ్ అంటారు?
   1) సెల్యూలోజ్ 2) గ్లైకొజెన్
   3) కైటిన్ 4) పెక్టిన్
3. RNAలో న్యూక్లియోటైడ్స్ దేనితో ముడిపడి ఉంటాయి?
   1) పెప్టైడ్ బంధాలు
   2) హైడ్రోజన్ బంధాలు
   3) అయానిక బంధాలు
   4) ఫాస్ఫోడైఎస్టర్ బంధాలు
4. యూనివర్సల్ ఆక్సెప్టెడ్ బ్లడ్ గ్రూప్?
   1) O^- 2) A^- 3) B^+ 4) AB^+
5. మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
   1) మెదడు 2) గుండె
   3) చర్మం 4) కాలేయం
6. విటమిన్ E లోపం దేనిని కలిగిస్తుంది?
   1) రికెట్స్ 2) బెరి బెరి
   3) పెల్లాగ్రా 4) వంధ్యత్వం
7. జన్యుశాస్త్ర పితామహుడు ఎవరు?
   1) హెన్రీ 2) మెండల్
   3) మారిసన్ 4) మోర్గాన్
8. కిరణ జన్య సంయోగ క్రియలో విడుదలయ్యే ఆక్సిజన్ నీటి నుంచి వస్తుందని నిరూపించింది ఎవరు?
   1) కాల్విన్ 2) హాచ్
   3) రూబెన్, కామెన్ 4) మేయర్

సమాధానాలు

1) 3	2) 2	3) 4	4) 4	5) 3
6) 4	7) 2	8) 3		


In which direction is he facing?

DISTANCE & DIRECTIONS

In this chapter problems are asked based on the directions and the distance travelled in that direction.

Let us see the change in direction when a left turn or right turn takes place.

Direction	Left	Right
North	West	East
East	North	South
South	East	West
West	South	North



Note:

i) Two right turns or two left turns → opposite directions

ii) One left turn and one right turn → same direction.

iii)Three left turns → one right turn

iv) Three right turns → one left turn

v) Four left or four right turns → same direction

While solving the questions, keep in mind if only direction is asked no need to draw the directional diagram.

Practice Questions

1. **Ravi in his evening walk travelled towards the sun 3 km, then he turned to his left walked 2 km. He again turned to his right walked another 2 km. Finally, he turned to his right walked another 2 km. In which direction is Ravi walking now?**
   1) East 2) West
   3) North 4) South
   5) None of these

A: 3

Ravi is walking towards the Sun in the evening, so initially he is moving in West direction. Afterwards he successively turned left, right and right respectively. The movement left turn gets nullified with one right turn. Ravi effectively took one right turn to his initial direction. The direction to the right of West is North. So Ravi is moving in the North direction.

2. **One Morning, Raja started to walk towards the Sun. After walking a while, he turned to his right and again to his right. After walking a while, he again turned right. In which dir- ection is he facing?**
   1) South 2) East
   3) West 4) North
   5) None of these


A: 4

Raja is moving towards Sun in the morning means he is moving in East direction. Afterwards he successively took three right turns. The impact of taking three right turns is same as taking one left turn. The direction to the left of East is North. Therefore finally Raja is walking in North direction.

3. **Veena walked 5 m towards north, took a left turn and walked 7m. She took a left turn again and walked 8m before taking a left turn and walking 7m. She then took a final left turn and walked 1m before stopping. How far is Veena from the starting point?**
   1) 3 m 2) 6 m 3) 4 m
   4) 2 m 5) 7 m

A: 4

In this question, to find the distance, it is necessary to draw the direction diagram.



S → Starting point, F → Finishing point

∴ Veena is 2m away from the starting point.




BANK EXAMS

REASONING

4. **Ajay walked 2m towards east, took a right turn and walked 7m. He then took a left turn and walked 5m before taking a left turn and walking 7m. He then took a final right turn and walked 1m before stopping. How far is Ajay from the starting point?**
   1) 8 m 2) 7 m 3) 6 m
   4) 5 m 5) 9 m


A: 1



Ajay is 2 + 5 + 1 = 8m away from the starting point.


5. **A man started from A, walked 10 km towards North, then took a right turn, and walked 7km and again walked 8 km towards his left. Finally he took a right turn and walked for 13 km and reached point B. In which direction is he with respect to the starting point?**
   1) Northeast 2) Southeast
   3) West 4) North
   5) Northwest

A: 1



6. **A man starts from a point A and walks 5 metres in the east, then he turns right and walks 3 metres, again he turns right and walks 9 metres and finally he takes a right turn walks 3 metres. Now how far is the man from point A and in which direction?**
   1) 6 m towards West
   2) 4 m towards West
   3) 4 m towards South
   4) 6 m towards East
   5) None of these


A: 2



The man is 4m far from point A towards West.

7. **Vivek and Ashok start from a fixed point. Vivek moves 3 km North and turns right and then covers 4 km. Ashok moves 5 km West and turns right and walks 3 km. Now how far are they apart?**
   1) 10 km 2) 9 km 3) 8 km 4) 6 km
   5) None of these


A: 2



Distance between Vivek and Ashok at the finishing positions are 5 + 4 = 9 km

8. **A child was looking for his father. He went 90 metres towards east before turning to his right. He then went 20 metres before turning to his right again to look for his father at his uncle's place 30 metres from this point. His father was not there. He then went 100 metres to the north before meeting his father in a street. How far from the starting point did the son meet his father?**
   1) 80 metres 2) 100 metres
   3) 140 metres 4) 260 metres
   5) None of these

A: 2



PT = 90–30 = 60m,

TU = 100–20 = 80m

PU = √((PT²)+(TU)²)


= √((60²)+(80)²)

= √(3600+6400)

= √10000 = 100m


Directions(Q. 9 - 10): ***Study the giv-en information carefully and answer the given questions.***

Sunil started walking from point A. He walked 6 metres towards East to reach point B. From point B he took a right turn and walked 3 metres to reach point C. From point C he took a right turn and walked 10 metres to reach point D. From point D he took a left turn and walked 4 metres to reach point E. From point E, he walked 4 metres East to reach point F, Point G is exactly midway between point C and point D.



9. **If Sunil walks 4 metres to the North of point F, how far and in which direction will he be from point G?**
   1) 1 metre towards East
   2) 2 metres towards East
   3) 1 metre towards West
   4) 2 metres towards West
   5) 1.5 metres towards East

A: 3



EF = FO = 4 m

∴ DO = 4m

DG = GC = 5m

∴ OG = DG – DO

= 5 – 4 = 1m

10. **How far and in which direction is point F from point A?**
    1) 7 metres towards North
    2) 6 metres towards South
    3) 8 metres towards South
    4) 6 metres towards North
    5) 7 metres towards South

A: 5